మంగళవారం 5-9-2023


సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 166



'ఆర్థిక అసమానతలు తొలగకపోతే రాజకీయ స్వాతంత్ర్యానికి అర్థం లేదు'



'ప్రకృతి' ప్రాజెక్టులపై పెట్టుబడులు

భారత్‌లో 3 మిలియన్ డాలర్ల ఇన్వెస్ట్‌మెంట్ పెట్టనున్నట్లు అమెజాన్ వెల్లడి - 13లో



టీమిండియా అలవోకగా...

నేపాల్‌పై 10 వికెట్లతో గెలుపు. ఆసియా కప్‌లో 'సూపర్–4' దశకు అర్హత. - 12లో

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



మరోసారి 'విక్రమ్' ల్యాండింగ్

జాబిల్లి దక్షిణ ధ్రువం ఉపరితలంపై భారత అంతరిక్ష పరిశోధన సంస్థ ల్యాండర్ 'విక్రమ్'ను మరోసారి సాఫ్ట్ ల్యాండింగ్ చేసింది. - వివరాలు 6లో



సరిహద్దుల్లో సైనిక విన్యాసాలు

చైనా, పాకిస్తాన్ సరిహద్దుల్లో భారత వైమానిక దళం త్రిశూల్ పేరిట భారీ సైనిక విన్యాసాలకు శ్రీకారం చుట్టింది. - వివరాలు 6లో



నాస్కామ్ చైర్‌పర్సన్‌గా నంబియార్

కాగ్నిజెంట్ ఇండియా సీఎండీ రాజేశ్ నంబియార్‌ను తన చైర్‌పర్సన్‌గా నియమిస్తున్నట్లు నాస్కామ్ సోమవారం ప్రకటించింది. - వివరాలు 13లో



నేడు కాంగ్రెస్ పార్లమెంటరీ భేటీ

పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో పార్టీపరంగా అనుసరించాల్సిన వ్యూహంపై విపక్ష కాంగ్రెస్ దృష్టి పెట్టింది. - వివరాలు 6లో

టార్గెట్.. తెలంగాణ

రాష్ట్రానికి రానున్న సోనియా, రాహుల్, ఖర్గే తదితర ఏఐసీసీ అగ్రనేతలు

- రాష్ట్ర నాయకత్వానికి చేయూత ఇచ్చేందుకు పార్టీ అధిష్టానం సిద్ధం
- వచ్చే ఎన్నికల్లో కచ్చితంగా ప్రభావం చూపుతుందన్న ఉద్దేశంతోనే హైదరాబాద్‌లో సీడబ్ల్యూసీ భేటీ నిర్వహణకు నిర్ణయం
- ఈ నెల 18న రాష్ట్రవ్యాప్తంగా పర్యటించనున్న సీడబ్ల్యూసీ సభ్యులు, పీసీసీ అధ్యక్షులు, సీఎల్పీ నేతలు
- 16న తాజ్‌కృష్ణలో సీడబ్ల్యూసీ భేటీ.. 17న పరేడ్ గ్రౌండ్స్ వేదికగా భారీ సభ
- ఐదు గ్యారంటీ కార్డు స్కీమ్‌లతోపాటు బీసీ, మైనార్టీ, మహిళా డిక్లరేషన్ల ప్రకటనకు టీపీసీసీ ఏర్పాట్లు



హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్స్‌ను పరిశీలిస్తున్న మాణిక్‌రావ్ ఠాక్రే, రేవంత్‌రెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్: సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే సహా కాంగ్రెస్ అతిరథ మహారథులు.. పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులు.. పార్టీ అత్యున్నత విధాన నిర్ణాయక మండలి అయిన వర్కింగ్ కమిటీ సభ్యులు.. అన్ని రాష్ట్రాల పీసీసీ అధ్యక్షులు, శాసన సభాపక్ష నాయకులు.. ఒక్కమాటలో చెప్పాలంటే దేశంలోని కీలక కాంగ్రెస్ నేతలంతా తెలంగాణకు రానున్నారు. సీడబ్ల్యూసీ సమావేశంలో పాల్గొనడంతోపాటు రాష్ట్రవ్యాప్తంగా పర్యటించనున్నారు. దీని వెనుక కాంగ్రెస్ అధిష్టానానికి పెద్ద వ్యూహమే ఉందని రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఈసారి ఎట్టి పరిస్థితుల్లో తెలంగాణలో అధికారం దక్కించుకునే ప్రణాళికలో భాగంగానే.. హైదరాబాద్ వేదికగా కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) సమావేశాలను ఏర్పాటు చేస్తున్నారని కాంగ్రెస్ వర్గాలు చెప్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీకి గెలుపు అవకాశాలు ఉన్నాయని సర్వేలు అంచనా వేసిన నేపథ్యంలో.. మిగతా 3వ పేజీలో ▶

కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీలో ఉత్తమ్

నూతన కమిటీని ఏర్పాటు చేసిన మల్లికార్జున ఖర్గే



సాక్షి, న్యూఢిల్లీ/హైదరాబాద్: తెలంగాణ సహా ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ అధిష్టానం నూతనంగా 16 మంది సభ్యులతో కేంద్ర ఎన్నికల కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కీలక కమిటీలో తెలంగాణ నుంచి పార్టీ ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డికి చోటు కల్పించారు. మల్లికార్జున ఖర్గే ఈ కమిటీని ఏర్పాటు చేయగా, ఏఐసీసీ ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ సోమవారం సాయంత్రం మిగతా 3వ పేజీలో ▶

హైదరాబాద్ వేదికగా తొలిసారి!

కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ భేటీకి రంగం సిద్ధం

సాక్షి, న్యూఢిల్లీ: కాంగ్రెస్ పార్టీలో ఇటీవలే నియామకమైన అత్యున్నత విధాన నిర్ణాయక మండలి కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) హైదరాబాద్‌లో తొలిసారిగా సమావేశం కానుంది. రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ఉండటంతో క్షేత్రస్థాయిలో పార్టీ శ్రేణులకు నూతనోత్సాహం తేవడం, కాంగ్రెస్ వైపు ప్రజల దృష్టి మళ్లించడం లక్ష్యంగా ఈ సమావేశాలను నిర్వహించనుంది. గత నెల 20న కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే సీడబ్ల్యూసీని పునర్వ్యవస్థీకరించిన విషయం తెలిసిందే. 16, 17 తేదీల్లో కొత్త కమిటీ తొలి సమావేశం కోసం హైదరాబాద్‌ను ఎంచుకున్నారు. సోమవారం ఢిల్లీలోని మిగతా 3వ పేజీలో ▶

నిజామాబాద్ నగర శివారు పాంగ్రా గ్రామంలో నీట మునిగిన ఇళ్లు



రాష్ట్రమంతా వాన జోరు

- నెల రోజుల విరామం తర్వాత మళ్లీ విస్తారంగా వానలు
- ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ జిల్లాల్లో భారీ వర్షాలు
- పలుచోట్ల పొంగుతున్న వాగులు.. నిండిన చెరువులు
- మంగళవారం బంగాళాఖాతంలో ఏర్పడనున్న అల్పపీడనం
- దాని ప్రభావంతో మరో 2 రోజులు మోస్తరు నుంచి భారీ వర్షాలు
- ఉత్తర ప్రాంత జిల్లాల్లో పలుచోట్ల కుండపోత వానలకు చాన్స్
- పదకొండు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్ జారీ చేసిన వాతావరణ శాఖ

సాక్షి, హైదరాబాద్/ సాక్షి నెట్‌వర్క్: నెల రోజుల సుదీర్ఘ విరామం తర్వాత రాష్ట్రవ్యాప్తంగా మళ్లీ వానలు జోరందుకున్నాయి. చాలాచోట్ల మోస్తరు వర్షాలు పడుతున్నాయి. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో కుండపోత వానలు నమోదవుతున్నాయి. వాగులు, వంకలు ఉప్పొంగి ప్రవహిస్తుండగా.. చెరువులు మత్తళ్లు దూకుతున్నాయి. పలుచోట్ల రోడ్లపై రాకపోకలు స్తంభించిపోయాయి. అయితే వాన నిలకడగా కురుస్తుండటంతో పెద్దగా ఇబ్బంది ఎదురుకావడం లేదని అధికారవర్గాలు చెప్తున్నాయి. మరోవైపు ఈ వర్షాలు ఇంకో రెండు రోజులు కొనసాగుతాయని వాతావరణ శాఖ ప్రకటించింది.

నిజామాబాద్‌లో దంచికొట్టిన వాన

ఉమ్మడి నిజామాబాద్ జిల్లా పరిధిలో రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. దీనితో వాగులు వంకలు ఉప్పొంగుతున్నాయి. డిచ్‌పల్లి మండలం మిగతా 2వ పేజీలో ▶

గోదావరిలో మళ్లీ జలకళ!

నెల విరామం తర్వాత పెరుగుతున్న ప్రవాహాలు - 2లో

ఒడిశాలో పిడుగుల వర్షం

2 గంటల్లో 61,000 పిడుగుపాట్లు.. 12 మంది మృతి - 6లో

న్యూస్‌రీల్

హోంగార్డు టు డ్రగ్ కొరియర్



రాజస్తాన్ పోలీసువిభాగంలో హోంగార్డుగా పనిచేస్తున్న ప్రదీప్‌శర్మ.. తనకు ఏర్పడిన పరిచయాలతో డ్రగ్ కొరియర్‌గా మారాడు. దేశవ్యాప్తంగా పెడ్లర్స్‌కు మాదకద్రవ్యాలు... ప్రధానంగా మిథలిన్ డయాక్సిమో థమెఫ్టామైన్ (ఎండీఎంఏ) సరఫరా చేస్తున్నాడు. - వివరాలు 14లో

మారుతున్న 'గురు'తర బాధ్యత



'నెట్' ప్రపంచం విద్యార్జనకు ముడి సరుకైంది. విశ్వవ్యాప్త విజ్ఞానం వైపు విద్యార్థుల ఆకాంక్షలు పరుగులు తీస్తున్నాయి. ఈ మేరకు బోధన తీరు మారుతోంది. తగిన నైపుణ్యాన్ని అందిపుచ్చుకోవాల్సిన అవసరం నేటి తరం గురువులకు తప్పనిసరైంది. - వివరాలు 14లో

ఆర్టీసీకి 910 కొత్త బస్సులు



3 నెలల్లో ఆర్టీసీకి 910 కొత్త బస్సులు సమకూరబోతున్నాయి. చాలాకాలంగా పాతబడ్డ బస్సులతో లాక్కొస్తుండగా, వాటిల్లోంచి కొన్నింటిని తుక్కుగా మార్చేసి.. కొత్త బస్సులు అందుబాటులోకి తేవాలని సంస్థ నిర్ణయించింది. - వివరాలు 5లో

2.66 లక్షల ర్యాంకుకూ కన్వీనర్ సీటు



మొదటి విడత కన్వీనర్ కోటా కౌన్సెలింగ్‌లో 2.38 లక్షల నీట్ ర్యాంకు సాధించిన విద్యార్థికి ఎంబీబీఎస్ సీటు రాగా, ఇప్పుడు రెండో విడత కౌన్సెలింగ్‌లో కన్వీనర్ కోటాలో ఏకంగా 2,66,945 ర్యాంకు సాధించిన బీసీ–సీ విద్యార్థినికి సీటు లభించింది. - వివరాలు 14లో

ఇదండీ సంగతి



ప్రస్తుతానికి వరుస భేటీలలో గ్రాండ్ సక్సెస్ అయ్యాం.. హ్యాపీ!!

ప్రభుత్వం చెల్లించకుంటే..

ప్రజల నుంచి వసూలు చేయాల్సిందే

- విద్యుత్ సబ్సిడీపై కేంద్రం ఆదేశాలు
- కరెంటు చార్జీలు పెంచి వసూలు చేసుకోవాలని స్పష్టీకరణ
- సబ్సిడీ రహిత టారిఫ్ అమలుకు డిస్కంలను ఆదేశించాలని ఈఆర్సీలకు సూచన
- ప్రభుత్వం ముందస్తుగా సబ్సిడీ చెల్లించకపోతే చార్జీల మోతే

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ముందస్తుగా విద్యుత్ సబ్సిడీని చెల్లించని పక్షంలో విద్యుత్ చట్టంలోని సెక్షన్ 65 ప్రకారం వినియోగదారుల నుంచి సబ్సిడీ లేని విద్యుత్ చార్జీలు (టారిఫ్) వసూలు చేయాల్సిందేనని కేంద్ర ప్రభుత్వం ఆదేశించింది. సబ్సిడీ రహిత టారిఫ్‌ను వర్తింపజేయాల్సిందిగా రాష్ట్రాల విద్యుత్ పంపిణీ సంస్థ (డిస్కం)లకు ఆదేశాలు జారీ చేయాలని ఆయా రాష్ట్రాల విద్యుత్ నియంత్రణ మండళ్లకు (ఈఆర్సీలకు) సూచించింది. విద్యుత్ చార్జీలు పెంచి వసూలు చేసుకోవాలని స్పష్టం చేసింది. ఈ మేరకు విద్యుత్ సబ్సిడీల విధానంలో కీలక మార్పులను అమల్లోకి తెస్తూ గత జూలై 26న గెజిట్ నోటిఫికేషన్ జారీ చేసిన కేంద్ర విద్యుత్ మంత్రిత్వ శాఖ తాజాగా దానిని బహిర్గతం చేసింది. విద్యుత్ నిబంధనలకు రెండో సవరణ–2023 పేరుతో ఈ నిబంధనలు అమల్లోకి వచ్చాయి.

ఇకపై కేంద్రం ప్రకటించే స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్ ఆధారంగా ప్రభుత్వం చెల్లించాల్సిన విద్యుత్ సబ్సిడీలను డిస్కంలు లెక్కించాలని మిగతా 10వ పేజీలో ▶



జమిలి అయినా ఓకే!

లోక్‌సభకు ముందస్తు ఎన్నికలపై పూర్తిస్థాయి స్పష్టతతో బీఆర్‌ఎస్



- ఒకవేళ జరిగితే అసెంబ్లీతోపాటే జరుగుతాయని లెక్కలు
- పార్టీ సంసిద్ధంగా ఉండేలా అధినేత కేసీఆర్ కార్యాచరణ
- డిసెంబర్‌లోపే ఎన్నికలు జరిగే అవకాశం ఉందని అంచనా
- అసెంబ్లీ అభ్యర్థుల జాబితాలో స్వల్ప మార్పులకు అవకాశం

సాక్షి, హైదరాబాద్: అసెంబ్లీ ఎన్నికలు లక్ష్యంగా అభ్యర్థుల జాబితాను ప్రకటించి ప్రచార సన్నద్ధతను ప్రారంభించిన భారత్ రాష్ట్ర సమితి, తాజాగా జాతీయ స్థాయిలో చోటు చేసుకుంటున్న రాజకీయాలను కూడా నిశితంగా పరిశీలిస్తోంది. ఈ నెల 18 నుంచి పార్లమెంటు సమావేశాల నేపథ్యంలో 'వన్ నేషన్.. వన్ ఎలక్షన్' పేరిట జమిలి ఎన్నికల అంశం తెరమీదకు వస్తుందని పార్టీ అంచనా వేస్తోంది. ఈ నేపథ్యంలో ఒకవేళ లోక్‌సభకు ముందస్తు ఎన్నికలు వస్తే అనుసరించాల్సిన వ్యూహంపై స్పష్టతతో ఉన్నట్లు బీఆర్‌ఎస్ వర్గాలు చెప్తున్నాయి. అసెంబ్లీ ఎన్నికలతోనే లోక్‌సభ ఎన్నికలు జరుగుతాయని అంచనా వేస్తున్నట్లు తెలిపాయి. అయితే గతంలో జమిలి ఎన్నికలకు సానుకూలంగా స్పందించిన బీఆర్‌ఎస్ ప్రస్తుత పరిస్థితుల్లో మాత్రం ఆచితూచి వ్యవహరించాలని భావిస్తోంది. ఈ అంశంపై అప్పుడే ఎలాంటి అభిప్రాయం వ్యక్తం చేయకుండా, సరైన సమయంలో స్పందించాలని నిర్ణయించినట్లు ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బి.వినోద్ కుమార్ 'సాక్షి'కి తెలిపారు. వన్ నేషన్ వన్ ఎలక్షన్ కోసం ఏర్పాటైన కమిటీలో దక్షిణాది నుంచి ఒక్కరికి కూడా చోటు కల్పించకపోవడాన్ని పార్టీ తప్పు పడుతోంది. జమిలి ఎన్నికలు ఇప్పట్లో సాధ్యం అయ్యే పని కాదని భావిస్తున్న బీఆర్‌ఎస్.. ఒకవేళ లోక్‌సభ ఎన్నికలు జరిగినా డిసెంబర్‌లోపే పోలింగ్ ఉంటుందని అంచనా వేస్తోంది.

విపక్షాలను గందరగోళంలోకి నెట్టేందుకేనా!

తెలంగాణ సహా ఐదు రాష్ట్రాల ఎన్నికల నేపథ్యంలో విపక్షాలను గందరగోళంలోకి నెట్టడంతో పాటు తన ఎత్తుగడలతో ఆ పార్టీలను కకావికలం చేసేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని బీఆర్‌ఎస్ అనుమానాలు వ్యక్తం చేస్తోంది. ఈ నేపథ్యంలో ఒకవేళ జమిలి ఎన్నికలను శరవేగంగా తెరమీదకు తెచ్చినా సంసిద్ధంగా ఉండేలా బీఆర్‌ఎస్ అధినేత, మిగతా 2వ పేజీలో ▶

జీ 20 శిఖరాగ్రానికి జిన్‌పింగ్ దూరం



➤ ఈ నెల 9, 10వ తేదీల్లో ఢిల్లీలో జరగనున్న జీ20 శిఖరాగ్ర భేటీకి అధ్యక్షుడు జిన్‌పింగ్ హాజరుకావడం లేదని చైనా తెలిపింది. ఆయన స్థానంలో ప్రధాని లీ క్వియాంగ్ చైనా ప్రతినిధి బృందానికి సారథ్యం వహిస్తారని స్పష్టం చేసింది. అందరితో కలిసి పనిచేసి శిఖరాగ్ర సదస్సును విజయవంతం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపింది. అయితే, జిన్‌పింగ్ హాజరు కాకపోవడానికి గల కారణాలను మాత్రం వెల్లడించలేదు. దీనిపై అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ స్పందిస్తూ.. ఈ కార్యక్రమానికి జిన్‌పింగ్ రాకపోవడం తనకు నిరాశ కలిగించిందన్నారు. - 6లో

శిఖరాగ్ర భేటీకి ప్రపంచ స్థాయి భద్రత

- 1.30 లక్షల మందితో కట్టుదిట్టమైన రక్షణ వ్యవస్థ
- ఏరోస్పేస్ రక్షణ కోసం సమగ్ర చర్యలు.. ఇప్పటికే పలు ప్రాంతాల్లో యాంటీ డ్రోన్ రక్షణ వ్యవస్థల ఏర్పాటు - 6లో

బీజేపీలో దరఖాస్తుల వెల్లువ!



- ఎన్నికల్లో పోటీకి తొలిరోజే 182 దరఖాస్తులు..
- ఆశావహుల నుంచి భారీ స్పందన...
- మీడియాతో మాట్లాడకుండా వెళ్లాలన్న కిషన్‌రెడ్డి
- మాట్లాడితే దరఖాస్తులు పక్కన పెట్టాలని ఆదేశం
- 10వ తేదీ వరకు స్వీకరణ...
- ఆ తర్వాత దశల వారీగా వడపోత

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర బీజేపీలో ఎన్నికల సందడి నెలకొంది. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో పోటీకి ఆసక్తి ఉన్న వారు మొదటిరోజే ఏకంగా 182 దరఖాస్తులు సమర్పించారు. ఐతే కొందరు ఒకటికి మించి స్థానాలకు తమ దరఖాస్తులను సమర్పించడంతో... వాస్తవానికి 63 నియోజకవర్గాలకే అభ్యర్థులు అప్లికేషన్లు ఇచ్చినట్లు భావించాల్సి ఉంటుందని పార్టీవర్గాలు చెబుతున్నాయి. దరఖాస్తుల స్వీకరణ నిమిత్తం మాజీ ఎమ్మెల్సీ మాగం రంగారెడ్డి, పార్టీనేతలు సుభాష్‌చందర్‌జీ, మల్లేశం గౌడ్‌లతో రాష్ట్ర పార్టీ కమిటీ ఏర్పాటు చేసిన సంగతి తెలిసిందే.

4 చోట్ల పోటీకి దరఖాస్తు చేసిన శ్రీవాణి: సికింద్రాబాద్ నుంచి పోటీకి రవిప్రసాద్‌గౌడ్ మొదటగా ఈ కమిటీకి దరఖాస్తు సమర్పించారు. భద్రాచలం స్థానం నుంచి మాజీ ఎమ్మెల్యే కుంజా సత్యవతి, మిగతా 2వ పేజీలో ▶

చిట్టాలో చినబాబు!



- మీ కుమారుడి సన్నిహితులకు ముట్టిన ముడుపులకు ఆధారాలివిగో
- చంద్రబాబుకు ఇచ్చిన నోటీసుల్లో వెల్లడించిన ఐటీ శాఖ
- లోకేశ్‌కు అత్యంత సన్నిహితుడు కిలారు రాజేశ్‌కు చేరిన ముడుపులు
- టీడీపీ ఆఫీస్‌లో కిలారుకు రూ.4.5 కోట్లు అందించామన్న మనోజ్ వాసుదేవ్
- ఆర్‌వీఆర్ ఇన్‌ఫ్రాకి చెందిన రఘు రేలా ద్వారా మరో రూ.20.18 కోట్లు
- నారాయణ, కృష్ణ అనే వ్యక్తుల ద్వారా నగదు తరలింపు

ఎన్నికల తర్వాత కూడా అక్రమ సంపాదన వసూళ్లలో బాబు బిజీ

సాక్షి, అమరావతి: రాజధాని పేరుతో తాత్కాలిక భవన నిర్మాణ సంస్థల నుంచి ముడుపులు పిండుకోవడంలో 'చినబాబు' కూడా చేతివాటం చూపిన విషయం ఐటీ నోటీసులతో వెలుగులోకి వచ్చింది. ఈమేరకు మాజీ సీఎం నారా చంద్రబాబు నాయుడుకు జారీ చేసిన 46 పేజీల సుదీర్ఘ నోటీసుల్లో నారా లోకేశ్ పేరును కూడా ఆదాయపు పన్ను శాఖ ప్రస్తావించింది. లోకేశ్‌కు అత్యంత సన్నిహితుడు, టీడీపీ కార్యదర్శిగా ఉన్న కిలారు రాజేశ్ అక్రమ నగదు తరలింపులో కీలకపాత్ర పోషించినట్లు ఐటీ శాఖ స్పష్టమైన సాక్ష్యాధారాలతో వెల్లడించింది. 'మీ కుమారుడు నారా లోకేశ్ సన్నిహితులు నగదు తీసుకున్నారనేందుకు పక్కా ఆధారాలివీ.. వీటిపై మీరు ఏం సమాధానం చెబుతారు?' అంటూ బ్యాంకు లావాదేవీలకు సంబంధించిన ఎక్సెల్ షీట్లు, నగదు తరలింపు సమయంలో జరిపిన వాట్సాప్ మెసేజ్‌లను స్క్రీన్‌షాట్ల రూపంలో అందించి మరీ నోటీసులను జారీ చేసింది. విశాఖకు చెందిన ఆర్‌వీఆర్ నిర్మాణ రంగ సంస్థకు చెందిన రఘు రేలా ఆయన సన్నిహితుల ద్వారా కూడా భారీ మొత్తాలను తరలించినట్లు సాక్ష్యాలతో స్పష్టం చేసింది. ఈ చాటింగ్‌లన్నీ మీ వ్యక్తిగత కార్యదర్శి పెండ్యాల శ్రీనివాస్ ఇంట్లో 2020 ఫిబ్రవరిలో సోదాలు జరిపినప్పుడు స్వాధీనం చేసుకున్న సామ్‌సంగ్ ఫోన్ నుంచి సేకరించినవని, వీటిని శ్రీనివాస్ కూడా ధ్రువీకరించినట్లు ఐటీ శాఖ చంద్రబాబుకు జారీ చేసిన నోటీసుల్లో పేర్కొంది.

కిలారుకు రూ.4.5 కోట్లు.. అయితే ఓకే!

లోకేశ్‌కు అత్యంత సన్నిహితుడైన కిలారు రాజేశ్‌కు రూ.4.5 కోట్లను నగదు రూపంలో ఎలా చేరవేశారో ఐటీ శాఖ పూర్తి సాక్ష్యాధారాలతో నోటీసుల్లో వివరించింది. ఎన్నికలు ముగిసిన తర్వాత కూడా వీరు ముడుపుల వ్యవహారాన్ని యథేచ్ఛగా కొనసాగించారు. 2019 మే 22న చంద్రబాబు పీఏ పెండ్యాల శ్రీనివాస్, మనోజ్ వాసుదేవ్ పార్థసాని మిగతా 10వ పేజీలో ▶

గద్వాల ఎమ్మెల్యేగా డీకే అరుణను నియమించండి



- హైకోర్టు ఆదేశాలను అమలు చేయండి
- రాష్ట్ర ప్రభుత్వానికి ఈసీ ఆదేశాలు
- ఇటీవల కృష్ణమోహన్‌రెడ్డి ఎన్నికను రద్దు చేసిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్/మహబూబ్‌నగర్/గద్వాల: హైకోర్టు ఆదేశాల మేరకు గద్వాల ఎమ్మెల్యేగా డీకే అరుణను గుర్తిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం గెజిట్ విడుదల చేసింది. ఇటీవల తెలంగాణ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను పేర్కొంటూ తదుపరి గెజిట్ ప్రచురించాలని తెలంగాణ ఎన్నికల సంఘాన్ని కూడా ఆదేశించింది. గత శాసనసభ ఎన్నికల్లో గద్వాల స్థానం నుంచి గెలుపొందిన బీఆర్‌ఎస్ అభ్యర్థి బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి తన మొత్తం ఆస్తులు, అప్పుల వివరాలను ఎన్నికల అఫిడవిట్‌లో ప్రకటించకుండా దాచిపెట్టారని రుజువు కావడంతో ఆయన ఎన్నిక చెల్లదని గత నెల 24న రాష్ట్ర హైకోర్టు మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...



సోమవారం తిరుమల శ్రీవారిని రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సి.సుమలత దర్శించుకున్నారు.

గవర్నర్, సీఎం ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు

సాక్షి, హైదరాబాద్: మాజీ రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని గవర్నర్ తమిళిసై సౌందరరాజన్, ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్ రావు వేర్వేరు ప్రకటనల్లో ఉపాధ్యాయ దినోత్సవ శుభాకాంక్షలు తెలిపారు. దేశానికి గురువే చుక్కాని అన్నారు.

ఉపాధ్యాయులు స్ఫూర్తిదాయకంగా ఉండాలి

మంత్రి సబితా ఇంద్రారెడ్డి

సాక్షి, హైదరాబాద్: విద్యార్థులకు ఉపాధ్యాయులు ఎల్లప్పుడూ స్ఫూర్తిదాయకంగా ఉండాలని మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి పిలుపునిచ్చారు. విద్యార్థుల్లో అంతర్లీన ప్రతిభను వెలికితీసేందుకు కృషి చేయాలని సూచించారు. రాష్ట్ర స్థాయి ఉపాధ్యాయ అవార్డులకు ఎంపికైన టీచర్లను మంత్రి హైదరాబాద్‌లో కలుసుకుని, వారి అనుభవాలను అడిగి తెలుసుకున్నారు.

పార్టీలకతీతంగా మాదిగలకు అండ

- మాదిగ మేధావుల భేటీలో నిర్ణయం
- రాజనర్సింహ, రాజయ్య భేటీపై చర్చ



నయీంనగర్: మాదిగలు ఏ పార్టీ నుంచి పోటీ చేసినా రాజకీయాలకు అతీతంగా అండగా నిలవాలని మాదిగ మేధావుల సమావేశంలో నిర్ణయించారు. సోమవారం హనుమకొండ నయీంనగర్‌లోని ఓ హోటల్‌లో మాదిగ చమర్ ఇంటలెక్చువల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 'ఏ టాక్ ఆన్ చేంజింగ్ పాలిటిక్స్ ఇన్ ఇండియా అండ్ ఫోకస్ టు తెలంగాణ'అనే అంశంపై చర్చించారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దామోదర రాజనర్సింహ, మాజీ ఎంపీ సిరిసిల్ల రాజయ్య, బీఆర్ఎస్ నుంచి స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య, బీజేపీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే కొండేటి శ్రీధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా దామోదర రాజనర్సింహను ఎమ్మెల్యే తాటికొండ రాజయ్య కలవడం రాజకీయంగా హాట్ టాపిక్‌గా మారింది. దామోదర్ రాజనర్సింహ మాట్లాడుతూ ఇది రాజకీయాలకు సంబంధం లేని సమావేశమని, ఎవరూ ఏ పార్టీలో చేరడం లేదని తెలిపారు.

బీజేపీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్‌గా ధర్మారావు

సాక్షి, హైదరాబాద్: బీజేపీ నేత, మాజీ ఎమ్మెల్యే ఎం.ధర్మారావు చైర్మన్‌గా, న్యాయవాది రవీంద్ర విశ్వనాథ్ కన్వీనర్‌గా రాష్ట్రపార్టీ క్రమశిక్షణ కమిటీ ఏర్పాటైంది. ఈ కమిటీలో సభ్యులుగా నాగూరావు నామాజీ, జి.పద్మజారెడ్డి, ఎస్.రాజమౌళిగౌడ్, బోసుపల్లి ప్రతాప్ నియమితులయ్యారు. సోమవారం ఈ మేరకు కేంద్రమంత్రి, బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి ఉత్తర్వులు జారీచేశారు.

గోదావరిలో మళ్లీ జలకళ!

సాక్షి, హైదరాబాద్/బాల్కొండ/కడెం/కాళేశ్వరం: రెండు, మూడు రోజులుగా కురుస్తున్న వానలతో గోదావరి నది మళ్లీ జలకళ సంతరించుకుంది. ఎగువన శ్రీరాంసాగర్ నుంచి నది పొడవునా ప్రవాహాలు పెరిగాయి. సోమవారం రాత్రికి ఎగువన శ్రీరాంసాగర్‌లోకి 50 వేల క్యూసెక్కుల వరద చేరుతుండగా.. 16 గేట్లు ఎత్తి సుమారు అదే స్థాయిలో నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టులో నీటి నిల్వ పూర్తిస్థాయిలో 90 టీఎంసీలకు చేరింది. ఇక కడెం ప్రాజెక్టుకు వరద 36,560 క్యూసెక్కులకు పెరిగింది. నాలుగు గేట్లను ఎత్తి 56,429 క్యూస్కెకుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 7.6 టీఎంసీలుకాగా.. ప్రస్తుతం 6.5 టీఎంసీలు నిల్వ ఉంది. ఇక ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి 35,300 క్యూసెక్కుల వరద చేరుతుండగా.. 46,221 క్యూసెక్కులను విడుదల చేస్తున్నారు. కాళేశ్వరంలో అంతర్భాగమైన మేడిగడ్డ (లక్ష్మి) బ్యారేజీ నుంచి 1,66,970 క్యూసెక్కులు, తుపాకుల గూడెం వద్ద ఉన్న సమ్మక్క బ్యారేజీ నుంచి 1,32,480 క్యూసెక్కులు, దుమ్ముగూడెం వద్ద సీతమ్మసాగర్ బ్యారేజీ నుంచి 81,108 క్యూసెక్కులను వదులుతున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవ్‌పూర్ మండలంలోని అన్నారం సరస్వతి బ్యారేజీకి సోమవారం రాత్రి గోదావరి ఎగువనుంచి వరద పోటెత్తడంతో 66 గేట్లకు 45 గేట్లు ఎత్తారు. లక్ష క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా ఇంజనీరింగ్ అధికారులు గేట్లు ఎత్తి దిగువకు విడుదల చేశారు. ఆ నీరంతా కాళేశ్వరం వైపు తరలివస్తోంది. బేసిన్ పరిధిలో ఆది, సోమవారాల్లో భారీ వర్షాలు కురిసిన నేపథ్యంలో మంగళవారం సాయంత్రానికి గోదావరిలో వరద మరింతగా పెరిగే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు.

నెల విరామం తర్వాత పెరుగుతున్న ప్రవాహాలు

శ్రీరాంసాగర్, కడెం, ఎల్లంపల్లి, సరస్వతి ప్రాజెక్టుల గేట్లు ఎత్తివేత

కృష్ణా పరీవాహకంలో మాత్రం ఇంకా కరువు ఛాయలే!



శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి విడుదలవుతున్న నీరు

కృష్ణాలో కానరాని ప్రవాహాలు

పశ్చిమ కనుమల్లో తీవ్ర వర్షాభావం కొనసాగుతుండటంతో కృష్ణా నదిలో ఎక్కడా పెద్దగా ప్రవాహాలు కానరావడం లేదు. సోమవారం ఆల్మట్టి డ్యామ్‌లోకి కేవలం 5,086 క్యూసెక్కుల ప్రవాహమే నమోదైంది. అక్కడ విద్యుదుత్పత్తి ద్వారా వదులుతున్న 14 వేల క్యూసెక్కులు దిగువన నారాయణపూర్‌లోకి చేరుతున్నాయి. రాష్ట్రంలోని జూరాలకు కేవలం 420 క్యూసెక్కులే వరద ఉంది. కృష్ణా ప్రధాన ఉప నది తుంగభద్రకు కూడా కేవలం 559 క్యూసెక్కుల ప్రవాహం వస్తోంది. శ్రీశైలం డ్యామ్‌కు ఎలాంటి వరద రావడం లేదు. స్థానిక వర్షాలతో నాగార్జునసాగర్‌కు 11,424 క్యూసెక్కులు, మూసీ ప్రవాహంతో పులిచింతలకు 5,546 క్యూసెక్కులు చేరుతున్నాయి.

రాష్ట్రమంతా వాన జోరు

మొదటి పేజీ తరువాయి

నడిపల్లిలో హైదరాబాద్ రోడ్డుపై వరద నీరు ఉధృతంగా ప్రవహించింది. సిరికొండ మండలంలో కప్పలవాగు ఉధృతికి గడ్కోల్-నిజామాబాద్ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయి. సిరికొండలో విద్యుత్ ఉపకేంద్రం నీట మునిగింది. నిజామాబాద్ శివార్లలోని పాంగ్రాలో పలు ప్రాంతాలు నీట మునగడంతో నిర్వాసితులను పునరావాస కేంద్రాలకు తరలించారు. రెంజల్ మండల కేంద్రంలో మూడు ఇళ్లు కూలిపోయాయి. కామారెడ్డి జిల్లాలోని పెద్దవాగు పొంగి పోచారం ప్రాజెక్టు అలుగు పోస్తోంది. మంజీరా పరవళ్లు తొక్కుతుండటంతో నిజాంసాగర్ ప్రాజెక్టు ఐదు గేట్లు ఎత్తి నీటిని వదులుతున్నారు. గాంధారి-బాన్సువాడ రహదారిపై రాకపోకలు నిలిచిపోయాయి.

వికారాబాద్ జిల్లాలో పొంగుతున్న వాగులు

భారీ వర్షాలతో వికారాబాద్ జిల్లాలో వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. వికారాబాద్, తాండూరు, పరిగిలలో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. కొత్రెపల్లి - బురంతపల్లి మార్గంలో రోడ్డు కోతకు గురైంది. జిల్లాలోని ప్రమాదకర వాగులు, బ్రిడ్జీల వద్ద నిఘా ఉంచారు. కాగ్నా, మూసీ, ఈసీ నదులు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఇక మెదక్ ఉమ్మడి జిల్లా పరిధిలో భారీ వర్షాలు కురిశాయి. వాగులు ఉప్పొంగడంతో సింగూరు ప్రాజెక్టులోకి వరద పెరిగింది.

ఉమ్మడి ఆదిలాబాద్‌లో విస్తారంగా..

ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో ఆదివారం రాత్రి నుంచి సోమవారం సాయంత్రం వరకు విస్తారంగా వానలు పడ్డాయి. వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. నిర్మల్ జిల్లా పెంబి మండలంలో చెట్లు విరిగిపడ్డాయి. ఖానాపూర్ మండలంలో రెంకోని వాగు ఉప్పొంగి కడెం, దస్తురాబాద్, ఖానాపూర్ మండలాలకు రాకపోకలు నిలిచిపోయాయి.

హైదరాబాద్‌ను వీడని వాన

రాష్ట్ర రాజధాని హైదరాబాద్ నగరంలో సోమవారం పొద్దంతా ఎడతెరిపి లేకుండా వాన పడింది. పలు ప్రాంతాల్లో కాసేపు భారీ వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయం కాగా.. ఇళ్లలోకి వరద చేరింది. పలు భవనాల సెల్లార్లు నీట మునిగాయి. రోడ్లపై వరద కారణంగా వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది.

మరో రెండు రోజులు వానలు

మంగళవారం వాయవ్య, పశ్చిమ మధ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణశాఖ అంచనా వేసింది. దీంతో రాష్ట్రవ్యాప్తంగా విస్తారంగా వానలు కురుస్తాయని ప్రకటించింది. పదకొండు జిల్లాలకు ఆరెంజ్ అలర్ట్‌ను జారీ చేసింది. రెండు రోజులుగా కురుస్తున్న వానలతో పంటలకు ప్రాణం పోసినట్లు అయిందని వ్యవసాయ అధికారులు చెప్తున్నారు.



నిర్మల్ జిల్లాలో ఉప్పొంగిన రెంకోని వాగు

- మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, భూపాలపల్లి, ములుగు, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల్లో అతిభారీ వర్షాలు పడతాయని వాతావరణ శాఖ హెచ్చరించింది.
- ఆదిలాబాద్, కుమ్రుంభీం ఆసిఫాబాద్, కరీంనగర్, పెద్దపల్లి, నల్లగొండ, సూర్యాపేట, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్ జిల్లాల్లో మోస్తరు వర్షాలు పడవచ్చని తెలిపింది.

2.7 సెంటీమీటర్ల సగటు వర్షపాతం

సోమవారం రాష్ట్రవ్యాప్తంగా 2.7 సెంటీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. జిల్లాల వారీగా సగటును పరిశీలిస్తే.. అత్యధికంగా నిజామాబాద్ జిల్లాలో 8.72 సెంటీమీటర్లు కురిసింది. నిర్మల్‌లో 8.4, రాజన్న సిరిసిల్ల జిల్లాలో 8.0, కామారెడ్డి జిల్లాలో 7.1, జగిత్యాలలో 6.9 సెం.మీ. వర్షపాతం నమోదైంది. ప్రాంతాల వారీగా చూస్తే.. రాష్ట్రంలోనే అత్యధికంగా కామారెడ్డి జిల్లా గాంధారిలో 10.05 సెంటీమీటర్ల వాన పడింది. నైరుతి రుతుపవనాల సీజన్‌కు సంబంధించి రాష్ట్రంలో సోమవారం (సెప్టెంబర్ 4) నాటికి 59.77 సెంటీమీటర్ల వర్షపాతం నమోదుకావాల్సి ఉండగా.. ఈసారి ఇదే సమయానికి 69.13 సెంటీమీటర్లు కురిసింది. అంటే సాధారణం కంటే 16శాతం అధిక వర్షపాతం కొనసాగుతోందని వాతావరణ శాఖ గణాంకాలు చెప్తున్నాయి. మొత్తంగా రాష్ట్రంలోని 12 జిల్లాల్లో అధికంగా, 20 జిల్లాల్లో సాధారణ వర్షపాతం నమోదవగా.. ఖమ్మం జిల్లాలో మాత్రం 17శాతం లోటు వర్షపాతం కొనసాగుతోంది.



6 గంటలు వరద మధ్య..



సంగయ్యను తీసుకువస్తున్న ఎమ్మెల్యే జాజాల

కామారెడ్డి జిల్లా గాంధారి మండలం పేట్ సంగెం, రాంలక్ష్మన్‌పల్లి గ్రామాల మధ్య ఉన్న పెద్దవాగు అవతల మాతు సంగెం గ్రామానికి చెందిన సంగయ్యకు పొలం ఉంది. సోమవారం ఉదయం పొలం వద్ద కట్టేసిన గేదెలను తీసుకురావడానికి వెళ్లిన సంగయ్య.. ఒక్కసారిగా పెద్దవాగు ప్రవాహం పెరగడంతో అక్కడే షెడ్డులో చిక్కుకుపోయాడు. దీనిపై సమాచారం అందడంతో ఎల్లారెడ్డి ఎమ్మెల్యే జాజాల సురేందర్, అధికారులు అక్కడికి చేరుకున్నారు. బోటు తెప్పించారు. సుమారు ఆరు గంటల తర్వాత సంగయ్యను తీసుకువచ్చారు.

అధిక వర్షపాతం నమోదైన ప్రాంతాలివీ (సెం.మీ.లలో)

ప్రాంతం (జిల్లా)	వర్షపాతం
గాంధారి (కామారెడ్డి)	10.05
లక్ష్మీసాగర్ (సంగారెడ్డి)	8.98
కొండాపూర్ (సంగారెడ్డి)	8.88
మోమిన్‌పేట్ (వికారాబాద్)	7.73
సంగారెడ్డి (సంగారెడ్డి)	7.63
చిట్కుల్ (మెదక్)	7.60
వికారాబాద్ (వికారాబాద్)	7.45
నవాబ్‌పేట్ (వికారాబాద్)	7.35
పుల్కల్ (సంగారెడ్డి)	7.00
పల్దా (నిజామాబాద్)	6.70

'మేరీ మిట్టి.. మేరా దేశ్'లో ప్రతిఒక్కరూ పాల్గొనాలి

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

అఫ్జల్‌గంజ్: దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన ఎందరో అమరవీరుల త్యాగాలను ప్రతిఒక్కరూ స్ఫూర్తిగా తీసుకోవాలని కేంద్రమంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అన్నారు. సోమవారం రాజ్యసభసభ్యుడు డాక్టర్ లక్ష్మణ్‌తో కలిసి గోషామహల్ నియోజకవర్గంలో 'మేరీ మిట్టి.. మేరా దేశ్'కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రతిఒక్కరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలని పిలుపునిచ్చారు. ముందుగా గోషామహల్‌లోని ఐదు గుళ్ల దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ఆవరణలో మొక్కలు నాటి, నాయకులు, కార్యకర్తలతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి మట్టి సేకరించారు. స్వాతంత్ర్య సమరయోధుడు వందేమాతరం రామ్‌చందర్ రావు ఇంటికి వెళ్లి వారి కుటుంబసభ్యులను ఘనంగా సన్మానించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ అక్టోబర్ 31న సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా దేశం నలుమూలల నుంచి సేకరించిన మట్టి కలశాలను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఢిల్లీలోని కర్తవ్య పథ్‌లో స్వీకరిస్తారన్నారు. ఇండియా కూటమి ఎన్ని కుతంత్రాలు చేసినా తిరిగి కేంద్రంలో ఎన్డీఏ ప్రభుత్వం హ్యాట్రిక్ విజయం సాధించి ప్రధానిగా మోదీ మరోసారి అధికారంలోకి వస్తారన్నారు. కార్యక్రమంలో బీజేపీ యువ నాయకుడు ఎం.విక్రమ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



గోషామహల్‌లో మట్టిని సేకరిస్తున్న కేంద్ర మంత్రి జి.కిషన్‌రెడ్డి, లక్ష్మణ్ తదితరులు

ఆప్తా సేవలు శ్లాఘనీయం

బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బండి సంజయ్



సాక్షి, హైదరాబాద్: ఆపదలో ఉన్న వారికి ఆపన్నహస్తం అందిస్తూ అమెరికన్ ప్రోగ్రెసివ్ తెలుగు అసోసియేషన్ (ఆప్తా) చేస్తున్న సేవలు శ్లాఘనీయమని బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ బండి సంజయ్ కుమార్ కొనియాడారు. స్వామి వివేకానంద స్ఫూర్తితో భారత సంస్కృతి, సనాతన ధర్మాన్ని పెంపొందించడం అభినందనీయమన్నారు. అమెరికా పర్యటనలో ఉన్న సంజయ్ అట్లాంటాలో జరిగిన ఆప్తా సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... 2008లో కేవలం 10 మందితో ప్రారంభించిన ఆప్తా నేడు 10 వేల మందికిపైగా విస్తరించడం ఆనందంగా ఉందన్నారు. ఏటా 1,500 మందికి ఉపకారవేతనాలివ్వడంతోపాటు వైద్య శిబిరాలు నిర్వహిస్తుండటం, మహిళలకు ఆర్థిక సాయం అందించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కోశాధికారి భండారు శాంతికుమార్, రాష్ట్ర కార్యదర్శి బొమ్మ జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.

సాంస్కృతిక విప్లవ యోధుడు గద్దర్

దళిత మహోద్యమ నేత డాక్టర్ కత్తి పద్మారావు



సాక్షి, అమరావతి: సాంస్కృతిక విప్లవ యోధుడు గద్దర్ గొప్ప క్రమశిక్షణ, వ్యక్తిత్వం కలిగిన నాయకుడని దళిత ఉద్యమ నేత డాక్టర్ కత్తి పద్మారావు కొనియాడారు. ఇటీవల పొన్నూరులోని అంబేడ్కర్ రీసెర్చ్ సెంటర్‌లో గద్దర్ కుమార్తె వెన్నెలతో కలిసి ప్రజా గాయకుడు గద్దర్ వ్యక్తిత్వంపై మూడు గంటలపాటు సుదీర్ఘ చర్చ నిర్వహించారు. తనకు గద్దర్‌తో ఉన్న అనుబంధాలను నెమరువేసుకున్నారు. గద్దర్ రాసిన 100కు పైగా పాటలు ముద్రణకు నోచుకోలేదని వెన్నెల చెప్పగా.. ఆ రచనలను లోకాయత పబ్లికేషన్స్ ద్వారా తామే ముద్రిస్తామని పద్మారావు భరోసా ఇచ్చారు. వాటిని ప్రజా బాహుళ్యంలోకి తీసుకెళ్లాలని సూచించారు. గద్దర్ అనుచరుడు యాదగిరి, లోకాయత పబ్లికేషన్స్ కో-ఆర్డినేటర్ కత్తి చేతన్, ఆంధ్రప్రదేశ్ దళిత మహాసభ ఉపాధ్యక్షుడు కొరబండి అంథోని పాల్గొన్నారు.

జమిలి అయినా ఓకే!

మొదటి పేజీ తరువాయి

సీఎం కేసీఆర్ కార్యాచరణ రూపొందిస్తున్నారు. కేంద్రం లోక్‌సభకు ముందస్తు ఎన్నికలు నిర్వహించినా, ప్రస్తుతం రాష్ట్రంలో నెలకొన్న పరిస్థితుల్లో ఫలితం తమకే అనుకూలంగా ఉంటుందని కేసీఆర్ లెక్కలు వేస్తున్నారు. అయితే లోక్‌సభకు ముందుగా ఎన్నికలు జరిగితే అసెంబ్లీ అభ్యర్థుల జాబితాలో స్వల్ప మార్పులు ఉంటాయని సమాచారం. తెలంగాణతో పాటు పొరుగునే ఉన్న మహారాష్ట్రను కూడా కలుపుకొని 65 లోక్‌సభ స్థానాల్లో పోటీ చేసేందుకు బీఆర్ఎస్ కసరత్తు చేస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో కామారెడ్డి, గజ్వేల్ నుంచి పోటీ చేస్తున్న కేసీఆర్, లోక్‌సభ ఎన్నికల్లో పొరుగునే ఉన్న మహారాష్ట్ర నుంచి పోటీ చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. అందుకు అవసరమైన వ్యూహం, కార్యాచరణపై వ్యూహాత్మకంగా పావులు కదుపుతున్నారు.

నియోజకవర్గాల్లో పరిస్థితిపై దృష్టి

అసెంబ్లీ ఎన్నికలకు అభ్యర్థులను ప్రకటించి పక్షం రోజులు కావస్తుండగా, సుమారు 40కి పైగా నియోజకవర్గాల్లో నేతల మధ్య అంతర్గత విభేదాలు కొలిక్కి రావడం లేదని కేసీఆర్ అంచనాకు వచ్చారు. వివిధ సర్వే సంస్థలు, నిఘా వర్గాల నుంచి అందిన ఫీడ్ బ్యాక్ ఆధారంగా ఆయా నియోజకవర్గాల్లో పరిస్థితిని మదింపు చేస్తున్నారు. మూడోవంతు నియోజకవర్గాల్లో అభ్యర్థుల ప్రచారం ఆశించిన స్థాయిలో లేకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేస్తున్న అధినేత.. ఈ నెల రెండో వారం నుంచి బలహీనంగా ఉన్న నియోజకవర్గాలపై వరుస సమీక్షలకు సిద్ధమవుతున్నారు. తాను పోటీ చేయాలని భావిస్తున్న కామారెడ్డి నియోజకవర్గ బీఆర్ఎస్ నేతలు, కేడర్‌తో ఈ నెల 7న భేటీ కానున్నారు.

గద్వాల ఎమ్మెల్యేగా డీకే అరుణను నియమించండి

మొదటి పేజీ తరువాయి

తీర్పునిచ్చిన విషయం తెలిసిందే. కృష్ణమోహన్ రెడ్డి ఎన్నికను సవాలు చేస్తూ సమీప ప్రత్యర్థి డీకే అరుణ వేసిన ఎలక్షన్ పిటిషన్‌పై హైకోర్టు ఈ నిర్ణయం తీసుకుంది. ఈ నేపథ్యంలో డీకే అరుణను ఎమ్మెల్యేగా నియమించాలని హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని కేంద్ర ఎన్నికల సంఘం అండర్ సెక్రటరీ సంజయ్ కుమార్ సోమవారం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి/శాసనసభ కార్యదర్శి, రాష్ట్ర ఎన్నికల ప్రధాన అధికారికి వేర్వేరుగా హైకోర్టు తీర్పు ప్రతిని జతచేస్తూ లేఖలు రాశారు.

కాంగ్రెస్ ఎమ్మెల్యేగానే..!

2018 అసెంబ్లీ ఎన్నికల్లో డీకే అరుణ కాంగ్రెస్ టికెట్‌పై పోటీ చేశారు. ప్రస్తుతం ఆమె బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలుగా ఉన్నా.. ఆమెను కాంగ్రెస్ ఎమ్మెల్యేగానే గుర్తించనున్నట్లు సమాచారం.

ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేయించండి: అరుణ

కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాలు, హైకోర్టు ఉత్తర్వుల మేరకు తక్షణమే తనను ఎమ్మెల్యేగా గుర్తిస్తూ గెజిట్ ప్రచురించి, ప్రమాణ స్వీకారం చేయించాలని డీకే అరుణ కోరారు. గద్వాల జిల్లాకేంద్రంలోని బీజేపీ కార్యాలయంలో ఆమె మాట్లాడుతూ గద్వాల ఎమ్మెల్యేగా తనను గుర్తిస్తూ కేంద్ర ఎన్నికల సంఘం గెజిట్ విడుదల చేసిందని వివరాలు వెల్లడించారు. అనర్హతకు గురైనవారు కోర్టు తీర్పు అనంతరం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేసే విధంగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు.

- స్పీకర్ కోర్టులో డీకే అరుణ..

సుప్రీంకోర్టుకు వెళ్లిన కృష్ణమోహన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: గద్వాల ఎమ్మెల్యేగా డీకే అరుణను ప్రకటిస్తూ హైకోర్టు తీర్పునివ్వడం, కేంద్ర ఎన్నికల సంఘం ఆమె ఎన్నికను గుర్తించడమేకాక, ఆ మేరకు చర్యలు తీసుకోవాలని ఆదేశించడంతో ఇప్పుడు బంతి స్పీకర్ కోర్టులో పడింది. స్పీకర్ పోచారం శ్రీనివాస్‌రెడ్డి గద్వాల ఎమ్మెల్యేగా డీకే అరుణతో ప్రమాణస్వీకారం ఎప్పుడు చేయిస్తారన్న దానిపై ఉత్కంఠ నెలకొంది. కొత్తగూడెం ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు ఎన్నిక చెల్లదంటూ బీఆర్ఎస్ నుంచి పోటీ చేసి ఓడిపోయిన సమీప ప్రత్యర్థి జలగం వెంకట్రావు హైకోర్టుకు వెళ్లడం, హైకోర్టు ఆయనకు అనుకూలంగా తీర్పునిచ్చిన సంగతి విదితమే. అప్పుడు స్పీకర్ కార్యాలయంలో తనను ఎమ్మెల్యేగా గుర్తించాలని, ప్రమాణ స్వీకారం చేయించాలని జలగం విజ్ఞప్తి కూడా చేశారు. కానీ, ఈలోగా వనమా సుప్రీంకోర్టుకు వెళ్లి హైకోర్టు ఉత్తర్వులపై స్టే తెచ్చుకుని ఎమ్మెల్యేగా కొనసాగుతున్నారు. కానీ, డీకే అరుణ విషయంలో మాత్రం హైకోర్టు తీర్పునివ్వడం ఒకటైతే, కేంద్ర ఎన్నికల కమిషన్ కూడా ఆమె ఎమ్మెల్యేగా ఎన్నికైన అంశాన్ని తదుపరి గెజిట్‌లో ప్రచురించాలని, ఆ కాపీలను తమకు పంపించాలని ప్రభుత్వ సీఎస్‌ను, శాసనసభ కార్యదర్శిని, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని ఆదేశించడం గమనార్హం. కాగా, హైకోర్టు ఇచ్చిన తీర్పుపై బీఆర్ఎస్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి సుప్రీంకోర్టును ఆశ్రయించారు. కృష్ణమోహన్‌రెడ్డి పిటిషన్‌ను ఈ నెల 11న విచారించడానికి లిస్టు చేసినట్లు సమాచారం. తాజాగా కేంద్ర ఎన్నికల సంఘం ఇచ్చిన ఉత్తర్వుల నేపథ్యంలో మంగళవారం ఈ అంశాన్ని సుప్రీంకోర్టు దృష్టికి తీసుకెళ్లనున్నట్లు కృష్ణమోహన్‌రెడ్డి వివరించారు.

కోర్టు ఆదేశాల నేపథ్యంలో...

డీకే అరుణ ప్రస్తుతం ఏ పార్టీలో ఉన్నప్పటికీ కోర్టు ఆదేశాల నేపథ్యంలో ఆమెతో ఎమ్మెల్యేగా ప్రమాణం చేయించాల్సి ఉంటుందని న్యాయనిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఆమె ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేశాకే ఆమె పార్టీ మారిందన్న అంశం తెరపైకి వస్తుందని అసెంబ్లీ కార్యకలాపాల్లో విశేష అనుభవం ఉన్న మాజీ అధికారి ఒకరు వివరించారు. 2018లో ఆమె అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి పోటీ చేసి ఓడిపోవడం, 2019 పార్లమెంట్ ఎన్నికల్లో ఆమె బీజేపీ నుంచి పోటీ చేసి పరాజయం పొందిన సంగతి తెలిసిందే. ఇప్పుడు ఆమె బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలుగా ఉన్నారు. స్పీకర్ ఆమెతో ప్రమాణం చేయిస్తే సాంకేతికంగా ఆమె కాంగ్రెస్ సభ్యురాలుగానే ఉండాల్సి ఉంటుందని ఆ మాజీ అధికారి తెలిపారు.

బీజేపీలో దరఖాస్తుల వెల్లువ!

మొదటి పేజీ తరువాయి

వేములవాడ సీటుకు కరీంనగర్ మాజీ జడ్పీ చైర్పర్సన్ తుల ఉమ అప్లికేషన్ పెట్టుకున్నారు. సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి మహేశ్వరం, ఎల్బీనగర్, సనత్‌నగర్, ముషీరాబాద్ నుంచి పోటీకి అవకాశమివ్వాలంటూ దరఖాస్తులు సమర్పించారు. ఎల్బీనగర్ అసెంబ్లీ టికెట్ కోసం సామ రంగారెడ్డి దరఖాస్తు చేశారు.

కిషన్‌రెడ్డి పరిశీలన

కేంద్రమంత్రి, బీజేపీ తెలంగాణ అధ్యక్షుడు కిషన్‌రెడ్డి సోమవారం ఎన్నికల దరఖాస్తుల స్వీకరణ కేంద్రాన్ని పరిశీలించారు. అప్లికేషన్ ఇచ్చిన వారు మీడియాతో మాట్లాడకుండా నేరుగా నియోజకవర్గం వెళ్లి పనిచేసుకోవాలని ఆయన సూచించారు. ఈ నెల 10వ తేదీ వరకు ఆశావాహుల నుంచి బీజేపీ దరఖాస్తులను స్వీకరించనుంది. ఇది ముగిశాక మూడు స్థాయిల్లో అంటే జిల్లా, రాష్ట్ర, జాతీయపార్టీ స్థాయిలలో వడపోత కార్యక్రమం నిర్వహిస్తారని పార్టీ నేతల సమాచారం.

25 స్థానాలకు ఒక్కో అభ్యర్థితోనే తొలిజాబితా

పార్టీ ముఖ్యనేతలు, కచ్చితంగా గెలిచే అవకాశాలున్న వారిని దాదాపు 25 స్థానాల వరకు కేవలం ఒక్కో అభ్యర్థితోనే తొలిజాబితా సిద్ధం చేసే అవకాశాలున్నట్టు తెలుస్తోంది. మిగతా స్థానాల్లో ఒక్కో సీటుకు ముగ్గురు లేదా నలుగురు చొప్పున ప్రతిపాదిత పేర్లతో రఫ్ జాబితా సిద్ధం చేసి రాష్ట్రపార్టీ నుంచి పార్లమెంటరీ బోర్డుకు సమర్పించవచ్చునని సమాచారం. ఇప్పటికే అధికార బీఆర్ఎస్ 113మంది అభ్యర్థులను ప్రకటించడంతో ఎక్కడికక్కడ నేతలంతా అసెంబ్లీ ఎన్నికల ప్రచారానికి శ్రీకారం చుట్టారు. ప్రధాన ప్రతిపక్షం కాంగ్రెస్‌పార్టీ సైతం పోటీచేసేందుకు ఆసక్తి ఉన్న వారి నుంచి దరఖాస్తులను స్వీకరించింది. ఈ నేపథ్యంలో బీజేపీలోనూ ఎన్నికల్లో పోటీకి దరఖాస్తుల ప్రక్రియ మొదటిరోజే వేగం పుంజుకుంది.

ఇంకా రుణమాఫీ అందని రైతులు.. 1.6 లక్షలు

రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు వెల్లడి

- వారికి వెంటనే అందజేయాలని బ్యాంకులకు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: సాంకేతిక, ఇతర కారణాల వల్ల సుమారు 1.6 లక్షల మందికి ఇంకా రుణమాఫీ కాలేదని రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి హరీశ్‌రావు వెల్లడించారు. వీరికి వెంటనే రుణమాఫీ సొమ్ము అందజేయాలని ఆదేశించారు. రైతు రుణమాఫీపై సోమవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సచివాలయంలో బ్యాంకర్లతో హరీశ్‌రావు ఆధ్వర్యంలో ఉన్నత స్థాయి సమీక్ష జరిగింది. దేవాదాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, సీఎస్ శాంతికుమారి, స్పెషల్ సీఎస్ రామకృష్ణరావు, వివిధ బ్యాంకుల అధికారులు హాజరయ్యారు. ఈ సమావేశంలో పలు ముఖ్యమైన నిర్ణయాలు తీసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి హరీశ్‌రావు మాట్లాడుతూ... రుణమాఫీకి సంబంధించి ప్రతి రూపాయి రైతు చేతికి వెళ్లాలన్నది సీఎం కేసీఆర్ ఆకాంక్ష అన్నారు. ఇందుకు అనుగుణంగా ప్రభుత్వం ఇప్పటికే



రూ.లక్షలోపు రుణాలు మాఫీ చేసిందన్నారు. మిగతావారికి ప్రాధాన్యక్రమంలో రుణమాఫీ జరుగుతుందన్నారు. ఇప్పటివరకు 18.79 లక్షల మంది రైతులకు రుణమాఫీ కింద రూ.9,654 కోట్లు ఆర్థిక శాఖ విడుదల చేసిందన్నారు.17.15 లక్షల మందికి రుణమాఫీ డబ్బులు వారి ఖాతాల్లో చేరాయన్నారు. బ్యాంకు ఖాతాలు పనిచేయకపోవడం, అకౌంట్లు క్లోజ్ చేయడం, అకౌంట్ నంబర్లు మార్చడం, బ్యాంకుల విలీనం అనే నాలుగు కారణాల వల్ల ఈ సమస్య తలెత్తినట్టు ఆయనకు అధికారులు వివరించారు. చర్చించిన అనంతరం మూడు పరిష్కారమార్గాలు కనుగొన్నారు.

- ఆధార్ నంబర్ల సాయంతో రైతుబంధు ఖాతాలను గుర్తించి ఆ ఖాతాల్లో రుణమాఫీ డబ్బు వేయడం, దీనివల్ల సుమారు మరో లక్షమందికి రుణమాఫీ డబ్బు అందుతుంది.
- ఎన్పీసీఐ సాయంతో బ్యాంకులు రైతుల బ్యాంకు ఖాతాలు సేకరించి ప్రభుత్వానికి అందజేయాలి. వారికి ఆర్థికశాఖ నిధులు విడుదల చేస్తుంది. ఇలా దాదాపు 50 వేల మందికి మూడు రోజుల్లోగా డబ్బు వేయాలని నిర్ణయించారు.
- మిగతా 16 వేల మందికి సంబంధించి కలెక్టర్లు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారుల ఆధ్వర్యంలో క్షేత్రస్థాయిలో వివరాలు పరిశీలిస్తారు. ఆ సమాచారం ఆధారంగా రుణమాఫీ పూర్తి చేస్తారని మంత్రి హరీశ్‌రావు తెలిపారు.

రుణమాఫీ సమస్యల పరిష్కారానికి రాష్ట్రస్థాయి గ్రీవెన్స్‌సెల్

రుణమాఫీ సమస్యల పరిష్కారానికి బ్యాంకులు రాష్ట్రస్థాయిలో గ్రీవెన్స్‌సెల్ ఏర్పాటు చేయాలి.. ఒక అధికారిని నియమించి, వారి ఫోన్‌నంబర్, ఈ మెయిల్ ఐడీని ప్రజలకు తెలియజేయాలని మంత్రి హరీశ్‌రావు ఆదేశించారు. రైతులు ముందుగా బ్యాంకుస్థాయిలో సంప్రదిస్తారు..అక్కడ పరిష్కారం కాకపోతే రాష్ట్రస్థాయి అధికారిని సంప్రదించి, సమస్యను చెప్పుకొనేలా ఏర్పాటు చేయాలన్నారు. ఇదే తరహాలో వ్యవసాయశాఖ తరఫున జిల్లాకు ఒక నోడల్ ఆఫీసర్‌ను నియమిస్తామన్నారు.

కొత్త రుణాలు మంజూరు చేయాలి

రుణమాఫీ పొందిన రైతులందరికీ బ్యాంకులు కొత్త రుణాలు మంజూరు చేయాలని మంత్రి హరీశ్‌రావు అన్నారు. పురోగతిపై బ్యాంకుల వారీగా ఎప్పటికప్పుడు సమీక్షలు జరపాలని చెప్పారు. రుణమాఫీ పొందినవారిలో ఇప్పటి వరకు 35 శాతం మందికి మాత్రమే కొత్త రుణాలు మంజూరైనట్టు గణాంకాలు చెబుతున్నాయన్నారు. ఈ నెలాఖరు నాటికి మొత్తం 18.79 లక్షల మంది రైతులకు పంట రుణాలు రెన్యూవల్ పూర్తి కావాలన్నారు. ప్రభుత్వం మాఫీ చేసిన రూ.9,654 కోట్ల మేర తిరిగి కొత్త లోన్ల రూపంలో రైతులకు చేరాలన్నారు. కొత్త రుణాలపై జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధుల సహకారంతో రైతులకు అవగాహన కల్పించాలన్నారు. రుణమాఫీ, పంట రుణాల రెన్యూవల్‌పై ఈ నెలాఖరులో మరోసారి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహిస్తామని మంత్రి స్పష్టం చేశారు. అనంతరం ఆయా జిల్లాల్లో రుణమాఫీ అంశంపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి, పలు ఆదేశాలు జారీ చేశారు. రుణ మాఫీ సంబంధిత అన్ని సమస్యలు పరిష్కరించి రైతులకు రుణాలు అందేలా చూడాలని మంత్రి ఆదేశించారు.

క్లుప్తంగా...

ఉండేదిక్కడ.. రాజకీయం అక్కడ
చంద్రబాబుపై శాసనమండలి చైర్మన్ గుత్తా విసుర్లు



నల్లగొండ టూటౌన్: టీడీపీ అధ్యక్షుడు చంద్రబాబునాయుడు హైదరాబాద్‌లో ఉంటూ.. ఆంధ్రలో రాజకీయాలు చేస్తున్నారని శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి ఆరోపించారు. ఆయన నల్లగొండలోని తన క్యాంపు కార్యాలయంలో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ.. చంద్రబాబు హైదరాబాద్‌లో ఉంటే ఎవరికీ అభ్యంతరం లేదని, కానీ ఇక్కడ పెత్తనం చెలాయించాలనే దురాలోచన ఆయనలో ఉందని విమర్శించారు. తెలంగాణపై మళ్లీ ఆధిపత్యానికి ఆంధ్ర నేతలు కుట్రలు పన్నుతున్నారని పేర్కొన్నారు. హైదరాబాద్‌లో ఉంటాం.. కుట్రలు పన్నుతాం.. పెత్తనం చేస్తామంటే సహించబోమని ఆయన హెచ్చరించారు. 2009లో చిదంబరం ప్రకటన చేయగానే తెలంగాణను అడ్డుకునేందుకు కుట్ర పన్నిన వారిలో కేవీపీ రామచంద్రరావు అగ్రభాగాన ఉన్నారని, ఇప్పుడాయన తెలంగాణ వాసిననడం ఇక్కడి ప్రజలను మభ్యపెట్టడానికేనని చెప్పారు. తెలంగాణ మేధావులు, యువత, ఉద్యోగులు వీరి కుట్రలపై జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందని హెచ్చరించారు. జమిలి ఎన్నికలు ఇప్పుడు సాధ్యం కాదని సుఖేందర్‌రెడ్డి స్పష్టం చేశారు.

జమిలి అంటే భయమెందుకు రేవంత్?
- బీజేపీ నేత డా.కె.లక్ష్మణ్ సూటి ప్రశ్న



సాక్షి, హైదరాబాద్: టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డికి జమిలి ఎన్నికలంటే ఉలికిపాటెందుకు ? ఎందుకంత అభద్రతాభావం? ఆయన కు ఎందుకు భయం పట్టుకుంది? అని బీజేపీ పార్లమెంటరీ బోర్డు సభ్యుడు డా.కె. లక్ష్మణ్ ప్రశ్నించారు. మోదీ ప్రభుత్వ విధానా లు, అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాలను తట్టుకోలేక, పీఎం చరిష్మాను జీర్ణించుకోలేక కాంగ్రెస్ విష ప్రచారం చేస్తోందని మండిపడ్డారు. గతంలో ప్రధానిగా నెహ్రూ ఉన్నప్పుడు నాలుగుసార్లు జమిలి ఎన్నికలు జరిగితే అప్పుడెందుకు కాంగ్రెస్ సమర్థించిందని నిలదీశారు. గతంలో లేని దక్షిణాది, ఉత్తరాది ప్రస్తావనను కాంగ్రెస్ ఇప్పుడెందుకు చేస్తోంద న్నారు. సోమవారం పార్టీ నేతలు గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి, ఎస్.కుమార్‌లతో కలిసి లక్ష్మణ్ మీడియాతో మాట్లాడారు. జమిలిపై కేంద్రం నియమించిన కమిటీలో ప్రతిపక్ష నేతగా అధిర్ రంజన్‌కు అవకాశం కల్పిస్తే కాంగ్రెస్ ఎందుకు పారిపోతోందో చెప్పాలన్నారు. ఇండియా కూటమికి మోదీ హఠావో తప్ప మరో ఎజెండా లేదని విమర్శించారు.

ఉదయనిధి క్షమాపణలు చెప్పాలని డిమాండ్
ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యలకు తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ క్షమాపణలు చెప్పాలని లక్ష్మణ్ డిమాండ్ చేశారు. మంత్రి హోదాలో హిందువులను అవమానించారని, ఆయన వ్యాఖ్యలనూ సమర్థిస్తూ కొన్ని పార్టీల నాయకులు హిందువులను అవమానించారన్నారు. ఈ వ్యాఖ్యలను రేవంత్ ఖండించలేదని, ఇదేనా కాంగ్రెస్ పార్టీ వైఖరి అని ప్రశ్నించారు.

విడివిడిగా.. కూలంకషంగా

- పీఈసీ సభ్యులతో స్క్రీనింగ్ కమిటీ భేటీ
- ఒక్కొక్కరితో 10 నిమిషాలకు పైగా మాట్లాడిన చైర్మన్ మురళీధరన్
- అభ్యర్థుల ఖరారుతో పాటు ఎన్నికల వ్యూహంపై అభిప్రాయ సేకరణ
- పార్టీలో పాటించాల్సిన సామాజిక సమతుల్యతపై చర్చ



టికెట్ ఇవ్వాలంటూ మురళీధరన్‌కు వినతిపత్రం సమర్పిస్తున్న ఓయూ విద్యార్థి సంఘం నేతలు

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ ప్రదేశ్ ఎన్నికల కమిటీ (పీఈసీ) సభ్యులతో స్క్రీనింగ్ కమిటీ చైర్మన్ మురళీధరన్ సమావేశమయ్యారు. గాంధీభవన్‌లో సోమవారం ఉదయం 11గంటల నుంచి రాత్రి వరకు ఈ భేటీలు కొనసాగాయి. ప్రతి నాయకుడితో వేర్వేరుగా 10 నిమిషాలకు పైగా మాట్లాడిన మురళీధరన్, రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థుల ఖరారుతో పాటు ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై అభిప్రాయ సేకరణ చేశారు. నల్లగొండ ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎంపీ వి.హనుమంతరావు, ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి, పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య, టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్, కోచైర్మన్ పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, ఎమ్మెల్యేలు శ్రీధర్‌బాబు, జగ్గారెడ్డి, సీతక్క, కేంద్ర మాజీ మంత్రి రేణుకాచౌదరి, ఎన్ఎస్‌యూఐ రాష్ట్ర అధ్యక్షుడు బల్మూరి వెంకట్, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సునీతారావు, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నేను, మీ నాన్న ఫ్రెండ్స్: పొన్నాల
మురళీధరన్‌ను కలిసిన సందర్భంగా ఆయన తండ్రి, కేరళ మాజీ సీఎం కరుణాకరన్‌తో తనకు ఉన్న అనుబంధాన్ని పొన్నాల గుర్తు చేసుకున్నారు. తాను మత్స్యశాఖ మంత్రిగా ఉన్న సమయంలో కేరళతో పాటు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి ప్రపంచ బ్యాంకు రుణం తీసుకువచ్చామని, ఆ తర్వాతే రెండు రాష్ట్రాల్లో రొయ్యల పరిశ్రమ అభివృద్ధి చెందిందని గుర్తు చేశారు. పార్టీలో పరిస్థితులు, టికెట్ల ఖరారులో పాటించాల్సిన సామాజిక సమతుల్యత గురించి వారు చర్చించినట్టు సమాచారం. బీసీలకు టికెట్ల కేటాయింపులో ఇవ్వాల్సిన ప్రాధాన్యతపై వీహెచ్ చర్చించినట్టు తెలుస్తోంది. స్క్రీనింగ్ కమిటీ సభ్యుడిగా ఉన్న సిద్దిఖీ కూడా సోమవారం మధ్యాహ్నం నుంచి ఈ భేటీల్లో పాల్గొనగా, మరో సభ్యుడు, గుజరాత్ ఎమ్మెల్యే జిగ్నేశ్ మేవానీ కోర్టు కేసుల కారణంగా రాలేకపోయారని, మంగళవారం వస్తారని గాంధీభవన్ వర్గాలు తెలిపాయి. మంగళవారం ఉదయం డీసీసీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులతో స్క్రీనింగ్ కమిటీ భేటీ కానుంది.

జగ్గారెడ్డి లేఖ: పీసీసీ మాజీ అధ్యక్షులకు వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించాలని, పార్టీ అనుబంధ సంఘాలకు టికెట్ల కేటాయింపులో ప్రాధాన్యతనివ్వాలని మురళీధరన్‌ను జగ్గారెడ్డి కోరారు. టికెట్ల కేటాయింపు విషయంలోనూ పీసీసీ మాజీ అధ్యక్షుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోవాలని కోరుతూ లేఖ ఇచ్చారు.

నేడు పీసీసీ విస్తృతస్థాయి సమావేశం
ఈనెల 16, 17 తేదీల్లో జరగనున్న సీడబ్ల్యూసీ సమావేశాల నిర్వహణపై చర్చించేందుకు మంగళవారం టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశం జరగనుంది. పీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి పీసీసీ సభ్యులందరూ విధిగా హాజరు కావాలని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేశ్‌కుమార్‌గౌడ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

బీసీలు ఎందుకు గెలవడం లేదు?

రాష్ట్ర కాంగ్రెస్ పార్టీలో పాటించాల్సిన సామాజిక సమతుల్యతపై ఈ భేటీల్లో ఆసక్తికర చర్చ జరిగినట్టు తెలిసింది. 1989 తర్వాత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మూడుసార్లు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినా తెలంగాణలోని మొత్తం అసెంబ్లీ సీట్లలో 50 శాతం సీట్లు ఎప్పుడూ రాలేదని, ఇందుకు కాంగ్రెస్ పార్టీని వెనుకబడిన వర్గాలు అక్కున చేర్చుకోకపోవడమే కారణమని కొందరు వివరించారు. తొలుత తెలుగుదేశం, ఆ తర్వాత బీఆర్ఎస్ వైపు బీసీలు మొగ్గుచూపుతున్నారని, అత్యధిక సంఖ్యలో ఉండే బీసీల హృదయాల్లో చోటు సాధించని కారణంగానే కాంగ్రెస్ పార్టీకి ఓటమి ఎదురవుతోందని చెప్పారు. దీంతో 'బీసీలకు సీట్లు ఇస్తే ఎందుకు గెలవడం లేదు?'అని మురళీధరన్ ప్రశ్నించినట్టు తెలుస్తోంది. కాగా ఓ ముఖ్య నాయకుడు బదులిస్తూ.. కాంగ్రెస్ పార్టీలోనే అలా జరుగుతోందని, మిగిలిన పార్టీల నుంచి బీసీ నేతలు గెలుస్తున్నారని, ఇందుకు కారణం ఏంటనేది సమీక్షించుకోవాల్సింది పార్టీయేనని చెప్పినట్టు సమాచారం. ఇక రెడ్డి సామాజిక వర్గంలోని గ్రూపు గొడవలు కూడా రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ఓటమికి కారణమవుతున్నాయని ఓ నేత వివరించినట్టు సమాచారం. కర్ణాటకలోని లింగాయత్‌లు, గౌడ సామాజిక వర్గ నేతలు ఐక్యంగా ఉండి అక్కడ అధికారాన్ని దక్కించుకోవడాన్ని గుర్తు చేసినట్లు తెలిసింది. అన్ని విషయాలను విన్న మురళీధరన్ 'ఏం జరుగుతుందో వేచి చూద్దాం.'అంటూ బదులివ్వడం గమనార్హం.

నమ్మకం నిలబెట్టుకుంటాం: రేవంత్ ట్వీట్
సీడబ్ల్యూసీ తొలి సమావేశాలను హైదరాబాద్‌లో నిర్వహించేందుకు అంగీకరించిన పార్టీ అధిష్టానానికి రేవంత్ ట్విట్టర్ వేదికగా కృతజ్ఞతలు తెలిపారు. తమపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటామని, సమావేశాలను విజయవంతం చేస్తామంటూ సోమవారం ఆయన ట్వీట్ చేశారు.

కాంగ్రెస్‌లో ఫ్లెక్సీల రగడ
గాంధీభవన్‌ను తాకిన ఎల్‌బీనగర్ పంచాయితీ

సాక్షి, హైదరాబాద్: గ్రేటర్ కాంగ్రెస్‌లో అసెంబ్లీ టికెట్ల రగడ మొదలైంది. ఒకవైపు బలమైన అభ్యర్థుల ఎంపికకు కసరత్తు జరుగుతుండగా, మరోవైపు టికెట్ల కోసం అంతర్గతపోరు తారాస్థాయికి చేరుతోంది. పోటాపోటీ సమావేశాలు.. ఫ్లెక్సీలు, పోస్టర్లు కలకలం రేపుతున్నాయి. తాజాగా గాంధీభవన్ వద్ద 'సేవ్ ఎల్‌బీనగర్ కాంగ్రెస్ పార్టీ.. గో బ్యాక్ మధుయాష్కీ'అంటూ ఫ్లెక్సీలు వెలిశాయి. ఈ ఫ్లెక్సీలపై తనకు ఎలాంటి సంబంధం లేదని ఎల్‌బీనగర్ పార్టీ ఇన్‌చార్జ్ జక్కిడి ప్రభాకర్‌రెడ్డి స్పష్టం చేశారు.

నేను లోకల్: మధుయాష్కీ



ఎల్‌బీనగర్ తనకు లోకల్ అని టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కీగౌడ్ అన్నారు. గాంధీభవన్ వద్ద తనకు వ్యతిరేకంగా వెలిసిన పోస్టర్లపై ఆయన తీవ్రంగా స్పందించారు. ఎల్‌బీనగర్ నా లోకల్. మా అమ్మనాన్న సమాధులు కూడా ఇక్కడున్నాయని గుర్తు చేశారు. ఓటమి భయంతోనే ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి తనపై వ్యతిరేక ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. కొందరు పార్టీ నేతలు ఎంగిలి మెతుకుల కోసం సుధీర్‌రెడ్డికి సహకరిస్తున్నారంటూ మండిపడ్డారు.

అభ్యర్థుల ఖరారుపై కసరత్తు ప్రారంభమైంది
టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ చేయాల్సిన అభ్యర్థుల ఎంపికపై తమ పార్టీలో ఇప్పుడే కసరత్తు ప్రారంభమైందని పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి చెప్పారు. పీఈసీ సమా వేశాలు ముగిసిన తర్వాత, స్క్రీనింగ్ కమిటీ భేటీ జరు గుతుందని, అక్కడ ఫైనల్ చేసిన లిస్టును, అప్పటివరకు చేసిన సర్వేలను కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ) పరిశీలిస్తుందని, ఆ తర్వాతనే అధికారికంగా ప్రకటిస్తుందని ఆయన తెలిపారు. సోమవారం రేవంత్ సీఎల్పీ కార్యాలయంలో విలేకరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడారు. ఈ ప్రక్రియ పూర్తయ్యేందుకు ఐదు రోజులే పట్టవచ్చని.. లేదంటే ఐదు నెలలు కూడా పట్టవచ్చని, ఎప్పుడైనా ఏఐసీసీ ప్రకటించే జాబితానే అధికారికమని వెల్లడించారు. సీడబ్ల్యూసీ సమా వేశాల నిర్వహణపై సమీక్షకు ఈనెల 6న కేసీ వేణుగోపాల్ హైదరాబాద్‌కు వస్తున్నారని, సీడబ్ల్యూసీ సమావేశాల నిర్వహణ సందర్భంగానే గాంధీ ఐడియాలజీ సెంటర్‌లో రాజీవ్‌గాంధీ నాలెడ్జ్ సెంటర్ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తామని చెప్పారు.

'జమిలి'తో రాష్ట్రాలు | స్వయం ప్రతిపత్తి కోల్పోతాయి
- బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్



సాక్షి, హైదరాబాద్/నాంపల్లి: భిన్నత్వంలో ఏకత్వంగా ఉన్న దేశానికి జమిలీ ఎన్నికలు ప్రయోజనకరం కాదని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.ఎస్. ప్రవీణ్ కుమార్ అన్నారు. జమిలి ఎన్నికల వల్ల రాష్ట్రాలు స్వయం ప్రతిపత్తి కోల్పోతాయని పేర్కొన్నారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో సోమవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ 'ఒకే దేశం – ఒకే ఎన్నికలు' అనేది కేవలం బీజేపీ నినాదంగా మిగులుతుందే తప్ప దేశానికి ఏమాత్రం ప్రయోజనం చేకూర్చదన్నారు. బీఆర్ఎస్ మంత్రులు, ఎమ్మెల్యేల భూ కబ్జాలపై విచారణ జరపాలని ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్‌రెడ్డి చీకటి దందాను అడ్డుకున్నందుకే ఉమ్మడి నల్లగొండ జిల్లా మార్కెటింగ్ సొసైటీ చైర్మన్, బీసీ నేత వట్టే జానయ్య యాదవ్‌పై మంత్రి అక్రమ కేసులు పెట్టిస్తున్నారని ఆరోపించారు. జానయ్యకు మంత్రి జగదీశ్ రెడ్డి నుంచి ప్రాణహాని ఉందని, తక్షణమే ఆయనకు పోలీసులు రక్షణ కల్పించాలని అన్నారు. తెలంగాణ మలి దశ ఉద్యమకారిణి బెల్లి లలితను కిరాయి హంతకులతో అంతమొందించినట్లే జానయ్యను చంపేందుకు మంత్రి కుట్ర పన్నారని ఆరోపించారు. ప్రతిపక్ష నేతల మొబైల్ ఫోన్లు ట్యాప్ చేసినందుకే పోలీసు అధికారి దుగ్యాల ప్రణీత్ రావుకు ప్రమోషన్ ఇచ్చారని ఆరోపించారు. త్వరలోనే బీఎస్పీ అభ్యర్థుల తొలి జాబితాను ప్రకటించనున్నట్లు చెప్పారు.

సీఎంగా మూడోసారి కేసీఆరే!
- ఎవరెన్ని ట్రిక్‌లు చేసినా.. హ్యాట్రిక్ బీఆర్ఎస్‌దే...
- ఓటమి భయంతోనే బీజేపీ జమిలి ఎన్నికల జిమ్మిక్కు
- రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖల మంత్రి హరీశ్



మాట్లాడుతున్న మంత్రి హరీశ్, పక్కన మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, సత్యవతి రాథోడ్, ఎర్రబెల్లి

సాక్షిప్రతినిధి, వరంగల్: బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు ఎన్ని తప్పుడు ప్రచారాలు, జిమ్మిక్కులు చేసినా.. ముచ్చటగా మూడోసారి కేసీఆర్ ముఖ్యమంత్రి అవుతారని రాష్ట్ర ఆర్థిక, వైద్య ఆరోగ్యశాఖల మంత్రి తన్నీరు హరీశ్‌రావు ధీమా వ్యక్తం చేశారు. ఎవరు ఎన్ని ట్రిక్కులు చేసినా.. హ్యాట్రిక్ బీఆర్ఎస్ పార్టీదేనని, ఈసారి దేశ రాజకీయాల్లోనూ మరింత కీలక పాత్ర పోషించనున్నామని స్పష్టం చేశారు. సోమవారం జనగామ జిల్లా పాలకుర్తిలో మంత్రులు దయాకర్‌రావు, ఇంద్రకరణ్ రెడ్డి, సత్యవతి రాథోడ్‌లతో కలిసి మంత్రి హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో వచ్చే ఎన్నికల నేపథ్యంలో డిక్లరేషన్‌పై కొందరు డ్రామాలు చేస్తున్నారని, డిక్లరేషన్‌పై కాంగ్రెస్ ఎన్ని నాటకాలు ఆడినా.. ప్రజలు ఎప్పుడో సెల్ఫ్ డిక్లరేషన్ ఇచ్చారని వ్యాఖ్యానించారు. కేసీఆర్ మూడో సారి సీఎం అయితేనే అభివృద్ధి, సంక్షేమం కొనసాగుతాయని, ఇతరులు అధికారంలోకి వస్తే ఆగి పోయి ప్రజలు ఆగమవుతారని హరీశ్‌రావు అన్నారు. దేశంలో ఆదరణ కోల్పోతున్న బీజేపీ ఓటమి భయంతోనే జమిలి ఎన్నికల నాటకానికి తెరలేపిందని ఆరోపించారు. సమావేశంలో ఎంపీ పసునూరి దయాకర్, ఎమ్మెల్యేలు ఆరూరి రమేశ్, శంకర్‌నాయక్ కూడా ఉన్నారు.

మా ఫైట్ నెట్‌ప్రాక్టీస్ లాంటిది
రేవంత్, జగ్గారెడ్డి సరదా ముచ్చట్లు



సీఎల్పీ కార్యాలయంలో జగ్గారెడ్డి, రేవంత్

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ రాజకీయాల్లో ఉప్పు, నిప్పులా ఉండే టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సంగారెడ్డి ఎమ్మెల్యే జగ్గారెడ్డిలు సరదాగా జోకులు వేసుకున్నారు. సోమవారం సాయంత్రం సీఎల్పీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడిన రేవంత్ బయటకు వస్తున్న సమయంలో అక్కడే ఉన్న జగ్గారెడ్డిని పలకరించారు. ఇద్దరూ కలిసి ఫొటోలకు పోజులిచ్చారు. అనంతరం మీడియా ప్రతినిధులతో మాట్లాడారు. ఈ సందర్భంగా ఇద్దరు నేతల ఫైటింగ్ అయిపోయిందా? అని మీడియా ప్రతినిధులు ప్రశ్నించగా, తామిద్దరి ఫైటింగ్ నెట్‌ప్రాక్టీస్ లాంటిదని, ఇక్కడ ప్రాక్టీస్ చేసి ప్రత్యర్థులపై గట్టిగా ఫైటింగ్ చేస్తామని చమత్కరించారు.

కాంగ్రెస్ కేంద్ర ఎన్నికల కమిటీలో ఉత్తమ్
▶ మొదటి పేజీ తరువాయి

ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీలో మల్లికార్జున ఖర్గే, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, అంబికా సోని, అధీర్ రంజన్ చౌదరి, సల్మాన్ ఖుర్షీద్, మధుసూదన్ మిస్త్రీ, ఎస్.ఉత్తమ్‌కుమార్ రెడ్డి, టీఎస్ సింగ్ దేవ్, కేజే జార్జ్, ప్రీతమ్ సింగ్, మహమ్మద్ జావేద్, అమీ యాజ్ఞిక్, పీఎల్ పునియా, ఓంకార్ మార్కం, కేసీ వేణుగోపాల్‌లు ఉన్నారు.

ఉత్తమ్ సేవలను అధిష్టానం గుర్తించింది
వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ)తో సమానంగా పరిగణించే కేంద్ర ఎన్నికల కమిటీ (సీఈసీ)లో ఎంపీ ఉత్తమ్‌కుమార్ రెడ్డికి చోటు లభించడం పట్ల రాష్ట్రంలోని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నాయి. సీఈసీలో తెలుగు రాష్ట్రాల నుంచి గత మూడు, నాలుగు దశాబ్దాలుగా ఎవరికీ అవకాశం లభించలేదు. ఈ పదవిలో ఆయన ఐదేళ్ల పాటు కొనసాగనున్నారు. దేశవ్యాప్తంగా అన్ని రాష్ట్రాలకు చెందిన ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ అభ్యర్థులను ఖరారు చేసే ఈ కమిటీలో ఉత్తమ్‌కు హైకమాండ్ స్థానం కల్పించడం విశేషం. రాష్ట్ర మంత్రిగా, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ గా, అధ్యక్షునిగా, 5 సార్లు ఎమ్మెల్యేగా, ఒకసారి ఎంపీగా ఆయన పార్టీకి చేసిన సేవలను అధిష్టానం గుర్తించిందని, ఆయన నిబద్ధతకు ఇదో నిదర్శనమని పార్టీ శ్రేణులు పేర్కొంటున్నాయి. కాంగ్రెస్ అధిష్టానానికి, గాంధీ కుటుంబానికి ఉత్తమ్‌పై ఉన్న నమ్మకం మరోమారు రుజువైందని చెపుతున్నాయి. ఇండియన్ ఎయిర్ ఫోర్స్‌లో ఫైటర్ పైలట్ గా సేవలందించిన ఉత్తమ్ కుమార్, భారత రాష్ట్రపతి కార్యాలయంలో ఉన్నతోద్యోగిగా పనిచేస్తున్న సమయంలో రాజకీయాల్లోకి వచ్చారు. 1994లో కాంగ్రెస్ పార్టీలో చేరిన ఆయన మూడు దశాబ్దాలుగా పార్టీలో కొనసాగుతున్నారు.

టార్గెట్.. తెలంగాణ
▶ మొదటి పేజీ తరువాయి

రాష్ట్ర పార్టీ వ్యూహాలకు తోడుగా నిలిచి, చేయూత అందించేందుకు కాంగ్రెస్ అధిష్టానం సిద్ధమైందని అంటున్నాయి. ఈ నెల 16, 17 తేదీల్లో జరిగే సీడబ్ల్యూసీ సమావేశాల ప్రభావం కచ్చితంగా అసెంబ్లీ ఎన్నికలపై ఉంటుందని పేర్కొంటున్నాయి. రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వంపై ఉన్న వ్యతిరేకత కాంగ్రెస్‌కు అనుకూలంగా మారేలా, ప్రజల్లో భరోసా కల్పించేలా.. సోనియా సహా పార్టీ కీలక నేతలు ఎన్నికల హామీలను ప్రకటించనున్నారని చెప్తున్నాయి.

నియోజకవర్గానికో నేత పర్యటన..
కాంగ్రెస్ పార్టీ ప్రకటించనున్న ఐదు గ్యారంటీ కార్డు స్కీమ్‌లతోపాటు బీఆర్ఎస్ ప్రభుత్వ వైఫల్యాలపై చార్జిషీట్‌ను ప్రజల్లోకి తీసుకెళ్లేలా నేతలు కార్యాచరణ సిద్ధంచేశారు. ఈ నెల 17న పరేడ్‌గ్రౌండ్స్ సభ ముగిశాక.. 18వ తేదీన సీడబ్ల్యూసీ సభ్యులు, అన్ని రాష్ట్రాల పీసీసీ అధ్యక్షులు, సీఎల్పీ నాయకులు రాష్ట్రవ్యాప్తంగా పర్యటించనున్నారు. రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గానికి ఒక్కో కీలక నేత వెళ్లి.. ఉదయం నుంచి సాయంత్రం వరకు నిర్వహించే వివిధ కార్యక్రమాల్లో పాల్గొననున్నారు.

ఆ రాష్ట్రాల తరహాలో ఇక్కడ కూడా..
కర్ణాటక, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాల్లో ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ గ్యారెంటీ కార్డు స్కీమ్‌ల పేరుతో ఐదు ప్రధాన హామీలు ఇచ్చింది. రెండు రాష్ట్రాల్లోనూ విజయం సాధించిన కాంగ్రెస్ తమ హామీలను నిలబెట్టుకునే దిశగా ముందుకెళుతోంది. ఇప్పుడు ఆ రెండు రాష్ట్రాల తరహాలోనే తెలంగాణలోనూ 5 గ్యారంటీ స్కీమ్‌లను అమలుచేస్తామని హామీ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తోంది. రూ.2 లక్షల వరకు రైతు రుణమాఫీ, పింఛన్లు రూ.4 వేలకు పెంపు, రూ.500కే వంటగ్యాస్ సిలిండర్, అసైన్డ్ భూములపై సర్వహక్కులు, 2 లక్షల ఉద్యోగాల భర్తీ హామీలు ఈ గ్యారంటీ కార్డు స్కీమ్‌లలో ఉంటాయని గాంధీ భవన్ వర్గాలు చెప్తున్నాయి. అధికారంలోకి రాగానే వీటిని అమలు చేస్తామని.. ఐదేళ్లలో ఉద్యోగాల భర్తీ పూర్తి చేస్తామని ప్రజలకు వివరించనున్నట్టు పేర్కొంటున్నాయి. ఈ ఐదు హామీలను కూడా తెలంగాణకు స్వాతంత్ర్యం వచ్చిన సెప్టెంబర్ 17న, తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఇచ్చిన సోనియాగాంధీతో ఇప్పించేందుకు సిద్ధమవుతున్నట్టు వివరిస్తున్నాయి.

మిగతా డిక్లరేషన్ల ప్రకటన కూడా..
ఈనెల17న పార్టీ ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేయాలని టీపీసీసీ భావించింది. మేనిఫెస్టో రూపకల్పన పూర్తికాకపోవడంతో.. ఆ రోజున గ్యారంటీ కార్డు స్కీమ్‌ల ప్రకటనకే పరిమితం కానున్నట్టు తెలిసింది. రైతు, యూత్, ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్లను ప్రకటించిన నేపథ్యంలో.. బీసీ, మైనార్టీ, మహిళా డిక్లరేషన్లను పరేడ్ గ్రౌండ్స్ సభలో ప్రకటించనున్నారు.

సమావేశాలు తాజ్‌కృష్ణాలో.. సభ పరేడ్ గ్రౌండ్స్‌లో..

సీడబ్ల్యూసీ సమావేశాల నిర్వహణ కోసం హైదరాబాద్ శివార్లలోని రిసార్టులను ఎంచుకోవాలని తొలుత భావించిన టీపీసీసీ.. చివరికి తాజ్‌కృష్ణా హోటల్‌లో నిర్వహించాలని దాదాపు నిర్ణయానికి వచ్చింది. గ్యారంటీ కార్డు స్కీంల ప్రకటన కోసం పరేడ్ గ్రౌండ్స్‌లో భారీ సభ నిర్వహించనుండటంతో.. పార్టీ పెద్దలు శివార్ల నుంచి సభకు రావడానికి సమయం పడుతుందనే ఉద్దేశంతో తాజ్ కృష్ణాలో సమావేశాలు ఏర్పాటు చేయాలని ఆలోచనకు వచ్చినట్టు తెలిసింది. ఈ క్రమంలోనే తాజ్ కృష్ణా హోటల్‌తోపాటు పరేడ్ గ్రౌండ్స్‌ను పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావ్ ఠాక్రే, టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి తదితరులు పరిశీలించారు. ఈ నెల ఆరో తేదీన సాయంత్రం ఏఐసీసీ సంస్థాగత వ్యవహారాల ఇన్‌చార్జి ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ హైదరాబాద్‌కు రానున్నారు. సీడబ్ల్యూసీ సమావేశాల నిర్వహణ, బహిరంగ సభ ఏర్పాట్లను పరిశీలించనున్నారు.

తెలంగాణ ప్రాధాన్యత ఏంటో అర్థం చేసుకోవచ్చు

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే నిజాం సంస్థానం పరిధిలోని కర్ణాటక ప్రాంతానికి చెందిన వ్యక్తి. అంటే ఆయనది తెలంగాణనే. ఆయన ఏఐసీసీ అధ్యక్షుడైన తర్వాత తొలి సీడబ్ల్యూసీ సమావేశాలను తన సొంత రాష్ట్రంలో నిర్వహిస్తున్నట్టే. దీన్నిబట్టి తెలంగాణకు ఏఐసీసీ ఎంతటి ప్రాధాన్యతనిస్తుందో అర్థం చేసుకోవచ్చు. ఈ సమావేశాల వేదికగానే జాతీయ స్థాయి రాజకీయ నిర్ణయాలు తీసుకుంటారు. దేశమంతా హైదరాబాద్ వైపు చూస్తుంది.
– టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి

హైదరాబాద్ వేదికగా తొలిసారి!
▶ మొదటి పేజీ తరువాయి

ఏఐసీసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్టీ సంస్థాగత వ్యవహారాల ప్రధాన కార్యదర్శి కేసీ వేణుగోపాల్ ఈ వివరాలను వెల్లడించారు. 17న విస్తృతస్థాయి సమావేశం తర్వాత అనంతరం భారీ బహిరంగ సభను నిర్వహించనున్నామని.. తెలంగాణకు సంబంధించి కాంగ్రెస్ పార్టీ అందించే 5 గ్యారంటీ హామీలను ప్రకటించనున్నామని వివరించారు.

17న నియోజకవర్గాల్లో బస
ఈ నెల 17న బహిరంగ సభ ముగిశాక అన్ని రాష్ట్రాల పీసీసీ అధ్యక్షులు, సీఎల్పీ నేతలు, పార్టీ సీనియర్ నాయకులు రాష్ట్రంలోని 119 నియోజకవర్గాల్లో తమకు కేటాయించిన చోటికి వెళ్లి రాత్రి బస చేస్తారు. 18న ఉదయం నుంచి సాయంత్రం వరకు ఆయా నియోజకవర్గాల్లో జరిగే పార్టీ కార్యక్రమాల్లో పాల్గొంటారని కేసీ వేణుగోపాల్ తెలిపారు.

సోనియా, రాహుల్, ప్రియాంక.. అంతా..
- సీడబ్ల్యూసీ భేటీ తొలిరోజు సమావేశాల్లో.. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, పార్టీ అగ్రనేతలు సోనియా, రాహుల్, ప్రియాంకగాంధీతోపాటు కాంగ్రెస్ పాలిత రాష్ట్రాల సీఎంలు సహా మొత్తం 39 మంది సీడబ్ల్యూసీ సభ్యులు, 32 మంది శాశ్వత ఆహ్వానితులు, 9 మంది ప్రత్యేక ఆహ్వానితులు, నలుగురు ఎక్స్ అఫీషియో సభ్యులు పాల్గొననున్నారు.
- రెండోరోజు 17న జరిగే సీడబ్ల్యూసీ సమావేశంలో వర్కింగ్ కమిటీ సభ్యులతోపాటు అన్ని రాష్ట్రాల పీసీసీ అధ్యక్షులు, సీఎల్పీ నేతలు, కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ ఆఫీస్ బేరర్లు పాల్గొంటారు.
- గత ఐదేళ్లలో ఢిల్లీ వెలుపల సీడబ్ల్యూసీ సమావేశం జరగడం ఇది రెండోసారి కావడం గమనార్హం. 2019 మార్చి 12న గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో సీడబ్ల్యూసీ భేటీ జరిగింది. తర్వాత ఢిల్లీలోనే ఈ భేటీలు నిర్వహించారు.



మీ మనసు మీద మీకు అధికారం ఉన్నది.
అంతేగానీ బాహ్య ఘటనల మీద కాదు. ఇది అర్థం
చేసుకోగలిగితే, మీకు శక్తి దొరుకుతుంది.

– మార్కస్ అరీలియస్

సాక్షి

మంగళవారం, 5 సెప్టెంబర్ 2023

గైర్హాజరీ సందేశం!

అనుకున్నదే అయింది. రానున్న 'జీ20' దేశాధినేతల శిఖరాగ్ర సదస్సుకు చైనా అధ్యక్షుడు షీ జిన్ పింగ్ అసాధారణ రీతిలో హాజరు కాకపోవచ్చంటూ కొద్ది రోజులుగా వినిపిస్తున్న ఊహాగానాలు నిజమయ్యాయి. చైనా ప్రధాని లీ కియాంగ్ ఆ సదస్సుకు హాజరవుతారంటూ ఆ దేశ విదేశాంగ శాఖ సోమవారం మధ్యాహ్నం ప్రకటించింది. అధ్యక్ష, ప్రధానులిద్దరూ ఏకకాలంలో విదేశాల్లో ఉండడం, అందులోనూ ఒకే కార్యక్రమంలో ఉండడమనేది చైనా ఎన్నడూ చేయని పని గనక 'జీ20'కి షీ గైర్హాజరు ఖాయమని తేటతెల్లమైంది. వెరసి, 'జీ–20' అధ్యక్ష హోదాలో భారత్ ఈ నెల 9, 10 తేదీల్లో ఆతిథ్యమిస్తున్న 18వ వార్షిక శిఖరాగ్ర సదస్సు ఇప్పుడు కొత్త కారణంతో వార్తల్లో నిలిచింది. ఇంట ఆర్థికవ్యవస్థలో ఇక్కట్లు, బయట అమెరికా – భారత్‌లతో క్షీణసంబంధాలు, పొరుగుదేశాలతో కొనితెచ్చుకున్న తగాదాల మధ్య చైనా అధినేత కావాలనే మొహం చాటేస్తున్నట్టు కనిపిస్తోంది.

ఆహ్వానించినప్పుడు వెళ్ళడానికి కొన్ని కారణాలుంటే, వెళ్ళాల్సి ఉన్నా వెళ్ళకపోవడానికి అంతకు మించే కారణాలుంటాయి. చైనా అధినేత గైర్హాజరు కథా అంతే! భారత్‌తో చైనా ద్వైపాక్షిక సంబంధాలు నానాటికీ దిగజారుతున్నాయి. లద్దాఖ్‌లో మూడేళ్ళ క్రితం సైనికుల కొట్లాట నుంచి ఇదే ధోరణి. సరిహద్దుకు ఇరువైపులా మోహరించిన సైన్యం ఉద్రిక్తతలకు అద్దంపడుతోంది. వాణిజ్యంపై విభేదాలు ఉండనే ఉన్నాయి. బద్ధశత్రువైన అమెరికాతో వ్యూహాత్మక సంబంధాలను భారత్ పెంచుకోవడంతో డ్రాగన్‌కి పుండు మీద కారం రాసినట్టుంది. చైనాను వెనక్కినెట్టి అత్యధిక ప్రపంచ జనాభా గల దేశంగా భారత్ ఇప్పటికే ముందుకొచ్చింది. సాంకేతిక విజ్ఞానం, అంతరిక్ష శోధన, ప్రపంచ వాణిజ్యంలో పోటాపోటీ సరేసరి. ఇవి చాలదన్నట్టు ప్రామాణిక దేశపటమంటూ భారత భూభాగాల్ని కలిపేసుకున్న వక్రీకరించిన మ్యాప్‌ను చైనా తాజాగా విడుదల చేసి కొత్త రచ్చ రేపింది.

చైనా అధినేత మొహం చాటేయడానికి ఇలా చాలా కారణాలే! ఈ తాజా పరిణామం చైనా – భారత సంబంధాల మెరుగుదలకు తోడ్పడదు. మరోపక్క అమెరికా అధ్యక్షుడు బైడెన్‌తో షీ సంభాషించే అవకాశం తప్పిపోతోంది. నిజానికి, అమెరికా విదేశాంగ మంత్రి ఆంటోనీ బ్లింకెన్ సహా పలువురు ఈ మధ్య బీజింగ్‌కు సందర్శనలు జరిపారు. అయినప్పటికీ అగ్రదేశాలైన అమెరికా, చైనాల మధ్య సంబంధాలు మునుపెన్నడూ లేనంత క్షీణించి ఉన్నాయి. గత నవంబర్‌లో ఇండొనేషియాలోని బాలిలో జరిగిన గత 'జీ20' తర్వాత షీ, బైడెన్‌లు కలసి మాట్లాడుకున్నది లేదు. ఇప్పుడు మళ్ళీ కలసి, సంబంధాలను సరిదిద్దుకొనే అవకాశాన్ని చైనా చేతులారా జారవిడుస్తోంది. బైడెన్ సైతం ఈ పరిణామంతో నిరాశకు లోనయ్యాననడం గమనార్హం. షీ ఒక్క 'జీ20'నే కాదు, జకార్తాలో జరగనున్న ఏషియాన్ (వాయవ్య ఆసియా దేశాల సంఘం), ఈస్ట్ ఏషియా సదస్సులూ ఎగ్గొడుతున్నారు. వాటికీ చైనా ప్రధానే హాజరు కానున్నారు.

2008 నుంచి ఇప్పటి వరకు మొత్తం 16 సార్లు భౌతికంగానూ, ఒకసారి వర్చ్యువల్‌గానూ (సౌదీ అరేబియా– 2020) జీ20 సదస్సులు జరిగాయి. వాటిలో మొదటి మూడు మినహా 2010 నుంచి ఇప్పటి వరకు ఏ ఇతర సదస్సులోనూ అన్ని దేశాల అధినేతలూ పాల్గొన్న దాఖలా లేదు. అయితే, చైనా అధినేత మాత్రం ఏ జీ20 సదస్సుకూ ఇప్పటి దాకా గైర్హాజరవలేదు. కరోనా ఆంక్షలున్న రెండేళ్ళూ వర్చ్యువల్‌గానైనా హాజరయ్యారు. గత నెల దక్షిణాఫ్రికాలో ప్రధాన వర్ధమాన ఆర్థిక వ్యవస్థల బృందమైన 'బ్రిక్స్' సదస్సు జరిగినప్పుడూ షీ వచ్చారు. మరి, ఇప్పుడు మాత్రం తన బదులు ప్రధానిని పంపుతున్నారు. రష్యా అధ్యక్షుడు పుతిన్ తన బదులు విదేశాంగ మంత్రిని పంపుతున్నట్టు ఇప్పటికే చెప్పేశారు. అధ్యక్షుడి గైర్హాజరుకు కారణాలు చైనా బయటకు చెప్పకపోయినా, ఇదంతా సహజమేనన్నట్టు భారత అధికార వర్గాలు చిత్రిస్తున్నా... విషయం మాత్రం అసాధారణమే. షీ రాజనీతి పట్ల సందేహాలు రేపుతున్నాయి.

మావో తర్వాత మరే ఇతర చైనా నేతకూ లేనంతటి అధికారం షీ సొంతం. ప్రాదేశిక ప్రయోజనాల పేరు చెప్పి, తైవాన్, దక్షిణ చైనా సముద్రం సహా అన్నీ చైనావేనంటూ ఆయన అంతకంతకూ దూకుడు చూపుతున్నారు. సహజంగానే పాకిస్తాన్ లాంటి ఒకట్రెండు దేశాల్ని మినహాయిస్తే, పొరుగున మిత్రుల కన్నా ఎక్కువగా శత్రువుల్ని చేసుకున్నారు. నిజానికి, జీ20 దేశాలంటే ప్రపంచ స్థూల జాతీయోత్పత్తి (జీడీపీ)లో 85 శాతం, ప్రపంచ వాణిజ్యంలో 75 శాతం, ప్రపంచ జనాభాలో మూడింట రెండొంతులకు ప్రాతినిధ్యం వహిస్తున్న బృందం. ఇంత కీలకమైనా సరే, దీని కన్నా తమ చైనా ఆధిపత్యం ఉన్న 'బ్రిక్స్' వగైరాల వైపే షీ మొగ్గుతున్నారనుకోవచ్చు. ఇటీవల ఆయన ప్రయాణించినదల్లా సౌదీ అరేబియా, రష్యా, సౌతాఫ్రికా లాంటి స్నేహపూర్వక స్వాగతం లభించే దేశాలకే అని విశ్లేషించవచ్చు. అటు అమెరికా, ఇటు భారత్‌లతో ఉద్రిక్తతలు తగ్గించడమూ తన షరతుల ప్రకారమే జరగాలని చూస్తున్నారనుకోవచ్చు.

డ్రాగన్ బుసలు కొడుతున్నందునే అమెరికా, ఆస్ట్రేలియా, జపాన్‌లతో కూడిన భద్రతా కూటమి 'క్వాడ్'లో భారత్ చేరిందని గమనించాలి. ఇక, బైడెన్‌తో ఇప్పుడు భేటీ తప్పిందంటే మళ్ళీ నవంబర్‌లో శాన్‌ఫ్రాన్సిస్కోలో ఆసియా–పసిఫిక్ ఆర్థిక సహకార సదస్సు దాకా వారు కలిసే ఛాన్స్ లేదు. ప్రస్తుత చైనా వైఖరి చూస్తుంటే, అప్పుడైనా షీ హాజరవుతారన్న గ్యారెంటీ లేదు. జీ20లోనూ దేశాధినేతలు చేయాల్సిన సమష్టి ప్రకటనకు గండికొట్టి, భారత పాలకుల విశ్వగురు ప్రచారాన్ని దెబ్బ తీశారనుకోవచ్చు. ప్రధానిని పంపుతున్నా, సదస్సులోని నిర్ణయాలకు చైనా కట్టుబడేలా చూసేందుకు సదరు వ్యక్తికి ఏపాటి అధికారం ఉంటుందో చెప్పలేం. వెరసి, షీ గైర్హాజరీ సందేశం సుదీర్ఘమైనదే!

నిజమైన ప్రత్యామ్నాయం కావాలంటే!

అభిప్రాయం



డా॥ కత్తి పద్మారావు

అత్యధిక బీజేపీయేతర పార్టీలు కలిసి 'ఇండియా' కూటమిగా ఏర్పడటం మంచి ప్రయత్నమే. భిన్న స్వభావాలు, భిన్న అభిప్రాయాలున్న రాజకీయ పార్టీలు ఒక సమన్వయానికి ప్రయత్నించడమూ గొప్ప విషయమే. అయితే, ప్రత్యామ్నాయ రాజకీయ ప్రణాళిక రూపకల్పనలో డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ రాజ్యాంగ స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుంటున్నామని ఈ పార్టీలు చెప్పడం లేదు. భారతదేశంలో ఈనాటికీ అస్పృశ్యత, నిరక్షరాస్యత ఉన్నాయి. కులం వేళ్లను పెకిలించకుండా నూతన భారతదేశ ఆవిష్కరణ జరగడం అసంభవం. అందుకే అంబేడ్కర్ చూపిన మార్గంలో ప్రత్యామ్నాయ ప్రణాళికను రూపొందించుకోవలసిన చారిత్రక బాధ్యత ఈ పార్టీలపై ఉంది. అప్పుడే అది నిజమైన ప్రత్యామ్నాయ రాజకీయ కూటమి అవుతుంది.

భారత జాతీయ అభివృద్ధి సమ్మిళిత కూటమి (ఇండియా) పేరుతో ప్రతిపక్షాలు సెప్టెంబర్ 1, 2023న ముంబైలో సమావేశమవటం భారత రాజకీయాలలో చారిత్రక ఘటనగా చెప్పుకోవచ్చు. 28 బీజేపీయేతర పార్టీలు హాజరై వచ్చే ఎన్నికల నాటికి చేయవలసిన ఉమ్మడి పోరు సన్నద్ధతపై చర్చించటం ముదావహం. 14 మంది సభ్యులతో ఒక సమన్వయ కమిటీని వేయడం కూడా ముందడుగే. వివిధ రాష్ట్రాలలో సీట్ల భాగస్వామ్య ఏర్పాటుకు ఇచ్చి పుచ్చుకునే ధోరణిలో వెళదామనేది కూడా మంచి ప్రయత్నమే. దీనికి కాంగ్రెస్ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గేను అభినందించాలి.



అంబేడ్కర్ ఆదర్శమని చెప్పరా?

ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే– బీజేపీ, ఆర్‌ఎస్‌ఎస్, విశ్వహిందూ పరిషత్‌కు ప్రత్యామ్నాయ ప్రణాళిక రూపకల్పన ఇక్కడ మృగ్యమైంది. ముంబైలో జరిగిన కూటమి మూడవ సమావేశం కేవలం రాజకీయ సమన్వయంగానే సాగింది. భిన్న ప్రణాళికలు, భిన్న స్వభావాలు, భిన్న అభిప్రాయాలు కలిగినటువంటి రాజకీయ పార్టీలన్నీ ఒక చోట కూర్చుని సమన్వయానికి ప్రయత్నించడం గొప్ప విషయమే కానీ, ప్రత్యామ్నాయ రాజకీయ ప్రణాళిక రూపకల్పనలో డాక్టర్ బి.ఆర్ అంబేడ్కర్ రాజ్యాంగ స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకుంటున్నామని అవి చెప్పలేదు. దీంతో దీన్ని ఉదార హిందూవాద సమన్వయ కమిటీగానే భావించాల్సి ఉంటుంది. మతోన్మాద హిందూ భావజాల పక్షాల కంటే ఈ కూటమి మెరుగైనది అయినప్పటికీ, రాజ్యాంగాన్ని రక్షించుకోవడానికి అంబేడ్కర్ ఆశయాల్లో తాము నడుస్తామని వీరు అనలేకపోతున్నారు. కారణం ఇందులో అంబేడ్కరైట్‌లు ఎవరూ లేరు. కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చిన మమతా బెనర్జీ, బీజేపీ పొత్తు నుంచి బయటికి వచ్చిన నితీష్ కుమార్, కాంగ్రెస్ నుంచి బయటకు వచ్చిన శరద్ పవార్, అంబేడ్కర్‌ను ఇప్పటివరకు తమ ఎజెండాలోకి తీసుకోని సీపీఎం, సీపీఐ నాయకులు ఈ కూడికలో ఉన్నారు. ఓబీసీలకు ప్రాతినిధ్యం వహిస్తున్న తేజస్వి యాదవ్, బిహార్‌లో రాజకీయ ప్రాధాన్యత ఉన్న లాలూ ప్రసాద్ యాదవ్ లాంటివాళ్ళు కూడా అంబేడ్కర్‌ను తమ ఎజెండాలోకి ఇంతవరకూ తీసుకోలేదు.

అదే ప్రత్యామ్నాయ ఎజెండా

అలాగే రాహుల్ గాంధీ నోట అంబేడ్కర్ పేరు రాకపోవడం కూడా ఆశ్చర్యం. ఎందుకంటే అధికార పక్షానికి ఆయన ప్రధానమైన రాజకీయ ప్రత్యర్థిగా ఉన్నారు. భారతదేశంలో ఈనాటికీ అస్పృశ్యత, నిరక్షరాస్యత ఉన్నాయి. కులం వేళ్లను పెకిలించకుండా భారతదేశం నూతన భారతదేశంగా ఆవిష్కరించబడటం కష్టమని శశి థరూర్ లాంటివాళ్లు రాశారు. చిదంబరం, శశి థరూర్ లాంటి కాంగ్రెస్ నాయకులు అంబేడ్కర్ గురించి రాసినవాటిని అయినా రాహుల్ గాంధీ చూసి ఉండవచ్చు. కానీ ఆయనలో ఉన్న ఉదార బ్రాహ్మణుడు కుల నిర్మూలనను తమ ఎజెండాలో ప్రకటించడానికి అడ్డు పడుతున్నాడని అనక తప్పదు. కార్పొరేట్ శక్తుల చేతుల్లోకి భారతదేశం వెళ్లిందని వామపక్ష పార్టీలు గగ్గోలు పెడతాయి కానీ కులం ఊబిలో దేశం కూరుకుపోయిందని చెప్పవు.

అంబేడ్కర్ ఎజెండా లేకుండా ఇండియా కూటమి విజయం అసాధ్యమని మనకి అర్థమవుతుంది. అంబేడ్కర్ చెప్పిన కుల నిర్మూలనా వాదమే భారత దేశానికి ప్రత్యామ్నాయ ఎజెండా. అంబేడ్కర్ అస్పృశ్యతా నివారణ మీద స్పష్టమైన ఆలోచనలు పొందుపర్చారు. అస్పృశ్యత వల్ల భారతదేశ నాగరికత, సంస్కృతి, శాస్త్రజ్ఞానం కుంటుపడ్డాయి. అస్పృశ్యులుగా చెప్పబడుతున్న ఉత్పత్తి శక్తులు, శ్రమజీవులు, మాతృస్వామ్య భావం కలవారిని నిర్లక్ష్యం చేయడమే భారతదేశ దారిద్ర్యానికి మూలం. ఈ రోజున మల్లికార్జున్ ఖర్గే అధ్యక్షతన మీటింగులు జరుగుతున్నాయి. కానీ నోరు తెరచి ఒక్కళ్ళు కూడా ఆయన మనకు ప్రధానమంత్రి కావాలని అనడం లేదు. ఎందుకు? వారందరి మనసులో కులం ఉంది.

శుభసూచనే కానీ...

ప్రతి ఒక్కరికీ మతం మారే హక్కు ఉండాలన్నారు అంబేడ్కర్. ప్రజలు మతం నుండి బయట పడకుండా తమ బానిసత్వం నుండి విముక్తి కాలేరని చెప్పారు. 'మీ బానిసత్వాన్ని మీరే రద్దు చేసుకోవాలి. దేవుడో, మరొక సూపర్‌మానో వచ్చి చేస్తాడని వారిపై ఆధారపడకండి. పవిత్ర గ్రంథాలను పూజించడం వల్ల మీరు బానిసత్వం నుంచి, దరిద్రం నుంచి విముక్తం కాలేరు. తరతరాలుగా మీ తాతముత్తాతలు అదే చేస్తూ వస్తున్నారు. అయినా మీ దుర్భర జీవితంలో లేశమాత్రమైనా మార్పు రాలేదు. మీ తాత ముత్తాతల్లానే మీరూ పీలికలు ధరిస్తున్నారు. వారిలాగ విసిరేసిన ఎంగిలి మెతుకులపై ఆధారపడుతున్నారు. వారిలాగే మీరు మురికివాడల్లోనూ, గుడిసెల్లోనూ జీవిస్తున్నారు. వారిలాగే తేలికగా రోగాల బారిన పడుతున్నారు. మీ మతపరమైన ఉపవాసాలు, ఆచారాలు, దీక్షలు మిమ్మల్ని ఆకలి నుంచి కాపాడలేకపోయాయి. మీకు కూడు, గుడ్డ, గూడు, విద్య, మందులు, జీవికకు అవసరమైన ఉపాధిని కల్పించడం శాసనసభ బాధ్యత. మీ అంగీకారం, సహాయం, ఇష్టంతో శాసనాలు రూపొందించడం, వాటిని అమలు చేయడం జరగాలి. క్లుప్తంగా చెప్పాలంటే భౌతిక ఆనందాలన్నింటికీ చట్టమే ఆధారం. చట్టాలు చేసే అధికారాన్ని గెలుచుకోండి. కనుక మీ దృష్టిని ఉపవాసాలు, ఆరాధనలు, దీక్షల నుంచి మళ్ళించి, శాసనాలు చేసే అధికారాన్ని దక్కించుకోవడంపై పెట్టండి. ఈ మార్గంలోనే మీ ముక్తి ఉంది. ఈ మార్గమే మీ ఆకలి సమస్యకు పరిష్కారమిస్తుంది. మీ జనాభా మెజారిటీలో ఉండడం సరిపోదని గ్రహించండి. ఎప్పుడూ అప్రమత్తంగా, బలంగా, విద్యావంతులై, ఆత్మగౌరవంతో ఉన్నప్పుడే విజయాన్ని సాధించి, దాన్ని నిలబెట్టుకోగలరు' అన్నది అంబేడ్కర్ బోధనల సారాంశం. కులాధిపత్యాన్ని, మతోన్మాదాన్ని ఖండించి నూతన భారతదేశాన్ని ఆవిష్కరించడానికి తగిన పునాదులు వేశారు అంబేడ్కర్. ఆయనను పరిగణనలోనికి తీసుకోకుండా ఒక రాజకీయ కూటమిని నిర్మించడం అంటే కళ్ళకు గంతలు కట్టుకుని గుంతల్లో నడవడమే.

రాజ్యాంగంలోని 21వ అధికరణ భారతదేశ ప్రజలకు ఊపిరి లాంటిది. ఒక వ్యక్తి జీవించి ఉంటేనేకదా ప్రాథమిక హక్కులను అనుభవించేది. రాజ్యాంగం ప్రసాదించిన ఈ ప్రాథమిక హక్కును హరించివేస్తున్నది కూడా ప్రభుత్వం, పోలీసులు, రక్షణ బలగాలే. రాజ్య హింసకు దర్పణం ఈ అధికరణ. రాజ్య హింస రెండు రకాలు. ప్రత్యక్ష హింస, పరోక్ష హింస. బూటకపు ఎన్‌కౌంటర్లు, లాకప్ హత్యల లాంటివి ప్రత్యక్ష హత్యలు. రైతుల ఆత్మహత్యలు, అర్ధాకలి మరణాలు, పోషకాహారం లేక శిశువులు, పిల్లల మరణాలు, సరైన వైద్య సదుపాయం లేక గాలిలో కలిసిపోతున్న బడుగు జీవుల ప్రాణాలు, వివిధ రకాల కాలుష్యాల ప్రభావంతో మరణాలు మొదలైనవన్నీ పరోక్ష హత్యలు. వీటన్నింటికీ బాధ్యత ప్రభుత్వానిదే కనుక. అందుకే ఇండియా కూటమి జీవించే హక్కుకు భరోసా ఇవ్వాలి.

భారతీయుడైన ప్రతివాడు ఆర్థిక, సాంఘిక స్వాతంత్ర్యాలను పొందాలని నొక్కి వక్కాణించారు అంబేడ్కర్. ప్రతి మనిషికి నిర్భయంతో కూడిన స్వేచ్ఛను అందించడం ప్రభుత్వ బాధ్యత అన్నారు. స్వేచ్ఛ, సమానత్వ, సౌభ్రాతృత్వాలను ప్రముఖంగా ప్రస్తావించారు. ఈ ప్రణాళిక అణగద్రొక్కబడ్డ వారి సాంఘిక సమానత్వాన్ని నొక్కి చెప్పింది. ఆయన ఆలోచనలను వందకు వంద శాతం ముందుకు తీసుకుని వెళ్లాలి. కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వాన్ని దించాలని ప్రజాస్వామ్య వాదులు, లౌకికవాదులు అందరూ అనుకుంటున్నారు. ఇది ఇండియా కూటమికి శుభసూచన. కానీ వీళ్ళు అంబేడ్కర్ మార్గంలో ప్రత్యామ్నాయ ప్రణాళికను రూపొందించుకోవలసిన చారిత్రక బాధ్యతను కలిగి ఉన్నారు. అప్పుడే అది నిజమైన ప్రత్యామ్నాయ రాజకీయ కూటమి అవుతుంది.

వ్యాసకర్త దళితోద్యమనేత । 98497 41695

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

బతకనీయరా?



జీ20 ప్రపంచ నాయకుల సదస్సు కోసం ఢిల్లీ సిద్ధమవుతోంది. నాయకుల దృష్టిలో పేద కార్మికులు పడకుండా భారీ ఎత్తున మురికివాడలను పడగొడుతున్నారు. నిరాశ్రయులకు నిలువనీడ లేకుండా చేస్తున్నారు. పేద కార్మికులే నగరాన్ని నడిపేది. తన పేద కార్మికుల పట్ల సిగ్గుపడే ప్రభుత్వాన్ని చూసి నేను సిగ్గుపడుతున్నాను.

– హర్ష్ మందర్, యాక్టివిస్ట్

శాశ్వత ధర్మం



ఎలా జీవించాలి? అంతరాత్మ, ఉనికి లాంటి శాశ్వత సత్యాల కోసం నిలబడేది సనాతన ధర్మం. తమను అంతం చేయడానికి దురాక్రమణదారులు జరిపిన దాడులను సనాతనులు తట్టుకోవడమే కాదు, వర్ధిల్లారు. దేశానికి పునాది అయిన సనాతన ధర్మం అన్ని విశ్వాసాలనూ, విలక్షణతలనూ కలుపుకొనేది. దాన్ని నిందించేవాళ్లు అది దేనికి నిలబడుతుందో తెలియనివాళ్లే!

– ప్రియాంక చతుర్వేది, రాజ్యసభ ఎంపీ


అతి - అపార్థం



సనాతన ధర్మం గురించి ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలపై బీజేపీ స్పందన అతిగా ఉంది. అతను సామూహిక హత్యాకాండ గురించి మాట్లాడలేదు. కానీ కుల దురాచారాలకూ, ఉనికిలో ఉన్న అత్యంత అధునాతనమైన మత భావనకూ మధ్య గందరగోళ పడ్డారు.

– తవ్లీన్ సింగ్, కాలమిస్ట్

మళ్లీ తెలుసుకోవాలా?



సూర్యుడి రహస్యాలను తెలుసుకోవడానికి ఇండియా నాలుగు నెలల దూరంలో ఉందని వార్తాపత్రికలు చెబుతున్నాయి. కానీ మనకు ఈ రహస్యాలన్నీ వేదాలు ఎప్పుడో వెల్లడించాయి. అవునా?

– ధ్రుతిమన్ చటర్జీ, నటుడు

సరిపోయారు!



హిందువులతో బీజేపీ: మాకు ఓటేయడం తప్ప మీకు ఇంకో దారి లేదు. హిందువులతో ప్రతిపక్ష పార్టీలు: బీజేపీకి ఓటేయడం తప్ప మీకు ఇంకో దారి లేదు.

– సి. రామ్‌ప్రసాద్ ఆంట్రప్రెన్యూర్

లెఫ్ట్ ఫ్రంట్ ఏర్పాటే ఆయన ధ్యేయం

ప్రజాయుద్ధ నౌకగా పేరుగాంచి, గోర్కీ, లూసన్‌ల మాదిరిగా ప్రపంచ ప్రజల మన్ననలు పొందిన కామ్రేడ్ గద్దర్ 75 ఏళ్ళ సుదీర్ఘ జీవితంలో నడచిన బాట, సృష్టించిన ప్రజా సాహిత్యం, నిర్మించిన ప్రజా కళా సౌధం అనితర సాధ్యం. ఆయన మరణం ప్రజా ఉద్యమాలకు పూడ్చలేని వెలితి. జీవిత చరమాంకంలో ఆయన కొన్ని విమర్శలు కూడా ఎదుర్కోవలసి వచ్చింది. ఆయన మంది బిడ్డలను రెచ్చగొట్టి తుపాకులకు బలిచేశాడనీ, తానూ, తన బిడ్డలు మాత్రం పది లంగా ఉన్నారనేదీ విమర్శ. మనువాదుల నుండి అనేకమంది వ్యతిరేకుల దాకా చేసిన ఈ దాడి చాలా కుటిలమైన వాదన కనుక మేము దీనిని చర్చించబోవడం లేదు. అయితే ఏ పార్టీ కోసమైతే కా॥ గద్దర్ అర్ధ శతాబ్దం పాటు తన సర్వస్వాన్నీ అర్పించి పాటు పడ్డాడో, ఏ పార్టీ ప్రతినిధిగా ప్రభుత్వంతో జరి గిన చర్చల్లో పాల్గొన్నాడో ఆ పార్టీయే ఆయనను తన మనిషిగా ప్రకటించలేక పోవడం తీవ్ర చర్చ నీయాంశమయ్యింది. తెలుగు సమాజంలోనే కాదు, యావత్తు దేశంలోని అన్ని వర్గాలూ, పార్టీలూ, గద్దర్ పాటలతో హోరెత్తుతుండగా మావోయిస్టు పార్టీ నిశ్శబ్దంగా ఉండడం నిజంగా కలత పెట్టే విషయం.



గద్దర్

తెలంగాణ ప్రజల బానిసత్వం, దొరల దౌర్జన్యాలు గద్దర్‌ను ప్రజా కవిగా మార్చినాయి. ఉవ్వెత్తున ఎగసిన ఉద్యమాల్లో ముందు పీఠిన నిలిచేలా చేశాయి. దొరలంతా ఊళ్లు వదిలి పారిపోతుంటే ఆయన ఉగ్రూతలూగాడు. మలి తెలంగాణ ఉద్యమం రావడం, అనేకమంది కమ్యూనిస్టులు అందులో ముందు వరుసలో నిలవడం జరిగింది. తలచింది ఒకటి, జరిగింది మరొకటి. పారిపోయిన దొరలంతా తెలంగాణ ఉద్యమం ముసుగులో టీఆర్‌ఎస్ జెండాతో ఊళ్ళల్లో చొరతబడ్డారు. అన్ని సమస్యలూ మరచిపోయి తెలంగాణ అంతటా ధూంధాంలు సాగాయి. గద్దర్ మిత్రులు ఎందరో టీఆర్‌ఎస్‌లో చేరారు. తెలంగాణలో ప్రజా స్వామ్యం వెల్లివిరుస్తుందని కా॥ గద్దర్ ఆశించారు. నిద్రలేచి చూసే సరికి తెలంగాణ రావణకాష్టం అయింది. నీళ్ళు పారుతాయని ఆశిస్తే అవినీతి వరదలై పారింది. తొలి తెలంగాణ ఉద్యమంలో ఉద్యమకారుల్ని కా॥ కేఎస్ కమ్యూనిస్టులుగా మార్చితే... మలి తెలంగాణ ఉద్యమంలో కమ్యూనిస్టులు ఎలా తెరాస పరమైనారో, తెలంగాణ ఎందుకు నెత్తురోడుతున్నదో విశ్లేషించే మార్క్సిస్టు మేధావులు కరువైనారు. గద్దర్ గుండె చెరువైంది. తెలంగాణ ఉద్యమ ఫలితాలను తన్నుకుపోతుంటే, ఎన్నికల బహిష్కరణ నినాదంతో పోరు బిడ్డల కాళ్ళకు సంకెళ్ళు పడగా... పోరు తెలంగాణ చేష్టలుడిగి నిల్చుంటే గద్దర్ సంఘర్షణ పడ్డాడు.

ఉద్యమం ఆటుపోట్లను ఎదుర్కొంటున్న సమయంలో కమ్యూనిస్టు పార్టీ మీద జరిగిన అనేక దాడుల్లో భాగంగానే కుల సమస్యను పట్టించుకోలేదని 'అంబేడ్కరిస్ట్'ల పేరుతో పెద్ద దాడి జరిగింది. ఈ దాడిని సైద్ధాంతికంగా ఎదుర్కోవడంలో మావోయిస్ట్ పార్టీతో సహా అన్ని ఎమ్‌ఎల్ పార్టీలూ విఫలమయ్యాయి. ఎర్రజెండా నీడలో కుల నిర్మూలన వైపు సాగడంలోను విఫలమైంది. పార్టీయే స్పష్టత కోల్పోయిన ఈ తరుణంలో ఎంతో సంఘర్షణకు గురైనప్పటికీ, గద్దర్ ఏనాడూ లక్ష్యాన్ని మరువలేదు, కుల తత్వానికి తాను బలి కాలేదు. గద్దర్ అంతిమ యాత్రలో 'సియాసత్' పత్రిక మేనేజింగ్ ఎడిటర్ జహీరుద్దీన్ ఖాన్ మరణం... గద్దర్ జీవితాంతం తపించిన 'హిందు–ముస్లిం' ఐక్యతకు ఒక హృద యాన్ని ద్రవింపచేసే సింబాలిజం.


జరిగిపోతున్న సంఘటనలతో రాజీపడలేక, అప్పులయిన వారు సహరించక కా॥ గద్దర్ తీవ్రమైన మానసిక సంఘర్షణకు లోనయినాడు. ఆయన ఎన్నికల రంగాన్ని ఉపయోగించుకోవ డంతో సహా ప్రజా పంథాను స్వీకరించాలనుకున్నాడే తప్ప తన లక్ష్యాన్ని వీడలేదు. తాను రాజకీయ నాయకుడో, సిద్ధాంతకర్తనో కాకపోవడం వల్ల తన ఆలోచన సరిగా వ్యక్తీకరింపబడి ఉండకపోవచ్చు. నిజానికి ఆ పని చేయ వలసింది కమ్యూనిస్టు పార్టీయేనన్న విషయం మరువరాదు.

– డాక్టర్ కె. విజయకుమార్, ప్రొఫెసర్; సి.హెచ్.ఎల్.ఎస్. మూర్తి, అడ్వకేట్

గురువు 'లఘువు' కాకూడదు!

'తరగతి గది ప్రపంచానికి అద్దం వంటిది. విద్యార్థి అభివృద్ధి అక్కడ నుంచే మొదలవుతుంది. నిజమైన ఉపాధ్యాయుడు ప్రపంచాన్ని తన తరగతి గదిలోకి తీసుకురాగలడు' అంటాడు ఓ ప్రముఖ తత్వవేత్త. ఉపాధ్యాయుని 'గురు'తర బాధ్యతనూ, వృత్తి గౌరవాన్నీ వ్యక్తం చేసేందుకు ఈ ఒక్కమాట చాలు. అయితే చదువుకు కేంద్ర బిందువు అయిన 'గురువు' మాత్రం 'లఘువు'గా మారాడన్న అపవాదు మోస్తున్నాడు.

గురు భావన వేద కాలం నుంచి ప్రస్తావనలో ఉంది. తమ గురించి తాము బాగా తెలిసిన గురువులు మంచి శిష్యుల కోసం చూసేవారట. శిష్యులు కూడా అటువంటి గురువునే ఆశ్రయించి శుశ్రూష చేస్తూ జ్ఞానార్జన చేసేవారట. 'నిజమైన గురువు జ్ఞాన రంగంలో నిష్ణాతుడు కావాలి. వేదాలు అభ్యసించిన వాడవ్వాలి. అసూయ లేనివాడు, యోగం తెలిసినవాడు, సరళమైన జీవితాన్ని గడిపేవాడు, ఆత్మజ్ఞానాన్ని పొందినవాడు అయివుండాలి' అంటూ నాటి సమాజం గురువుకు అత్యున్నత స్థానం కట్టబెట్టి గౌరవించింది. గురువు నైపుణ్యాల బోధకుడు. మానసిక విశ్లేషకుడు. విలువలు అలవర్చడం, అనుభవాలను వివరించడం అతని బాధ్యత. అన్ని విషయాలపై అవగాహన కల్పించి శిష్యుడిని సర్వసమగ్రంగా తీర్చిదిద్దే శిక్షకుడు గురువు. అక్షర జ్ఞానం నుంచి ఆధ్యాత్మిక అంశాల వరకు, యుద్ధ కళల నుంచి సంగీత, సాహిత్య, చిత్రకళల వరకు గురుకులాల్లో బోధన జరిగేది. ఊహ తెలిసిన తర్వాత గురుకులంలోకి ప్రవేశించిన విద్యార్థి యుక్తవయసు నాటికి అన్ని కళల్లో ఆరితేరి తిరిగి తల్లిదండ్రుల వద్దకు చేరేవాడు. సూర్యునిలా ప్రకాశించే గురువు అంతే ప్రకాశవంతంగా శిష్యుని తీర్చిదిద్దేవాడని వేదాలు చెప్పాయి.



నేటి కాలానికి వస్తే – ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు తమ బాధ్యతను చిత్తశుద్ధితో నిర్వహించడం, లక్ష్యం మేరకు విధులు నిర్వహించడంలో పలు సవాళ్లు ఎదుర్కోవాల్సి రావడం వాస్తవమే అయినా... ఉన్నంతలో తమ విధులు నిర్వహించడంలో చాలామంది ఉపాధ్యాయులు విఫలమవుతూ చిన్న చూపుకు గురవుతున్నారు.

చదువుకోవడం ఒకప్పుడు గౌరవ ప్రదమైన కార్యక్రమం. ఇప్పుడు ప్రాథమిక హక్కు. ఉచిత నిర్బంధ విద్యతో మొదలైన ప్రభుత్వాల కృషి నేడు 'హక్కు' అమలుకు పటిష్టంగా కొనసాగుతోంది. కనీస సదుపాయాలు లేవనో, ఉపకరణాలు అందుబాటులో ఉండడం లేదనో, సరిపడే సిబ్బందిని నియమించడం లేదనో చెప్పి ఉపాధ్యాయులు నిందను ప్రభుత్వం మీదకు తోసేసి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నారు. సమస్యలు లేవని చెప్పలేకున్నా గతకాలంతో పోల్చితే ఇప్పుడు విద్యపై ప్రభుత్వాల శ్రద్ధ పెరిగింది. నిధుల కేటాయింపు అధికమయ్యింది. సదుపాయాలు, ఉపకరణాలు అందుబాటులోకి వచ్చాయి. ఈ పరిస్థితుల్లో విద్యాప్రమాణాల మెరుగుదలకు కృషి చేయాలని ప్రభుత్వం ఒత్తిడి పెంచుతోంది. మొక్కుబడి ఫలితాలపై కాకుండా వాస్తవ అభివృద్ధి సాధించాలని కోరుతోంది.

ఆధునిక విద్య అందరికీ అందించడం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యత. కానీ పెట్టుబడి పెట్టడం వరకే ప్రభుత్వం చేయగలదు. క్షేత్ర స్థాయిలో అమలు బాధ్యత ఉపాధ్యాయులదే. ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ విద్యార్థులను తీర్చి దిద్దినప్పుడు వారికి ఆత్మసంతృప్తితోపాటు ప్రజల నుంచి హర్షామోదాలు వ్యక్తమవుతాయి. ఇందుకు ఆధునిక బోధనా విధానాలు, మూల్యాంకనా విధానాలతో పాటు జాతి నిర్మాణానికి ఉపయుక్తమయ్యే తాజా కరికులంపై పూర్తిస్థాయి అవగాహన ఏర్పర్చుకుని లక్ష్య సాధనకు ఉపాధ్యాయులు సిద్ధపడాలి.

ఉపాధ్యాయుడు నిరంతర అభ్యాసకుడు, పరిశోధకుడు అయినప్పుడు మాత్రమే మంచిఫలితాలు సాధ్యమవుతాయి. ఆధునిక అవసరాలు, వాస్తవ పరిస్థితులను అర్థం చేసుకుని తమను తాము అందుకు సన్నద్ధం చేసుకుంటూ భావి భారత పౌరులను తీర్చిదిద్దేందుకు సిద్ధం కావాలి. క్షేత్ర స్థాయిలో ఇది కనిపించినప్పుడే ఉపాధ్యాయులకు గౌరవం.

– బి.వి. రమణమూర్తి, టీచర్, విశాఖపట్నం

(నేడు సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి; ఉపాధ్యాయ దినోత్సవం)

శరీర ధర్మం

మహాపురుష లక్షణాలతో, అసమాన సౌందర్యంతో బుద్ధుడి భౌతిక కాయం విరాజిల్లుతుండేది. అట్టి కాయాన్ని దర్శించినంత మాత్రాన, ప్రశంసించినంత మాత్రాన, అర్హంత సిద్ధి లభించదనే మాట సత్యం. అతడు ప్రవచించిన అష్టాంగ మార్గం అనుసరించటం వల్లనే అది లభిస్తుంది. అయినప్పటికీ, ఆయన సౌందర్యమే చాలామందికి ప్రథమ ఆకర్షణ కారణమవ్వటం 'తిపిటకా'ల్లో మనం చూస్తాము.

నవజాత శిశువు తథాగత సిద్ధార్థుని రూప సౌందర్యం చూసి సంతోషంతో కాలదేవుడు అనే ఋషి 'ఇతడు శ్రేష్ఠ వర్ణంతో, దీపశిఖలా ప్రజ్వలిస్తున్నాడు. పసుపు రంగు కంబళిపై పెట్టిన బంగారు ముద్రిక వలె ఉన్నాడు' అంటాడు. యువకుడైన సిద్ధార్థ గౌతముని అపూర్వ సౌందర్యం, ప్రజల మనసుల్ని అయస్కాంతంలా ఆకర్షించేదిగా ఉండేది. శాక్య వనిత కిసా గౌతమి అతని సౌందర్యం చూసి ముగ్ధురాలైందని అట్ఠ కథ ఒకటి చెబుతోంది. ఇల్లు విడిచి సత్యాన్వేషణలో బయలుదేరిన సిద్ధార్థుడు, రాజగృహం నగర వీధిలో పోతుంటే, మగధ రాజైన బింబిసారుడు చూసి అనుకొంటాడు 'ఇతడు దీర్ఘకాయుడు, పవిత్రుడు' అని.

బుద్ధత్వం ప్రాప్తించిన తర్వాత భగవానుడు తండ్రి శుద్ధోదనుడి ఆహ్వానం మేరకు కపిలవస్తు చేరుకొంటాడు. యశోధర, పదేండ్ల ప్రాయం గల పుత్రుడు రాహులునికి అప్పటిదాకా అతడు చూడని తండ్రిని మొదటిసారి చూపించి, ఈ విధంగా పరిచయం చేస్తుంది: ''మహా పురుష లక్షణాలతో పరిపూర్ణమైన శరీరంగల, చక్రాంకితమైన ఎర్రని పాదాలు గల, కాటుక వంటి నీలి వర్ణ కేశాలు గల, ప్రకాశవంతమైన నుదురుగల, నరులలో సింహంలా కనపడే ఇతడే నీ తండ్రి''.

బాగా అలంకరించిన రాజ రథం కూడా కాలం సమీపించినప్పుడు, కూలిపోయినట్లే శరీరం కూడా జీర్ణమైపోతుంది అని సుత్త పిటకం, సంయుత్త నికాయం, జరాధమ్మసుత్తం చెప్తుంది. అలాగే, బంగారు ఛాయతో మెరిసే బుద్ధుని శరీరం కూడా వృద్ధాప్యంలో జీర్ణావస్థకు లోనైంది. ముడుతలు పడింది. ఒక సందర్భంలో బుద్ధుడు తన ప్రియ శిష్యుడు ఆనందుడుతో అంటాడు, ''నాకిప్పుడు ఎనభైయవ ఏడు నడుస్తోంది. అరిగి పోయిన పాత బండిని ఏ విధంగా కట్టి, బిగించి నడిపిస్తారో, నేను కూడా నా శరీరాన్ని ఆ విధంగా నడిపిస్తున్నాను.''

బుద్ధుడు సామాన్య వ్యక్తుల కంటే ఎక్కువ ఆరోగ్యంగా ఉండేవాడు. అయినప్పటికీ, ముసలితనం ఎలాగో, వ్యాధి కూడా అలాగే శరీర ధర్మం. అందు వల్ల బుద్ధుడు అప్పుడప్పుడు వ్యాధిగ్రస్తుడు అవుతుండేవాడు. మలబద్ధకంతో, వాతంతో, వీపు నొప్పితో పీడింపబడేవాడు. అప్పుడప్పుడు భగవానుని శరీరం రోగగ్రస్తమై ఉండినప్పటికీ, చిత్తం ఎల్లప్పుడూ నిరోగియై ఉండేది.

– దీవి సుబ్బారావు

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, దక్షిణాయణం, వర్ష ఋతువు, నిజ శ్రావణ మాసం, **తిథి:** బ.షష్ఠి రా.8.45 వరకు, తదుపరి సప్తమి, **నక్షత్రం:** భరణి ప.2.46 వరకు, తదుపరి కృత్తిక, **వర్జ్యం:** రా.2.44 నుండి 4.20 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.15 నుండి 9.07 వరకు, తదుపరి రా.10.48 నుండి 11.34 వరకు, **అమృతఘడియలు:** ఉ.10.04 నుండి 11.34 వరకు; **రాహుకాలం:** ప.3.00 నుండి 4.30 వరకు, **యమగండం:** ఉ.9.00 నుండి 10.30 వరకు, **సూర్యోదయం:** 5.49, **సూర్యాస్తమయం:** 6.08.

క్లుప్తంగా...

ఖదీర్ లాకప్‌డెత్‌పై కౌంటర్ దాఖలు చేయండి

- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: మెదక్‌లో జరిగిన ఖదీర్ ఖాన్ లాకప్‌డెత్ ఘటనపై కౌంటర్ దాఖలు చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు హోంశాఖ కార్యదర్శి, మెదక్ ఎస్పీలకు నోటీసులు జారీచేసింది. తదుపరి విచారణను 4 వారాలకు వాయిదా వేసింది. మెదక్ పట్టణానికి చెందిన ఖదీర్‌ఖాన్ గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఫిబ్రవరిలో మృతి చెందిన విషయం తెలిసిందే. ఓ దొంగతనం కేసులో పోలీసులు పట్టుకెళ్లి తీవ్రంగా కొట్టడం వల్లే మృతి చెందాడంటూ ఆయన భార్య సిద్ధేశ్వరి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఖదీర్ మృతి అంశంపై ప్రత్యేక దర్యాప్తు బృందం(సిట్)తో విచారణ జరిపించాలని, ప్రభుత్వం రూ.50 లక్షల పరిహారం చెల్లించాలని కోరుతూ ఆమె రిట్ పిటిషన్ దాఖలు చేసింది. సంబంధిత పోలీసుస్టేషన్‌లోని సీసీటీవీ ఫుటేజీ ఫ్రీజ్ చేసేలా ఎస్పీకి ఆదేశాలు ఇవ్వాలని న్యాయస్థానానికి విజ్ఞప్తి చేసింది. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అలోక్ అరాధే, జస్టిస్ ఎన్వీ శ్రవణ్‌కుమార్ ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. గతంలో ఈ అంశంపై పత్రికల్లో వచ్చిన కథనాన్ని హైకోర్టు సుమోటో పిల్‌గా విచారణకు స్వీకరించింది. దీన్ని ప్రస్తావిస్తూ పిల్‌తోపాటే రిట్‌ను కూడా విచారిస్తామని ధర్మాసనం పేర్కొంది.

ఫోన్ మాట్లాడుతూ ట్రాక్‌పై నిద్రలోకి జారుకున్న కూలీ

- పైనుంచి రైలు వెళ్లడంతో తెగిపోయిన కాళ్లు

కొత్తగూడెం అర్బన్: సెల్‌ఫోన్‌లో మాట్లాడుకుంటూ రైల్వే ట్రాక్‌పై నిద్రపోయిన వ్యక్తిపై నుంచి రైలు వెళ్లడంతో రెండు కాళ్లు తెగిపోయిన ఘటన కొత్తగూడెంలో సోమవారం చోటుచేసుకుంది. జీఆర్పీ పోలీసుల కథనం ప్రకారం.. ఒడిశాకు చెందిన వలస కూలీ భీమా కొత్తగూడెం వచ్చి బంధువులతో కలిసి గంగబిషన్ బస్తీలో నివాసం ఉంటున్నాడు. సోమవారం మధ్యాహ్నం ఆ కాలనీలో ఉన్న రైల్వే ట్రాక్‌పై పడుకుని ఫోన్ మాట్లాడుకుంటూ అలాగే నిద్రలోకి జారుకోగా..అదే సమయంలో వచ్చిన రైలు భీమా కాళ్ల పైనుంచి వెళ్లడంతో రెండు కాళ్లూ తెగిపోయాయి. సమాచారం అందుకున్న జీఆర్పీ పోలీసులు బాధితుడిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు.

ఉదయం పెళ్లి రిజిస్ట్రేషన్.. సాయంత్రం ఆత్మహత్య



ధరణి మృతదేహం

జగిత్యాలక్రైం: పాప పుట్టినరోజు వేడుకల నిర్వహణలో తండ్రితో తలెత్తిన విభేదాలతో మనస్తాపం చెందిన ఓ యువతి మ్యారేజ్ రిజిస్ట్రేషన్ చేసుకున్న గంటల వ్యవధిలోనే ఎస్సారెస్పీ కాలువలో దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన జగిత్యాల్లో చోటుచేసుకుంది. జగిత్యాల రూరల్ మండలం తాటిపల్లి గ్రామానికి చెందిన ఏటూరి ధరణి(25)ని విజిత్ గోవర్ధన్‌కు ఇచ్చి పెద్దలు రెండేళ్ల క్రితం సంప్రదాయబద్ధంగా పెళ్లి జరిపించారు. వీరికి 11 నెలల పాప ఉంది. తమ అవసరాల నిమిత్తం సోమవారం జగిత్యాల సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో దంపతులు మ్యారేజ్ రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. మరో వారంరోజుల్లో పాప పుట్టిన రోజు వేడుకలు ఉండడంతో కుటుంబసభ్యులు అందరూ కలిసి షాపింగ్ చేసి సాయంత్రం ఇంటికి చేరుకున్నారు. అందరూ ఇంట్లో ఉండగా, ధరణి బయటకు వెళ్లి సమీపంలోని ఎస్సారెస్పీ కాలువలో దూకేసింది. సమాచారం అందుకున్న ఎస్సై సుధాకర్ ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని వెలికితీయించి పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మన వరాలు పుట్టిన రోజు వేడుకలను జగిత్యాలో చేద్దామని తన కూతురు ధరణి చెప్పిందని, తాను తాటిపల్లిలో చేద్దామని అన్నానని, దీంతో మనస్తాపం చెంది కూతురు ఆత్మహత్యకు పాల్పడిందని మృతురాలి తండ్రి ఆంజనేయులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు.

ముఖంపై కోతలు... కడుపులో కత్తిపోట్లు

- ప్రేమోన్మాది చేతిలో గాయపడిన యువతి శాశ్వత వైకల్యానికి గురయ్యే ప్రమాదం
- ఆ పరిస్థితి రాకుండా మా వైద్య బృందం కృషి చేస్తోంది: నాగేశ్వర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ప్రేమోన్మాది శివకుమార్ చేతిలో కత్తిపోట్లకు గురైన యువతికి చికిత్స కొనసాగుతోందని గచ్చిబౌలిలోని ఏఐజీ హాస్పిటల్స్ చైర్మన్ డాక్టర్ నాగేశ్వర్‌రెడ్డి చెప్పారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. దారుణమైన రీతిలో యువతి శరీరంలో అనేక చోట్ల కత్తిపోట్లకు గురైందని, తమ వైద్యులు తీవ్రంగా శ్రమించాల్సి వస్తోందని వెల్లడించారు. ఆస్పత్రికి చెందిన ట్రామాకేర్ బృందంలోని న్యూరో సర్జన్లు, పునర్నిర్మాణ శస్త్రచికిత్స నిపుణులు, ఆర్థోపెడిక్స్, ఎమర్జెన్సీ ఫిజీషియన్‌ల బృందంతో కలిసి ఆ యువతికి చికిత్స అందిస్తున్నామని చెప్పారు. తమ ఆస్పత్రికి తీసుకొచ్చే సమయానికి ఆమె ముఖంపైన కోతలతో సహా అనేకచోట్ల కత్తిపోట్లు ఉన్నాయని, ప్లాస్టిక్ సర్జన్ ముఖానికి అవసరమైన కుట్లు వేసి, ముఖరూపు మారకుండా చూస్తున్నామని తెలిపారు. కానీ తీవ్రమైన కత్తి దాడి ఫలితంగా గర్భాశయ ప్రాంతానికి సమీపంలో వెన్నుపాముకు ప్రాణాంతకమైన గాయమై ప్రధాన నరాలను తీవ్రంగా ప్రభావితం చేసిందని, దీని వల్ల ఆమె వైకల్యం బారిన పడే ప్రమాదం ఉందని, ఆ పరిస్థితి రాకుండా తమ వైద్యులు కృషి చేస్తున్నారని, తగిన సమయంలో శస్త్రచికిత్స చేస్తామన్నారు.

ఉచిత చికిత్స... దీర్ఘకాలిక సేవలు అందిస్తాం



యువతి ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని మొదట ప్రాణరక్షణపైనే కృషి చేశామని, ఈ గాయాలు ఆమెకు జీవి తాంతం భారంగా మారకుండా, ఆమె వైద్య ఖర్చులను తామే భరించాలని నిర్ణయించుకున్నామని నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. దీర్ఘకాలిక ఫిజియో థెరపీతో ఆమె కోలుకోవడానికి కొంత సమయం పడుతుందని చెప్పారు. డిశ్చార్జి తర్వాత కూడా తమ వైద్య బృందం ఆమెకు సహాయం చేస్తుందన్నారు. ఆమె ఎదుర్కొన్న తీవ్ర మానసిక వేదన నుంచి బయటకు రావడానికి మానసిక, ఆరోగ్య కౌన్సెలింగ్ అవసరం కూడా ఉంటుందని, మొత్తంగా ఇదొక సుదీర్ఘ ప్రయాణమే అని అన్నారు.

ప్రేమోన్మాది శివకుమార్ అరెస్టు

నాగోలు, కొందుర్గు: ప్రేమపేరుతో యువతిపై దాడి చేసి, ఆమె తమ్ముడిని హతమార్చిన కేసులో సోమవారం రాత్రి నిందితుడు శివకుమార్‌ను సోమవారం రాత్రి ఎల్‌బీనగర్ పోలీసులు అరెస్టు చేశారు. పృథ్వీ తండ్రి సురేందర్‌గౌడ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు శివకుమార్‌పై పలు సెక్షన్ల కేసు నమోదు చేసి కోర్టు ముందు హాజరుపర్చగా 14 రోజుల రిమాండ్ విధించినట్లు ఎల్‌బీనగర్ సీఐ అంజిరెడ్డి తెలిపారు. శివకుమార్ ఆదివారం ఆర్టీసీ కాలనీలోకి వచ్చిన దృశ్యాలు కాలనీలోని సీసీకెమెరాలలో రికార్డు అయ్యాయి. సోమవారం తెల్లవారుజామున పోలీసులు సంఘటన జరిగిన స్థలంలో నిందితుడిని తీసుకెళ్లి సీన్ రీకన్‌స్ట్రక్షన్ చేశారు. ఆ తర్వాత దాడికి ఉపయోగించిన కత్తితోపాటు శివకుమార్ సెల్‌ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ప్రేమోన్మాది చేతిలో ప్రాణాలు కోల్పోయిన పృథ్వీ కుటుంబానికి న్యాయం చేయాలని సోమవారం రంగారెడ్డి జిల్లా కొందుర్గు చౌరస్తాలో వివిధ పార్టీల నాయకులు ధర్నా చేపట్టారు. వర్షాన్ని సైతం లెక్కచేయకుండా రోడ్డుపై బైఠాయించారు. నిందితుడు శివకుమార్‌ను ఉరితీయాలని డిమాండ్ చేశారు. దాదాపు గంటపాటు రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. ఎక్కడి వాహనాలు అక్కడే నిలిచిపోయాయి.



యువతి ఇంట్లోకి వెళుతున్న నిందితుడు (సీసీ ఫుటేజీ). (ఇన్‌సెట్‌లో)శివకుమార్

సింగరేణి ఉద్యోగులకు రూ.2,800 కోట్లు

- వేజ్‌బోర్డు బకాయిలు, లాభాల వాటా, దీపావళి బోనస్ ప్రకటించిన సంస్థ
- రోజుకు రెండు లక్షల టన్నుల బొగ్గు ఉత్పత్తి చేయాలి: సీఎండీ శ్రీధర్



గోదావరిఖని: సింగరేణి ఉద్యోగులకు వేజ్‌బోర్డు ఏరియర్స్, లాభాల వాటా, దీపావళి బోనస్ పేరుతో రూ.2,800 కోట్లు చెల్లించనున్నట్లు ఆ సంస్థ సీఎండీ ఎన్.శ్రీధర్ తెలిపారు. సోమవారం సింగరేణి వ్యాప్తంగా ఉన్న అన్ని ఏరియాల జీఎంలతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి బొగ్గు ఉత్పత్తిపై సమీక్షించారు. రాష్ట్ర విద్యుత్ అవసరాల నేపథ్యంలో నిర్దేశించిన బొగ్గు ఉత్పత్తి లక్ష్యాలు సాధించాలని, మార్చి వరకు 72 మిలియన్ టన్నుల ఉత్పత్తి సాధించి థర్మల్ విద్యుత్‌కేంద్రాలకు సరఫరా చేయాలని సూచించారు. గతేడాదితో పోల్చితే ఈసారి మొదటి ఐదు నెలల్లో మెరుగైన బొగ్గు ఉత్పత్తి, రవాణా సాధించేలా ముందుకెళ్తున్నామని హర్షం వ్యక్తం చేశారు.

ఒక్కో కార్మికుడికి రూ.6.5 లక్షలు

సింగరేణి ఉద్యోగులకు నెల రోజుల్లో రూ.1,726 కోట్లు, 11వ వేజ్‌బోర్డు ఏరియర్స్, లాభాల వాటా రూ.700 కోట్లు, దీపావళి బోనస్ రూ.300 కోట్లు చెల్లించడానికి ఏర్పాట్లు చేశామని శ్రీధర్ వెల్లడించారు. సగటున ఒక్కో కార్మికుడు సుమారు రూ.6.5 లక్షలు అందుకోనున్నట్లు వివరించారు. సమావేశంలో డైరెక్టర్లు ఎన్.బలరాం, డి.సత్యనారాయణరావు, ఎన్వీకే.శ్రీనివాస్, జి.వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మన పాలకులకు ప్రేమ, భక్తి ఉన్నాయి



విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమంలో మాట్లాడుతున్న చినజీయర్‌స్వామి. వేదికపై మంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఇంద్రకరణ్‌రెడ్డి, సత్యవతి రాథోడ్

- అందుకే అన్నిరంగాల్లో ముందుకు వెళ్తున్నాం
- వల్మిడిలో త్రిదండి చినజీయర్ స్వామీజీ
- శ్రీ సీతారామచంద్రస్వాముల ఆలయ పునఃప్రారంభం, విగ్రహాల పునఃప్రతిష్ఠాపన

సాక్షి ప్రతినిధి,వరంగల్: ఆధ్యాత్మిక భావనతో మనసులో ఎటువంటి కల్మషం లేకుండా, మానవీయ కోణంలో ఏ కార్యక్రమం తలపెట్టినా సత్ఫలితాలు వస్తాయని త్రిదండి చినజీయర్‌స్వామిజీ అన్నారు. కొత్త ఆలయాలు నిర్మించడం సహజమని, కానీ పురాతన ఆలయానికి పునరుజ్జీవం పోయడం గొప్ప విషయమని, కోట్లాది రూపాయలు ఖర్చు చేసి వల్మిడిలో రామాలయం నిర్మించడం మరింత అభినందనీయమని పేర్కొన్నారు. రాష్ట్రంలో పాలకులకు ప్రేమ, భక్తి రెండూ కలసి ఉండడంతో మనం అన్ని రంగాల్లో ముందుకు వెళుతున్నామని చెప్పారు. తెలంగాణ రాష్ట్రం ఇలాగే పచ్చగా కొనసాగాలని ఆకాంక్షించారు. జనగామ జిల్లా పాలకుర్తి మండలం వల్మిడి గ్రామంలో సోమవారం జరిగిన శ్రీ సీతారామచంద్రస్వామి ఆలయ పునఃప్రారంభం, విగ్రహాల ప్రతిష్ఠాపన కార్యక్రమంలో చినజీయర్ పాల్గొని సందేశం ఇచ్చారు. మనుషుల్లో అంతర్లీనమైన ప్రేమ, సహోదర భావం పెంపొందించడంతో పాటు మానసిక ధైర్యాన్ని ఇచ్చేందుకు ప్రతిచోట ఆలయాలు అవసరమని ఆయన తెలిపారు. వాల్మీకితో సంబంధం ఉన్న అతి ప్రాచీనమైన వల్మిడి రామాలయాన్ని దివ్య క్షేత్రంగా వెలుగొందేలా మంత్రి దయాకర్‌రావు చేసిన కృషి అభినందనీయమన్నారు. ప్రముఖ పుణ్యక్షేత్రం యాదాద్రికి దీటుగా వల్మిడి ఆలయాన్ని మరింత అభివృద్ధి చేయడానికి అన్ని చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర ఆర్థిక, వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీశ్‌రావు చెప్పారు. ముందుగా వేదమంత్రోచ్ఛరణల నడుమ సీతారాముల విగ్రహాన్ని జీయర్ స్వామి ప్రతిష్ఠించారు. అనంతరం ఆలయంలోని ఇతర విగ్రహాలను, ఆలయ గోపురంపై కలశాన్ని ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు ఇంద్రకరణ్ రెడ్డి, సత్యవతి రాథోడ్, ఎంపీలు, ఎమ్మెల్యేలు, కలెక్టర్లు, అధికారులు, అధిక సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు. కాగా పాలకుర్తి మండల కేంద్రంలోని సోమేశ్వర లక్ష్మీ నరసింహస్వామి వారి ఆలయంలో మంత్రులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సోమ నాథుడి స్మృతి వనం, కల్యాణ మండపం, హరిత హోటల్, గిరిజన భవన్ నిర్మాణ పనులకు శంకుస్థాపన, ప్రారంభోత్సవాలు చేశారు.

అడ్వొకేట్ కమిషనర్ నియామకం

మంత్రి శ్రీనివాస్‌గౌడ్ కేసులో సాక్షుల నుంచి వివరాలు నమోదు చేయాలని హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్: మహబూబ్‌నగర్ నియోజకవర్గం ఎమ్మెల్యే, మంత్రి శ్రీనివాస్‌గౌడ్‌పై దాఖలైన ఎన్నికల పిటిషన్‌లో హైకోర్టు.. అడ్వొకేట్ కమిషనర్‌ను నియమించింది. ఆయన ముందు హాజరై వివరాలు ఇవ్వాలని సాక్ష్యులను ఆదేశించింది. ఈ నెల 11వ తేదీ వరకు విచారణ పూర్తి, నివేదిక అందజేయాలని అడ్వొకేట్ కమిషనర్‌కు కోర్టు స్పష్టం చేసింది. మహబూబ్‌నగర్ సబ్ రిజిస్ట్రార్, రాణిగంజ్ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ మేనేజర్, ఎర్రగడ్డ ఎస్‌బీఐ మేనేజర్, మహబూబ్‌నగర్ జిల్లా బండమేడి ఆర్‌టీవోలను ఈ నెల 6న హాజరు కావాలని ఆదేశించింది. అలాగే 8న మెదక్ జిల్లా ఆర్డీవో, 11న నల్లగొండ జిల్లా అడిషనల్ కలెక్టర్‌ను అడ్వొకేట్ కమిషనర్ ముందు హాజరైన వివరాలు వెల్లడించాలని చెప్పింది. ఈ మేరకు సాక్షులకు వ్యక్తిగతంగా నోటీసులు జారీ చేయాలని రిజిస్ట్రీకి సూచించింది. సాక్షుల నుంచి సేకరించిన వివరాలను సీల్డ్ కవర్‌లో అందజేయాలని అడ్వొకేట్ కమిషనర్‌కు సూచిస్తూ.. తదుపరి విచారణను ఈ నెల 12కు వాయిదా వేసింది. ఎన్నికల అఫిడవిట్‌లో కుటుంబ ఆస్తుల గురించి శ్రీనివాస్ గౌడ్ తప్పుడు సమాచారం ఇచ్చారంటూ మహబూబ్‌నగర్‌కు చెందిన సీహెచ్ రాఘవేంద్ర రాజు 2019లో హైకోర్టులో ఎన్నికల పిటిషన్(ఈపీ) దాఖలు చేసిన విషయం తెలిసిందే. అఫిడవిట్ దాఖలు చేసిన తర్వాత మార్పులు చేసి మళ్లీ మరోసారి అందజేశారని, ఇది చట్టవిరుద్ధమని పేర్కొన్నారు. దీనిపై జస్టిస్ ఎం.లక్ష్మణ్ విచారణ చేపట్టారు.

‘టీచర్ పోస్టులు భర్తీ చేయకపోతే ఉద్యమం’



ముషీరాబాద్ (హైదరాబాద్): రాష్ట్రవ్యాప్తంగా 25 వేలకు పైగా ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను వెంటనే భర్తీ చేయకపోతే నిరుద్యోగులతో కలిసి ఉద్యమిస్తామని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం ఇందిరాపార్కు వద్ద వేలాది మంది నిరుద్యోగులు ధర్నా నిర్వహించారు. వర్షాన్ని లెక్క చేయకుండా నిరుద్యోగులు ధర్నాలో పాల్గొన్నారు.

ఆర్టీసీకి 910 కొత్త బస్సులు

టాటా, అశోక్ లేలాండ్ కంపెనీలకు ఆర్డర్ • డిసెంబర్‌కల్లా అందుబాటులోకి...

సాక్షి, హైదరాబాద్: మూడునెలల్లో ఆర్టీసీకి 910 కొత్త బస్సులు సమకూరబోతున్నాయి. చాలా కాలంగా పాతబడ్డ బస్సులతో లాక్కొస్తుండగా, వాటిల్లోంచి కొన్నింటిని తుక్కుగా మార్చేసి.. కొత్త బస్సులు అందుబాటులోకి తేవాలని సంస్థ నిర్ణయించింది. ఇప్పటికే టెండర్లు పిలవగా టాటా, అశోక్ లేలాండ్ కంపెనీలు తక్కువ కొటేషన్‌తో ముందుకొచ్చాయి. టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి నెగోషియేషన్స్ ద్వారా వాటి కొటేషన్ మొత్తాన్ని కొంతమేర తగ్గించేందుకు ఆర్టీసీ అధికారులు చర్చలు జరుపుతున్నారు. మరికొద్ది రోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి చేసి, రెండు కంపెనీలు ఒకే ధరకు ముందుకొచ్చేలా చేసి, వాటికే ఆర్డర్ ఇవ్వాలని చూస్తున్నారు. ఈ నెలలోనే కంపెనీలకు బస్సులు ఆర్డర్ ఇస్తే...బస్ బాడీల నిర్మాణానికి మూడు నెలల సమయం పడుతుంది.

ఎక్స్‌ప్రెస్ బస్సులు 540

ఆర్టీసీలో బాగా డిమాండ్ ఉన్న ఎక్స్‌ప్రెస్ కేటగిరీని బలోపేతం చేయాలని సంస్థ నిర్ణయించింది. ప్రస్తుతం అద్దె బస్సులుపోను సొంతంగా 1,800 వరకు ఎక్స్‌ప్రెస్ బస్సులున్నాయి. ఇవి ఎక్కువ ఆక్యుపెన్సీ రేషియోతో నడుస్తూ ఆర్టీసీకి మంచి ఆదాయాన్ని తెచ్చి పెడుతున్నాయి. దూరప్రాంత పట్టణాల మధ్య ఇవి తిరుగుతున్నాయి. కొన్ని ఇతర రాష్ట్రాలకు కూడా వెళుతున్నాయి. ఈ నేపథ్యంలో 540 కొత్త ఎక్స్‌ప్రెస్ బస్సులు సమకూర్చుకోవాలని ఆర్టీసీ అనుకుంటోంది. వాటి రాకతో డొక్కు ఎక్స్‌ప్రెస్ బస్సులు అదే సంఖ్యలో తొలగిస్తారు. వాటిల్లో కొన్నింటిని సిటీ బస్సులుగా, మరికొన్నింటిని పల్లెవెలుగు బస్సులుగా కన్వర్ట్ చేస్తారు. అంతమేర సిటీ, పల్లెవెలుగు పాత డొక్కు బస్సులను తుక్కుగా మారుస్తారు.



స్లీపర్ కమ్ సీటర్

రాజధాని బస్సులు 50 లేదా 60

ఇక దూరప్రాంత పట్టణాల మధ్య తిరుగుతున్న రాజధాని (ఏసీ) బస్సులకు కూడా మంచి ఆదరణ ఉంది. ప్రస్తుతం ఉన్న బస్సులు బాగా పాతబడిపోయాయి. వాటిల్లోంచి మరీ పాత బస్సులను తొలగించి కొన్ని కొత్తవి సమకూర్చాలన్న ఉద్దేశంతో 50 లేదా 60 బస్సులు కొంటున్నారు. ప్రస్తుతం రాజధాని కేటగిరీ బస్సులన్నీ సీటర్ బస్సులే. తొలిసారి ఆ కేటగిరీలో స్లీపర్ బస్సులు సమకూర్చనున్నారు. పైన కొన్ని బెర్తులు, దిగువ సీట్లు ఉండే స్లీపర్ కమ్ సీటర్ బస్సులు తీసుకోవాలని నిర్ణయించారు.

ఎట్టకేలకు పల్లెవెలుగుకు కొత్త బస్సులు

సాధారణంగా ఎక్స్‌ప్రెస్, రాజధాని బస్సులు పాతబడ్డాక వాటిని తొలగించి సిటీ ఆర్డినరీ, పల్లె వెలుగు బస్సులుగా కన్వర్ట్ చేస్తారు. దీంతో ఆ బస్సులు చాలా పాతబడి ఉంటున్నాయి. అయితే కొత్తగా ఇప్పుడు 100 నుంచి 120 మధ్యలో కొత్త బస్సులు సమకూర్చాలని అధికారులు నిర్ణయించారు. ప్రస్తుతం చాలా డిపోలకు అద్దె బస్సులే నడుస్తున్నాయి. మరో 200 కొత్త బస్సులు హైదరాబాద్ సిటీకి కేటాయిస్తారు.

క్లుప్తంగా...

ఒక్క రోజైనా సెలవు తీసుకోని ప్రధాని మోదీ



న్యూఢిల్లీ: తొమ్మిదేళ్ల క్రితం ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నరేంద్ర మోదీ అప్పటి నుంచి ఇప్పటిదాకా ఒక్క రోజు కూడా సెలవు తీసుకోలేదు. నిత్య శ్రామికుడిలాగా పని చేస్తున్నారు. ప్రధానమంత్రి తీసుకున్న సెలవుల వివరాలు ఇవ్వాలంటూ మహారాష్ట్రలోని పుణేకు చెందిన ప్రఫుల్ పి.సార్దా అనే సామాజిక కార్యకర్త సమాచార హక్కు చట్టం(ఆర్టీఐ) కింద దరఖాస్తు చేశారు. గత తొమ్మిదేళ్లలో మోదీ ఇప్పటిదాకా ఒక్క సెలవు కూడా పెట్టలేదని, నిత్యం విధి నిర్వహణలోనే ఉంటున్నారని ప్రధానమంత్రి కార్యాలయం(పీఎంఓ) తాజాగా సమాచారమిచ్చింది. ప్రధానమంత్రి హోదాలో మోదీ ఎన్ని కార్యక్రమాలకు హాజరయ్యారో చెప్పాలని ప్రఫుల్ పి.సార్దా మరో ప్రశ్న అడిగారు. భారత్ సహా విదేశాల్లో మోదీ 3,000కుపైగా కార్యక్రమాల్లో పాల్గొన్నారని పీఎంఓ బదులిచ్చింది. ఒక్క రోజైనా సెలవు తీసుకోకుండా పని చేస్తున్న ప్రధానమంత్రిపై సోషల్ మీడియాలో ప్రశంసల వర్షం కురుస్తోంది. దేశ అభివృద్ధి పట్ల ఆయన అంకితభావాన్ని నెటిజన్లు కొనియాడుతున్నారు. అందరికీ ఆయనొక మార్గదర్శి అని చెబుతున్నారు.

ఒడిశాలో పిడుగుల వర్షం



భువనేశ్వర్: శక్తివంతమైన పిడుగులు ఒడిశా రాష్ట్రాన్ని వణికించాయి. శనివారం కేవలం రెండు గంటల వ్యవధిలో ఏకంగా 61,000కుపైగా పిడుగుపాట్లు సంభవించడం గమనార్హం. పిడుగుల ధాటికి 12 మంది మరణించారని, మరో 14 మంది గాయాలపాలయ్యారని స్పెషల్ రిలీఫ్ కమిషనర్ సత్యబ్రత సాహూ చెప్పారు. మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున నష్ట పరిహారం చెల్లిస్తామన్నారు. బంగాళాఖాతంలో ఏర్పడిన తుఫాను ప్రభావంతో ఒడిశాలో భారీ వర్షాలు కురుస్తున్నాయి. పలు జిల్లాల్లో 'ఎల్లో వార్నింగ్' జారీ చేశారు. ఈ నెల 7వ తేదీదాకా వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ ప్రకటించింది.

ఒకే వసుధ ఒకే కుటుంబం ఒక సదస్సు



జీ20 సదస్సుకు ఢిల్లీ ముస్తాబు వసుధైక కుటుంబమే నినాదం

అంతర్జాతీయ స్థాయిలో జరిగే అత్యంత కీలకమైన జీ20 సదస్సుకు నభూతో అనే స్థాయిలో ఘనంగా ఆతిథ్యం ఇచ్చేందుకు భారత్ పూర్తిస్థాయిలో సిద్ధమవుతోంది. అమెరికా మొదలుకుని 20 అతి పెద్ద ఆర్థిక వ్యవస్థల అధినేతలు ఒకే వేదిక మీదికి రానున్నారు. ఆర్థిక అసమానతలు మొదలుకుని వాతావరణ మార్పుల దాకా ప్రపంచాన్ని పట్టి పీడిస్తున్న పలు ప్రధాన సమస్యలపై సెప్టెంబర్ 9 నుంచి రెండు రోజుల పాటు లోతుగా చర్చించనున్నారు. ఐక్యత, సమష్టి కార్యాచరణే ఆయుధాలుగా పరిష్కార మార్గాలు అన్వేషించనున్నారు.

అంతర్జాతీయంగా భారత్ పలుకుబడి, పేరు ప్రతిష్టలు కొన్నేళ్లుగా పెరుగుతూ వస్తున్నాయి. దేశాల మధ్య అతి జటిలమైన సమస్యల పరిష్కారానికైనా, వివాదాల్లో మధ్యవర్తిత్వానికైనా అన్ని దేశాలూ భారత్ వైపే చూసే పరిస్థితి! ఇప్పుడు జీ20 శిఖరాగ్రానికి భారత్ వేదికగా నిలుస్తుండటాన్ని అందుకు కొనసాగింపుగానే భావిస్తున్నారు. మన దేశ వ్యవహార దక్షతను నిరూపించుకోవడానికి మాత్రమే గాక అంతర్జాతీయ స్థాయిలో సంలీన వృద్ధి, సుస్థిర అభివృద్ధి సాధన యత్నాలకు అజెండా నిర్దేశించేందుకు కూడా ఇది చక్కని అవకాశంగా నిలవనుంది. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెరపైకి తెచ్చిన వసుధైవ కుటుంబకం (ఒక వసుధ, ఒకే కుటుంబం, ఒకటే భవిత) నినాదమే సదస్సుకు మూలమంత్రంగా నిలవనుంది.

రెండు రోజులు.. మూడు సెషన్లు

దేశ రాజధాని ఢిల్లీలో చారిత్రక ప్రగతి మైదాన్‌లో సదస్సు జరగనుంది.

వేదికకు **భారత్ మండపం** అని నామకరణం చేశారు.

అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ 7వ తేదీనే భారత్‌కు రానున్నారు. 8న మిగతా దేశాధినేతలు వస్తారు. దాంతో వారితో ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలకు కావాల్సినంత సమయం చిక్కనుంది.

8న బైడెన్‌తో మోదీ భేటీ అవుతారని సమాచారం. ఈ భేటీ ఎజెండా ఏమిటన్నది ఇప్పటికైతే సస్పెన్సే.

తొలి రోజు ఇలా...

- సదస్సు 9న మొదలవుతుంది.
- ప్రతి దేశాధినేతకూ భారత్‌మండపం వద్ద మన సంప్రదాయ రీతుల మధ్య ఘన స్వాగతం లభించనుంది.
- రెండు రోజుల సదస్సులో మొత్తం మూడు సెషన్లు జరుగుతాయి.
- ఒకే వసుధ (వన్ ఎర్త్) పేరుతో తొలి సెషన్ శనివారం ఉదయం 9కి మొదలవుతుంది.
- దానికి కొనసాగింపుగా దేశాధినేతల మధ్య అధికార, అనధికార భేటీలుంటాయి.
- అనంతరం ఒకే కుటుంబం (వన్ ఫ్యామిలీ) పేరుతో రెండో సెషన్ మొదలవుతుంది.

రెండో రోజు ఇలా...

- సదస్సు రెండో రోజు ఆదివారం కార్యక్రమాలు త్వరగా మొదలవుతాయి.
- దేశాధినేతలంతా ముందు రాజ్‌ఘాట్‌ను సందర్శిస్తారు. గాంధీజీ సమాధి వద్ద నివాళులర్పిస్తారు.
- అనంతరం భారత్ మండపం వేదిక వద్ద మొక్కలు నాటుతారు. పర్యావరణ పరిరక్షణకు పునరంకితం అవుతామని ప్రతినబూనుతారు.
- ఒకే భవిత (వన్ ఫ్యూచర్) పేరిట జరిగే మూడో సెషన్‌తో సదస్సు ముగుస్తుంది.
- జీ20 అధ్యక్ష బాధ్యతలను వచ్చే ఏడాది శిఖరాగ్రానికి ఆతిథ్యం ఇస్తున్న బ్రెజిల్‌కు అప్పగించడంతో సదస్సు లాంఛనంగా ముగుస్తుంది.



మరెన్నో విశేషాలు...

- ప్రతినిధుల షాపింగ్ కోసం క్రాఫ్ట్స్ బజార్ పేరిట వేదిక వద్ద జీ20 జాబ్ ఫెయిర్ ఏర్పాటు చేస్తారు.
- ప్రజాస్వామ్యాలకు తల్లి భారత్ థీమ్‌తో హాల్ నంబర్ 14లో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేస్తారు.

ప్రథమ మహిళల సందడి

జీ20 సదస్సులో ఆయా దేశాధినేతల సతీమణులు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నారు.

పలు ప్రత్యేక కార్యక్రమాలతో సందడి చేయనున్నారు.

శనివారం తొలి రోజు వాళ్లు పూసా లోని వ్యవసాయ పరిశోధన సంస్థ, నేషనల్ మోడర్న్ ఆర్ట్ గ్యాలరీ సందర్శిస్తారు.

తృణ ధాన్యాల పరిరక్షణ, వృద్ధిలో భారత్ చేస్తున్న కృషిని స్వయంగా గమనిస్తారు.

చివరగా పలు రకాల షాపింగులతో సేదదీరుతారు.

రెండో రోజు ఆదివారం దేశాధినేతల అనంతరం వాళ్లు కూడా రాజ్‌ఘాట్‌ను సందర్శిస్తారు.

షడ్రసోపేత విందు

- శనివారం తొలి రోజు సదస్సు అనంతరం రాత్రి ఆహూతులకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఘనంగా విందు ఇవ్వనున్నారు.
- ఇందులో దేశాధినేతలు మొదలుకుని రాయబారులు దాకా 400 మంది దాకా పాల్గొంటారు.
- విందు కూడా అధినేతల చర్చలకు వేదిక కానుంది. కాన్ఫరెన్స్ గదుల రొటీన్‌కు దూరంగా ఆరుబయట వారంతా మనసు విప్పి మాట్లాడుకుంటారు.

సాక్షి, నేషనల్ డెస్క్

జీ20 శిఖరాగ్రానికి జిన్‌పింగ్ దూరం

- బదులుగా ప్రధాని లీ క్వియాంగ్
- చైనా విదేశాంగశాఖ స్పష్టీకరణ
- నిరాశ కలిగించిందన్న అమెరికా అధ్యక్షుడు బైడెన్

బీజింగ్: ఈ నెల 9, 10వ తేదీల్లో ఢిల్లీలో జరగనున్న జీ20 శిఖరాగ్ర భేటీకి అధ్యక్షుడు జిన్‌పింగ్ హాజరుకావడం లేదని చైనా తెలిపింది. ఆయన స్థానంలో ప్రధాని లీ క్వియాంగ్ చైనా ప్రతినిధి బృందానికి సారథ్యం వహిస్తారని స్పష్టం చేసింది. అందరితో కలిసి పనిచేసి శిఖరాగ్ర సదస్సును విజయవంతం చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపింది. 18వ జీ20 భేటీకి రావాలంటూ భారత ప్రభుత్వం పంపిన ఆహ్వానం మేరకు ప్రధాని లీ క్వియాంగ్ హాజరవుతారని చైనా విదేశాంగ ప్రతినిధి మావో నింగ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 'అతి ముఖ్యమైన అంతర్జాతీయ ఆర్థిక సహకార వేదికైన జీ20కి చైనా ఎంతో ప్రాధాన్యం ఇస్తోంది. జీ20 కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటుంది' అని వివరించిన మావో..ఈ భేటీకి జిన్‌పింగ్ హాజరు కాకపోవడానికి గల కారణాలను మాత్రం వెల్లడించలేదు. ఈ పరిణామంపై అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ స్పందించారు. భారత్‌లో జరిగే జీ20 శిఖరాగ్రంలో పాల్గొనేందుకు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నాను. అయితే, ఈ కార్యక్రమానికి చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్ రాకపోవడం నాకు నిరాశ కలిగించింది. కానీ, ఆయన్ను కలుసుకోబోతున్నా' అని చెప్పారు. జిన్‌పింగ్‌తో భేటీ ఎప్పుడుంటుందనే విషయాన్ని మాత్రం ఆయన తెలపలేదు. గత ఏడాది నవంబర్‌లో ఇండోనేసియాలోని బాలిలో జరిగిన భేటీకి కూడా జిన్‌పింగ్ హాజరుకాలేదు. ఇటీవల జకార్తాలో జరిగిన ఆసియాన్, తూర్పు ఆసియా శిఖరాగ్ర భేటీలకు సైతం చైనా అధ్యక్షుడు దూరంగా ఉన్నారు. కాగా, ఉక్రెయిన్‌లో 'స్పెషల్ మిలటరీ ఆపరేషన్'పైనే తన దృష్టంతా ఉన్నందున జీ20 శిఖరాగ్రానికి హాజరు కాలేకపోతున్నట్లు రష్యా అధ్యక్షుడు పుతిన్ ఇప్పటికే ప్రధాని మోదీకి స్వయంగా ఫోన్ చేసి చెప్పిన విషయం తెలిసిందే.

ప్రపంచ స్థాయి భద్రత

సాక్షి, న్యూఢిల్లీ: ప్రపంచంలోని అత్యంత శక్తివంతమైన నాయకులు హాజరవుతున్న జీ20 శిఖరాగ్ర సదస్సుకు కేంద్ర ప్రభుత్వం పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేస్తోంది. ఈ నెల 9, 10వ తేదీల్లో జరుగనున్న శిఖరాగ్ర సదస్సుకు 20 దేశాల అధినేతలు సహా 14 అంతర్జాతీయ సంస్థల అధిపతులు హాజరు కానున్నారు. సదస్సు సందర్భంగా 80,000 మంది ఢిల్లీ పోలీసులతో సహా దేశ రాజధానికి సుమారు 1,30,000 మంది భద్రతా సిబ్బంది రక్షణ కల్పిస్తారని కేంద్రం వెల్లడించింది. సరిహద్దు భద్రతా దళం (బీఎస్‌ఎఫ్) సహా, విదేశీ నేతలకు సంబంధించిన భద్రత కోసం సెంట్రల్ రిజర్వ్ పోలీస్ ఫోర్స్ (సీఆర్పీఎఫ్), నేషనల్ సెక్యూరిటీ గార్డ్ (ఎన్‌ఎస్‌జీ), స్పెషల్ ప్రొటెక్షన్ గ్రూప్ (ఎస్పీజీ) కమెండోలను నియమించారు. వీరికి అదనంగా పారామిలిటరీ బలగాలు, ఇంటెలిజెన్స్ బ్యూరో (ఐబీ), రీసెర్చ్ అండ్ అనాలిసిస్ వింగ్ (రా) సైతం భద్రతా చర్యల్లో పాలుపంచుకోనున్నాయి. అదనంగా, ప్రపంచ నాయకుల జీవిత భాగస్వాములు, కుటుంబ సభ్యుల రక్షణ బాధ్యతను సశస్త్ర సీమా బల్ (ఎస్ఎస్‌బీ) దళాలకు అప్పగించారు. అమెరికాకు చెందిన సెంట్రల్ ఇన్వెస్టిగేషన్ ఏజెన్సీ (సీఐఏ), చైనా భద్రతా శాఖ (ఎంఎస్ఎస్), యునైటెడ్ కింగ్‌డమ్‌కు చెందిన ఎంఐ–6, ఇతర విదేశీ గూఢచార సంస్థలు సైతం ఇప్పటికే ఢిల్లీకి చేరుకున్నాయి.

రాఫెల్‌లు.. హెలికాప్టర్‌లు.. యాంటీ డ్రోన్‌లు

దేశాధినేతల భద్రతా వ్యవస్థలో బాగంగా గగనతల దాడులను సైతం సమర్థంగా ఎదుర్కొనేలా ఇండియన్ ఎయిర్ ఫోర్స్ (ఐఏఎఫ్), ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీఎస్), ఇతర ఏజెన్సీలు జాగ్రత్తలు తీసుకున్నాయి. అత్యవసర సమయాల్లో ఎన్‌ఎస్‌జీ కమెండోలు, ఐఏఎఫ్ సిబ్బందిని తరలించేలా హెలికాప్టర్లను మోహరించింది. ఢిల్లీ, దాని సమీప ప్రాంతాలలో సమగ్ర ఏరోస్పేస్ రక్షణ కోసం ఇప్పటికే పారాగ్లైడర్లు, పారామోటర్లు, హ్యాంగ్–గ్లైడర్లు, మైక్రోలైట్ ఎయిర్‌క్రాఫ్ట్‌లు, రిమోట్‌గా పైలట్ చేసిన ఎయిర్‌క్రాఫ్ట్, హాట్ ఎయిర్ బెలూన్‌లు, చిన్న విమానం, క్వాడ్‌కాప్టర్ల నిర్వహణను నిషేధించారు.

అప్పటి దాకా ధాన్యం ఒప్పందం ఉండదు

మాస్కో: యుద్ధం కొనసాగుతున్న వేళ నల్ల సముద్రం మీదుగా ఉక్రెయిన్ ధాన్యం రవాణా కారిడార్‌ను పునరుద్ధరించాలంటే పశ్చిమ దేశాలు ముందుగా తమ డిమాండ్లను అంగీకరించాల్సిందేనని రష్యా అధ్యక్షుడు పుతిన్ చెప్పారు. దీంతో, ఆఫ్రికా, మధ్య ప్రాచ్యం, ఆసియా దేశాలకు ఎంతో కీలకమైన ఆహార ధాన్యాల సరఫరాపై నీలినీడలు అలుముకున్నాయి. టర్కీ, ఐరాస మధ్యవర్తిత్వంతో కుదిరిన ధాన్యం రవాణా కారిడార్ ఒప్పందం నుంచి జూలైలో వైదొలిగింది. ఈ ఒప్పందం పునరుద్ధరణపై చర్చించేందుకు సోమవారం రష్యాలోని సోచిలో తుర్కియే అధ్యక్షుడు తయ్యిప్ ఎర్డోగన్‌తో ఆయన సమావేశమయ్యారు. రష్యా నుంచి ఆహారధాన్యాలు, ఎరువుల ఎగుమతులకు గల అవరోధాలను తొలగిస్తామన్న వాగ్దానాలను పశ్చిమదేశాలు నిర్లక్ష్యం చేశాయని ఈ సందర్భంగా ఆయన అసంతృప్తి వ్యక్తం చేశారు. గత ఏడాది వరకు రికార్డు స్థాయిలో ఉన్న వ్యవసాయ ఉత్పత్తుల వాణిజ్యం ఓడల రాకపోకలు, బీమాకు సంబంధించిన అవరోధాల కారణంగా తీవ్రంగా దెబ్బతిందన్నారు. పశ్చిమదేశాలు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చిన పక్షంలో కొద్ది రోజుల్లోనే ఒప్పందంపై సంతకాలు చేస్తామని స్పష్టం చేశారు. ఈ విషయంలో త్వరలోనే పురోగతి సాధిస్తామని ఎర్డోగన్ చెప్పారు.


జాబిల్లిపై మరోసారి 'విక్రమ్' ల్యాండింగ్

40 సెం.మీ. పైకి లేచి.. 40 సెం.మీ. దూరంలో దిగిన ల్యాండర్

- చంద్రుడిపై లూనార్ నైట్ నేపథ్యంలో స్లీప్ మోడ్‌లోకి ల్యాండర్
- ల్యాండర్, రోవర్ మళ్లీ పనిచేస్తాయో లేదో చెప్పలేమంటున్న సైంటిస్టులు



ఆగస్ట్ 25న ల్యాండర్ చంద్రుడిపై దిగిన చోటు



సెప్టెంబర్ మూడున దిగిన చోటు

సూళ్లూరుపేట(తిరుపతి జిల్లా): చంద్రయాన్–3 మిషన్ ప్రయోగం విజయవంతంగా కొనసాగుతోంది. జాబిల్లి దక్షిణ ధ్రువం ఉపరితలంపై ల్యాండర్ 'విక్రమ్'ను మరోసారి సాఫ్ట్ ల్యాండింగ్ చేశారు. మొదట దిగిన ప్రాంతంలో కాకుండా మరో చోట విక్రమ్ క్షేమంగా దిగినట్లు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ(ఇస్రో) 'ఎక్స్'లో వెల్లడించింది. తాము ఇచ్చిన ఆదేశాలకు విక్రమ్ చురుగ్గా స్పందించినట్లు తెలియజేసింది. ల్యాండర్ తొలిసారిగా ఆగస్టు 23న చందమామ ఉపరితలంపై విజయవంతంగా దిగిన సంగతి తెలిసిందే. చంద్రయాన్–3 మిషన్ లక్ష్యంలో భాగంగా ల్యాండర్‌ను తాజాగా మరోచోట దించారు. కమాండ్ ఇచ్చిన తర్వాత ల్యాండర్‌లోని ఇంజిన్లు ఫైర్ అయ్యాయని, తర్వాత ల్యాండర్ 40 సెంటీమీటర్ల మేర పైకి లేచిందని, 30 నుంచి 40 సెంటీమీటర్ల దూరంలో సురక్షితంగా ఉపరితలంపై దిగిందని ఇస్రో స్పష్టం చేసింది. ఈ ప్రక్రియ మానవ సహిత ప్రయోగాలను నిర్వహించినపుడు వ్యోమగాములను క్షేమంగా తిరిగి భూమిపైకి తీసుకురావడానికి కిక్ స్టార్ట్ వంటిదని ఇస్రో శాస్త్రవేత్తలు చెబుతున్నారు. ఈ ల్యాండింగ్‌కు సంబంధించిన వీడియోను ఇస్రో విడుదల చేసింది.

నిద్రాణ స్థితిలోకి 'విక్రమ్'

చందమామపై మరో రెండు మూడు రోజుల్లో లూనార్ నైట్ ప్రారంభం కానుంది. ఈ నేపథ్యంలో ల్యాండర్ విక్రమ్‌ను నిద్రాణ స్థితి(స్లీప్ మోడ్)లోకి మార్చినట్లు ఇస్రో ప్రకటించింది. సోమవారం ఉదయం 8 గంటలకు ఈ ప్రక్రియ చేపట్టినట్లు తెలియజేసింది. ల్యాండర్‌ను స్లీప్ మోడ్‌లో ఉంచడంతో అందులోని పేలోడ్స్ డీయాక్టివ్ అయినట్లు వివరించింది. ల్యాండర్ రిసీవర్స్ మాత్రం చురుగ్గా పని చేస్తున్నట్లు తెలిపింది. చంద్రుడి ఉపరితలంపై సౌరశక్తి తగ్గిపోయి, బ్యాటరీ అయిపోయిన తర్వాత ల్యాండర్ విక్రమ్, రోవర్ ప్రజ్ఞాన్ పూర్తిగా స్లీప్ మోడ్‌లో ఉంటాయని ఇస్రో స్పష్టం చేసింది. చంద్రుడిపై రాత్రి ముగిసిపోయి, తిరిగి పగలు మొదలయ్యాక 22న ల్యాండర్, రోవర్ స్లీప్ మోడ్ నుంచి బయటకు వస్తాయని ఇస్రో అంచనా వేస్తోంది. లూనార్ డే మొదలైన తర్వాత ల్యాండర్, రోవర్ మళ్లీ పనిచేస్తాయా అంటే చెప్పలేమని ఇస్రో సైంటిస్టులు అంటున్నారు. మళ్లీ పని చేస్తే చంద్రయాన్–3 ప్రయోగం కొనసాగుతుంది. లేనిపోతే కథ ముగిసినట్లే.

నేడు కాంగ్రెస్ పార్లమెంటరీ వ్యూహ కమిటీ సమావేశం

ప్రత్యేక సమావేశాల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చ

న్యూఢిల్లీ: పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో పార్టీ పరంగా అనుసరించాల్సిన వ్యూహంపై విపక్ష కాంగ్రెస్ దృష్టి పెట్టింది. కాంగ్రెస్ అగ్రనేత సోనియా గాంధీ నేతృత్వంలో కాంగ్రెస్ పార్లమెంటరీ వ్యూహ కమిటీ మంగళవారం సాయంత్రం 5 గంటలకు సమావేశం కానుందని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఈ నెల 18 నుంచి ఐదు రోజులపాటు పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు జరగనున్నాయి. ఈ సమావేశాల్లో లేవనెత్తాల్సిన అంశాలపై కాంగ్రెస్ పార్లమెంటరీ వ్యూహ కమిటీ భేటీలో చర్చిస్తారు. స్వల్ప జ్వరంతో బాధపడుతూ చికిత్స కోసం ఢిల్లీలోని సర్ గంగారాం ఆసుపత్రిలో చేరిన సోనియా గాంధీ సోమవారం డిశ్చార్జి అయ్యారు. ఇంటికి చేరుకున్నారు. ఆమె ఆరోగ్య పరిస్థితి మెరుగుపడినట్లు సమాచారం. విపక్ష 'ఇండియా' కూటమి ఎంపీలతో ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే త్వరలో సమావేశం కానున్నారు. పార్లమెంట్ ప్రత్యేక సమావేశాల్లో కూటమి తరఫున అనుసరించాల్సిన కార్యాచరణపై చర్చిస్తారు.

68 ఏళ్ల హరీశ్ సాల్వేకు మూడో పెళ్లి



న్యూఢిల్లీ: ప్రముఖ న్యాయవాది, మాజీ సొలిసిటర్ జనరల్ హరీశ్ సాల్వే మూడోసారి పెళ్లి కొడుకయ్యారు. 68 ఏళ్ల జనరల్ హరీశ్ సాల్వే లండన్‌లో త్రినా అనే మహిళను వివాహం చేసుకున్నారు. అత్యంత వైభవంగా ఈ పెళ్లి వేడుకకు నీతా అంబానీ, సునీల్ మిట్టల్, లలిత్ మోదీ తదితర ప్రముఖులు హాజరయ్యారు. హరీశ్ సాల్వేకు ఇది మూడో వివాహం. ఆయన మొదట మీనాక్షిని వివాహమాడారు. వారికి ఇద్దరు కుమార్తెలు సాక్షి, సానియా ఉన్నారు. దాదాపు 30 సంవత్సరాల తర్వాత మీనాక్షి నుంచి విడిపోయారు. 2020 జూన్‌లో విడాకులు తీసుకున్నారు. అదే సంవత్సరం కరోలిన్ బ్రోసార్డ్‌ను పెళ్లి చేసుకున్నారు. కొంత కాలానికి ఆమె నుంచి దూరమయ్యారు. ఇప్పుడు మూడోసారి త్రినాను పెళ్లాడారు. హరీశ్ సాల్వే 1999 నవంబర్ నుంచి 2002 నవంబర్ వరకూ ఇండియా సొలిసిటర్ జనరల్‌గా పనిచేశారు. టాటా గ్రూప్, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐటీసీ గ్రూప్ వంటి ప్రఖ్యాత సంస్థల కేసులను వాదించారు. భారత ప్రభుత్వం 2015లో హరీశ్ సాల్వేకు 'పద్మ భూషణ్' పురస్కారం ప్రకటించింది. 'ఒకే దేశం –ఒకే ఎన్నిక'పై అధ్యయనం చేయడానికి మాజీ రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ నేతృత్వంలో ఏర్పాటైన కమిటీలో హరీశ్ సాల్వే సభ్యుడిగా ఉన్నారు.

'శివలింగం' వివాదంలో యూపీ మంత్రి

బారాబంకీ: సనాతన ధర్మాన్ని అవమానించారంటూ ఇండియా కూటమిపై గగ్గోలు పెడుతూ బీజేపీ నేతలు కూడా అలాంటి తప్పులే చేస్తున్నారని ప్రతిపక్షాల నేతలు విమర్శిస్తున్నారు. యూపీ మంత్రి ఒకరు శివలింగం వద్ద చేతులు కడుక్కోవడంపై వారు మండిపడుతున్నారు. మంత్రి సతీశ్ శర్మ ఆగస్ట్ 27వ తేదీన లోధేశ్వర్ మహాదేవ్ ఆలయంలో పూజలు చేశారు. ఈ సమయంలో ఆయన శివలింగం మొదట్లో చేతులు కడుక్కున్నారు. ఇందుకు సంబంధించిన వీడియో ఒకటి బయటకు రావడంతో తాజాగా విమర్శలు వెల్లువెత్తాయి. సనాతన ధర్మాన్ని అవమానించిన మంత్రి సతీశ్ శర్మ పదవి నుంచి వైదొలగాలని కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీలు డిమాండ్ చేశాయి. అయితే, తను ఏ తప్పూ చేయలేదని మంత్రి అంటున్నారు.

అమెరికాలో అయ్యో పాపం మన పిల్లలు...

21 ఏళ్లు నిండితే ఇండియాకే!.. ముప్పు జాబితాలో 1.34 లక్షల మంది

న్యూఢిల్లీ: అమెరికాలో ఉంటున్న భారతీయులకు మరో చేదు వార్త. వారి పిల్లల్లో చాలామంది 21 ఏళ్లు నిడగానే దేశం వీడాల్సిన పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. ఆరి హెచ్4 కేటగిరీ వీసాల ప్రాసెసింగ్‌కు దశాబ్దాలకు పైగా వెయిటింగ్ జాబితా ఉండటమే ఇందుకు కారణం. వీరి సంఖ్య లక్షకు పైగా ఉంటుందన్న అంచనాలు మరింత ఆందోళన కలిగిస్తున్నాయి. అమెరికాలో శాశ్వత నివాసానికి వీలు కల్పించే గ్రీన్ కార్డుల కోసం ఉద్యోగాధారిత కేటగిరీ కింద దరఖాస్తు చేసుకుని వెయిటింగ్ లో ఉన్న భారతీయుల సంఖ్య 10.7 లక్షలకు పైగా ఉంది. ఇది చాలదన్నట్టు ఒక్కో దేశం నుంచి ఏటా ప్రాసెస్ చేసే వీసా దరఖాస్తుల సంఖ్యను 7 శాతానికి పరిమితం చేయడం సమస్యను జటిలం చేసింది. ప్రస్తుత వేగంతో మన వాళ్లందరికీ గ్రీన్ కార్డులు రావాలంటే హీన పక్షం 135 ఏళ్లు పడుతుంది. 21 ఏళ్ల కంటే తక్కువ వయసు వారు అమెరికాలో ఉండేందుకు వీలు కల్పించేదే హెచ్4 వీసా. ఈ కారణంగా కనీసం 1.34 లక్షల మంది భారతీయ పిల్లలు 21 ఏళ్లు నిండగానే అమెరికా వీడాల్సి ఉంటుందని డిసైడ్ మెయిర్ అనే ఇమిగ్రేషన్ వ్యవహారాల నిపుణుడు చేసిన అధ్యయనంలో తేలింది. హెచ్ 1బీ కేటగిరీ కింద అమెరికాలో ఉండే విదేశీయుల పిల్లలకు హెచ్4 వీసా ఇస్తారు. 21 ఏళ్లు వచ్చేదాకా అమెరికాలో ఉండేందుకు ఇది వీలు కల్పిస్తుంది. ఆ తర్వాత వాళ్లు హెచ్4 కేటగిరీ కింద అక్కడ ఉండేందుకు వీల్లేదు. వారక్కడే ఉండాలంటే స్టూడెంట్ (ఎఫ్) వీసా సంపాదించాలి. అవి చాల పరిమిత సంఖ్యలో మాత్రమే దొరుకుతాయి. దొరకని వారంతా అమెరికా వీడాల్సి ఉంటుంది. పిల్లలుగా అమెరికా వెళ్లి, అక్కడే పెరిగి పెద్దయిన వారికి ఇలా తల్లిదండ్రులను వదిలి దేశం వీడటం నరకప్రాయమే. పైగా భారత్ లోని తమ కుటుంబాలతో వారికి పెద్ద బంధాలేవీ ఉండే అవకాశం పెద్దగా ఉండదు. కనుక వెనక్కు వచ్చి ఇక్కడ, ఎలా ఉండాలన్నది మరో పెద్ద సమస్య కాగలదు.

ఇండియా కూటమికి తొలి సవాల్

నేటి ఉపపోరులో కొన్ని చోట్ల ఉమ్మడిగా, మరికొన్ని చోట్ల విడివిడిగా..

లక్నో/అగర్తలా: దేశవ్యాప్తంగా ఆరు రాష్ట్రాల్లోని ఏడు అసెంబ్లీ స్థానాలకు మంగళవారం జరగనున్న ఉప ఎన్నికలు ప్రతిపక్ష ఇండియా కూటమికి తొలి పరీక్షగా నిలిచాయి. ఇండియా కూటమి కొన్ని చోట్ల ఉమ్మడిగా పోటీ చేస్తుండగా, మరికొన్ని చోట్ల పరస్పరం పోటీపడుతున్నాయి. యూపీలోని ఘోసి, జార్ఖండ్‌లోని దుమ్రి, త్రిపురలోని ధన్‌పూర్, బొక్సానగర్, ఉత్తరాఖండ్‌లోని బాగేశ్వర్ అసెంబ్లీ నియోజకవర్గాల్లో ప్రతిపక్ష ఇండియా కూటమి ఉమ్మడిగా అభ్యర్థులను బరిలోకి దించింది. పశ్చిమబెంగాల్‌లోని ధుప్‌గురి, కేరళలోని పుత్తుపల్లిల్లో ఇవే కూటమి పార్టీలు పరస్పరం తలపడుతుండటం గమనార్హం. ధుప్‌గురిలో టీఎంసీ, బీజేపీ, కాంగ్రెస్ బలపరిచిన సీపీఎం అభ్యర్థుల మధ్య ముక్కోణపు పోటీ నెలకొంది. ఓట్ల లెక్కింపు ఈ నెల 8న ఉటుంది.

ఇండియా కూటమి హిందూ వ్యతిరేకి

- సనాతన ధర్మ వ్యాఖ్యలపై బీజేపీ మండిపాటు
- అన్ని మతాలను గౌరవిస్తామన్న కాంగ్రెస్



పట్నాలో బీజేపీ కార్యకర్తల నిరసన

న్యూఢిల్లీ: సనాతన ధర్మాన్ని నిర్మూలించాలంటూ తమిళనాడు మంత్రి ఉదయనిధి స్టాలిన్ చేసిన వ్యాఖ్యలు దుమారం రేపుతున్నాయి. దీనిపై బీజేపీ నేతలు, కేంద్రమంత్రులు ప్రతిపక్ష ఇండియా కూటమిపై విరుచుకుపడుతున్నారు. ఇటీవల ముంబైలో జరిగిన ఇండియా కూటమి నేతల సమావేశం హిందూమతమే లక్ష్యంగా జరిగిందని ఆరోపించారు. అయితే, తాము అన్ని మతాలను, ప్రతి ఒక్కరి విశ్వాసాలను గౌరవిస్తామని, అదేసమయంలో ఇతరులకు తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే స్వేచ్ఛ ఉంటుందని కాంగ్రెస్ పేర్కొంది. మనుషుల్ని సమానంగా చూడలేని మతం మతమే కాదని కర్ణాటక మంత్రి, కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే కొడుకు ప్రియాంక్ ఖర్గే పేర్కొన్నారు. అటువంటి మతం రోగంతో సమానమన్నారు. అయితే, కాంగ్రెస్ సీనియర్ నేత కరణ్ సింగ్ మాత్రం ఉదయనిధి వ్యాఖ్యలను ఖండించారు. దేశంలోని కోట్లాదిమంది ఆచరించే సనాతనధర్మంపై ఉదయనిధి చేసిన వ్యాఖ్యలు అసంబద్ధం, అత్యంత దురదృష్టకరమని వ్యాఖ్యానించారు. బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన రాజకీయ నేత ఇలాంటి వ్యాఖ్యలు చేయరాదని కరణ్ సింగ్ అన్నారు.

క్షమాపణ చెప్పాలి

ఉదయనిధి వ్యాఖ్యలపై ఇండియా కూటమి నేతలు సోనియాగాంధీ, రాహుల్, అశోక్ గెహ్లాట్ తదితరులు మౌనంగా ఎందుకున్నారని బీజేపీ ప్రశ్నించింది. ఆ కూటమి హిందూ మతానికి వ్యతిరేకమని ఆరోపించింది. కేంద్రమంత్రులు రాజ్‌నాథ్ సింగ్, ప్రహ్లాద్ జోషి,అనురాగ్ ఠాకూర్ ఉదయనిధి వ్యాఖ్యలను ఖండించారు. ఇండియా కూటమి నేతలు క్షమాపణ చెప్పకుంటే దేశం వారిని క్షమించబోదన్నారు హిందువుల మనోభావాలు దెబ్బతీశారంటూ ఉదయనిధిపై ముజఫర్‌పూర్‌కు చెందిన లాయర్ సుధీర్ కుమార్ ఓఝా కోర్టులో పిటిషన్ వేశారు.



గిన్నిస్‌బుక్‌లో చోటు సంపాదించిన ప్రపంచంలోనే అతి పెద్ద స్ట్రింగ్ చీజ్ బంతి ఇది. దీని బరువు ఏకంగా 558 కేజీలు. దీని తయారీకి 6,000 లీటర్ల పాలను వినియోగించారు. దక్షిణ మెక్సికోలోని చియాపాస్ రాష్ట్రంలో దీనిని తయారుచేశారు.

సరిహద్దుల్లో భారీ సైనిక విన్యాసాలు

న్యూఢిల్లీ: చైనా, పాకిస్తాన్‌తో సరిహద్దుల్లో భారత వైమానిక దళం(ఐఏఎఫ్) త్రిశూల్ పేరిట భారీ సైనిక విన్యాసాలకు శ్రీకారం చుట్టింది. ఈ నెల 4 నుంచి 14వ తేదీ వరకు ఇవి కొనసాగనున్నాయి. త్రిశూల్‌లో భాగంగా రఫేల్ వంటి యుద్ధ విమానాలను, ఎస్–400, ఎంఆర్‌సామ్, స్పైడర్ వంటి గగనతల రక్షణ వ్యవస్థలను ఎయిర్‌ఫోర్స్ రంగంలోకి దించనుంది. దీంతోపాటు, లద్దాఖ్‌లో ఆర్మీ విభాగాలు వేరుగా విన్యాసాలు చేపడతాయి. దేశ ఉత్తర సరిహద్దులతోపాటు ఢిల్లీలో, ఢిల్లీ వెలుపల ఐఏఎఫ్ పలు రక్షణ వ్యవస్థలను మోహరించనుంది. జీ20 సదస్సుకు సమగ్ర గగనతల రక్షణను కల్పించడమే త్రిశూల్ ఉద్దేశమని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. అదేవిధంగా, లద్దాఖ్‌లో ఆర్మీ విభాగాలు ప్రత్యేక విన్యాసాలు నిర్వహిస్తాయి. పారా ట్రూపర్లు, పర్వత ప్రాంత యుద్ధ విద్యలో ఆరితేరిన విభాగాలు సైతం ఇందులో పాల్గొంటాయి. త్వరలో జరిగే జీ20 శిఖరాగ్రానికి 20 మందికి పైగా ప్రపంచ దేశాల నేతలు రానున్న దృష్ట్యా దేశ రాజధాని ఢిల్లీలో అత్యంత పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు జరుగుతున్న వేళ ఈ విన్యాసాలు జరుగుతుండటం గమనార్హం.

సాక్షి హైదరాబాద్

మంగళవారం । 5 । సెప్టెంబర్ । 2023



సెల్‌ఫోన్ చోరుల ముఠా అరెస్టు

దృష్టి మరల్చి సెల్‌ఫోన్ల చోరీకు పాల్పడుతున్న ముఠా గుట్టు రట్టు చేశారు బోయిన్‌పల్లి పోలీసులు. ఇద్దరు దొంగలతో పాటు, వాటిని కొను గోలు చేస్తున్న ఇద్దర్ని సైతం అరెస్ట్ చేశారు. -8లో



లారీ ఢీ కొని విద్యార్థిని దుర్మరణం

ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీ కొనడంతో శివాని గౌడ్(19) అనే విద్యార్థిని అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. -8లో

81 మందికి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులు

సాక్షి, సిటీబ్యూరో: హైదరాబాద్ జిల్లాలో 81 మంది ఉపాధ్యాయులు జిల్లా స్థాయి ఉత్తమ టీచర్లుగా ఎంపికయ్యారు. ప్రభుత్వ పాఠశాలలకు చెందిన 77 మంది, ఎయిడెడ్, అన్ ఎయిడెడ్ పాఠశాలలకు చెందిన ఇద్దరు చొప్పున టీచర్లు ఉత్తమ అవార్డుకు ఎంపికయ్యారు. మరో ముగ్గురు రాష్ట్రస్థాయి ఉత్తమ టీచర్లుగా ఎంపికయ్యారు. గురుపూజోత్సవం సందర్భంగా మంగళవారం అవార్డులను అందజేస్తారు.

న్యూస్‌రీల్

ఔటర్‌పై ఒకదాని వెనుక ఒకటి ఆరు కార్లు ఢీ



మణికొండ: ఓ వైపు వర్షం..కమ్ముకున్న కారు మబ్బులు..ముందు వెళ్తున్న కార్లు సరిగా కనిపించకపోవటం..రహదారులపై నిలిచిన వరద నీటి కారణంగా..ఔటర్ రింగ్ రోడ్డుపై వెళ్తున్న ఆరు కార్లు వెనక నుంచి ఒకదానికొకటి ఢీ కొన్నాయి. ఈ సంఘటన నార్సింగి పోలీస్ స్టేషన్‌కు సమీపంలో సోమవారం జరిగింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సోమవారం మధ్యాహ్నం వర్షం పడుతున్న సమయంలో గచ్చిబౌలి నుంచి శంషాబాద్ వైపు వెళ్తుండగా..నార్సింగి కాకతీయ స్థూపం సమీపంలో రోడ్డుపై నీరు నిలిచి ఉండటంతో ముందుగా వెళ్తున్న ఓ కారు డ్రైవర్ అకస్మాత్తుగా వేగం తగ్గించాడు. దాంతో దాని వెనక వస్తున్న కారు దాన్ని ఢీ కొట్టింది. అదే తరహాల్లో మరో నాలుగు కార్లు వచ్చి ఢీ కొట్టాయి. కార్లలో ఉన్న వారికి ఎవరికీ గాయాలు కాకపోవటంతో వారంతా ఇతర వాహనాల్లో వెళ్లిపోయారు. ప్రమాదానికి గురైన కార్లలో రాష్ట్ర మినిమం వేజెస్ అడ్వయిజరీ బోర్డు చైర్మన్‌కు చెందిన ఇన్నోవా కారు కూడా ఉంది. విషయం తెలుసుకున్న ఔటర్ రింగ్ రోడ్డు సిబ్బంది వాటిని వెంటనే అక్కడి నుంచి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నార్సింగి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

నిమ్స్ వైద్యులకు పదోన్నతులు

లక్డీకాపూల్: నిజాం వైద్య విజ్ఞాన సంస్థ (నిమ్స్) వైద్యులకు సీనియర్ ప్రొఫెసర్లుగా యాజమాన్యం పదోన్నతి కల్పించింది. గత కొన్నేళ్లుగా పెండింగ్‌లో ఉన్న పదోన్నతుల అంశానికి ఎట్టకేలకు మోక్షం కల్పించడంతో 15 మంది ప్రొఫెసర్లకు ప్రయోజనం కలిగింది. దీంతో నిమ్స్ సంచాలకులు ప్రొఫెసర్ నగరి బీరప్ప, మెడికల్ సూపరింటెండెంట్ ప్రొఫెసర్ నిమ్మ సత్యనారాయణతో పాటు కార్డియాలజీ వైద్య నిపుణులు డాక్టర్ ఒ.సాయి సతీష్, జనరల్ మెడిసిన్ వైద్యులు వై.సత్యనారాయణ రాజు తదితరులకు సీనియర్ ప్రొఫెసర్లుగా పదోన్నతులు లభించాయి.



ఎల్బీనగర్‌లో వర్షం దృశ్యం



కేపీహెచ్‌బీలో ట్రాఫిక్ జామ్

వాన..హైరానా

లోతట్టు ప్రాంతాల్లో నిలుస్తున్న నీళ్లు

- పూర్తి కాని ఎస్ఎన్‌డీపీ పనులు
- ప్రజలకు తప్పని పాట్లు

సాక్షి, సిటీబ్యూరో: గ్రేటర్ నగరంలో వానొస్తే చాలు అనేక ప్రాంతాల ప్రజల గుండెలు జల్లుమంటున్నాయి. సాధారణ వర్షం కురిసినా లోతట్టుప్రాంతాలు, పలు బస్తీలు జలమయం కావడమే ఇందుకు కారణం. ఆది, సోమవారాల్లో కురిసిన వర్షాలకు సైతం పలు ప్రాంతాల్లో నీటినిల్వలు చేరాయి. రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. పాతబస్తీ, ముషీరాబాద్, సికింద్రాబాద్ వంటి ప్రాంతాల్లోనే కాకుండా ఖైరతాబాద్, బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, నార్సింగి వంటి ప్రాంతాల్లోనూ పలు ప్రాంతాల్లో రోడ్లపై నీరు చేరి వాహనాల రాకపోకలకు ఇబ్బందులేర్పడ్డాయి. లోతట్టు బస్తీల్లో, హుస్సేన్‌సాగర్ పరిసర ప్రాంతాల్లో నీరు చేరడంతో ప్రజలు ఆందోళనకు గురయ్యారు. సరూర్‌నగర్ చెరువు పరిసరాల్లోని పలు కాలనీలతోపాటు బీఎన్‌రెడ్డినగర్, లింగోజిగూడ, మన్సూరాబాద్ తదితర ప్రాంతాల్లో ని కాలనీ రోడ్లు నీట మునిగి ప్రజలు ఇబ్బందులు పడ్డారు. చందానగర్, మియాపూర్, కూకట్‌పల్లి, నిజాంపేట తదితర ప్రాంతాల్లోనూ వర్షం ఇబ్బంది లు తప్పలేదు. ప్రధాన రహదారులపై నీటిని డీఆర్‌ఎఫ్, జీహెచ్ఎంసీ ఎంఈటీ బృందాలు తోడి పోస్తున్నప్పటికీ పరిస్థితులు అధ్వాన్నంగా మారాయి.

పూర్తికాని పనులు

నీటి సమస్యల పరిష్కారానికి రూ.985 కోట్లతో చేపట్టిన ఎస్ఎన్‌డీపీ పనులు పూర్తికాలేదు. దాంతో వర్ష సమస్యలు సమసిపోలేదు. భూసేకరణ సమస్యలు, డిజైన్ల మార్పు వంటి వాటితో కొన్ని ప్రాంతాల్లో జాప్యం జరుగుతోంది.

నాలా సేఫ్టీ అంతంతమాత్రమే..

నాలా సేఫ్టీ పై తొలుత ఎంతో శ్రద్ధ చూపిన అధికారులు ప్రస్తుతం దాన్ని పెద్దగా పట్టించుకోవడం లేదు. నాలాలకు కొన్ని ప్రాంతాల్లో రక్షణగోడలు లేవు. రోడ్ల వెంబడే కాక ప్రధాన రహదారుల్లోనూ మ్యాన్‌హోళ్లు ప్రమాదకరంగా ఉన్నాయి. పెద్ద ప్రమాదాలు జరిగినప్పుడు మాత్రం హడావుడి చేస్తున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

39 ఫిర్యాదులు

ఆదివారం సాయంత్రం నుంచి సోమవారం సాయంత్రం వరకు 24 గంటల్లో ఈవీడీఎం డీఆర్‌ఎఫ్‌కు 39 ఫిర్యాదులందాయి. వీటిల్లో చెట్లు కూలినవి 15, నీటినిల్వలవి 21 ఫిర్యాదులున్నాయి.

3 రోజుల పాటు ఆరెంజ్ అలర్ట్

హైదరాబాద్ మహానగరంలో సోమవారం కొన్ని ప్రాంతాల్లో కుండపోత వాన కురిసింది. కొన్ని ప్రాంతాల్లో రోజంతా జల్లులు కురిశాయి. మొత్తంమీద నగరంలో సరాసరిన 5 సెంటీమీటర్లకు పైనే వర్షపాతం నమోదైంది. ఇక భారీ వర్షాల నేపథ్యంలో హైదరాబాద్‌కు మూడు రోజుల పాటు వాతావరణ శాఖ ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. రాబోయే మూడు రోజుల్లోనూ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. ఇక యథావిధిగా సోమవారం కూడా నగరవాసులు వాన కష్టాలు ఎదుర్కొన్నారు. లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. రోడ్లపై భారీగా వరద నీరి చేరి గంటలపాటు ట్రాఫిక్ స్తంభించింది. కూకట్‌పల్లి నుంచి అమీర్‌పేట, ఖైరతాబాద్ మీదుగా కోఠి వెళ్లే రోడ్‌లలో వాహనాలు భారీగా నిలిచిపోయాయి. అమీర్‌పేట నుంచి మాదాపూర్ వెళ్లే మార్గంతో పాటు పంజగుట్ట నుంచి కొండాపూర్ రోడ్డు, సికింద్రాబాద్ నుంచి జూబ్లీహిల్స్ మాదాపూర్ మీదుగా హైటెక్ సిటీ వెళ్లే రోడ్డు మొత్తం స్తంభించింది.

మియాపూర్‌లో అత్యధికంగా

నగరంలో అత్యధికంగా మియాపూర్‌లో 5.2 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది, రాత్రి ఎనిమిది గంటల వరకు బీహెచ్ఈఎల్‌లో 3.9, హైదర్‌గూడలో 3.8, చందానగర్, లింగంపల్లి 3.7, గచ్చిబౌలిలో 3.5, రామచంద్రాపురం, మాదాపూర్, జూబ్లీహిల్స్ తదితర ప్రాంతాల్లో సగటున 3 సెంటీమీటర్ల వర్షం కురిసింది. ఆదివారం తెల్లవారు జామున 8.8 సెం.మీ వర్షపాతం నమోదు కాగా, సోమవారం ఐదు సెంటీమీటర్లు దాటింది.

హుస్సేన్‌సాగర్ నాలాలో మహిళ గల్లంతు?



లక్ష్మి(ఫైల్)


ముషీరాబాద్: కవాడిగూడ డివిజన్ పరిధిలోని దామోదర సంజీవయ్య బస్తీలో లక్ష్మి (55) అనే మహిళ ఆదివారం మధ్యాహ్నం నుంచి కనిపించకుండా పోవడంతో ఇంటి దగ్గరే ఉన్న నాలాలో పడిందేమోననే అనుమానాలు వ్యక్తమయ్యాయి. ఆదివారం రాత్రి నుంచి గాంధీనగర్ పోలీసులు, జీహెచ్ఎంసీ, డిజాస్టర్ సిబ్బంది నాలాలో వెతికినా ఆమె ఆచూకీ మాత్రం లభించలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు. గాంధీనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని దామోదర సంజీవయ్యనగర్‌లో నివాసం ఉండే లక్ష్మి ముగ్గురు కుమార్తెలకు వివాహాలు కాగా.. భర్త గతంలోనే చనిపోయాడు. దీంతో ఆమె ఇంట్లో ఒంటరిగా ఉంటోంది. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వారి ఇంటి గోడ కూలిపోవడంతో ప్రమాదభరితంగా మారింది. హుస్సేన్‌సాగర్ నాలాకు రిటర్నింగ్ వాల్ పూర్తయితే తమ ఇంటికి టాయిలెట్ నిర్మించుకోవాలని అనుకున్నామని ఆమె కూతుళ్లు కన్నీటి పర్యంతరం అయ్యారు. మొహం కడుక్కోవడానికి ప్రయత్నించిన లక్ష్మి ప్రమాదవశాత్తు హుస్సేన్‌సాగర్ నాలాలో పడిపోయి ఉండవచ్చని కుటుంబ సభ్యులు భావిస్తున్నారు. మధ్యాహ్నం 2 గంటలకు లక్ష్మి కూతురు సుజాత తన తల్లి దగ్గరికి రాగా..ఆమె కనిపించకపోవడంతో ఆందోళన చెంది పరిసర ప్రాంతాలు, బంధువుల ఇళ్లలో గాలించారు. ఆచూకీ లభించకపోవడంతో గాంధీనగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో మిస్సింగ్ కేసుగా నమోదు చేసుకొని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. కాగా జీహెచ్ఎంసీ డీఆర్‌ఎఫ్ బృందాలు నాలాల్లో ముమ్మర గాలింపు చర్యలు చేపట్టాయి. వందమంది సిబ్బంది నాలుగు బృందాలుగా నాలాల్లో గాలింపు చర్యలు చేపట్టారు. ఆచూకీ కోసం డ్రోన్లనూ వినియోగించారు. సోమవారం కవాడిగూడ నుంచి గోల్నాక వరకు దాదాపు 10 కి.మీ.ల మేర గాలింపు జరిపినట్లు ఈవీడీఎం డైరెక్టర్ ప్రకాశ్‌రెడ్డి తెలిపారు. ఆమె ఆచూకీ తెలియకపోవడంతో మంగళవారం కూడా గాలింపు చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు.



లక్ష్మి ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపడుతున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

ఖాజాగూడ గుట్టలు ఖల్లాస్

ఆగని ఆక్రమణలు.. మొద్దు నిద్రలో అధికారులు



- దశాబ్దాలుగా రెవెన్యూ, హెచ్ఎండీఏల నిర్లక్ష్యం
- ఇప్పటి వరకు కదలికలేని సర్వే పనులు, ఫెన్సింగ్ ఏర్పాట్లు
- ఖాజాగూడ రాక్స్ పరిరక్షణ కోసం ఏళ్లుగా పోరాడుతున్న సేవ్‌రాక్స్ సొసైటీ
- వారసత్వ సంపదగా పరిరక్షించాలని డిమాండ్

సాక్షి, సిటీబ్యూరో: ఒకవైపు ఐటీ కారిడార్లు, మరో వైపు ఔటర్‌రింగ్ రోడ్డుకు చేరువలో విస్తరించి ఉన్న ఖాజాగూడ గుట్టలకు రక్షణ కరువైంది. ఏళ్లతరబడి ఆక్రమణల పర్వం కొనసాగుతోంది. రియల్‌ఎస్టేట్ బకాసురులు వేల ఏళ్ల చరిత్ర కలిగిన ఖాజాగూడ గుట్టలను ధ్వంసం చేసి ఆక్రమణలకు పాల్పడుతున్నప్పటికీ రెవెన్యూ శాఖ, హెచ్ఎండీఏలు ప్రేక్షక పాత్ర వహిస్తున్నాయి. ఒకప్పుడు 200 ఎకరాల వరకు ఖాజాగూడ రాక్స్ విస్తరించి ఉండగా..ఆక్రమణల కారణంగా ప్రస్తుతం వంద ఎకరాలకు పరిమితమైనట్లు హైదరాబాద్ సేవ్‌రాక్స్ సొసైటీ ఆందోళన వ్యక్తం చేసింది. అక్కడి గుట్టలను ఆనుకొని ప్రైవేట్ స్థలాలు ఉన్నట్లు చూపుతూ కొందరు వ్యక్తులు రాళ్లను పగులగొట్టి కబ్జాలకు పాల్పడుతున్నారు. ఈ క్రమంలో ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాలపైన సమగ్రమైన సర్వే నిర్వహించి సర్కార్ భూములు, గుట్టల చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయవలసి ఉండగా రెవిన్యూ అధికారులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు. మరోవైపు సుమారు 2500 ఏళ్ల నాటి ఈ గుట్టలను వారసత్వ సంపదగా ప్రకటించి రక్షించాలని సేవ్‌రాక్స్ సొసైటీ అనేకమార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. కానీ ఇప్పటి వరకు హెచ్ఎండీఏ ఆ దిశగా ఎలాంటి చర్యలు చేపట్టలేదు. దీంతో హైదరాబాద్ మహానగరానికి పడమటి వైపున వేల ఏళ్ల చరిత్రకు సాక్ష్యంగా ఉన్న ఈ గుట్టలు నిలువునా కరిగిపోతున్నాయి. క్రమంగా విధ్వంసమవుతున్నాయి. దీంతో పాటు నగరంలోని అనేక చోట్ల ఇదే పరిస్థితి నెలకొందని సేవ్‌రాక్స్ సొసైటీ ప్రతినిధి అమర్‌దీప్‌సింగ్ విస్మయం వ్యక్తం చేశారు.

చారిత్రక సంపదకు చెద...

అప్పటి గోల్కొండ కోట చుట్టూ విస్తరించి ఉన్న మహారణ్యంలో అనేక చోట్ల వందల ఎకరాల్లో కొండలు, గుట్టలు, గుహలు ఉండేవి. కాలినడకన వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగించే అప్పటి ప్రజలు ఈ గుట్టల వద్ద సేదతీరేవారు. గుహల్లో విశ్రాంతి తీసుకొనేవారు. నగరం విస్తరిస్తున్న కొద్దీ సహజమైన వనరులు కనుమరుగయ్యాయి. ఇంచుమించు 1951 వరకు కూడా మెహర్‌బాబా ఖాజాగూడ గుహల్లో ఉండేవాడని చరిత్ర చెబుతోంది. ప్రస్తుతం అక్కడ మెహర్‌బాబా దర్గా కూడా ఉంది. ఇటు లాంకోహిల్స్ నుంచి అటు ఖాజాగూడ చెరువు వరకు సుమారు 200 ఎకరాల వరకు ఉంటే ఇప్పుడు ఆక్రమణల ఫలితంగా 50 శాతం గుట్టలు మాయమయ్యాయి. 'ఈ గుట్టలకు స్థానికుల వల్ల ఎలాంటి ఇబ్బంది లేదు. కానీ బయటి నుంచి వచ్చిన వారే ఆక్రమిస్తున్నారు. ఎలాంటి సర్వే నెంబర్లు లేకపోయినా ఆ భూములు తమవేనని కబ్జాలకు పాల్పడుతున్నారు. పోలీసులను ఆశ్రయిస్తున్నారు. నిజానికి ఇది రెవెన్యూశాఖకు సంబంధించిన అంశం.' అని అమర్‌దీప్ చెప్పారు. ఖాజాగూడ గుట్టలను కాపాడాలని కోరుతూ సేవ్‌రాక్స్ సొసైటీ 2015 నుంచి పోరాడుతూనే ఉంది. ఆ సంస్థ ఆధ్వర్యంలో 2019లో హైకోర్టులో స్పెషల్ లీవ్ పిటీషన్ దాఖలు చేశారు. దీంతో హైకోర్టు స్టే కూడా విధించింది. అయినా ప్రభుత్వం ఆ గుట్టలను కాపాడేందుకు ఎలాంటి చర్యలు చేపట్టడం లేదని ఆయన విస్మయం వ్యక్తం చేశారు.

ఎంతో విలువైన సంపద...

ఖాజాగూడ రాక్స్‌ను ఫక్రుద్దీన్ గుట్టలు అని కూడా పిలుస్తారు. ఇక్కడ ఉన్నవన్నీ గ్రానైట్ రాళ్లు. ఎంతో విలువైనవి. మైనింగ్‌శాఖ కూడా ఈ గుట్టల రక్షణ కోసం దృష్టి సారించవలసి ఉంటుంది. కాగా వీటి పరిరక్షణ కోసం కృషి చేస్తున్న సేవ్‌రాక్స్ సొసైటీ ప్రతి సంవత్సరం నవంబర్, డిసెంబర్ నెలల్లో రాకథాన్ నిర్వహిస్తుంది. విద్యార్థులు, ఉపాధ్యాయులు, సామాజిక కార్యకర్తలు, సంస్థలను ఇందులో భాగస్వాములను చేస్తోంది. సహజవనరుల పరిరక్షణపైన వివిధ రకాల పోటీలను, అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తోంది. ఖాజాగూడతో పాటు జీహెచ్ఎంసీ పరిధిలో మరో 19 చోట్ల కొండలు, గుట్టలు ఉన్నాయి. ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల చాలా చోట్ల రక్షణ కరువైందని సామాజిక కార్యకర్తలు పేర్కొంటున్నారు.

రక్షణ చర్యలు చేపట్టండి



ఫక్రుద్దీన్ గుట్టలను రక్షించేందుకు చర్యలు తీసుకోవాలి. ఇప్పటికైనా సర్వే నిర్వహించి ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి. ఆక్రమణలను అరికట్టేందుకు హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలి.

– అమర్‌దీప్‌సింగ్, హైదరాబాద్ సేవ్‌రాక్స్ సొసైటీ

స్వచ్ఛ ఓటరు జాబితాకు సహకరించండి

- రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్‌రాస్



సాక్షి, సిటీబ్యూరో: స్వచ్ఛమైన ఓటరు జాబితా తయారీకి తగిన సహకారం అందించాల్సిందిగా హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ రాజకీయపార్టీ ప్రతినిధులను కోరారు. ఓటరు జాబితాలో తప్పుల సవరణపై జాతీయ, రాష్ట్ర స్థాయి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, రిటర్నింగ్ అధికారులు, జీహెచ్ఎంసీ ఎన్నికల నోడల్ అధికారులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ, ఆయా పార్టీల ప్రతినిధుల నుంచి అందిన అభ్యంతరాలను పరిశీలించి వారికి లిఖిత పూర్వకంగా సమాధానమివ్వాల్సిందిగా ఆర్ఓలు, ఈఆర్ఓలను ఆదేశించారు. ప్రత్యేక ఓటరు క్యాంపెయిన్‌లో విధులు సక్రమంగా నిర్వహించని బీఎల్ఓలపై తగిన చర్యలు తీసుకుంటామన్నారు. బీఎల్ఓ యాప్ ద్వారా వారి పనితీరును పరిశీలిస్తామన్నారు. హైదరాబాద్ జిల్లాలో పొరపాట్ల సవరణలకు సంబంధించి దాదాపు 4.61 లక్షల ఓటర్ల నుంచి ఫారం– 8 దరఖాస్తులు సేకరించాల్సి ఉండగా, ఇంకా 41,269 మంది నుంచి కలెక్ట్ చేయాల్సి ఉందని, అందుకు పూర్తి సహకారం అందించాల్సిందిగా రాజకీయపార్టీల ప్రతినిధులను కోరారు.

ప్రతి బుధవారం సమావేశం..

నియోజకవర్గ స్థాయిలో ప్రతి బుధవారం అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం జరుగుతుందని రోనాల్డ్ రాస్ చెప్పారు. మరో రెండు రోజులు ప్రత్యేక క్యాంపెయిన్‌కు ఏర్పాట్లు చేయాల్సిందిగా అన్ని పార్టీల ప్రతినిధులు కోరగా, సీఈఓ అనుమతితో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. ఓటరు అవగాహనకు జీహెచ్ఎంసీ పరిధిలోని 10 లక్షల మంది ఆస్తిపన్ను దారులకు ఎస్ఎంఎస్‌లు పంపినట్లు తెలిపారు. ఇంకా, నగరంలోని ప్రధాన కూడళ్లు, బస్టాండ్లు, రైల్వేస్టేషన్లలో ఆడియో ద్వారా ప్రచారంతో పాటు స్వచ్ఛ ఆటో టిప్పర్ల ద్వారా పెద్ద ఎత్తున ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో అడిషనల్ కమిషనర్ శంకరయ్య, జోనల్ కమిషనర్లు వెంకటేష్ దోత్రే, వెంకన్న, రిటర్నింగ్ అధికారులు, నోడల్ అధికారులు, కార్వాన్ శాసనసభ్యులు కౌసర్ మొయినుద్దీన్(ఎంఐఎం) పాల్గొన్నారు. బీఎస్పీ ప్రతినిధులు సునీల్, నందీష్ కుమార్, బీజేపీ ప్రతినిధులు పొన్న వెంకటరమణ, అజయ్‌కుమార్, కె.పవన్ కుమార్, ఆమ్ ఆద్మీ పార్టీ ప్రతినిధులు డి.సుధాకర్, ఠాకూర్ రాకేష్, సీపీఎం ప్రతినిధి ఎం.శ్రీనివాసరావు, కాంగ్రెస్ ప్రతినిధులు నిరంజన్, రాజేష్ కుమార్, బీఆర్ఎస్ ప్రతినిధులు డి.కొండారెడ్డి, ఎ.కార్తీక్ రెడ్డి పాల్గొన్నారు.

'జామ్' జాటంలోనూ నెం.1

బంజారాహిల్స్ రోడ్ నెం.1లో ట్రాఫిక్ కష్టాలు

- రద్దీ వేళల్లో ఈ రూట్ దాటడానికి కనీసం 45 నిమిషాలు
- బాటిల్ నెక్స్‌తో పాటు కొన్ని వ్యాపార సంస్థలూ కారణం
- పట్టనట్లు వ్యవహరిస్తున్న ట్రాఫిక్ విభాగం అధికారులు

సాక్షి, సిటీబ్యూరో: నగరంలోని అత్యంత కీలకమైన రహదారుల్లో బంజారాహిల్స్ రోడ్ నెం.1 ఒకటి. దీని మీదుగా అనునిత్యం ప్రముఖులు కూడా ప్రయాణిస్తుంటారు. అయితే ఈ మార్గంలో రద్దీ వేళల్లో ట్రాఫిక్ వాహనచోదకులకు నరకం చూపిస్తోంది. డ్రైవర్ల సహనానికి పరీక్ష పెడుతోంది. సదరు రూట్‌లో ఉన్న బాటిల్ నెక్స్‌తో పాటు కొన్ని వ్యాపార సంస్థల కారణంగానూ ఈ పరిస్థితులు తలెత్తుతున్నాయి. ఏళ్లుగా ఇదే దుస్థితి ఉన్నా ట్రాఫిక్ విభాగం అధికారులు మాత్రం పట్టించుకోవట్లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి.

ఆ రెంటి మధ్యా 2.9 కిలోమీటర్లు...

పంజగుట్టలోని నాగార్జున సర్కిల్ నుంచి పెన్షన్ ఆఫీస్ మీదుగా మాసబ్ ట్యాంక్ చౌరస్తా వరకు 2.9 కిలోమీటర్ల పరిధిలో రోడ్ నెం.1 ఉంటుంది. నిరంకారి–పంజగుట్ట మధ్య ఉన్న మార్గానికి ఇది సమాంతరంగా ఉంటుంది. రోడ్ నెం.1 మీదుగా అనునిత్యం ప్రముఖులు, ఉన్నతాధికారులతో పాటు ఉద్యోగులు, సామాన్యులు సైతం ప్రయాణిస్తుంటారు. ఈ కారణంగానే రోడ్డు రోజూ రద్దీగానే ఉంటుంది. వెస్ట్‌జోన్ పరిధిలో ఉన్న అనేక కీలక ఆస్పత్రులకు వెళ్లి వచ్చే అంబులెన్సులతో హడావుడి కూడా ఎక్కువే. ప్రముఖ హోటళ్లు, రెస్టారెంట్లు కూడా ఈ రోడ్డులో ఉన్నాయి. బంజారాహిల్స్ రోడ్ నెం.1 మీదనే తాజ్ కృష్ణ, 1/10, 1/12 వంటి కీలక జంక్షన్లతో పాటు పోలీసు ఆఫీసర్స్ మెస్ 'టి' జంక్షన్ కూడా నిత్యం హడావుడిగానే ఉంటుంది.

రద్దీ వేళల్లో 45 నిమిషాల వరకు...

వెస్ట్‌జోన్ పరిధిలోని కొన్ని ప్రాంతాల నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి వెళ్ళే ప్రయాణికులు సైతం రోడ్ నెం.1నే ఆశ్రయిస్తారు. మాసబ్‌ట్యాంక్ మీదుగా మెహదీపట్నం వరకు వెళ్ళి అక్కడే పీవీ నర్సింహారావు ఎక్స్‌ప్రెస్ వే ఎక్కుతారు. దీంతో విదేశీయుల కోణంలోనూ ఈ రూట్ కీలకమే. ఈ రహదారిలో ఉన్న జంక్షన్లలో కొన్ని ఇరుకుగా ఉంటాయి. దీనికి తోడు కేర్ ఆస్పత్రికి సమీపంలో, 1/12 జంక్షన్ దాటిన తర్వాత రోడ్డు బాటిల్ నెక్‌గా మారుతుంది. వీటితో పాటు ఈ రహదారిలో ఉన్న రెండు ప్రముఖ బేకరీ కమ్ రెస్టారెంట్లకు వచ్చిపోయే వాహనాలు, ఓ మద్యం దుకాణం వద్ద ఆగే కొనుగోలుదారుల వెహికిల్స్‌తో తీవ్ర ట్రాఫిక్ జామ్స్ ఏర్పడుతున్నాయి. ఈ కారణాలతో రద్దీ వేళల్లో ఒక్కోసారి ఈ రూట్ దాటడానికి 45 నిమిషాల వరకు పడుతోంది. అంబులెన్సుల సైరన్ వినిపిస్తున్నా ఏమీ చేయలేని పరిస్థితి ఉంటోంది.

వర్షం కురిస్తే మరీ ఘోరం...

సాధారణ రోజుల్లో పీక్ అవర్స్‌గా పిలిచే ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే ట్రాఫిక్ ఇబ్బందులు ఉంటాయి. ఇక వర్షం కురిసిన రోజుల్లో సమయాలతో సంబంధం లేకుండా రోడ్డు మొత్తం జామ్ అయిపోతుంది. ఏళ్లుగా ఇదే పరిస్థితి ఉన్నప్పటికీ అటు జీహెచ్ఎంసీ, ఇటు పోలీసు విభాగాలు సరైన చర్యలు తీసుకోవట్లేదు. గవర్నర్, ముఖ్యమంత్రి, హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి వంటి అత్యంత ప్రముఖుల కదలికలు ఉంటే మాత్రమే ట్రాఫిక్ పోలీసుల హడావుడి కనిపిస్తుంది. సాధారణ రోజుల్లో ఈ అధికారులు తీసుకునే చర్యలు నామమాత్రమే. ఆయా వ్యాపార సంస్థల వద్ద రోడ్డుపై వాహనాలు ఆగినా, క్యారేజ్ వేల్లో రాంగ్ పార్కింగ్ చేసినా ఎవరూ పట్టించుకోవట్లేదు. దీని ప్రభావం బంజారాహిల్స్ రోడ్.నెం.1 మొత్తమ్మీద ఉంటోంది. ఇకనైనా అధికారులు స్పందించి తమ ఇబ్బందులు తీర్చాలని వాహనచోదకులు కోరుతున్నారు. ట్రాఫిక్ పోలీసులు సైతం ఈ రూట్‌లో గస్తీ వాహనాలు మోహరించాలని సూచిస్తున్నారు.



బంజారాహిల్స్ రోడ్ నెం.1లో బారులు తీరిన వాహనాలు

యువతిని రహస్యంగా వీడియో తీసిన యువకులకు జైలు

హిమాయత్‌నగర్: వివిధ నేరాలకు పాల్పడుతూ ఇతరులకు ఇబ్బందులు కలిగిస్తున్న ఆరుగురు యువకులకు న్యాయస్థానం జైలు శిక్ష విధించినట్లు సెక్రెటరియేట్(లేక్) పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ దెబోరా తెలిపారు. అబ్దుల్ ఫరాజ్, మహ్మద్ అర్బాజ్, మీర్జా అలీ నెక్లెస్ రోడ్డులో ఆదివారం ఉదయం సైక్లింగ్ చేస్తున్న ఓ యువతిని రహస్యంగా వీడియో తీశారు. దీనిని గమనించిన సదరు యువతి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ముగ్గురు యువకులను అరెస్ట్ చేసిన పోలీసులు న్యాయస్థానం ఎదుట హాజరు పరచగా వారికి ఎనిమిది రోజులు చొప్పున జైలు శిక్ష విధిస్తూ తీర్పు చెప్పింది. మహ్మద్ వాజీద్, మహ్మద్ తాజుద్దీన్, ఎండీ యూసఫ్ అనే యువకులు నెక్లెస్ రోడ్డులో పత్తాలు ఆడుతున్నట్లు సమాచారం అందడంతో దాడులు నిర్వహించిన పోలీసులు వారిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నేరాన్ని అంగీకరించకుండా పోలీసులకు వాగ్వాదానికి దిగడంతో నిందితులపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. వారికి మూడు రోజుల చొప్పున న్యాయస్థానం జైలు శిక్ష విధించినట్లు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు.

సెల్‌ఫోన్ చోరుల ముఠా అరెస్టు


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ రామలింగ రాజు

19 సెల్‌ఫోన్‌లు, ఆటో స్వాధీనం

కంటోన్మెంట్: దృష్టి మరల్చి సెల్‌ఫోన్‌ల చోరీకు పాల్పడుతున్న ముఠా గుట్టు రట్టు చేశారు బోయిన్‌పల్లి పోలీసులు. ఇద్దరు దొంగలతో పాటు, వాటిని కొనుగోలు చేస్తున్న ఇద్దరు రిసీవర్లను సైతం అరెస్ట్ చేశారు. వారి నుంచి 19 సెల్‌ఫోన్‌లతో పాటు ఆటోను స్వాధీనం చేసుకున్నారు. బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బేగంపేట ఏసీపీ రామలింగరాజు సోమవారం వివరాలు వెల్లడించారు. ఎర్రగడ్డకు చెందిన దేవేంద్ర కుమార్ శర్మ గత నెల 31న బోయిన్‌పల్లి చౌరస్తా నుంచి సుచిత్ర సర్కిల్‌కు ఆటోలో వెళుతుండగా ఆటోలో అతడితోపాటు ప్రయాణిస్తున్న మరో వ్యక్తి అతని సెల్‌ఫోన్ లాక్కుని పరారయ్యాడు. బాధితుడు బోయిన్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. సీసీ కెమెరాల ఫుటేజీ ఆధారంగా నిందితులను గుర్తించిన పోలీసులు వారిని అరెస్ట్ చేశారు.

నలుగురితో కలిసి ముఠాగా ఏర్పడి..

బహదూర్‌పురాకు చెందిన సయ్యద్ సాజిద్ మరో నలుగురితో కలిసి ముఠాగా ఏర్పడి సెల్‌ఫోన్‌ల చోరీకి పాల్పడుతున్నట్లు గుర్తించారు. అమర్ ఆటో నడుపుతూ ప్రయాణికులను ఎక్కించుకునేవాడు. పాతబస్తీ షహీన్ నగర్‌కు చెందిన మహ్మద్ ఇక్బాల్ ఆటోలో ప్రయాణిస్తూ తోటి ప్రయాణికుల సెల్‌ఫోన్లు చోరీ చేసేవాడు. ఇదే తరహాలో వారు పలు ప్రాంతాల్లో సెల్‌ఫోన్ చోరీలకు పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న ఫోన్‌లలో ఐదు ఫోన్లను బాధితులకు అందజేశారు. ప్రధాన నిందితుడు సాజిద్, ఆటో డ్రైవర్ అమీర్‌లతో పాటు రిసీవర్లు అహ్మద్, షఫీలను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మరో ముగ్గురు నిందితులు ఇజాజ్, మహ్మద్, వసీమ్ పరారీలో ఉన్నట్లు తెలిపారు. ఆటో డ్రైవర్ అమర్‌పై ఫలక్‌నుమా పీఎస్ పరిధిలో మర్డర్ కేసు ఉన్నట్లు తెలిపారు.

సీఈఐఆర్‌ను వినియోగించాలి

అపహరణకు గురైన సెల్‌ఫోన్లను త్వరగా గుర్తించేందుకు వీలుగా ప్రజలు సెంట్రల్ ఎక్విప్‌మెంట్ ఐడెంటిటీ రిజిస్టర్ (సీఈఐఆర్)ను వినియోగించుకోవాలని ఏసీపీ తెలిపారు. సెల్‌ఫోన్ చోరీకి గురైన వెంటనే ఈ పోర్టల్‌లో రిజిస్టర్ చేసుకోవడం ద్వారా ఫోన్‌ను బ్లాక్ చేయవచ్చన్నారు. తద్వారా ఆ సెల్‌ఫోన్‌ను గుర్తించడం సులభతరం అవుతుందన్నారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ లక్ష్మీ నర్సింహా రెడ్డి, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ సర్దార నాయక్, ఎస్‌ఐ శివశంకర్ పాల్గొన్నారు.

ముంబై క్రైం పోలీసుల పేరు చెప్పి..

- నిషేధిత మెటీరియల్ అంటూ బెదిరింపులు
- నగర వ్యాపారి నుంచి రూ.29లక్షలు వసూలు

హిమాయత్‌నగర్: ముంబై క్రైం పోలీసులమని బెదిరించి నగర వ్యాపారి నుంచి సైబర్ నేరగాళ్లు భారీగా దోచేశారు. వారి మాటలకు భయపడిన వ్యాపారి అడిగినంత ముట్టజెప్పాడు. మరిన్ని డబ్బులు కావాలని డిమాండ్ చేయడంతో అనుమానం వచ్చిన బాధితుడు సోమవారం సిటీ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వివరాల్లోకి వెళితే.. ఇటీవల నగరానికి చెందిన వ్యాపారికి గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి 'ఫెడెక్స్' కొరియర్ ద్వారా మీరు తైవాన్‌కు నిషేధిత మెటీరియల్ సరఫరా చేస్తున్నందున మీపై కేసు నమోదు చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. ముంబై సైబర్ క్రైం పోలీసులు ఫోన్ చేసి మరిన్ని వివరాలు సేకరించిన అనంతరం కేసు నమోదు చేస్తామన్నారు. ఆ తర్వాత కొద్దిసేపటికి మరో వ్యక్తి ఫోన్ చేసి ముంబైలోని అంధేరి సైబర్ క్రైం ఠాణా నుంచి మాట్లాడుతున్నట్లు చెప్పి వాట్సాప్ ద్వారా అతడి నుంచి పలు డాక్యుమెంట్స్ తీసుకున్నాడు. ముందుగా మీరు కొంత డబ్బు పంపితే డాక్యుమెంట్స్ వెరిఫికేషన్ అనంతరం మీరు ఏ విధమైన నిషేధితమైన మెటీరియల్ పంపలేదని నిర్ధారణ అయితే డబ్బు వెనక్కి పంపుతామన్నారు. వారి మాటలు నమ్మిన సదరు వ్యాపారి వారిచ్చిన ఖాతాలకు పలు దఫాలుగా రూ.29 లక్షలు బదిలీ చేశాడు. అయినా మరిన్ని డబ్బులు డిమాండ్ చేస్తుండటంతో తాను మోసపోయినట్లు గుర్తించిన బాధితుడు సైబర్ క్రైం పోలీసులను ఆశ్రయించాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఏసీపీ ఆర్.జి.శివ మారుతి పేర్కొన్నారు.

వర్షంలో ఒంటి కాలిపై నిల్చొని..

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల వినూత్న ఆందోళన


ఆందోళన చేస్తున్న ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు

సుల్తాన్‌బజార్: ఎన్‌హెచ్‌ఎం స్కీంలో ప్రభుత్వ యూపీహెచ్‌సీల్లో పనిచేస్తున్న అకౌంటెంట్స్, పీహెచ్‌సీ డీఈఓ, పీహెచ్‌ఎం, సపోర్టింగ్ స్టాఫ్ ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని కోరుతూ కోఠి డీఎంహెచ్‌ఎస్ క్యాంపస్ ఆవరణలో సోమవారం వర్షంలో ఒంటికాలిపై నిలుచుని వినూత్న నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐదు రోజులుగా సమ్మె చేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదన్నారు. ఎన్‌హెచ్‌ఎంస్కీంలో పనిచేస్తున్న ఉద్యోగులందరినీ రెగ్యులర్ చేయాలని డిమాండ్ చేశారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు. హెల్త్ కార్డులు జారీ చేయాలని, ఇన్సూరెన్స్ వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. 510 జీఓలో విలీనం చేయాలన్నారు. డిమాండ్లు నెరవేరే వరకు ఆందోళన కొనసాగిస్తామని స్పష్టం చేశారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా పెద్ద ఎత్తున ఉద్యోగులు ఆందోళనలో పాల్గొనడం విశేషం. కార్యక్రమంలో బాలసుబ్రహ్మణ్యం, శ్రీమణి, శ్రీలక్ష్మి, భార్గవి, లోకేష్, ప్రకాష్, బాల్‌రెడ్డి, లోకేష్, సురేష్, హనుమంతు, మధు, శిరీష, నరసింహులు, సునీల్, పల్లవి, మాధవి, లావణ్య, భారతి, గౌరీ, చంద్రకళ, అనసూయ, రమేష్, హైదరాబాద్ మేడ్చల్, రంగారెడ్డి, జిల్లాల ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

అత్యాచారం, హత్య కేసులో నిందితుడి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న మాదాపూర్ డీసీపీ సందీప్

గచ్చిబౌలి: ఓ మహిళపై లైంగికదాడికి పాల్పడి, దారుణంగా హత్య చేసిన కేసులో నిందితుడిని గచ్చిబౌలి పోలీసులు అరెస్ట్ చేశారు. సోమవారం మాదాపూర్ డీసీపీ సందీప్ వివరాలు వెల్లడించారు. గౌలిదొడ్డి కేశవ్‌నగర్‌కు చెందిన కాశమ్మ(38) ఆగస్టు 27న అదృశ్యం కావడంతో కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు గచ్చిబౌలి పోలీసులు మిస్సింగ్ కేసు నమోదు చేసిన విషయం తెలిసిందే. ఆగస్టు 29న ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో నిర్మాణంలో ఉన్న సెల్లార్‌లో కాశమ్మ మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు సీసీ కెమెరా ఫుటేజీ ఆధారంగా వెస్ట్ బెంగాల్‌కు చెందిన ప్రధాన నిందితుడు శ్యామల్ రాయ్‌ని అరెస్ట్ చేశారు.

చనువును ఆసరాగా తీసుకుని..

తరచూ ఐరన్ స్క్రాప్ కోసం వచ్చే కాశమ్మతో శ్యామల్ చనువుగా ఉండేవాడు. ఆగస్టు 27న స్క్రాప్ కోసం వచ్చిన కాశమ్మను మాటల్లో పెట్టి సెల్లార్‌లోకి తీసుకెళ్లి లైంగికదాడికి పాల్పడ్డాడు. ఆమె కేకలు వేయడంతో మెడకు చీర కొంగుతో బిగించాడు. ఆమె స్పృహతప్పి కిందపడిపోగానే బండరాయితో తలపై మోది దారుణంగా హత్య చేశాడు. అనంతరం నేరుగా అక్కడి నుంచి తన తోటి కూలీలు నివాసం ఉండే గుడిసెల వద్దకు వెళ్లాడు. శ్యామల్ దుస్తులపై రక్తపుమరకలు గుర్తించిన తోటి కార్మికులు అశోక్ కుమార్, అలోక్ సర్కార్ అతడిని నిలదీయడంతో హత్య విషయం చెప్పాడు. దీంతో భయాందోళనకు గురైన వారు ముగ్గురితో పాటు మరికొందరు కార్మికులు వెస్ట్ బెంగాల్‌కు పరారయ్యారు. హత్య కేసును ఛేదించేందుకు ఆరు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసిన పోలీసులు నిందితుల కోసం గాలింపు ముమ్మరం చేశారు. ఈ నేపథ్యంలో ఆదివారం అడిషనల్ డీసీపీ నేతృత్వంలోని బృందం బంగ్లాదేశ్ సరిహద్దులో నిందితులను అదుపులోకి తీసుకుంది. ప్రధాన నిందితుడు శ్యామ్ రాయ్‌తో పాటు, నేరం చేశాడని తెలిసీ సంబంధిత అధికారులకు సమాచారం ఇవ్వకుండా దాచినందుకుగాను అశోక్ కుమార్, అలోక్‌లపై కూడా కేసులు నమోదు చేశారు. నిందితుడి నుంచి సెల్ ఫోన్, ప్యాంట్, షర్ట్ స్వాధీనం చేసుకున్నారు. టీం వర్క్‌తో కేసు ఛేదించిన గచ్చిబౌలి పోలీసులకు డీసీపీ రివార్డు అందజేశారు. సమావేశంలో అడిషనల్ డీసీపీ నంద్యాల నర్సింహా రెడ్డి, సీసీఎస్ ఏడీసీపీ నర్సింహా రెడ్డి, ఏసీపీ శ్రీనివాస్, సీఐ జేమ్స్ బాబు, డీఐ రాఘవేందర్ తదితరులు పాల్గొన్నారు.

'ప్రజావాణి' సమస్యలు పరిష్కరించండి: కలెక్టర్



సాక్షి, సిటీబ్యూరో: ప్రజావాణి కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి స్వీకరించిన ఫిర్యాదుల పరిష్కారానికి సంబంధిత శాఖల అధికారులు చర్యలు చేపట్టాలని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ మధుసూదన్‌తో కలిసి కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. శాఖల వారీగా పెండింగ్‌లో ఉన్న ఫిర్యాదులను కలెక్టర్ చదివి వినిపించి, సత్వరమే పరిష్కరించాలని అధికారులను కోరారు. వివిధ మండల తహసీల్దార్ల తో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జి ఓ నంబర్ 58 , 59 , గృహ లక్ష్మి పథకాల పురోగతి పై ఆరా తీశారు.సమస్యల పరిష్కారం కోరుతూ వచ్చే అర్జీదారుల సమస్యల గురించి తెలుసుకుంటూ తగిన చర్యలు తీసుకోవలసిందిగా సంబంధిత శాఖ అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఏ ఓ సునీల్, జిల్లా ప్రణాళిక అధికారి సురేందర్, జిల్లా సాంఘిక సంక్షేమ శాఖ అధికారి యాదయ్య, తహసీల్దార్లు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి ఫలాలు సామాన్యులకు అందాలి



మాట్లాడుతున్న డా.పీఎస్ గోయల్, 'ఒక వారం ఒక ప్రయోగశాల' కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న అతిథులు

ఉప్పల్: సీఎస్ఐఆర్ సంస్థలు చేస్తున్న ఆవిష్కరణలను సమాజానికి తెలియజేయాలనే ఉద్దేశంతో 'ఒక వారం ఒక ప్రయోగశాల' పేరుతో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీయమని భారత ప్రభుత్వ విజ్ఞాన శాఖ మాజీ ముఖ్య కార్యదర్శి డా.పీఎస్ గోయల్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఉప్పల్ జాతీయ భూ భౌతిక పరిశోధన సంస్థ(ఎన్‌జీఆర్ఐ)లో ఏర్పాటు చేసిన ప్రదర్శనను రాష్ట్ర ఐటీ శాఖ కార్యదర్శి జయేష్ రంజన్, సీఎస్ఐఆర్ సంచాలకులు డా. ఎన్ కలైసెల్వి, ఎన్‌జీఆర్ఐ డైరెక్టర్ డా. ప్రకాష్ కుమార్ తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంక్లిష్టమైన భూమి వ్యవస్థకు సంబంధించిన అంశాలను, సమస్యాత్మక సవాళ్లను పరిష్కరించడంలో విజ్ఞానం, విభిన్న శాస్త్రీయ పద్ధతులను అనుసరించాలన్నారు. ఎన్‌జీఆర్ఐ, ఐఐటీ మద్రాస్, చెన్నై, ఎస్ఆర్‌టీఎమ్ విశ్వవిద్యాలయం, నాందేడ్, బుందేల్ ఖండ్ విశ్వవిద్యాలయంతో పరిశోధనలపై సహకార, అవగాహన ఒప్పందాలపై ఎంఓయూలు చేసుకున్నారు. అంతకు ముందు జయేష్ రంజన్ మాట్లాడుతూ, శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, పారిశ్రామికవేత్తలను సాధారణ ప్రజలతో అనుసంధానం చేస్తూ సీఎస్ఐఆర్ చేపట్టిన కార్యక్రమం అభినందనీయమన్నారు. ప్రభుత్వం చేపట్టిన రీసెర్చ్ అండ్ ఇన్నోవేషన్ సర్కిల్ ఆఫ్ హైదరాబాద్(రిచ్) కార్యక్రమాల్లో చేరాలని సూచించారు. రాష్ట్ర వ్యవసాయ రంగం, ఐటీ పరిశ్రమల అభివృద్ధికి చేయూత నిచ్చేలా పరిశోధనలు సాగాలన్నారు. రాష్ట్రంలో ఫార్మా రంగం కూడా గణనీయంగా అభివృద్ధి చెందిందని, వ్యాక్సిన్ తయారీలో ఫార్మాతో పాటు పరిశోధనా సంస్థలు కీలక పాత్ర పోషించడం అభినందనీయమన్నారు. ఎన్‌జీఆర్ డైరెక్టర్ ప్రకాష్ కుమార్ 62 ఏళ్లుగా ఎన్‌జీఆర్ఐ అందిస్తున్న సేవలను వివరించారు. భూ విజ్ఞాన శాస్త్రరంగంలో కృత్రిమ మేధ, మెషిన్ లెర్నింగ్ తదితర ఆత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని అవలంభించాలని సూచించారు.

లారీ ఢీ కొని విద్యార్థిని దుర్మరణం


శివాని (ఫైల్)


శివాని మృతదేహాన్ని తరలిస్తున్న పోలీసులు

ఉప్పల్: ద్విచక్ర వాహనాన్ని లారీ ఢీ కొనడంతో ఓ విద్యార్థిని అక్కడికక్కడే మృతి చెందిన సంఘటన ఉప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఉప్పల్ గణేష్‌నగర్ ప్రాంతానికి చెందిన తాండ శ్రీనివాస్ కుమార్తె శివాని గౌడ్(19) హబ్సిగూడలోని ఓ ప్రైవేట్ కాలేజీలో డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతోంది. సోమవారం ఉదయం చిలుకానగర్‌కు చెందిన స్నేహితురాలు సారికతో కలిసి బైక్‌పై కాలేజీకి వెళ్లి తిరిగి వస్తుండగా స్థానిక స్టేడియం మెట్రో స్టేషన్ వద్ద వెనుక నుంచి వేగంగా వచ్చిన లారీ ఢీకొనడంతో బైక్ వెనుక కూర్చున్న శివాని ఎగిరి రోడ్డుపై పడిపోయింది. లారీ వెనకాల చక్రాలు హమె తలపై నుంచి వెళ్లడంతో అక్కడికక్కడే మృతి చెందింది. బైక్ నడుపుతున్న సారిక ఫుట్‌పాత్‌పై పడటంతో గాయాలయ్యాయి. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని గాంధీ ఆస్పత్రికి తరలించారు. మృతురాలు శివాని తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

న్యాయవాది ఆత్మహత్య

మణికొండ: కుటుంబ తగాదాల కారణంగా ఓ న్యాయవాది ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన నార్సింగి పోలీస్‌స్టేషన్ పరిధిలోని పుప్పాలగూడ బెగోనియా అపార్ట్‌మెంట్స్‌లో ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఇంద్రనీల్ ముఖర్జీ(44) న్యాయవాదిగా పనిచేస్తూ భార్య, కుమారుడితో కలిసి పుప్పాలగూడలో నివాసం ఉండేవాడు. ఏడాది క్రితం భార్యతో గొడవలు తలెత్తడంతో ఆమె కుమారుడితో కలిసి వేరుగా ఉంటోంది. అప్పటినుంచి మానసికంగా కుంగిపోయిన ఇంద్రనీల్ ముఖర్జీ ఆదివారం ఇంట్లో ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అతని వద్ద గతంలో డ్రైవర్‌గా పనిచేసిన భాష ఉదయం నుంచి ఫోన్ చేస్తున్నా స్విచ్ ఆఫ్ వస్తుండటంతో అతని తమ్ముడు మానవేంద్ర ముఖర్జీకి ఫోన్ చేసి సమాచారం అందించాడు. అనంతరం ఇద్దరు కలిసి వచ్చి చూడగా ఇంద్రనీల్ ముఖర్జీ ఇంటి తలుపులు మూసి ఉన్నాయి, పలుమార్లు పిలిచినా స్పందన లేకపోవడంతో సెక్యూరిటీ గార్డుల సహాయంతో కిచెన్ గ్రిల్ తొలగించి లోపలికి వెళ్లి చూడగా ఇంద్రనీల్ ముఖర్జీ ఫ్యాన్‌కు ఉరివేసుకుని కనిపించాడు. మృతదేహాన్ని కిందికి దించి నార్సింగి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

అంతరిక్ష పరిశోధనల్లో భారత్ ప్రయత్నాలను గౌరవిస్తాం


డాక్టర్ క్లాడియో అన్సోరెనాకు మెమెంటో అందజేస్తున్న మీలా జయదేవ్, చక్రవర్తి

నాంపల్లి: ఖగోళ శాస్త్రంలో భారతదేశ ప్రయత్నాలను తాము గౌరవిస్తామని కోస్టారికా రాయబారి డాక్టర్ క్లాడియో అన్సోరెనా మోంటెరో అన్నారు. సోమవారం రెడ్‌హిల్స్‌లోని ఫెడరేషన్ హౌస్‌లో భారత్‌- కోస్టారికా దేశాల వాణిజ్య ప్రతినిధులతో చర్చాగోష్టి జరిగింది. కార్యక్రమానికి హాజరైన డాక్టర్ క్లాడియో అన్సోరెనా మోంటెరో మాట్లాడుతూ... భారత్‌తో పోలిస్తే కోస్టారికా చిన్న దేశమని, కానీ ఇరు దేశాలు ప్రజాస్వామ్య, శాంతి, సుస్థిరత తదితర అంశాల్లో విలువలు పంచుకుంటాయన్నారు. భారతదేశం ఇటీవల అంతరిక్ష పరిశోధనల్లో సాధించిన విజయాలను తాము అభినందిస్తున్నామన్నారు. జనవరిలో ఇస్రో డైరెక్టర్ ఎస్.సోమనాథ్‌ను కలిసి భారతదేశానికి చెందిన అనుభవాలను నేర్చుకోవాలని ఉందని తెలిపారు. పరిశ్రమ స్థాయిలో సహకారం, శాటిలైట్ బిల్డింగ్, స్పేస్ టెక్నాలజీ అప్లికేషన్‌లో కోస్టారికా అధికారుల సామర్థ్యాన్ని పెంపొందించే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. ఎఫ్‌టీసీసీఐ అధ్యక్షులు మీలా జయదేవ్ మాట్లాడుతూ... కోస్టారికాకు భారతదేశం నుంచి ఎగుమతుల విలువ సుమారు 200 మిలియన్ డాలర్లు కాగా, కోస్టారికా నుంచి దిగుమతుల విలువ దాదాపు 40 మిలియన్ డాలర్లు ఉన్నట్లు వివరించారు. అనంతరం ఇరుదేశాలు పలు ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాలు, అవగాహన ఒప్పందాలపై సంతకాలు చేశాయి. కార్యక్రమంలో సీఆర్‌డీసీ కంపెనీ సీఈఓ డోనాల్ థామ్సన్, అంతర్జాతీయ వాణిజ్య కమిటీ చైర్మన్ చక్రవర్తి పాల్గొన్నారు.

సారీ.. ఎయిర్‌పోర్టుకు రాలేం

క్యాబ్‌వాలాల 'లోఫేర్..నో ఎయిర్' మూవ్‌మెంట్

సాక్షి, సిటీబ్యూరో: క్యాబ్‌వాలాలు సరికొత్త ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. ఎయిర్‌పోర్టు ప్రయాణికులకు క్యాబ్ సేవలను నిలిపివేస్తూ 'లో ఫేర్..నో ఎయిర్' ప్రచారం చేపట్టారు. ఎయిర్‌పోర్టు నుంచి నడిపే క్యాబ్‌డ్రైవర్లకు సరైన ఆదాయం లభించకపోవడమే ఇందుకు కారణం. దీంతో సకాలంలో క్యాబ్‌లు లభించక.. ఒకవేళ సర్వీసులు బుక్ అయినప్పటికీ డ్రైవర్లు నిరాకరించడం వల్ల ఎయిర్‌పోర్టుకు రాకపోకలు సాగించే ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. సకాలంలో క్యాబ్‌లు లభించక గంటల తరబడి పడిగాపులు కాస్తున్నారు. హైదరాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి ప్రతిరోజు సుమారు 65 వేల మంది జాతీయ, అంతర్జాతీయ ప్రయాణికులు రాకపోకలు సాగిస్తారు. ఆర్టీసీ పుష్పక్ బస్సులు, ప్రీపెయిడ్ ట్యాక్సీలు, సొంత వాహనాలు మినహాయించి మరో 5 వేల క్యాబ్‌లు ఇటీవల వరకు ఎయిర్‌పోర్టుకు అందుబాటులో ఉండేవి. కానీ కొంతకాలంగా ఎయిర్‌పోర్టు నుంచి 50 కిలోమీటర్ల పరిధిలో ఎక్కడికి వెళ్లినా తమకు రూ.500 నుంచి రూ.700 వరకు మాత్రమే లభిస్తున్నాయని. దీంతో ఇంధన ఖర్చులు కూడా రావడం లేదని డ్రైవర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పైగా ఓలా, ఉబెర్ సంస్థలు డ్రైవర్ల నుంచి 30 శాతం వరకు కమిషన్ తీసుకుంటున్నాయి. ఇది మరింత భారంగా మారిందని తెలంగాణ గ్రిగ్ అండ్ ట్యాక్సీ డ్రైవర్స్ అసోసియేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు షేక్ సలావుద్దీన్ తెలిపారు. ఎయిర్‌పోర్టు నుంచి ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించే ప్రీపెయిడ్ ట్యాక్సీలకు ఒక ట్రిప్పుపైన రూ.980 నుంచి రూ.1150 వరకు లభిస్తుండగా తమకు మాత్రం అతి తక్కువ ఆదాయం లభిస్తుందన్నారు. దీంతో ఎయిర్‌పోర్టుకు క్యాబ్‌లు నడిపేందుకు నిరాకరిస్తున్నట్లు చెప్పారు. ప్రీపెయిడ్ ట్యాక్సీల తరహాలో ఎయిర్‌పోర్టుకు నడిచే క్యాబ్‌లకు ప్రతి కిలోమీటర్‌కు రూ.21 చొప్పున ఇవ్వాలని, అగ్రిగేటర్ సంస్థలకు ఇచ్చే కమిషన్‌ను 30 శాతం నుంచి 15 శాతానికి తగ్గించాలని క్యాబ్ డ్రైవర్లు డిమాండ్ చేస్తున్నారు.

పార్కింగ్‌లోకి దూసుకెళ్లిన కారు


పోలీసుల అదుపులో నిందితులు

బంజారాహిల్స్: మద్యం మత్తులో అతి వేగంగా కారులో దూసుకెళుతూ కారును కంట్రోల్ చేయలేక పార్కింగ్ స్థలంలోకి దూసుకెళ్లిన సంఘటన జూబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే... మెదక్ జిల్లా, గడి గ్రామానికి చెందిన ఫిర్దోస్ సాదిక్ అలీ ఆదివారం రాత్రి కారులో తన స్నేహితులు అస్మత్, షాబాద్‌తో కలిసి మద్యం సేవించాడు. అనంతరం వారు కారులో జూబ్లీహిల్స్ రోడ్ నెం 70 డీకే నగర్ మీదుగా వెళుతుండగా అతి వేగం కారణంగా కారు అదుపు తప్పి ప్లాట్ నెం 179లోని పార్కింగ్ స్థలంలోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో బోర్‌వెల్‌ను ఢీకొట్టడంతో బోర్‌వెల్ ధ్వంసమైంది. అదే సమయంలో సమీపంలో నిద్రిస్తున్న వాచ్‌మెన్ రవి పక్కకు జరిగి ప్రాణాలు దక్కించుకున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని నిందితులను అదుపులోకి తీసుకున్నారు. బ్రీత్ అనలైజర్ పరీక్షలు నిర్వహించి వారు మద్యం సేవించినట్లుగా నిర్ధారించారు. నిందితులను అరెస్ట్ చేసిన జూబ్లీహిల్స్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

క్లుప్తంగా...

గౌస్‌పాషా కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే దానం పరామర్శ



బంజారాహిల్స్: హిమాయత్‌నగర్‌లో నాలుగు రోజుల క్రితం చెట్టు కూలి ఆటోడ్రైవర్ మృతి చెందిన ఘటనలో ఆ కుటుంబాన్ని సోమవారం ఎమ్మెల్యే దానం నాగేందర్ పరామర్శించారు. ఈ ఘటనపై ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. కుటుంబాన్ని అన్ని రకాలుగా ఆదుకుంటామని హామీ ఇచ్చారు. చెట్టు కూలడంతో ఆటో డ్రైవర్ గౌస్‌పాషా మృతి చెందిన విషయం తెలిసిందే.

ఘనంగా గ్రాండ్ పేరెంట్స్ డే



గ్రాండ్ పేరెంట్స్‌తో చిన్నారులు

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నెం. 9లోని కల్ప స్కూల్‌లో గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు సోమవారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ప్రీ ప్రైమరీ, ప్రైమరీ, హైస్కూల్ విద్యార్థులు వారి అమ్మమ్మ, తాతయ్య, నానమ్మలతో సందడిగా గడిపారు. ప్రస్తు డిజిటల్ యుగంలో చిన్నారులు అమ్మమ్మ, తాతయ్యలకు దూరమవుతున్నారని వారు పిల్లల జీవితాల్లో ఎంత ముఖ్యమో చెప్పేందుకు ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు పాఠశాల డైరెక్టర్ కుసుమ్ గుప్తా, ప్రిన్సిపాల్ అయేషా జిలానీ తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి.

రోడ్డు పనుల పరిశీలన



హిమాయత్‌నగర్: రాజమోహల్లా ప్రాంతంలో నూతనంగా నిర్మిస్తున్న సీసీ రోడ్డును హిమాయత్‌నగర్ కార్పొరేటర్ గడ్డం మహాలక్ష్మి సోమవారం పరిశీలించారు. పనుల్లో జాప్యత, లోపాలను ఆమె గుర్తించారు. లోపాలు లేకుండా రోడ్డు నిర్మించాలని, త్వరితగతిన రోడ్డు ప్రజలకు అందుబాటులోకి రావాలని కోరారు. డివిజన్‌లో మరిన్ని చోట్ల అవసరమైన రోడ్లను కూడా నిర్మిస్తామని తెలిపారు. నేతలు రామన్‌గౌడ్, నర్సింగ్‌గౌడ్, జకీ, మల్లేష్, సాయి, జగదీష్, పూజ, హితేష్ తదితరులు పాల్గొన్నారు.

వైజ్ఞానిక ప్రదర్శనలో సత్తాచాటిన విద్యార్థులు

ఖైరతాబాద్: ఖైరతాబాద్ సరస్వతి విద్యామందిర్ స్కూల్‌లో సోమవారం క్లస్టర్ స్థాయి సైన్స్ అండ్ మ్యాథ్స్ ప్రదర్శన నిర్వహించారు. సరస్వతి విద్యామందిర్ పీఠం ఆధ్వర్యంలో జరిగిన ఈ ఫెయిర్‌లో విద్యార్థులు అనేక రకాల విజ్ఞాన ప్రదర్శనలు ఇచ్చి ఆలోచింపజేశారు. వ్యర్థాల నుంచి విద్యుత్ ఉత్పత్తి, చంద్రయాన్-3లో ప్రజ్ఞాన్ రోవర్ కిందకు దిగడం, మానవ శరీరంలో అవయవాల పనితీరు, సోలార్ ఎనర్జీ, ప్రకృతి వ్యవసాయం, వాటర్ హార్వెస్టింగ్ తదితర నమూనాలను విద్యార్థులు ప్రదర్శించారు. మెరుగైన ప్రదర్శనలిచ్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమానికి సీసీఆర్‌యూఎం ప్రశాంత డైరెక్టర్ పి.వీరేంద్రనాథ్ హాజరై విద్యార్థులను అభినందించారు. సరస్వతి విద్యాపీఠం సంకలన ప్రముఖ మల్లేష్, పాఠశాల ప్రిన్సిపాల్ పాయల్ ఖన్నా, కో ఆర్డినేటర్ జగదీష్ తదితరులు పాల్గొన్నారు.



సరస్వతి విద్యామందిర్ పాఠశాలలో విద్యార్థుల ప్రదర్శనలు



నిర్మాణాలను కూల్చివేసిన అధికారులు

దర్గాగా దారి కబ్జాకు యత్నం..

నాయుడునగర్‌బస్తీలో ఉద్రిక్తత

- బోగస్ ధ్రువపత్రాలతో నిర్మాణాలకు యత్నం
- అడ్డుకున్న నాయుడునగర్‌బస్తీవాసులు
- ప్రభుత్వ స్థలమని నిర్ధారిస్తూ నిర్మాణాలను కూల్చేసిన అధికారులు
- బస్తీవాసులపై కబ్జాదారుడి దూషణలపర్వం
- బస్తీవాసుల ఆందోళనతో సర్వత్రా ఉద్రిక్తత



ఆందోళన చేస్తున్న నాయుడు నగర్ బస్తీవాసులు

వెంకటేశ్వరకాలనీ: నడి రోడ్డుపై కరెంటు స్తంభాలు, డ్రెయినేజీ లైన్లు, సీసీ రోడ్డును కూడా కలిపేసుకొని దర్గాగా కబ్జా చేయడంతో పాటు అడ్డుకునేందుకు యత్నించిన బస్తీవాసులపై కబ్జాదారులు దౌర్జన్యానికి దిగారు. దీంతో వెంకటేశ్వరకాలనీ డివిజన్ బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని నాయుడు నగర్ బస్తీలో సోమవారం ఉద్రిక్తత చోటు చేసుకుంది. వివరాలివీ... ఓ వ్యక్తి 20 ఏళ్ల క్రితం డాక్యుమెంట్‌ను తీసుకొచ్చి బస్తీకి దారి తీసే స్థలంలో నిర్మాణాలు చేపట్టేందుకు యత్నించాడు.

◆ సుమారు 50కిపైగా కుటుంబాలు గత 18 ఏళ్లుగా రోడ్డు కోసం వినియోగిస్తున్న స్థలాన్ని తనదే అంటూ నెల రోజుల క్రితం ఓ గుడిసె వేశాడు. అంతటితో ఆగకుండా కొంత మంది ప్రజాప్రతినిధులు, బస్తీ లీడర్ల సహకారంతో బోగస్ పత్రాలతో కరెంటు మీటర్‌ను సైతం పొందాడు. వారం రోజుల క్రితం గుడిసె స్థలంలో పక్కా ఇంటి నిర్మాణం ప్రారంభించాడు. అయితే ఎన్నో ఏళ్లుగా రోడ్డుగా ఉన్న స్థలాన్ని ఎలా ఆక్రమిస్తారంటూ బస్తీవాసులు అడ్డుకున్నారు.

◆ ఆ స్థలంలోనే డ్రైనేజీ లైన్, కరెంటు స్తంభాలు, జెండా దిమ్మెలు ఉన్నప్పటికీ కొంత మంది బస్తీ నేతలతో కలిసి స్థలాన్ని కబ్జా చేస్తున్నారంటూ షేక్‌పేట మండల అధికారులకు ఫిర్యాదు చేశారు. ఈ విషయాన్ని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి సైతం ఫిర్యాదు చేశారు. ఈ మేరకు రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలంలో విచారణ చేపట్టి ఇది ప్రభుత్వ స్థలమేనని గుర్తించి అక్రమ నిర్మాణాన్ని కూల్చారు.

◆ అయితే తమ ఇంటిని ఎలా కూల్చివేయిస్తారంటూ సదరు నిర్మాణదారుడి కుటుంబ సభ్యులు బస్తీవాసులపై దాడిచేయడంతో పాటు దూషణలకు దిగాడు. దీంతో బస్తీవాసులు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. బంజారాహిల్స్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చారు.

రియల్ ఎస్టేట్ ఏజెంట్‌పై కేసు నమోదు

బంజారాహిల్స్: తన ఇల్లు దెబ్బతినడానికి కారణమైన వ్యక్తిపై చర్యలు తీసుకోవాల్సిందిగా బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బంజారాహిల్స్ పోలీసులు రియల్‌ఎస్టేట్ ఏజెంట్‌పై ఐపీసీ సెక్షన్ 341 కింద కేసు నమోదు చేశారు. వివరాలివీ... బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని గౌరీ శంకర్ కాలనీలో నివసించే ఎస్. వరమ్మ ఇంటి పక్కన సురేష్ అనే రియల్ ఎస్టేట్ ఏజెంట్ ఇంటి నిర్మాణం చేపడుతున్నాడు. నిర్మాణ వ్యర్థాలను కొంత కాలంగా వరమ్మ నివాసం పక్కనే ఉన్న ప్రభుత్వం స్థలంలో నింపుతున్నాడు. పలుమార్లు హెచ్చరించినా సు రేష్ వినిపించుకోలేదు. భారీ వర్షాలకు ఆదివారం రాత్రి ఇక్కడ గోడకూలడంతో తన ఇల్లు ధ్వంసమైందని పక్కనే ఉన్న యాదమ్మ అనే మహిళ కూడా ఇదే సమస్యను ఎదుర్కొందని ఆరోపిస్తూ ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు సురేష్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దెబ్బతిన్న నివాసాలకు రూ. 3 లక్షల సాయం



పంచవటి కాలనీలో జెడ్‌సీ వెంకటేష్ దోత్రెతో కలిసి పర్యటిస్తున్న ఎమ్మెల్యే దానం

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నెం.10లోని గౌరీ శంకర్ కాలనీలో పంచవటి కాలనీ పార్కు గోడ కూలి దెబ్బతిన్న నివాసితులకు ప్రభుత్వం ద్వారా ఒక్కో ఇంటికి రూ. 3 లక్షల ఎక్స్‌గ్రేషియా ఇప్పిస్తానని ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ హామీ ఇచ్చారు. సోమవారం ఎమ్మెల్యే జోనల్ కమిషనర్ వెంకటేష్ దోత్రెతో కలిసి ఆయన ఘటనా స్థలంలో పర్యటించి కాలనీవాసులతో, దెబ్బతిన్న నివాసితులను పరామర్శించి మాట్లాడారు. త్వరితగతిన సహాయ చర్యలు పూర్తిచేయాలని పార్కులో ఉన్న మట్టి వ్యర్థాలను పూర్తిగా నేల వరకు తొలగించాలని సూచించారు. పార్కు చుట్టూ పటిష్టమైన ప్రహరీ నిర్మించాలని సూచించారు. అదే విధంగా పార్కులో అక్రమ డంపింగ్ చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని, వారికి నోటీసులు ఇవ్వాలని సూచించారు. కార్యక్రమంలో గౌరీశంకర్ కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ముత్తు తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా శ్రీవారి పవిత్రోత్సవాలు



పవిత్రోత్సవ పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

వెంకటేశ్వరకాలనీ: శ్రీనగర్ కాలనీలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవస్థానంలో శ్రీవారి పవిత్రోత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా సోమవారం అగ్నిప్రతిష్ఠ, చతుస్థానార్చన, పవిత్రారోహణం, సహస్ర నామార్చన (తులసి), జపం, తర్పణం, హోమం తదితర పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. బ్రహ్మోత్సవాలకు ముందు ఆలయంలో ఆరాధనోత్సవాలు, పవిత్రోత్సవాలు విధిగా నిర్వహిస్తుంటారు. పవిత్రోత్సవాల్లో భక్తులు భారీ సంఖ్యలో పాల్గొని శ్రీవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో ఎన్. లావణ్య హోమంలో పాల్గొని అనంతరం శ్రీవారికి విశేష పూజలు నిర్వహించారు.

నష్టపరిహారం చెక్కుల పంపిణీ

హిమాయత్‌నగర్: నాలా రిటైనింగ్ వాల్ నిర్మాణంలో కొన్ని కుటుంబాలకు ప్రభుత్వం నష్టపరిహారాన్ని చెల్లిస్తుంది. ఇందులో భాగంగా హిమాయత్‌నగర్ డివిజన్‌కు చెందిన 11 కుటుంబాలకు నష్టపరిహారం ఇచ్చేందుకు అధికారులు జాబితా సిద్ధం చేశారు. ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ మేల్కొటియా పార్క్ వద్ద 11 మంది కుటుంబాల్లో ఏడు కుటుంబాల వారికి సోమవారం చెక్కులను పంపిణీ చేశారు. మిగతా వారికి కూడా ఒకటి రెండు రోజుల్లో చెక్కులు ఇవ్వనున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. డీపీఓ రజితరెడ్డి, ఏసీపీ వీరాస్వామి, కార్పొరేటర్ గడ్డం మహాలక్ష్మి, బీఆర్ఎస్ అధ్యక్షుడు యాదగిరి, బీసీ నాయకులు రాజేంద్రప్రసాద్, నాయకులు టి.రాజేందర్, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.



బాధితురాలికి చెక్కు పంపిణీ చేస్తున్న దృశ్యం

వరద నీరు చేరకుండా చర్యలు



వరద నీరు నిలిచిన ప్రాంతాల్లో పరిస్థితిని సమీక్షిస్తున్న జూబ్లీహిల్స్ ఎస్ఐ రాకేష్

బంజారాహిల్స్: వరద బీభత్సం ఇటు ప్రజలను, అటు రహదారులను ముంచెత్తింది. ఆదివారం రాత్రి నుంచి కురుస్తున్న వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. వాటర్‌లాగింగ్ పాయింట్ల వద్ద నీరు నిల్వకుండా జీహెచ్ఎంసీ సిబ్బందిని అప్రమత్తం చేస్తూ ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా జూబ్లీహిల్స్ ఏసీపీ కె. హరిప్రసాద్ జూబ్లీహిల్స్, ఫిలింనగర్ పోలీసులను క్షేత్ర స్థాయిలో పర్యటించాల్సిందిగా సోమవారం ఆదేశించారు. దీంతో ఎస్ఐలు తమ సెక్టార్ల పరిధిలో వాటర్ లాగింగ్ పాయింట్లను క్షేత్ర స్థాయిలో పరిశీలించి పరిస్థితిని పర్యవేక్షించారు. జీహెచ్ఎంసీ మాన్‌సూన్ యాక్షన్ టీమ్‌లతో వరద నీరు వెళ్లే మార్గాలను సుగమం చేయించారు. వరద నీరు వెళ్లే మ్యాన్‌హోల్ మూతలపై, కాల్వలవద్ద ఫెన్సింగ్‌లపై వ్యర్థాలు, ప్లాస్టిక్ కవర్లు, రాళ్లు చిక్కుకుపోయి నీళ్లు వెళ్లకపోవడంతో వాటిని దగ్గరుండి తొలగించేలా చూశారు.

ఉత్తమ ఉపాధ్యాయులకు జాతీయ అవార్డులు



అవార్డుల కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

పంజగుట్ట: బోధనలో అత్యున్నత ప్రమాణాలు నెలకొల్పిన ఉపాధ్యాయులకు రాజా రత్న హెల్త్‌కేర్, ఎడ్యుకేషనల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో 8వ ఐటాప్ 2023 అవార్డులు ప్రదానం చేయనున్నట్లు ఐటాప్ మేనేజిమెంట్ కమిటీ చైర్మన్ వెంకట్ బార్ల తెలిపారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో కార్యక్రమ కరపత్రాన్ని ఐటాప్ వ్యవస్థాపక సభ్యులు ఎస్.సురేష్ కుమార్, కె.రామారావుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని గత 7 సంవత్సరాలుగా జాతీయ స్థాయిలో ఉత్తమ ఉపాధ్యాయుల అవార్డు ఇస్తున్నట్లు తెలిపారు. కొత్త టెక్నాలజీ విద్యా బోధనలో ఉపయోగించి విద్యార్థుల అభ్యున్నతికి కృషి చేస్తున్న ఉపాధ్యాయులు ఈ అవార్డుకు అర్హులన్నారు. ఉపాధ్యాయులతో పాటు లెక్చరర్లు, ప్రొఫెసర్లు, క్రీడా కోచ్‌లు విభిన్న కళలను నేర్పించే కళాకారుతో పాటు, గురువులు, మెంటార్‌లూ అర్హులన్నారు. జాతీయ స్థాయిలో 24 మందికి ఉత్తమ ఉపాధ్యాయునిగా ఒకరికి మహామహోపాధ్యాయ పురస్కారం అందిస్తామని తెలిపారు. ఈ అవార్డుకు ఈ నెల 25వ తేదీ లోపు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఏడుగురు బృందంతో కూడిన నిష్ణాత జ్యూరీ సభ్యులు నామినేషన్లు పరిశీలించి అవార్డులను ప్రకటిస్తారన్నారు. అవార్డుల ప్రదానోత్సవం హైదరాబాద్‌లో అక్టోబర్ 2వ తేదీ గాంధీ జయంతి రోజు నిర్వహిస్తామని తెలిపారు. వివరాలకు ఫోన్: 89781 74444లో సంప్రదించాలన్నారు.

జూబ్లీహిల్స్ క్లబ్‌లో సోలార్ ప్లాంట్ ప్రారంభం



సోలార్ ప్లాట్‌ను ప్రారంభిస్తున్న జూబ్లీహిల్స్ క్లబ్ సభ్యులు

బంజారాహిల్స్: జూబ్లీహిల్స్ ఇంటర్నేషనల్ సెంటర్(జేహెచ్ఐసీ)లో నూతనంగా ఏర్పాటు చేసిన సోలార్ ప్లాంట్‌ను జేహెచ్ఐసీ గవర్నింగ్ కౌన్సిల్ శాశ్వత సభ్యుడు నరేంద్ర చౌదరితో పాటు క్లబ్ సభ్యులు సోమవారం ప్రారంభించారు. టాటాపవర్ కంపెనీకి చెందిన ఈ వ్యవస్థను డైలాగ్ వైర్‌సెల్ సర్వీసెస్ సంస్థ వారు ఏర్పాటు చేశారు. 320 కిలోవాట్ల సామర్థ్యం కలిగిన ఈ సోలార్ ప్లాంట్ ద్వారా నిత్యం 1600 యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి అవుతుందని వారు తెలిపారు. రూ. 1.70 కోట్ల వ్యయంతో 22 వేల చదరపు అడుగుల్లో ప్యానెల్స్‌ను ఏర్పాటు చేశామని అన్నారు. కార్యక్రమంలో జేహెచ్ఐసీ సెక్రటరీ హన్మంతరావు, కిలారి రాజేశ్వర్‌రావు, హిమబిందు రెడ్డి, జనార్దన్‌రెడ్డి, రమేష్ చౌదరి, సోలార్ సంస్థ ప్రతినిధి శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వరద సమస్యల పరిష్కారానికి చర్యలు

ఖైరతాబాద్: ఖైరతాబాద్ ఓల్డ్ సీఐబీ క్వార్టర్స్‌వాసులు ఎదుర్కొంటున్న వరద సమస్యల శాశ్వత పరిష్కారానికి రూ. 6 కోట్లతో పనులు ప్రారంభిస్తున్నట్లు ఎమ్మెల్యే దానం నాగేందర్ తెలిపారు. సోమవారం ఖైరతాబాద్ ఓల్డ్ సీఐబీ క్వార్టర్స్‌లో అధికారులతో కలిసి పనులను ఎలా చేపట్టాలో అనే విషయంపై మ్యాపింగ్ ద్వారా స్థానికులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఎంతో కాలంగా ఖైరతాబాద్ ఓల్డ్ సీఐబీ క్వార్టర్స్‌లో నెలకొన్న వరద సమస్యను ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్ దృష్టికి తీసుకెళ్లి ఎస్ఎన్‌డీపీ కింద రూ. 6 కోట్లు కేటాయించగా మొదటి విడతగా రూ. 3 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. ఎస్ఎన్‌డీపీ ఈఈ రత్నాకర్, డీఈ చైతన్య, ఏఈ చరణ్, జీహెచ్ఎంసి ఈఈ ఇందిరా, బ్రైట్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ అనిల్‌కుమార్, అధ్యక్షుడు జ్ఞానేశ్వర్ యాదవ్, ఉపాధ్యక్షుడు కె.రాజు, కిషోర్‌కుమార్, సంజీవ్‌కుమార్, సునీల్, బీఆర్ఎస్ నాయకులు మహేందర్‌బాబు, ప్రవీణ్, గంగాదర్ యాదవ్, నాగేష్ పాల్గొన్నారు.

వసతుల కల్పనే ధ్యేయం: ఎమ్మెల్యే మాగంటి

వెంగళరావునగర్: నియోజకవర్గంలోని అన్ని బస్తీలు, కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించడమే ధ్యేయంగా ముందుకు సాగుతున్నామని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. వెంగళరావు నగర్ డివిజన్ మధురానగర్‌కాలనీలో రూ. 10 లక్షలు, కళ్యాణ్‌నగర్‌కాలనీలో రూ. 6 లక్షల వ్యయంతో చేపట్టనున్న పైప్‌లైన్ నిర్మాణ పనులు, వెంగళరావునగర్ కాలనీలో రూ. 20 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు పనులకు సోమవారం ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... అన్ని ప్రాంతాల్లో రోడ్లు, డ్రైనేజీ, మంచినీరు, విద్యుత్, వీధి దీపాలు తదితర అన్ని సౌకర్యాలు కలిపిస్తున్నామన్నారు. కార్పొరేటర్ దేదీప్య విజయ్, జీటీఎస్ టెంపుల్ చైర్మన్ చిన్న రమేష్, వివిధ కాలనీల నేతలు, నేతలు వేణు, చిలకల వెంకటేశ్వరరావు, దేవిరెడ్డి నాగార్జునరెడ్డి, అంబటి రామకృష్ణ, పవన్ ముదిరాజ్, సత్యనారాయణ, ఆంజనేయులు యాదవ్, సునీత, సుజాత, శివ పాల్గొన్నారు.

'సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం విఫలం'



మాట్లాడుతున్న ఎమ్మెల్యే రూబీ మనోహర్

సనత్‌నగర్: ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో కేసీఆర్ ప్రభుత్వం విఫలమైందని ఏఐసీసీ పర్యవేక్షకుడు, తమిళనాడు ఎమ్మెల్యే రూబీ మనోహర్ అన్నారు. టీపీసీసీ ప్రధాన కార్యదర్శి కోట నీలిమా ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన ప్రజాకోర్టు కార్యక్రమంలో రూబి మనోహర్ పాల్గొని మాట్లాడారు. కేసీఆర్, మోదీ రహస్య ఒప్పందంతో పని చేస్తున్నారన్నారు. హైదరాబాద్‌లో రియల్ ఎస్టేట్ అభివృద్ధి చెందిందని చెబుతున్నా ప్రభుత్వం దాని వల్ల పేద ప్రజలకు ఏం లాభం వస్తుందని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే అన్ని రంగాల్లో అభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. మోదీ హయాంలో ప్రజలను విభజించు, పాలించు పద్ధతిలో పాలన జరుగుతుందన్నారు. పార్టీ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్‌యాదవ్ మాట్లాడుతూ.. సనత్‌నగర్ నియోజకవర్గం అభివృద్ధికి దూరంగా ఉందన్నారు. కోట నీలిమా ఆధ్వర్యంలో ప్రజాకోర్టు నిర్వహించి ప్రజా సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి కృషి చేయడం సంతోషంగా ఉందన్నారు. విజయ్‌కుమార్, రాపోలు విజయ్‌కుమార్, ఎలీషా, బబ్లు, సల్మాన్ పాల్గొన్నారు.

శ్రీరాంనగర్‌లో ఆపరేషన్ చబుత్ర

రహమత్‌నగర్: శ్రీరాంనగర్‌లో బోరబండ పోలీసులు ఆదివారం రాత్రి ఆపరేషన్ చబుత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రాత్రి వేళల్లో అరుగులు, సందుల్లో కాలక్షేపం చేసే యువకులకు ఇన్‌స్పెక్టర్ కామల్ల రవికుమార్ కౌన్సెలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ మాట్లాడుతూ... అర్ధరాత్రి వరకు కూర్చోవడం మంచిది కాదాని, అసాంఘిక కార్యక్రమాలకు బీజం పడే అవకాశం ఉందన్నారు. పిల్లలు అర్ధరాత్రి బయట తిరగకుండా కట్టడి చేయాలని తల్లిదండ్రులకు సూచించారు. నిబంధనలు పాటించని వారిపై కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

క్రైం కార్నర్..

15 మంది రౌడీ షీటర్లు బైండోవర్...

బోరబండ పీఎస్ పరిధిలోని 15 మంది రౌటీషీటర్లను సోమవారం బైండోవర్ చేశారు. సత్ప్రవర్తన నిమిత్తం 15 మంది రౌడీ షీటర్లను ఎగ్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ ముందు హాజరు పర్చారు. ఒక్కొక్కరికి రూ. 50 వేల వ్యక్తిగత పూచీత్తు నిబంధన విధించి, ఒక సంవత్సర కాలానికి వీరిని బైండోవర్ చేశారని ఇన్‌స్పెక్టర్ కామల్ల రవికుమార్ తెలిపారు.

కాంట్రాక్టర్‌ను బెదిరించిన వ్యక్తిపై ఫిర్యాదు

వెంగళరావునగర్: నిర్మాణ పనులు అడ్డుకోవడమే కాకుండా తనతో పాటుగా కూలీలను సైతం ఓ వ్యక్తి బెదిరించాడని మధురానగర్ పోలీసులకు కాంట్రాక్టర్ ఫిర్యాదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... ఎల్లారెడ్డిగూడ డివిజన్ సంజయ్‌గాంధీనగర్ సర్వేనెంబర్ 138లో ఉన్న 183 గజాల స్థలాన్ని శ్రీనివాస్ అనే కాంట్రాక్టర్ విష్ణు అనే వ్యక్తి నుంచి కాంట్రాక్ట్ తీసుకున్నాడు. ఆ స్థలంలో గేటు ప్రహరీ నిర్మించేందుకు ఒప్పందం చేసుకున్నారు. ఈ క్రమంలో గత నెల 24వ తేదీ నుంచి పనులు కూడా చేపట్టాడు. రోజూ కూలీలు వచ్చి పనులు చేస్తున్నారు. గత నెల 30వ తేదీ శ్రీకాంత్ యాదవ్ అనే వ్యక్తి ప్రహరీ గేటును తన్నుకుంటూ లోనికి ప్రవేశించాడు. కూలీలను, కాంట్రాక్టర్ శ్రీనివాస్‌ను దుర్భాషలాడాడు. మరోసారి ఇక్కడ పనులు చేపడితే నీ అంతు చూస్తానంటూ బెదిరించి పనులు ఆపించాడు. దాంతో గేటుకు తాళం వేశారు. మరుసటి రోజు శ్రీకాంత్ యాదవ్‌తో పాటు మరికొందరు ఆ ప్రాంతానికి వచ్చి గేటును, ప్రహరీని ధ్వంసం చేశారు. ఆయా సంఘటనలకు ఆందోళన చెందిన కాంట్రాక్టర్ శ్రీనివాస్ తనను బెదిరిస్తున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలంటూ మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఓయూ ఈఎంఎంఆర్‌సీ డైరెక్టర్‌గా రఘుపతి

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ ఈఎంఎంఆర్‌సీ డైరెక్టర్‌గా రఘుపతి నియమితులయ్యారు. ఓయూలో జర్నలిజం పూర్తి చేసి ఈటీవీ రిపోర్టర్‌గా పనిచేసిన రఘుపతి ఐదేళ్ల క్రితం ప్రొడక్షన్ అసిస్టెంట్‌గా (బోధనేతర) ఈఎంఎంఆర్‌సీ ఉద్యోగంలో చేరారు. అనతి కాలంలోనే అధికారుల మన్ననలను పొందిన ఆయన ఇటీవల జరిగిన ఇంటర్వ్యూలో డైరెక్టర్‌గా నియమితులయ్యారు.

ఔటా అభ్యంతరం

ఈఎంఎంఆర్‌సీ డైరెక్టర్ పదవీలో సీనియర్ ప్రొఫెసర్‌ను నియమించాలని ఔటా అధ్యక్షులు ప్రొ.మనోహర్‌కు వీసీ ప్రొ.రవిందర్‌కు లేఖ రాశా రు. ఓయూలో 40 ఏళ్లుగా కొనసాగుతున్న ఈఎంఎంఆర్‌సీకి ఇంత వరకు యూజీసీ నిబంధనల ప్రకారం ప్రొఫెసర్ హోదా గల సీనియర్ అధ్యాపకులనే నియమించారని ప్రొ.మనోహర్ పేర్కొన్నారు. ఇదిలా ఉండగా పీహెచ్‌డీ, యూ జీసీ నెట్, టీచింగ్ అనుభవం గల అభ్యర్థులే ఈఎంఎంఆర్‌సీ డైరెక్టర్ పదవీకి అర్హులని నిబంధనలకు విరుద్ధంగా రఘుపతిని నియమించారని ఇంటర్వ్యూకు హాజరైన ఇతర అభ్యర్థులు ఆరోపించారు.

లిఫ్టు గుంతలో యువకుడి మృతదేహం

మృతిపై పలు అనుమానాలు



షౌకత్ (ఫైల్)

రహమత్‌నగర్: ప్రమాద వశాత్తు లిఫ్టు గుంతలో పడి ఓ యువకుడు మృతి చెందిన సంఘటన బోరబండ పోలీస్ స్టేషన్ పరిధిలోని సంజయ్‌నగర్‌లో సోమవారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ కామల్ల రవికుమార్ తెలిపిన వివరాలు ప్రకారం... సంజయ్‌నగర్‌లో సత్యనారాయణ అనే టిఫిన్ సెంటర్ యాజమాని స్థానికంగా భవన నిర్మాణం చేపడుతున్నాడు. రెండు రోజులుగా భవన నిర్మాణ పనులు జరుగడం లేదు. ఈ క్రమంలోనే సోమవారం ఉదయం మేస్త్రీగా పనిచేసే వ్యక్తి కింద పోర్షన్‌నుంచి దుర్వాసన వస్తుండటంతో అక్కడికి వెళ్లి చూడగా లిఫ్టు గుంతలో ఓ శవం పడి ఉండటాన్ని గమనించి భవన యాజమానికి సమాచారం అందించాడు. వెంటనే అతను బోరబండ పోలీసులకు సమాచారం అందించాడు. సంఘటన స్థలానికి ఎస్ఐ సర్దార్ జమాల్, డీఎస్ఐ భూపాల్‌గౌడ్‌లు చేరుకుని మృతుడు స్థానికుడే అనే అనుమానంతో పలువురు బస్తీ వాసులకు పిలిపించి చూపించారు. ఈ క్రమంలోనే ఇదే బస్తీకి చెందిన నసీమా సుల్తానా మృతుడు తన కుమారుడు షౌకత్‌గా గుర్తించి బోరుమని విలపించింది. తన కుమారుడు షౌకత్ పంజగుట్ట మటన్ షాపులో పనిచేస్తుంటాడని, శుక్రవారం నుంచి తన కొడుకు కనిపించకుండా పోయాడని తెలిపింది. శవాన్ని పోస్టు మార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ రవికుమార్ తెలిపారు. సంఘటన స్థలానికి క్లూస్ టీం, డాగ్ స్క్వాడ్ రప్పించి విచారణ చేపట్టారు.

పలు అనుమానాలు...

మృతుడు షౌకత్ మత్తు పదార్థాలు వాడే వాడని స్థానికులు చెపుతున్నారు. సత్యనారాయణ భవనంలో ఎందుకు వెళ్లాడు? దొంగతనానికి వెళ్లాడా? ఎవరితోనైనా కలిసి వెళ్లాడా? లిఫ్టు గుంతలో మద్యమత్తులో పడిపోయాడా అనే సందేహాలు సర్వత్రా వ్యక్తం మవుతున్నాయి. మూడు రోజుల వరకు శవాన్ని గమనించక పోవడం పట్ల స్థానికులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

హుక్కా పార్లర్ నిర్వాహకుడి అరెస్టు

పంజగుట్ట: నిబంధనలు ఉల్లంఘించి హుక్కా పార్లర్ నడుపుతున్న నిర్వాహకుడితో పాటు 10 మంది వినియోగదారులను పంజగుట్ట పోలీసులు అరెస్టు చేశారు. పోలీసుల సమాచారం మేరకు... ఎర్రగడ్డ శంకర్‌లాల్ నగర్‌కు చెందిన మహమ్మద్ సలీం(33) పంజగుట్ట, ఎ.ఆర్ ప్లాజాలో నిబంధనలు ఉల్లంఘించి నిషేధిత హుక్కా సెంటర్ నడుపుతున్నాడన్న పక్కా సమాచారం అందుకున్న ఎస్ఐ మహమ్మద్ యాసీన్ అలీ, అతని బృందం దాడిచేసింది. నిర్వాహకుడు మహమ్మద్ సలీంతో పాటు హుక్కా సేవిస్తున్న 10 మంది కస్టమర్లను అదుపులోకి తీసుకుని వారి నుంచి హుక్కా కుండలతో పాటు, వివిధ రకాల నిషేధిత ఫ్లేవర్లు స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



కృష్ణానగర్‌ను ముంచెత్తిన వరద..

వర్షం.. లోతట్టుప్రాంతాలు జలయమం

అల్పపీడన ప్రభావంతో సోమవారం ఉదయం నుంచి ఆగకుండా కురిసిన వర్షంతో లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ప్రధానంగా కృష్ణానగర్‌లో వరద బీభత్సాన్ని సృష్టించింది. చాలా నివాసాల్లోకి వరద నీరు చేరింది. కేబీఆర్ పార్కు నుంచి జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు దారిలో వరద నీరు పెద్ద ఎత్తున నిలిచిపోవడంతో సిబ్బంది మోటార్ల సహాయంతో వరద నీటిని పంపింగ్ చేశారు. ఖైరతాబాద్ ఓల్డ్ సీఐబీ క్వార్టర్స్ నీట మునిగింది.

–బంజారాహిల్స్





కేబీఆర్ పార్కు వద్ద నిలిచిన వరద నీరు



జూబ్లీహిల్స్ చెక్‌పోస్టు వద్ద వరద నీటిని పంపింగ్ చేస్తున్న సిబ్బంది

క్లుప్తంగా...

'రెరా' రిజిస్ట్రేషన్ తప్పనిసరి



చైర్మన్ సత్యనారాయణ

సాక్షి, హైదరాబాద్: రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులు 'రెరా' రిజిస్ట్రేషన్ తప్పనిసరిగా పొందాలని ఆ సంస్థ చైర్మన్ ఎన్.సత్యనారాయణ స్పష్టం చేశారు. తద్వారా కొనుగోలుదారుల నమ్మకానికి భరోసా ఇవ్వాలని అన్నారు. 'రెరా' నిబంధనలు ఉల్లంఘించిన మూడు ప్రాజెక్టులకు సోమవారం ఆయన షోకాజ్ నోటీసులు జారీ చేశారు. 15 రోజులలోగా వివరణ ఇవ్వాలని సంబంధిత రియల్ ఎస్టేట్ ప్రాజెక్టులను ఆదేశించారు. షాద్‌నగర్ సమీపంలోని చెరుకుపల్లి, కొందుర్గ్‌లో స్వర్గసీమ శాండిల్ ఉడ్ ఫార్మ్ ప్రైవేట్ లిమిటెడ్ 'స్వర్గసీమ సుకేతన' పేరుతో నివాస ప్లాట్లు విక్రయించే వెంచర్ చేపట్టి 'రెరా' రిజిస్ట్రేషన్ లేకుండా మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేపట్టడంపై షోకాజ్ నోటీసు జారీ చేశారు. మాదాపూర్‌కు చెందిన జేఎల్ఎల్ అనే నిర్మాణ సంస్థ 'రెరా' రిజిస్ట్రేషన్ పొందకుండా రియల్ ఎస్టేట్ వ్యాపార కార్యక్రమాలు నిర్వహించడం అథారిటీ దృష్టికి వచ్చినందున షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు తెలిపారు. మహేశ్వరం, తుక్కాపూర్ గ్రామం, శ్రీనగర్ ప్రాంతాలలో ఓఆర్ఆర్ ఎగ్జిట్ 14 ప్రాంతంలో 'కాంస్టేల్లా రియల్ ఎస్టేట్ ప్రాజెక్టు' రెరా రిజిస్ట్రేషన్ ఉండి కూడా ప్రకటనలో, వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ నంబర్ చూపని కారణంగా షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు తెలిపారు.

వెంకటేశ్వర హ్యాచరీస్ ఆస్తులు జప్తు చేసిన ఈడీ

మహారాష్ట్ర, కర్ణాటకలో కలిపి రూ.65.53 కోట్ల విలువైన స్థిరాస్తుల జప్తు

సాక్షి, హైదరాబాద్: నగదు చెల్లింపులలో అక్రమాలపై ఫెమా చట్టాల (ఫారిన్ ఎక్స్ఛేంజ్ మెనేజ్‌మెంట్ యాక్ట్) కింద నమోదైన కేసులో వెంకటేశ్వర హ్యాచరీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు చెందిన రూ.65.53 కోట్ల విలువైన స్థిరాస్తులను ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) అధికారులు జప్తు చేశారు. సదరు కంపెనీ నుంచి లండన్‌లోని వెంకీస్ ఓవర్‌సీస్ లిమిటెడ్ కంపెనీకి 2011 నుంచి అక్రమంగా నిధుల మళ్లింపు జరిగినట్లు గతంలోనే గుర్తించిన ఈడీ అధికారులు దీనిపై దర్యాప్తు చేపట్టారు. ఈ అక్రమ చెల్లింపుల సొమ్ముతో లండన్‌లోనూ స్థిరాస్తులను కొనుగోలు చేసినట్లు నిర్ధారించారు. అన్ని కీలక ఆధారాలు సేకరించిన ఈడీ అధికారులు, వెంకటేశ్వర హ్యాచరీస్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థకు చెందిన కర్ణాటక, మహారాష్ట్రలోని తొమ్మిది స్థిరాస్తులను జప్తు చేసినట్టు వెల్లడించారు.

చిట్టాలో చినబాబు!

▶ మొదటి పేజీ తరువాయి



మధ్య జరిగిన వాట్సాప్ సంభాషణలు దీన్ని ధ్రువీకరిస్తున్నాయి. ఆ రోజు చంద్రబాబు పీఏ శ్రీనివాస్ డబ్బుల పంపిణీ గురించి అడగ్గా కిలారు రాజేష్‌కు రూ.4.5 కోట్లను పార్టీ ఆఫీసులో అందించినట్లు పార్థసాని పేర్కొన్నాడు. అంకిత్ బలదూత ద్వారా రూ.2.2 కోట్లు పంపగా, రఘు రేలాకు సన్నిహితుడైన శ్రీకాంత్ ద్వారా మిగిలిన మొత్తాన్ని పంపినట్లు చెప్పడంతో ''అయితే ఓకే..'' అంటూ చంద్రబాబు పీఏ శ్రీనివాస్ బదులిచ్చాడు. ఈమేరకు నగదు తరలింపులకు సంబంధించి శ్రీకాంత్ ఫోన్ నుంచి జరిగిన వాట్సాప్ సంభాషణలను కూడా ఐటీ అధికారులు జత చేశారు. వాంగ్మూలం నమోదు సమయంలో ఈ సంభాషణలను మనోజ్ వాసుదేవ్‌కు చూపగా అది నిజమేనని అంగీకరించినట్లు ఐటీశాఖ పేర్కొంది. డేటా చౌర్యం ఐటీ గ్రిడ్ కేసులో కూడా కిలారు రాజేష్ కీలక పాత్రధారిగా వ్యవహరించిన విషయం విదితమే.

రఘు ద్వారా రూ.20.18 కోట్లు తరలింపు..

విశాఖకు చెందిన రఘు రేలా ఆర్‌వీఆర్ పేరుతో రియల్ ఎస్టేట్‌తో పాటు 18కిపైగా కంపెనీలను ఏర్పాటు చేసి వివిధ వ్యాపారాలు నిర్వహిస్తున్నాడు. షాపూర్జీ పల్లోంజీ నుంచి అక్రమంగా నగదు తరలింపులో రఘు రేలా కీలకపాత్ర పోషించినట్లు గుర్తించిన ఐటీ అధికారులు ఆర్‌వీఆర్ గ్రూపులో సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వాధీనం చేసుకున్న సాక్ష్యాల ఆధారంగా మనోజ్ వాసుదేవన్‌ను విచారించారు. చంద్రబాబు పీఏ శ్రీనివాస్ ఆదేశాల మేరకు రఘు రేలా ద్వారా మొత్తం రూ.20.18 కోట్లను తరలించినట్లు మనోజ్ పార్థసాని అంగీకరించాడు. ఈ నగదు తరలింపులో రఘుకు సన్నిహితులైన కృష్ణ, నారాయణ అనే ఇద్దరు వ్యక్తులు కీలకంగా వ్యవహరించారని, అయితే వారి గురించి తనకు ఎటువంటి వివరాలు తెలియవని పేర్కొన్నాడు. విశాఖ, విజయవాడ, హైదరాబాద్‌కు ఈ మొత్తాన్ని తరలించారని, ఇందుకు ఎక్సెల్ షీట్ స్పష్టమైన ఆధారమని ఐటీ శాఖ వెల్లడించింది.

ఓటమిపై ఆవేదన

నగదు తరలింపులో కీలకంగా వ్యవహరించిన మనోజ్ వాసుదేవ్ పార్థసాని 2019 సార్వత్రిక ఎన్నికల్లో చంద్రబాబు ఓడిపోవడాన్ని జీర్ణించుకోలేకపోయాడు. టీడీపీ ఘోరంగా ఓడిపోయి చంద్రబాబు ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయడంతో ఆయన పీఏ శ్రీనివాస్‌కు మనోజ్ వాసుదేవ్ ఒక మెసేజ్ పంపారు. తన జీవితంలో ఇటువంటి దారుణమైన రాజీనామా లేఖను చూడలేదని అందులో పేర్కొన్నారు. వీరి మధ్య బంధం ఎంత బలంగా ఉందనేందుకు ఆ మెసేజ్ నిదర్శనమని ఐటీ శాఖ తన నోటీసులో పేర్కొంది. నిర్మాణ రంగ సంస్థల నుంచి నగదును అక్రమంగా తరలించారనేందుకు ఇవి తిరుగులేని సాక్ష్యాలని, నగదు తరలింపులో మీ తనయుడు లోకేష్ సన్నిహితులు కీలకపాత్ర పోషించారనేందుకు ఇవన్నీ నిదర్శనమని చంద్రబాబుకు జారీ చేసిన నోటీసుల్లో ఐటీ శాఖ స్పష్టంగా పేర్కొంది.

సిరిధాన్యాలపై అంతర్జాతీయంగా ఆసక్తి

- కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే
- విత్తనాలు, ఆహార ఉత్పత్తులపై విదేశీ ప్రతినిధుల వాకబు
- వ్యవసాయంపై జీ–20 సదస్సు ప్రారంభం



సాక్షి, హైదరాబాద్/శంషాబాద్: ఆరోగ్యంతో పాటు పర్యావరణానికి అనుకూలమైన సిరిధాన్యాలపై ఇప్పుడు అంతర్జాతీయంగానూ ఆసక్తి పెరుగుతోందని కేంద్ర వ్యవసాయ శాఖ సహాయ మంత్రి శోభా కరంద్లాజే తెలిపారు. భారత్ అధ్యక్షతన జరుగుతున్న జీ–20 సమావేశాల్లో భాగంగా సోమవారం హైదరాబాద్‌లో మొదలైన 'క్లైమేట్ రెసిలియెంట్ ఫార్మింగ్'టెక్నికల్ వర్క్‌షాప్‌కు మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ జీ–20 సమావేశాల్లో పాల్గొంటున్న అనేక దేశాల ప్రతినిధులు, సిరిధాన్యాలపై ఆసక్తికనబరుస్తున్నారని, విత్తనాలతోపాటు ఉత్పత్తులు, వాటి తయారీ పద్ధతుల గురించి వాకబు చేస్తున్నారని తెలిపారు. విదేశీ ప్రతినిధుల ఆసక్తి ముఖ్యంగా రాగి విత్తనాలపై కనిపించిందని, మరికొందరు ఇతర ధాన్యాల గురించి కూడా అడిగారని, దేశంలోనూ ఉత్తరప్రదేశ్ వంటి రాష్ట్రాలు కూడా సిరిధాన్యాలు సాగు చేసే దిశగా అడుగులు వేస్తున్నాయని వివరించారు.

వాతావరణ మార్పులు తట్టుకోవడానికి ..

వాతావరణ మార్పుల ప్రభావం వల్ల వ్యవసాయం తీవ్రంగా దెబ్బతిని ఆహార భద్రతపై ప్రభావం పడే అవకాశం ఉన్న నేపథ్యంలో ఆ సమస్యను అధిగమించేందుకు అందరూ చేతులు కలపాలని మంత్రి పేర్కొన్నారు. వాతావరణ మార్పుల ప్రభావాన్ని తట్టుకునేందుకు భారత్ సిరిధాన్యాలను ప్రోత్సహిస్తోందన్నారు. చాలా రాష్ట్రాల్లో సిరిధాన్యాలను రేషన్ డిపోల ద్వారా కూడా అందిస్తున్నామని గుర్తు చేశారు. వ్యవసాయం విషయంలో కొన్ని రాష్ట్రాలు కేంద్ర ప్రభుత్వానికి పూర్తిగా సహకరించడం లేదని మంత్రి కరంద్లాజే ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పారు. భారతీయ వ్యవసాయ పరిశోధన సమాఖ్య (ఐసీఏఆర్) డైరెక్టర్ జనరల్ డాక్టర్ హిమాన్షు పాఠక్ మాట్లాడుతూ.. వాతావరణ మార్పులను తట్టుకునేందుకు ఐసీఏఆర్ ఇప్పటికే దాదాపు 1,880 కొత్త వంగడాలను సిద్ధం చేయడంతోపాటు నీరు, ఎరువులు వంటి వ్యవసాయ కార్యకలాపాల సమర్థ నిర్వహణకు ప్రణాళికలను కూడా రూపొందించిందని తెలిపారు. కొత్తగా అభివృద్ధి చేసిన వంగడాలన్నీ ఇప్పుడు వాడకంలో ఉన్నాయని, గత ఏడాది గోధుమ వంగడం అధిక వర్షాలను కూడా తట్టుకుని మంచి దిగుబడులు ఇచ్చిందని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఐసీఏఆర్–క్రిడా డైరెక్టర్ డాక్టర్ వి.కె.సింగ్, ఐసీఏఆర్–డీడీజీ ఎస్.కె.చౌదరి, డేర్ కార్యదర్శి అల్కా నంగియా అరోరా పాల్గొన్నారు.

మృత్యు పాశాలు

- విద్యుదాఘాతంతో వేర్వేరు చోట్ల ముగ్గురి దుర్మరణం
- మంచిర్యాలలో తండ్రి, కుమారుడు..
- సిద్దిపేట జిల్లాలో పెళ్లయిన మూడు రోజులకే నవ వరుడు..

వెలుగులు పంచే విద్యుత్ తీగలు బతుకుల్లో అంధకారం నింపాయి. ముగ్గురి జీవితాలకు ఉరితాళ్లయ్యాయి. రెండు కుటుంబాలకు తీరని శోకం మిగిల్చాయి. దండెంపై బట్టలు ఆరేస్తూ విద్యుదాఘాతానికి గురైన తండ్రి.. అతన్ని కాపాడబోయిన కొడుకు కన్నుమూస్తే.. మరోచోట కొత్త పెళ్లికొడుకు పెళ్లయిన మూడోరోజే విద్యుదాఘాతానికి గురై ప్రాణాలు కోల్పోయాడు. వేర్వేరు ప్రాంతాల్లో జరిగిన ఈ సంఘటనలు రెండు కుటుంబాల్లో తీరని విషాదం నింపాయి..



నిరంజన్‌చారి, అరుణ్ కుమార్, రాజేందర్ (ఫైల్), ప్రమాదానికి కారణమైన ఇనుప కూలర్, పైన దండెం

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల/సిద్దిపేట కమాన్: మంచిర్యాల పట్టణం ఏసీసీ కాలనీ శివరామాలయం వీధికి చెందిన ఎడ్ల రాజేందర్ (50), సెక్యూరిటీ గార్డుగా, భార్య సరోజ ఇళ్లలో స్వీపర్‌గా పనిచేస్తున్నారు. ఎంసీసీ క్వార్టర్‌లో నివసిస్తున్న వీరి కొడుకు అరుణ్‌కుమార్(17) పట్టణంలోని ఓ బైక్ షోరూంలో పనిచేస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం 3 గంటల ప్రాంతంలో షోరూం నుంచి అరుణ్‌కుమార్ ఇంటికి భోజనానికి వచ్చాడు. ఆ సమయంలో తండ్రి రాజేందర్ స్నానం చేసి, దండెంపై తువ్వాలు ఆరేస్తుండగా ఇనుప కూలర్‌కు తగిలి విద్యుదాఘాతానికి గురయ్యాడు. తండ్రి అరుపులు విని అతన్ని కాపాడబోయిన అరుణ్ కూడా విద్యుదాఘాతానికి గురయ్యాడు. రాజేందర్ తమ్ముడు కర్రతో విద్యుత్‌తీగను గట్టిగా కొట్టడంతో.. తండ్రీకొడుకులు కింద పడ్డారు. అనంతరం ప్రథమ చికిత్సలో భాగంగా వారిద్దరి శ్వాస ఆడేందుకు ప్రయత్నించినా కోలుకోలేదు. దీంతో 108 అంబులెన్సులో జిల్లా ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లగా తండ్రీకొడుకులు ఇద్దరూ అప్పటికే మృతి చెందారని వైద్యులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వివాహమైన మూడ్రోజులకే..

సిద్దిపేట రూరల్ మండలం వెంకటాపూర్‌కు చెందిన జయలక్ష్మి, పెంటయ్య చారి దంపతులకు నలుగురు కూతుళ్లు, ఏకైక కుమారుడు రామోజు నిరంజన్‌చారి (38) ఉన్నారు. వీరు కుటుంబంతో కలిసి సిద్దిపేట పట్టణం నాసర్‌పురలో నివసిస్తున్నారు. నిరంజన్ 2003 డీఎస్సీలో ప్రభుత్వ ఉపాధ్యాయునిగా ఎంపికై 2005 నుంచి పనిచేస్తున్నారు. 2012 నుంచి సిద్దిపేట ఇందిరానగర్ జెడ్పీహెచ్ఎస్‌లో ఫిజికల్ సైన్స్ స్కూల్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్నారు. నిజామాబాద్ బోధన్‌కు చెందిన అమ్మాయితో శనివారం ఘనంగా వివాహం జరిగింది. సోమవారం పట్టణంలోని ఎన్‌జీవో భవన్‌లో ఘనంగా రిసెప్షన్ ఏర్పాట్లు చేశారు. రిసెప్షన్‌కు బంధువులను ఆహ్వానించడానికి నిరంజన్ సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ తన ఇంటిపైకి వెళ్లారు. ఈ క్రమంలో భవనానికి అలంకరించిన విద్యుద్దీపాలకు సపోర్ట్‌గా కట్టిన తీగకు విద్యుత్ సరఫరా కావడంతో విద్యుదాఘాతానికి గురయ్యారు. వెంటనే కుటుంబసభ్యులు ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఒక్కగానొక్క కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులు, అక్కాచెల్లెళ్లు, నవ వధువు రోదించారు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. సహోపాధ్యాయులు, కుటుంబ సభ్యులు అశ్రునయనాలతో నిరంజన్ మృతదేహానికి అంతిమయాత్ర నిర్వహించి దహన సంస్కారాలు పూర్తి చేశారు.

ప్రజల నుంచి వసూలు చేయాల్సిందే

▶ మొదటి పేజీ తరువాయి

కేంద్రం స్పష్టం చేసింది.

ఎంత సబ్సిడీ చెల్లించకపోతే అంత మోత..

రాష్ట్ర ప్రభుత్వం చెల్లించాల్సిన మొత్తం సబ్సిడీతో పోలిస్తే వాస్తవంగా చెల్లిస్తున్న సబ్సిడీ తక్కువగా ఉంటుండటంతో డిస్కంలు భారీ ఆర్థిక నష్టాల్లో కూరుకుపోతున్నాయి. దీంతో రాష్ట్ర ప్రభుత్వం బకాయి పడిన సబ్సిడీ మేరకు చార్జీలను పెంచి వినియోగదారుల నుంచి వసూలు చేయాల్సిందేనని కేంద్రం ఆదేశించింది. ఉదాహరణకు గృహ వినియోగదారులకు విద్యుత్ సరఫరా చేసేందుకు యూనిట్‌కు రూ.8 చార్జీ ఉండగా, రాష్ట్ర ప్రభుత్వం ఇందులో రూ.4 సబ్సిడీ ఇచ్చేందుకు హామీ ఇచ్చింది. అయితే ప్రభుత్వం యూనిట్‌కు రూ.2 మాత్రమే సబ్సిడీగా చెల్లిస్తోంది. దీంతో వినియోగ దారులు చెల్లించే రూ.4కు లోటు సబ్సిడీ రూ.2 కలి పి మొత్తం రూ.6కు చార్జీ పెంచుకోవాల్సిందిగా కేంద్రం సూచించింది. ఒకవేళ ప్రభుత్వం సబ్సిడీ పూర్తి గా చెల్లించని పక్షంలో రూ.8 వసూలు చేసుకోవాల ని ఆదేశించింది.

ఇకపై సబ్సిడీల వివరాలతో త్రైమాసిక నివేదికలు

కేంద్రం ఆదేశాలతో రాష్ట్ర ప్రభుత్వం హామీ ఇచ్చిన మేరకు పూర్తిస్థాయిలో విద్యుత్ సబ్సిడీలను ఎప్పటికప్పుడు ముందస్తుగా డిస్కంలకు చెల్లించకతప్పని పరిస్థితి నెలకొంది. కాగా కేటగిరీల వారీగా వినియోగదారులు వాడిన విద్యుత్‌కు సంబంధించి ప్రభుత్వం నుంచి రావాల్సిన సబ్సిడీలను కచ్చితంగా లెక్కించడానికి కొత్త విధానాన్ని కేంద్రం అమల్లోకి తెచ్చింది. కేటగిరీల వారీగా ఓ త్రైమాసికంలో సబ్సిడీ వినియోగదారులు ఎన్ని యూనిట్ల విద్యుత్ వాడారు? ప్రతి యూనిట్ విద్యుత్‌కు రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన సబ్సిడీ ఎంత? రాష్ట్ర ప్రభుత్వం వాస్తవంగా చెల్లించిన సబ్సిడీ ఎంత? ఇంకా రావాల్సిన సబ్సిడీ బకాయిలు/లోటు ఎంత? అనే వివరాలతో రాష్ట్రాల ఈఆర్సీలు త్రైమాసిక నివేదికను విడుదల చేయాలి. ప్రతి త్రైమాసికం ముగిసిన తర్వాత 30 రోజుల్లోగా ఈఆర్సీకి డిస్కంలు ఈ మేరకు వివరాలతో నివేదికను సమర్పిస్తాయి. ఈ ప్రతిపాదనలను పరిశీలించి అవసరమైన సవరణలతో 30 రోజుల్లోగా ఈఆర్సీ తుది త్రైమాసిక నివేదికను ప్రకటిస్తుంది. నిబంధనల మేరకు విద్యుత్ సబ్సిడీ అకౌంటింగ్ జరగలేదని, సబ్సిడీల కోసం ప్రభుత్వానికి బిల్లులు పంపించలేదని తేలితే డిస్కంలోని సంబంధిత అధికారిపై చర్యలు తీసుకోవాలని ఈఆర్సీలను కేంద్రం ఆదేశించింది.

నగర వార్తలు

బీజేపీ రాష్ట్ర కార్యాలయం ముట్టడి



గన్‌ఫౌండ్రీ: ఎస్సీ వర్గీకరణపై రాజకీయ పార్టీలు తమ వైఖరిని మార్చుకోవాలని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు చెన్నయ్య డిమాండ్ చేశారు. ఎస్సీ వర్గీకరణ విషయంలో బీజేపీ తీరును నిరసిస్తూ సోమవారం మాల మహానాడు ఆధ్వర్యంలో నాంపల్లిలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయాన్ని ముట్టడించారు. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ... రాజకీయ పార్టీలు తమ స్వలాభం కోసం ఎస్సీ వర్గీకరణ అంశాన్ని తెరమీదికి తీసుకొచ్చి దళితుల మధ్య చిచ్చుపెడుతున్నాయని మండిపడ్డారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈ నెల 18 నుంచి 22 వరకు చలో ఢిల్లీ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద మాల మహానాడు మేధావులతో నిరసన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. పలు రాజకీయ పార్టీల ప్రతినిధులను కలుస్తామని ఆయన వెల్లడించారు. బీజేపీ రాష్ట్ర కార్యాలయంలోకి వెళ్లేందుకు మాల మహానాడు ప్రతినిధులు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకుని వివిధ పోలీస్ స్టేషన్లకు తరలించారు.

రాజకీయ లాభం కోసమే ఎస్సీ వర్గీకరణ: చెన్నయ్య

నాంపల్లి: ఎస్సీ వర్గీకరణ అంశంపై రాజకీయ పార్టీలు తమ వైఖరిని మార్చుకోకుంటే రానున్న ఎన్నికల్లో మాలలు ఓటు ద్వారా తగిన గుణపాఠం చెబుతారని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య హెచ్చరించారు. సోమవారం లక్డీకాపూల్ ఏసీగార్డ్స్‌లోని యేటూరి టవర్స్‌లో మాల మహానాడు అత్యవసర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా చెన్నయ్య మాట్లాడుతూ... సుప్రీం కోర్టు తీర్పునకు వ్యతిరేకంగా ఎస్సీ వర్గీకరణ అంశాన్ని తెరమీదకు తెచ్చి రాజకీయ పార్టీలు చిచ్చుపెడుతున్నాయని మండిపడ్డారు. ఇటీవల కేంద్ర మంత్రి నారాయణ స్వామి రాజ్యసభ వేదికగా ఒక ఎంపీ అడిగిన ప్రశ్నకు బదులిస్తూ ఎస్సీ వర్గీకరణ సాధ్యం కాదని స్పష్టం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. సమావేశంలో ఎస్సీ వర్గీకరణ అంశంపై సుదీర్ఘంగా చర్చించి పలు తీర్మానాలను ఆమోదించినట్లు తెలిపారు. ఈ నెల 18 నుంచి 21 వరకు ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడు ఆధ్వర్యంలో 'హలో మాల–చలో ఢిల్లీ' కార్యక్రమం, ఢిల్లీలోని జంతర్‌మంతర్ వద్ద ధర్నాలు, నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.వెంకటేష్, ప్రధాన కార్యదర్శి ఆనంద్ రావు, గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు బైండ్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉన్నత లక్ష్య సాధనకు కృషి చేయాలి



సీబీఐటీలో న్యూస్ లెటర్‌ను ఆవిష్కరిస్తున్న అతిథులు

పోలీస్ అకాడమీ డైరెక్టర్ సందీప్ శాండిల్య

మణికొండ: మన జీవితాన్ని ఉన్నతంగా తీర్చిదిద్దుకునేందుకు అదే స్థాయిలో లక్ష్యాలను ఏర్పాటు చేసుకుని వాటిని సాధించేందుకు పూర్తి స్థాయిలో కృషి చేయాల్సిన బాధ్యత ప్రతి విద్యార్థిపై ఉందని తెలంగాణ పోలీస్ అకాడమీ డైరెక్టర్ సందీప్ శాండిల్య, జేఎన్‌టీయూ రిజిస్ట్రార్ మన్సూర్ హుస్సేన్ అన్నారు. గండిపేటలోని చైతన్య భారతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (సీబీఐటీ), మహాత్మాగాంధీ ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంజీఐటీ) కళాశాలల్లో కొత్తగా చేరిన మొదటి సంవత్సరం విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా కార్యక్రమాలకు ముఖ్య అతిథులుగా హాజరైన వారు మాట్లాడుతూ... నూతన విద్యా విధానం ప్రకారం ప్రస్తుతం డ్యూయల్ డిగ్రీలను చదువుకోవచ్చన్నారు. కళాశాలల్లో ఉన్న మౌలిక సదుపాయాలను, అధ్యాపకుల జ్ఞానాన్ని సమగ్రంగా ఉపయోగించుకుని ఉన్నత స్థానాలను అధిరోహించాలన్నారు. విద్యతో పాటు కాలానికి అనుగుణంగా వస్తున్న మార్పులను ఎదుర్కొనేలా ఆలోచన సరళిని మార్చుకున్నపుడే రాణిస్తారన్నారు. ప్రపంచ వ్యాప్తంగా వస్తున్న మార్పులను నిశితంగా గమనించినపుడే ఎదిగే అవకాశం ఉంటుందన్నారు. సీబీఐటీలో జరిగిన కార్యక్రమంలో గౌరవ అతిథులుగా ఉస్మానియా యూనివర్సిటీ రిజిస్ట్రార్ పి.లక్ష్మీనారాయణ, ఎల్‌టీఐ మైండ్ ట్రీ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ కృష్ణ గొల్లపూడి, ప్రిన్సిపాల్ సీవీ నరసింహులు, ఓరియంటేషన్ ప్రోగ్రాం చైర్మన్ పి. సురేష్ , కన్వీనర్ బి. శ్రీనివాస్‌రెడ్డి, ఎంజీఐటీలో జరిగిన కార్యక్రమంలో గౌరవ అతిథిగా టీసీఎస్ రీజనల్ హెడ్ ఎస్.శ్రీకాంత్, ప్రిన్సిపాల్ జి.చంద్రమోహన్ రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ కె.సుధాకర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాశాలల న్యూస్ లెటర్‌లను అతిథులు ఆవిష్కరించారు.

స్వర్ణకార వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలి

ముషీరాబాద్: రాష్ట్రంలో స్వర్ణకారులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకుంటే పెద్ద ఎత్తున సింహగర్జన సభ నిర్వహించి తమ సత్తా చాటుతామని తెలంగాణ రాష్ట్ర స్వర్ణకార సంఘం నేతలు హెచ్చరించారు.

తమిళనాడు రాష్ట్రంలానే తెలంగాణలోనూ ప్రభుత్వం స్వర్ణకార వెల్ఫేర్ బోర్డును తక్షణమే ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. స్వర్ణకారుల ఆత్మహత్యలు నివారించాలని, కార్పొరేట్ జ్యూవెల్లరీ షాపుల వల్ల ఉపాధి కోల్పోతున్న స్వర్ణకారులకు ప్రభుత్వం చేయూతనందించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రాష్ట్ర స్వర్ణకార సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఇందిరాపార్కు ధర్నా చౌక్ వద్ద మహాధర్నా నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర విశ్వకర్మ, విశ్వబ్రాహ్మణ సంఘం గౌరవ అధ్యక్షుడు లాలుకోట వెంకటాచారి, రాష్ట్ర స్వర్ణకార సంఘం అధ్యక్షుడు వింజమూరు రామాచారి, ఉపాధ్యక్షులు రామదాసులక్ష్మణచారి, రవిప్రశాంత్ చారి, రాష్ట్ర కార్యదర్శి రాగిపల్లి సతీష్‌చారి, ప్రచారా కార్యదర్శులు నాగరాజుచారి, సతీష్ చారి, పోతులూరిచారి, సంతోష్‌కుమార్ తదితరులు మాట్లాడారు. తెలంగాణ ఉద్యమంలో విశ్వబ్రాహ్మణుల పాత్ర కీలకమైందని, తొలిదశలో ప్రొఫెసర్ జయశంకర్, మలిదశ ఉద్యమంలో శ్రీకాంతచారిలు ఎనలేని పోరాటాలు చేశారని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన 272 జీవోను పటిష్టంగా అమలు చేసి దానిలో ఉన్న లోపాలను సవరించి స్వర్ణకారులపై జరుగుతున్న పోలీసు వేధింపులను అరికట్టాలనివారు డిమాండ్ చేశారు. సంఘం నాయకులు బాల బ్రహ్మాచారి, ఎం.సతీష్‌చారి, జంగాచారి, భీష్మాచారి, హరిప్రసాద్, శ్రీహరి, వెంకటాచారి, ప్రవీణ్‌చారి, వినోద్‌కుమార్ తదితరులతో పాటు స్వర్ణకారులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



'శ్రీనిధి'పై ఏబీవీపీ నేతల దాడి

ఫర్నిచర్ ధ్వంసం: సెక్యూరిటీ సిబ్బందికి గాయాలు

పోచారం: యమ్నంపేట్‌లోని శ్రీనిధి ఇంజినీరింగ్ కళాశాలలో హాజరు శాతం తక్కువగా ఉన్న కారణంగా ఒకరు డిటెయిన్ కావడంతో గత నెల 31న ఏబీవీపీ నాయకులు కళాశాల యాజమాన్యంతో మాట్లాడేందుకు వచ్చిన సంగతి తెలిసిందే. వీరిని కళాశాలలోకి అనుమతించక పోగా సెక్యూరిటీ సిబ్బంది దాడి చేశారు. ఈ దాడుల్లో మనోహర్, సచిన్ నాయక్, ఆదిత్య గాయపడ్డారు. దీంతో మనోహర్ పోచారం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో ఆరుగురు సెక్యూరిటీ సిబ్బందిని పోలీసులు రిమాండ్ చేశారు. ఇదిలా ఉండగానే సోమవారం కళాశాలలో ఓరియంటేషన్ కార్యక్రమం జరుగుతుండగా మధ్యాహ్నం ఏబీవీపీ నాయకులు బస్సులో వచ్చి ప్రతిదాడి చేశారు. ఫర్నిచర్‌ను ధ్వంసం చేశారు. ఈ దాడుల్లో ముగ్గురు సెక్యూరిటీ సిబ్బంది తలలకు బలమైన గాయాలు తగిలాయి.

పోలీసుల అదుపులో ఏబీవీపీ నాయకులు

శ్రీనిధి ఇంజినీరింగ్ కళాశాలపై దాడి చేసిన ఏబీవీపీ నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారణ చేస్తున్నారు. పోచారం ఐటీ కారిడార్ పోలీస్ స్టేషన్ సీఐ అశోక్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం... శ్రీనిధి కళాశాలలో కొత్తగా చేరిన విద్యార్థులకు ఓరియంటేషన్ కార్యక్రమం ముగిసే సమయానికి సుమారు 20 మంది ఏబీవీపీ నాయకులతో పాటు పలువురు లోనికి ప్రవేశించి కళాశాలకు వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ దాడులకు పాల్పడ్డారు. కళాశాల ప్రాపర్టీకి నష్టం కలిగించారు. ప్రిన్సిపాల్ టి.సి.హెచ్.శివారెడ్డి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. దాడిలో పాల్గొన్న బి.శ్రీకాంత్, గొల్ల పృథ్వీ, ఆత్మకూర్ శ్రీనాథ్, ఎ.మహేష్, జి.హరిప్రసాద్, పి.ప్రతీక్ గౌడ్, ఆర్.నరేష్, పాట్టిపాక నాగరాజు, గుండు పృథ్వీరాజ్, బొక్క రాజేష్, కరకండ్ల ఆదిత్య, మేకల పవన్ కుమార్, సచిన్, చింతకాయల ఝాన్సీ తదితరులను అదుపులోకి తీసుకున్నారు.

మహిళా ఇంజినీర్లకు శిక్షణ

మాదాపూర్: ప్రతి సంవత్సరం 200 మంది మహిళా ఇంజినీర్లకు శిక్షణ ఇవ్వాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్నట్టు క్వాలీజీల్ ఇండియా ఆపరేషన్స్ అడ్వైజర్ లీడ్ మధుమూర్తి రోనాంకి పేర్కొన్నారు. మాదాపూర్‌లోని ఐ ల్యాబ్స్‌లో సోమవారం గ్రేస్ హప్పర్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని హైదరాబాద్‌లోని కేఎల్ యూనివర్శిటీ, విష్ణు ఎడ్యుకేషనల్ సొసైటీ, వాసవి కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజ్, మల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్ ఫర్ ఉమెన్, క్యాంపస్‌లలో ఏర్పాటు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. కేఎల్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్థసారథి, బీవీఆర్ ఐటీ హైదరాబాద్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్ ఫర్ ఉమెన్ ప్రిన్సిపాల్ డాక్టర్ సునీత, మల్లారెడ్డి ఇంజినీరింగ్ కాలేజ్ ఫర్ ఉమెన్ ప్రిన్సిపాల్ డాక్టర్ మాధవీలత, వీఆర్ సిద్ధార్థ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏవీ రత్నప్రసాద్, సీఐఐ తెలంగాణ చైర్మన్ శేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అంతరిక్ష రంగంలో భారత్ అపార ప్రగతి

- కేంద్ర రక్షణ మంత్రి సలహాదారు డాక్టర్ సతీశ్‌రెడ్డి



ఘట్‌కేసర్: భారతదేశం రక్షణ, అంతరిక్ష రంగాలలో అపార ప్రగతి సాధిస్తున్నదని కేంద్ర రక్షణ మంత్రి సలహాదారు డాక్టర్ సతీశ్‌రెడ్డి అన్నారు. అవుషాపూర్ విజ్ఞాన భారతి ఇంజినీరింగ్ (వీబీఐటీ) కళాశాలలో సోమవారం నిర్వహించిన గ్రాడ్యుయేషన్ డే వేడుకలకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు పట్టాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... చంద్రయాన్–3, ఆదిత్య మిషన్ సాధించిన విజయాలను యువత స్ఫూర్తిగా తీసుకొని ముందుకెళ్లాలన్నారు. విద్యార్థులు సాంకేతిక నైపుణ్యాలను పెంపొందించుకొని సాఫ్ట్‌వేర్, ఇతర పరిశ్రమలలో అవకాశాలను అందుకోవాలని పిలుపునిచ్చారు.

- వీబీఐటీలో సోమవారం బీటెక్ మొదటి సంవత్సరం విద్యార్థుల ఓరియంటేషన్ డే వేడుకలు ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ సురేశ్‌కుమార్ మాట్లాడుతూ... సాంకేతిక పరిజ్ఞానంతోపాటు భాషా నైపుణ్యం అవసరమని, అందుబాటులో ఉన్న అవకాశాలను సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. కళాశాల చైర్మన్ ఎస్.గౌతంరావు, కార్యదర్శి మనోహర్ రెడ్డి, డైరెక్టర్లు కేకేవీ శర్మ, ప్రిన్సిపాల్ పీవీఎస్ శ్రీనివాస్, విద్యార్థులు, తల్లితండ్రులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

వాసవి సరోవర్ బ్రోచర్ విడుదల

ప్రారంభ ఆఫర్ రూ. 6999

- పెట్‌పార్క్, క్లబ్‌హౌస్, వాకింగ్‌ట్రాక్, సైక్లింగ్, బ్యాడ్మింటన్ కోర్టులు, వాలీబాల్‌తోపాటు స్కేటింగ్ రింగ్, క్రికెట్ పిచ్, అవుట్‌డోర్ జిమ్
- నగరంలో మూడు సరస్సులను దత్తత తీసుకున్న వాసవి గ్రూప్
- 21.48 ఎకరాలు, 29 ఫ్లోర్‌లు, 85 స్కైవిల్లాలు, 11 టవర్స్



వాసవి సరోవర్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న సైనా నెహ్వాల్, సీఎండీ యర్రం విజయ్‌కుమార్

మాదాపూర్: ప్రాజెక్టులను కట్టేటప్పుడు శారీరకంగా ఎక్సర్‌సైజులు చేసేందుకు వసతులను కల్పించాలని ప్రముఖ బ్యాడ్మింటన్ క్రీడాకారిణి సైనా నెహ్వాల్ పేర్కొన్నారు. మాదాపూర్‌లోని హెచ్ఐసీసీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో వాసవి సరోవర్ బ్రోచర్‌ను వాసవి గ్రూప్ సీఎండీ యర్రం విజయ్‌కుమార్, డైరెక్టర్లతో కలసి సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సైనా నెహ్వాల్ మాట్లాడుతూ... వాసవి గ్రూప్ ఎక్కువ శాతం ఖాళీ స్థలాన్ని వదిలి నిర్మాణాలను చేపట్టి... ఆట స్థలాలు, వ్యాయామశాల, బ్యాడ్మింటన్ కోర్టులను ఏర్పాటు చేస్తున్నదని అభినందించారు. ఇతర రెసిడెన్షియల్‌ల కంటే వాసవి సరోవర్ 72 శాతం ఓపన్ స్పేస్‌ను కలిగి ఉందని వాసవిగ్రూప్ సీఎండీ యర్రం విజయ్‌కుమార్ తెలిపారు.

- కూకట్‌పల్లి, హైటెక్‌సిటీ వద్ద వాసవీ సరోవర్‌ని ప్రారంభించనున్నట్టు తెలిపారు. 21.48 ఎకరాలలో నిర్మించనున్నామని ప్రకటించారు. 72 శాతం ఖాళీ ప్రదేశంతో దాదాపు 100 సౌకర్యాలను కల్పిస్తున్నట్టు తెలిపారు. దేశంలో మొదటిసారిగా నగరంలో 3 సరస్సులను సీఎస్ఆర్ ఇనిషియేటివ్ కింద దత్తత తీసుకున్నట్టు తెలిపారు.
- కోమటికుంట బాచుపల్లి, చిన్నమైసమ్మ చెరువు కూకట్‌పల్లి, మొండికుంట హైటెక్‌సిటీలలో ఉన్న మూడింటిని దత్తత తీసుకున్నట్టు తెలిపారు.
- సరస్సులను సుందరీకరించడం, రక్షించడం, సంరక్షణ చేస్తుందన్నారు. ప్రణాళికాబద్ధంగా క్లబ్‌హౌస్ డిలైట్‌లు, సందడిగా ఉండే ప్రాంతాలు, ధ్యాన ప్రదేశాలు, స్కై విల్లాలు, అపార్ట్‌మెంట్ విల్లాలు కొనుగోలుదారులకు అందుబాటులో ఉన్నాయని తెలిపారు.
- కమ్యూనిటీలోనే సీనియర్ సిటిజన్‌లకు ప్రత్యేక వసతులు, పెట్‌పార్క్ సౌకర్యాలు కల్పిస్తున్నట్టు తెలిపారు.
- వాసవి సరోవర్‌లో అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన వ్యాయామశాలలు, క్లబ్‌హౌస్‌లు, చుట్టూ పచ్చిక బయళ్లు, నివాసితుల కోసం వాకింగ్‌ట్రాక్, సైక్లింగ్, బ్యాడ్మింటన్ కోర్టులు, వాలీబాల్‌తో పాటు స్కేటింగ్ రింగ్, క్రికెట్‌పిచ్, అవుట్‌డోర్ జిమ్, ఆటస్థలాలు వాసవి సరోవర్‌లో అందుబాటులో ఉన్నాయని తెలిపారు.
- 10 మిలియన్ ప్లస్ ఎస్ఎఫ్‌టీతో 30 రెసిడెన్షియల్ ప్రాజెక్ట్‌లు, 17 కమర్షియల్ ప్రాజెక్టులు అందించాయమన్నారు. ప్రారంభ ఆఫర్‌లో భాగంగా రూ. 6999కే బుక్ చేసుకోవచ్చని ఆయన వెల్లడించారు. డిసెంబర్ 2026 నాటికి అందిస్తామని తెలిపారు. వాసవి గ్రూప్ నేతలు అభిషేక్‌చందా, సౌమ్య, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

సాక్షి ఫ్యామిలీ
హైదరాబాద్
మంగళవారం ॥ 5-9-2023

టీచర్స్ డే

'మా టీచర్ ఇలా చెప్పలేదు'
'మా టీచర్ ఇలాగే చెప్పింది'
'మా టీచర్ కోప్పడుతుంది'
'మా టీచర్ మెచ్చుకుంటుంది'
పిల్లలకు ప్రతి సంవత్సరం ఒక ఫేవరెట్ టీచర్ దొరకాలి.
ఇంట్లో తల్లి తర్వాత పిల్లలు తమ ఫేవరెట్ టీచర్ మీదే ఆధారపడతారు.
వారి సాయంతో చదువు బరువును సులువుగా మోసేస్తారు.
వారు ట్రాన్స్‌ఫర్ అయి వెళితే వెక్కివెక్కి ఏడుస్తారు.
'టీచర్స్ డే' సందర్భంగా పిల్లలు అభిమానించే టీచర్ల స్వభావాలూ... లక్షణాలు... అవి కలిగి ఉన్నందుకు వారికి ప్రకటించాల్సిన కృతజ్ఞతలు.



థ్యాంక్యూ టీచర్

పిల్లలు స్కూల్‌కు రాగానే తమ ఫేవరెట్ టీచర్ వచ్చిందా రాలేదా చూసుకుంటారు. ఒకవైపు ప్రేయర్ జరుగుతుంటే మరోవైపు ఒక కంటితో ఫేవరెట్ టీచర్‌ను వెతుక్కుంటారు. క్లాసులు జరుగుతుంటాయి. వింటుంటారు. కాని ఆ రోజు టైమ్‌టేబుల్‌లో ఫేవరెట్ టీచర్ క్లాస్ కోసం ఉత్సాహంగా ఎదురు చూస్తారు. స్కూల్లో ఎందరో టీచర్లు. కాని ఒక్కో స్టూడెంట్‌కు ఒక్కో ఫేవరెట్ టీచర్. ఆ టీచర్ మాటను వేదవాక్కుగా భావించేవారు గతంలో ఉన్నారు.. రేపూ ఉంటారు. 'పాప... నువ్వు డాక్టర్ కావాలి' అనంటే డాక్టరైన వారున్నారు. 'బాబూ.. నీకు సైన్స్ బాగా వస్తోంది సైంటిస్ట్ కావాలి' అనంటే ఆ మాటలు మరువక సైంటిస్ట్ అయినవారున్నారు. ఫేవరెట్ టీచర్లు పిల్లలను గొప్పగా ఇన్‌స్పైర్ చేస్తారు. బలం ఇస్తారు. ప్రేమను పంచుతారు. వారే లేకపోతే చదువులు భారంగా మారి ఎందరో విద్యార్థులు కుదేలయి ఉండేవారు.

■ **సబ్జెక్ట్ బాగా వచ్చినవారు**

ఫేవరెట్ టీచర్లు ఎవరు అవుతారు? సబ్జెక్ట్ ఎవరికి బాగా వస్తుందో వారు చాలామందికి ఫేవరెట్ టీచర్ అవుతారు. సబ్జెక్ట్ బాగా వచ్చినవారు అది ఎలా చెప్తే పిల్లలకు బాగా అర్థమవుతుందో తెలుసుకుని చెప్తారు. పిల్లలకు అర్థం కావాల్సింది పాఠం సులభంగా అర్థం కావడం. అర్థమైతే పాఠం పట్ల భయం పోతుంది. భయం పోతే ఆ సబ్జెక్ట్ మరింతగా చదవాలనిపిస్తుంది. అందుకు కారణమైన టీచర్‌ను అభిమానించబుద్ధవుతుంది. సబ్జెక్ట్‌ను అందరికీ అర్థమయ్యేలా చెప్తూ, క్లాస య్యాక కూడా వచ్చి అడిగితే విసుక్కోకుండా సమాధానం చెప్తారనే నమ్మకం కలిగిస్తూ, చెప్తూ, పాఠం అర్థం కాని స్టూడెంట్‌ను చిన్నబుచ్చకుండా గట్టున ఎలా పడేయాలో ఆలోచించే టీచర్ ఎవరికైనా సరే ఫేవరెట్ టీచర్.

■ **మనలాంటి వారు**

పిల్లలు తమలాంటి టీచర్లను, తమను తెలుసుకున్న టీచర్లను ఇష్టపడతారు. క్లాస్‌లో రకరకాల పిల్లలు ఉంటారు. రకరకాల నేపథ్యాల పిల్లలు ఉంటారు. వారి మాతృభాషను, ప్రాంతాన్ని, నేపథ్యాన్ని గుర్తెరిగి వారితో ప్రోత్సాహకరంగా మాట్లాడే టీచర్లను పిల్లలు ఇష్టపడతారు. 'మీది గుంటూరా? ఓ అక్కడ భలే ఎండలు. భలే కారం మిరపకాయలు దొరుకుతాయిరోయ్' అని ఒక స్టూడెంట్‌తో ఒక టీచర్ అంటే ఆ స్టూడెంట్ కనెక్ట్ కాకుండా ఎలా ఉంటాడు. 'రేపు మీరు ఫలానా పండగ జరుపుకుంటున్నారా? వెరీగుడ్. ఆ పండగ గురించి నాకు తెలిసింది చెప్తానుండు' అని ఏ టీచరైనా అంటే పిల్లలు వారిని తమవారనుకుంటారు. భాషాపరంగా, సంస్కృతి పరంగా పిల్లలు కలిగి ఉన్నదంతా తమది కూడా అని భావించిన ప్రతి టీచర్ ప్రతి విద్యార్థికీ ఫేవరెట్ టీచరే.

■ **మంచి ఫ్రెండ్**

కొందరు టీచర్లు క్లాస్‌లో ఫ్రెండ్‌లా ఉంటారు. 45 నిమిషాల క్లాస్‌లో 40 నిమిషాలు పాఠం చెప్పి ఒక ఐదు నిమిషాలు వేరే కబుర్లు, విశేషాలు మాట్లాడతారు. పిల్లల కష్టసుఖాలు వింటారు. వారి తగాదాలు తీరుస్తారు. ఎవరైనా చిన్నబుచ్చుకుని ఉంటే కారణం తెలుసుకుంటారు. ముఖ్యంగా దిగువ ఆర్థిక పరిస్థితి ఉన్న పిల్లలు ఇలాంటి టీచర్లను చాలా తీవ్రంగా అభిమానిస్తారు. తమ కష్టాలు చెప్పుకోవడానికి ఒక మనిషి ఉన్నట్టుగా భావిస్తారు. అదే మంచి ఆర్థికస్థితి ఉన్న పిల్లలైతే తమకు ఎమోషనల్ సపోర్ట్ కోసం చూస్తారు. పాఠాల అలజడుల నుంచి ధైర్యం చెప్పే టీచర్‌ను అభిమానిస్తారు.

■ **అందరూ సమానమే**

ఒక టీచర్‌ను పిల్లలు ఎప్పుడు అభిమానిస్తారంటే వారు అందరినీ సమానంగా చూస్తారనే భావన కలిగినప్పుడు. టీచర్లు ఫేవరిటిజమ్ చూపిస్తే ఆ పిల్లల్ని మాత్రమే వారు ఇష్టపడతారని, తమను ఇష్టపడరని మిగతా పిల్లలు అనుకుంటారు. మంచి టీచర్లు అందరు పిల్లల్నీ ఇష్టపడతారు. 'టీచర్ నిన్నే కాదు నన్ను కూడా మెచ్చుకుంటుంది' అని పిల్లలు అనుకునేలా టీచర్ ఉండాలి. కొంతమంది స్టూడెంట్‌లు మంచి మార్కులు తెచ్చుకుంటే వారిని ఎక్కువ పొగిడి కొంతమంది స్టూడెంట్‌లు ఎంత బాగా చదువుతున్నా మెచ్చుకోకుండా ఉండే టీచర్లు పిల్లలను భావోద్వేగాలకు గురిచేస్తారు. టీచర్ మెచ్చుకోలు, టీచర్‌తో సంభాషణ పిల్లల హక్కు. అది పిల్లలకు ఇవ్వగలిగిన టీచర్ ఫేవరెట్ టీచర్.

■ **క్రమశిక్షణ**

పిల్లలు తమ ఫేవరెట్ టీచర్‌లో క్రమశిక్షణ ఆశిస్తారు. టైమ్‌కు సిలబస్ పూర్తి చేయడం, టైమ్‌కి స్కూల్‌కు రావడం, క్లాసులు ఎగ్గొట్టకపోవడం, సరిగ్గా నోట్స్ చెప్పడం, సరిగ్గా పరీక్షలకు ప్రోత్సహించడం, ఎంత సరదాగా ఉన్నా క్లాస్ జరుగుతున్నప్పుడు సీరియస్‌గా ఉండటం... ఇవీ పిల్లలు ఆశిస్తారు. తాము గౌరవించదగ్గ లక్షణాలు లేని టీచర్లను పిల్లలు ఫేవరెట్ టీచర్లు అనుకోరు.

టీచర్ వృత్తి ఎంతో గొప్ప వృత్తి. టీచర్లు కూడా మనుషులే. వారిలోనూ కోపతాపాలు ఉంటాయి. కాని ఎంతోమంది టీచర్లు పిల్లల కోసం తమ జీవితాలను అంకితం చేసి వారి జీవితాలను తీర్చిదిద్దుతారు. 'మీరు పెద్దవాళ్లయి పెద్ద పొజిషన్‌కు వెళితే అంతే చాలు' అంటూ ఉంటారు. మంచి టీచర్లు, గొప్ప టీచర్లు పిల్లల శ్రేయస్సును ఆకాంక్షించి తద్వారా వారి గుండెల్లో మిగిలిపోతారు.

పిల్లల హృదయాల్లో ప్రేమ, గౌరవం పొందిన టీచర్లందరికీ 'టీచర్స్ డే' శుభాకాంక్షలు.

స్ఫూర్తి

విజయం గురించి కలలు కనేవారికి...
విజేతల నోటి నుంచి వచ్చిన మాటలు ఆణిముత్యాలు అవుతాయి.
ఆచరణకు కొత్త మెరుగులు దిద్దుకునే పాఠాలు అవుతాయి.
వరల్డ్స్ యంగెస్ట్ ఫిమేల్ చార్టర్డ్ ఎకౌంటెంట్‌గా గిన్నిస్ బుక్‌లోకి ఎక్కిన నందిని అగర్వాల్ జోష్ టాక్ (ఇన్‌స్పిరేషనల్ టాక్స్)తో వ్యక్తిత్వ వికాస కోణంలో విద్యార్థులకు స్ఫూర్తిదాయకమైన మాటలు చెబుతోంది...

జోష్ టాక్

– కలలకు ఊపిరి



నందిని అగర్వాల్‌కు ఎప్పుడూ తొందరే. పరీక్షలు ఇంకో వారంరోజుల్లో ఉంటే 'రేపే అయితే బాగుండేది' అనుకునేది. ఈ తొందర ఆమెను రెండు క్లాసులు జంప్ చేసేలా చేసింది. అలా అన్నకు క్లాస్‌మేట్‌గా మారింది.



మధ్యప్రదేశ్‌లోని మొరెనా జిల్లాకు చెందిన నందిని అగర్వాల్ పందొమ్మిది సంవత్సరాల వయసులో సీఏ ఫైనల్ పరీక్ష ఫలితాలలో (2021)లో ఆలిండియా టాపర్‌గా నిలిచింది. అన్న సచిన్ అగర్వాల్‌కు 18 ర్యాంకు వచ్చింది. మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ట్విట్టర్‌లో ఈ అన్నాచెల్లెళ్లను ప్రత్యేకంగా ప్రశంసించారు.

ఒకరోజు నందిని చదువుతున్న స్కూల్‌కు గిన్నిస్ వరల్డ్ రికార్డ్ హోల్డర్ వచ్చారు. ఆ వ్యక్తి అపురూపంగా కనిపించారు. తాను కూడా గిన్నిస్‌బుక్‌లో పేరు సంపాదించాలని ఆ సమయంలోనే కల కన్నది నందిని.

అప్పుడే ఆమె దృష్టి సీఏపై పడింది.

అయితే సీఏ ఎంట్రెన్స్ కోచింగ్ సమయంలో తనను ఎవరూ సీరియస్‌గా తీసుకోలేదు. వారి నిర్లక్ష్యం, చిన్నచూపు తనలో మరింత పట్టుదల పెంచింది. అనుకున్న లక్ష్యాన్ని అవలీలగా సాధించి 'ఔరా' అనిపించింది.

'నా విజయంలో మా అన్నయ్యది ప్రధానపాత్ర. మాక్ టెస్ట్‌లో నాకు అత్తెసరు మార్కులు వచ్చాయి. చాలా నిరాశగా అనిపించింది. మాక్ టెస్ట్‌లోనే ఇలా ఉంటే రియల్ టెస్ట్‌లో ఎలా ఉంటుంది అని భయపడ్డాను. ఆ సమయంలో అన్నయ్య ఎంతో ధీమా ఇచ్చాడు. నువ్వు కచ్చితంగా మంచి మార్కులు తెచ్చుకోగలవు అన్నాడు. ఆ మాటలు నాకు ఎంతో ధైర్యాన్ని ఇచ్చి ముందుకు నడిపించాయి' అంటుంది నందిని.

'నందినిలోని నాకు బాగా నచ్చిన విషయం... బాగా కష్టపడి చదువుతుంది. ఒకవిధంగా చెప్పాలంటే చెల్లి నాకు స్ఫూర్తి. నందినిని చూసిన తరువాత నేను కూడా చదువుపై బాగా దృష్టి పెట్టాను' అంటాడు సచిన్ అగర్వాల్.

ఇక నందిని అగర్వాల్ 'జోష్ టాక్'లో ఆకట్టుకునే కొన్ని మాటలు...

- కొత్త వ్యక్తులు, కొత్తప్రదేశాలతో నిరంతర పరిచయం మన ప్రపంచాన్ని విస్తృతం చేస్తుంది.
- జీవితం సులభంగా సాగిపోవాలంటే కొన్నిసార్లు కఠిన నిర్ణయాలు తీసుకోక తప్పదు
- వ్యక్తిగత స్వార్థంతో చేసే సహాయానికి విలువ ఉండదు
- 'నువ్వు ఇలాగే ఉంటావు. ఇది మాత్రమే సాధించగలవు' అనే మాటలు అవతలి వ్యక్తుల నుంచి రాకుండా చూసుకోవాలి. మనం ఎలా ఉండాలి అనేది మనం నిర్ణయించుకోవాలి, మనం ఏది సాధించగలమో మనకు తెలిసి ఉండాలి. 'నీవల్ల ఏమవుతుంది!' అనేది ఎంతోమంది విజేతలకు సుపరిచితమైన మాట. ఆ మాటను తేలిగ్గా తీసుకొని 'కచ్చితంగా నా వల్లే అవుతుంది' అని వారు అనుకోవడం వల్లే విజేతలయ్యారు.
- జీవిత సత్యాలను ఎక్కడినుంచైనా నేర్చుకోవచ్చు. చివరికి ఐస్‌క్రీమ్ నుంచి కూడా! 'ఎంజాయ్ ది లైఫ్ బిఫోర్ ఇట్ మెల్ట్స్'
- సక్సెస్‌ఫుల్ లీడర్‌లు వర్క్‌ను ప్లాన్ చేసుకుంటారు. ప్లాన్ చేసుకున్న దానిపై బాగా వర్క్ చేస్తారు.
- నిన్ను నువ్వు కంట్రోల్ చేసుకోలేకపోతే ఇతరులను ఎప్పుడూ కంట్రోల్ చేయలేవు. కలల సాధనకు కష్టాన్ని జోడించకపోతే కల కనే అర్హత కోల్పోతాం
- మన జీవితానికి హ్యాపీ వెర్షన్ ఏమిటంటే బాల్య జ్ఞాపకాల్లోకి వెళ్లడం
- పనిలో తప్పులో చేసినా ఫరవాలేదుగానీ ఏమీ చేయకపోవడమంత తప్పు మరొకటి లేదు.
- మనం ఎక్కువగా భవిష్యత్ గురించి ఆలోచిస్తుంటాం. గతంలో జరిగిన పొరపాట్ల గురించి అదేపనిగా పశ్చాత్తాపపడుతుంటాం. నిజానికి మనం చేయాల్సింది... వర్తమాన జీవితాన్ని ఆనందంగా ఆస్వాదించడం.
- మీ టైమ్‌ను సేవ్ చేసుకోకపోవడం తెలియకపోతే, టైమ్ మిమ్మల్ని సేవ్ చేయదు.

సాగుబడి
పుబ్బ కార్తె: సెప్టెంబర్ 13 వరకు
ఉత్తర కార్తె: సెప్టెంబర్ 14 నుంచి

'కొబ్బరి'లో 'సుగంధా'ల గుబాళింపు!

- కొబ్బరి తోటల్లో కోకో సహా అనేక అంతర పంటల సాగుకు దక్షిణ కోస్తా జిల్లాలు అనుకూలం
- వక్క, మిరియాలు, అల్లం, పసుపు, దాల్చిన చెక్క, జాపత్రి వంటి సుగంధ ద్రవ్య పంటల సాగు
- కొబ్బరికి తోడుగా అంతర పంటలతో రైతులకు చేకూరుతున్న అదనపు ఆదాయం

■ 8-10 కూలీలు అవసరమయ్యే పనులను బైక్ ట్రాలీతో ఇద్దరు చేస్తున్నారు.
■ కొబ్బరి+ అంతర పంటల ద్వారా ఎకరానికి రూ. 1.05,000 నికరాదాయం
■ రైతు సతీశ్‌కు సి.హెచ్. రవీందర్‌రెడ్డి బెస్ట్ ఫార్మర్ అవార్డు ప్రదానం

ఉద్యాన తోటల్లో సైతం ఏదో ఒకే పంటపై ఆధారపడకుండా.. అంతర పంటల సాగు చేస్తేనే రైతులకు వ్యవసాయం గిట్టుబాటవుతుంది. కొబ్బరి రైతుల పాలిట అంతరపంటల సేద్యం కల్పతరువుగా మారింది. దక్షిణ కోస్తా ఆంధ్రా జిల్లాల్లో వాతావరణం కొబ్బరి సాగుకు అనుకూలం. అందువల్లనే ఏపీ కొబ్బరి తోటల విస్తీర్ణంలో 50 శాతానికిపైగా పాత ఉభయ గోదావరి జిల్లాల్లోనే ఉంది. కొబ్బరి తోటల్లో ఉండే పాక్షిక నీడ వల్ల చల్లని వాతావరణం ఏర్పడుతుంది. ఆ వాతావరణం సుగంధ ద్రవ్య పంటల (స్పైసెస్)కు ఎంతో అనువైనది. ముదురు కొబ్బరి తోటల్లో అనేక సుగంధ ద్రవ్య పంటలను అంతర పంటలుగా సాగు చేస్తూ, నేరుగా మార్కెటింగ్ చేసుకుంటున్న రైతుల విజయగాథలెన్నో. విశేష ప్రగతి సాధిస్తున్న అటువంటి ఇద్దరు ప్రకృతి వ్యవసాయదారులు ఉప్పలపాటి చక్రపాణి, జుజ్జూరి సతీశ్‌ల సుసంపన్న అనుభవాలను తెలుసుకుందాం..

కొబ్బరి+ వక్క+ మిరియాలు+ సిలోన్ దాల్చిన చెక్క+ పసుపు..

గత ఐదారేళ్లుగా కొబ్బరిలో అంతర పంటలు సాగు చేస్తూ.. వీటి ద్వారా ప్రధాన పంటకు తగ్గకుండా అదనపు ఆదాయం పొందవచ్చని రైతు శాస్త్రవేత్త ఉప్పలపాటి చక్రపాణి రుజువు చేస్తున్నారు. ఏలూరు జిల్లా పెదవేగి మండలం లక్ష్మీపురం గ్రామానికి చెందిన చక్రపాణి గత 13 సంవత్సరాలుగా ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో కొబ్బరి తోటలో వక్క, మిరియాలు, పసుపు అల్లం పండిస్తూ సంతృప్తికరమైన ఫలితాలు సాధిస్తున్నారు. కొబ్బరి తోటలో ఆరేళ్ల క్రితం నాటిన 2,500 వక్క చెట్లు చక్కని ఫలసాయాన్నిస్తున్నాయి. ఈ ఏడాది 700 వక్క చెట్లకు కాపు వచ్చింది. 2 టన్నుల ఎండు వక్కకాయల దిగుబడి ద్వారా రూ. 3 లక్షల 80 వేలు ఆదాయం వచ్చిందని చక్రపాణి వివరించారు. 300 కొబ్బరి చెట్లకు ఐదారేళ్ల క్రితం మిరియాల తీగలను పాకించారు. వీటిద్వారా 500 కిలోల ఎండు మిరియాల దిగుబడి వచ్చింది. కేజీ రూ.600 చొప్పున రిటైల్‌గా అమ్ముతున్నారు.



చక్రపాణి కొబ్బరి తోటలో సాగవుతున్న అంతర పంటలు

గానుగ నూనెతో ఆరోగ్యం

కొబ్బరి చెట్ల మధ్య వక్క చెట్లు పెంచి.. కొబ్బరి చెట్లకు అనేక ఏళ్ల క్రితమే మిరియం మొక్కల్ని పాకించడంతో చక్రపాణి కొబ్బరి తోట వర్టికల్ గ్రీన్ హెవెన్‌గా మారిపోయింది. కొబ్బరి చెట్లకు మిరియం మొక్కలు చుట్టుకొని ఉంటాయి కాబట్టి, మనుషులను ఎక్కించి కొబ్బరి కాయలు దింపే పద్ధతికి స్వస్తి చెప్పారు. కాయల్లో నీరు ఇంకిన తర్వాత వాటికవే రాలుతున్నాయి. రాలిన కాయలను అమ్మకుండా.. సోలార్ డ్రయ్యర్‌లో పూర్తిగా ఎండబెట్టి కురిడీలు తీస్తున్నారు. కురిడీలతో గానుగల ద్వారా సేంద్రియ కొబ్బరి నూనె తీసి నేరుగా వినియోగదారులకు విక్రయిస్తున్నారు. రెండేళ్లుగా తాము ఇంట్లో వంటలకు తమ సేంద్రియ కొబ్బరి నూనెనే వాడుతున్నామని, చాలా ఆరోగ్య సమస్యలు తీరటం గమనించామని చక్రపాణి సంతోషంగా చెప్పారు.

కేరళ మాదిరిగా ఇక్కడా పండిస్తున్నా!


రైతులు భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని సేంద్రియ వ్యవసాయ పద్ధతుల్లోనే పంటలు పండించటం నేర్చుకోవాలి. పశ్చిమ గోదావరి జిల్లాలో అప్‌లాండ్ ఏరియాలో ఉద్యాన తోటలకు అనువైన వాతావరణం ఉంది. ఇవి సారవంతమైన భూములు. ఇక్కడి నీరు కూడా మంచిది. నాలుగైదేళ్లుగా భూగర్భజలాలు పెరగడంతో నీటి సమస్య లేదు. కొబ్బరిలో అంతర పంటలకు అనుకూలంగా ఉండేలా ముందే తగినంత దూరంలో మొక్కలు నాటుకొని సాగు చేసుకోవచ్చు. అంతర పంటలద్వారా సూక్ష్మ వాతావరణం సృష్టించుకొని కేరళలో మాదిరిగా సుగంధ ద్రవ్య పంటలు సాగు చేసుకోవచ్చు. కేరళలో 35 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంటే మన దగ్గర 45 డిగ్రీల వరకు వస్తుంది. కొబ్బరిలో అంతర పంటల వల్ల బయటతో పోల్చితే పది డిగ్రీల వరకు ఉష్ణోగ్రత తక్కువగా ఉంటుంది. ఎండ, గాలిలో తేమ సమపాళ్లలో చెట్లకు అందుతున్నందున కేరళలో మాదిరిగా మిరియాలు, దాల్చిన చెక్క ఇక్కడ మా తోటలోనూ పండుతున్నాయి.



– ఉప్పలపాటి చక్రపాణి (94401 88336), లక్ష్మీపురం, పెదవేగి మం., ఏలూరు జిల్లా

పసుపు ఫ్లేక్స్

కొబ్బరి తోటలో వక్క, మిరియాలతో పాటు రెండేళ్లుగా అటవీ రకం పసుపును కూడా సాగు చేస్తున్నారు చక్రపాణి. ఈ రకం పసుపు వాసన, రంగు చాలా బాగుంది. పచ్చి పసుపు కొమ్ములను పల్చటి ముక్కలు చేసి, సోలార్ డ్రయ్యర్‌లో ఎండబెట్టి, ఆ ఫ్లేక్స్‌ను అమ్ముతున్నారు. వాటి వాసన, రంగు, రుచి అద్భుతంగా ఉన్నాయని వాడిన వారు చెబుతున్నారన్నారు.



కొబ్బరి, వక్క తోటలో అంతరపంటగా పసుపు

సిలోన్ దాల్చిన చెక్క బెటర్

కొబ్బరిలో వక్క వేయడంతో పైకి తోట వత్తుగా కనిపించినా నేలపైన అక్కడక్కడా ఖాళీ ఉంటుంది. ఆ ఖాళీల్లో గత ఏడాది నుంచి అటవీ పసుపుతో పాటు అల్లం, సిలోన్ దాల్చిన చెక్క, నట్‌మగ్‌లను సాగు చేస్తున్నామని చక్రపాణి తెలిపారు. సాధారణంగా మనం ఇళ్లలో వాడే దాల్చిన చెక్క విదేశాల నుంచి దిగుమతయ్యే సాధారణ రకం. సిలోన్ దాల్చిన చెక్క రకం దీనికన్నా మెరుగైనది. ఇది పల్చగా ఉన్నప్పటికీ, ఆరోగ్యకరమైనదని నిపుణులు చెబుతున్నారు. ఇది కూడా కోస్తా ఆంధ్రలో బాగా పండుతోందని చక్రపాణి వివరించారు. కొబ్బరి, పామాయిల్ తోటల్లో అంతర పంటల సాగు ద్వారా అధికాదాయం పొందేందుకు రైతులను ప్రోత్సహిస్తున్నట్లు పెదవేగి మండల ఉద్యాన అధికారి ఎం. రత్నమాల తెలిపారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు అవగాహన కల్పిస్తున్నామన్నారు.

– కొత్తపల్లి వినోద్‌కుమార్, సాక్షి, పెదవేగి, ఏలూరు జిల్లా

బైక్ ట్రాలీ వాడకంతో తగ్గిన కూలీల ఖర్చు





బైక్ ట్రాలీ ఖర్చు రూ. పది వేలు

ద్విచక్ర మోటారు వాహనానికి వెనుక కట్టుకొని బరువులు లాక్కెళ్లేందుకు వీలుగా ఐదేళ్ల క్రితం సతీశ్ బైక్ ట్రాలీని సొంత ఆలోచనతో తయారు చేయించుకొని వినియోగిస్తున్నారు. ఎరువులు వేయటం వంటి పనులకు ఎకరానికి 8-10 మంది కూలీలు అవసరమవుతారని బైక్ ట్రాలీ ఉండటం మూలాన ఇద్దరు కూలీలతోనే వేగంగా పని పూర్తవుతోందని సతీశ్ తెలిపారు. బైక్ ఇంజన్‌తోనే జీవామృతం, పంచగవ్య, ఇతర ద్రావణాలు, కషాయాలను సైతం సులువుగా పిచికారీ చేయగలుగుతున్నానని తెలిపారు. బైక్ ట్రాలీ తయారీకి రూ. పది వేలు ఖర్చయ్యిందని, ఈ ఐదేళ్లలో దాని ద్వారా దాదాపు రూ. 2 లక్షల వరకు డబ్బు ఆదా అయ్యిందన్నారు. దీని ద్వారా ప్రకృతి వ్యవసాయం సులువు కావటం వల్ల ఇతర రైతులు సైతం స్ఫూర్తిని పొందుతున్నారన్నారు. తనను చూసి పాతిక మంది రైతులు ప్రకృతి వ్యవసాయం చేపట్టారన్నారు. జీవామృతాన్ని ఫిల్టర్ చేయటం, పిచికారీ చేయటం వంటి పనుల్లో కూడా మనుషుల ప్రమేయం తగ్గించే ఫిల్టర్ వ్యవస్థను నిర్మించటం వల్ల వడకట్టే పని సులువైపోయిందని, పిచికారీ చప్పున పూర్తవుతోందన్నారు. బైక్ స్ప్రేయర్ ద్వారా ఎకరంలో అర గంటలోనే పిచికారీ పూర్తవుతోందన్నారు. టైప్ 2 సూపర్ జీవామృతం తయారీ పద్ధతి రైతులకు వెసులుబాటుగా ఉందన్నారు.

తూర్పు గోదావరి జిల్లా దేవరపల్లి మండలం కురుకూరు గ్రామానికి చెందిన జుజ్జవరపు సతీశ్ గత పదేళ్లుగా ప్రకృతి వ్యవసాయం చేస్తున్నారు. కొబ్బరి తోటలో ఐదంచెల సాగు ద్వారా ఎకరానికి ఏటా రూ.1,05,000 నికరాదాయం పొందుతున్నారు. మోటార్ బైక్‌తో నడిచే ట్రాలీని, బైక్‌తో నడిచే స్ప్రేయర్‌ను తానే తయారు చేయించుకోవటం ద్వారా కూలీల ఖర్చును భారీగా తగ్గించుకోవటం ఆయన ప్రత్యేకత. రైతుసాధికార సంస్థలో మాస్టర్ ట్రైనర్‌గా పనిచేస్తూ ఇతర రైతులకు మార్గదర్శకుడిగా మారారు. ఆయన స్ఫూర్తితో కురుకూరు గ్రామానికి చెందిన సుమారు పాతిక మంది రైతులు 300 ఎకరాల్లో ప్రకృతి వ్యవసాయం చేపట్టారు. రిటైర్డ్ ఐసిఏఆర్ ఉద్యోగుల సంఘం సి.హెచ్. రవీందర్‌రెడ్డి బెస్ట్ ఫార్మర్ అవార్డుతో సతీశ్‌ను ఇటీవల హైదరాబాద్‌లో సత్కరించటం విశేషం. కొబ్బరి తోటలో ఐదంచెల అంతర పంటలను ఆయన సాగు చేస్తున్నారు. మొదటి లేయర్‌గా 27×27 అడుగులకు కొబ్బరి, రెండో లేయర్‌గా కొబ్బరి చెట్ల మధ్యలో 13.5×10 అడుగులలో కోకో సాగు చేస్తున్నారు. మూడో లేయర్‌లో 7×7 అడుగులలో వక్క మొక్కలు వేశారు. నాలుగో లేయర్‌లో వక్క మొక్కలకు మిరియాలు పాకిస్తున్నారు. ఐదో లేయర్ గా ఎండ పడే చోట పైనాపిల్ మొక్కలు నాటారు. కొబ్బరి మొక్కలు లేని చోట్ల జాజికాయ మొక్కలు నాటారు.

ప్రతి 10 రోజులకు జీవామృతం డ్రిప్ ద్వారా ఇస్తున్నారు. పిచికారీ కోసం టైప్ 2 సూపర్ జీవామృతం వాడుతున్నారు. సాధారణంగా జీవామృతం తయారీకి ప్రతి సారీ ఆవు పేడ, మూత్రం అవసరం ఉంటుంది. అయితే, టైప్ 2 జీవామృతం తయారీకి ఒకసారి పేడ, మూత్రం వాడితే చాలు, ఆ తర్వాత 6 నెలల వరకు ఆ అవశేషాలకు 200 లీటర్ల నీటికి లీటరు జీవన ఎరువులతో పాటు బెల్లం జోడిస్తూ మళ్లీ మళ్లీ జీవామృతాన్ని తయారు చేసుకొని వాడటం వల్ల అదే ఫలితాలు వస్తున్నాయన్నారు.

జీవామృతం వడపోతకు తాను రూపొందించిన ఆటోమేటిక్ ఫిల్టర్ సిస్టమ్‌ను మరో 20 మంది రైతులు 200 ఎకరాల తోటల్లో వాడుతున్నారని సతీశ్ (90107 42459) తెలిపారు.

సేంద్రియ సాగుపై రైతు సదస్సులు

'నాబార్డు' సహకారంతో 'రైతునేస్తం ఫౌండేషన్' ఆధ్వర్యంలో ఈ నెల 9, 10, 11 తేదీల్లో సేంద్రియ సాగు పద్ధతులు, కషాయాలు/ద్రావణాల తయారీ, విలువ జోడింపుపై తెలంగాణలో రైతులకు అవగాహన సదస్సులు జరగనున్నాయి. 9న కరీంనగర్ జిల్లా చొప్పదండి మం., పెద్దకురుంపల్లిలోని మల్లిఖార్జున రెడ్డి తోటలో, 10న జగిత్యాల జిల్లా లక్ష్మీపూర్‌లోని ఎడమల మల్లారెడ్డి తోటలో, 11న పెద్దపల్లి జిల్లా రామగిరి మం., కల్వచర్లలోని యాదగిరి శ్రీనివాస్ తోటలో (ఉ.10 గం.-సా. 4 గం.) సదస్సులు జరుగుతాయి. పాల్గొనదలచిన రైతులు తప్పనిసరిగా ముందుగా పేర్లు రిజిస్టర్ చేసుకోవాలి. వివరాలకు.. 70939 73999 (వెంకటరెడ్డి). అందరూ ఆహ్వానితులే. ప్రవేశం ఉచితం.



నేడు భారత ప్రపంచకప్ జట్టు ప్రకటన!

స్వదేశంలో వచ్చే నెలలో జరిగే ప్రపంచకప్ వన్డే క్రికెట్ టోర్నీలో పాల్గొనే భారత జట్టును మంగళవారం మధ్యాహ్నం ప్రకటించనున్నారు. ఆసియా కప్ కోసం ఎంపిక చేసిన జట్టులో ఏమైనా మార్పులు చేసి ప్రపంచకప్‌లో ఇతర ఆటగాళ్లకు సెలక్టర్లు అవకాశం కల్పిస్తారో లేదో వేచి చూడాలి. బెంగళూరులోని జాతీయ క్రికెట్ అకాడమీలో నిర్వహించిన ఫిట్‌నెస్ పరీక్షలో భారత క్రికెటర్ కేఎల్ రాహుల్ పాస్ అయ్యాడు. దాంతో ఆసియా కప్‌లో మిగిలిన మ్యాచ్‌ల కోసం రాహుల్ మంగళవారం శ్రీలంకకు చేరుకోనున్నాడు.

వెన్నెల-శ్రియాన్షి జోడీకి టైటిల్



ఇండియా జూనియర్ ఇంటర్నేషనల్ గ్రాండ్‌ప్రి బ్యాడ్మింటన్ టోర్నీ మహిళల అండర్-19 డబుల్స్ ఫైనల్లో వెన్నెల కలగట్ల-శ్రియాన్షి వలిశెట్టి (భారత్) జోడీ టైటిల్ సాధించింది. ఫైనల్లో వెన్నెల-శ్రియాన్షి 21-19, 21-13తో ఉత్సనన్-నత్రీనా (థాయ్‌లాండ్)లపై గెలిచారు. పురుషుల అండర్-19 డబుల్స్‌లో అరిగెల భార్గవ్ రామ్-విశ్వతేజ్ గొబ్బూరు జోడీ టైటిల్ సాధించింది.

భారత టీటీ జట్టుకు పతకం ఖాయం

ఆసియా చాంపియన్‌షిప్‌లో సెమీస్‌కు



ప్యాంగ్‌చాంగ్ (దక్షిణ కొరియా): ఆసియా టేబుల్ టెన్నిస్ (టీటీ) చాంపియన్‌షిప్‌లో భారత పురుషుల జట్టు సెమీఫైనల్లోకి దూసుకెళ్లి కనీసం కాంస్య పతకాన్ని ఖాయం చేసుకుంది. సోమవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో భారత జట్టు 3-0తో సింగపూర్ జట్టును ఓడించింది. భారత మహిళల జట్టు క్వార్టర్ ఫైనల్లో 0-3తో జపాన్ చేతిలో ఓడిపోయింది. సింగపూర్‌తో తొలి మ్యాచ్‌లో 41 ఏళ్ల ఆచంట శరత్ కమల్ 11-1, 10-12, 11-8, 11-13, 14-12తో ఇజాక్ క్వెక్‌పై నెగ్గగా... రెండో మ్యాచ్‌లో సత్యన్ జ్ఞానశేఖరన్ 11-6, 11-8, 12-10తో యె ఎన్ కొయెన్ పాంగ్‌ను ఓడించాడు. దాంతో భారత్ 2-0తో ఆధిక్యంలోకి వెళ్లింది. మూడో మ్యాచ్‌లో హర్మీత్ దేశాయ్ 11-9, 11-4, 11-6తో జె యు క్లారెన్స్ చ్యూపై గెలవడంతో భారత్ 3-0తో విజయాన్ని ఖాయం చేసుకుంది. బుధవారం జరిగే సెమీఫైనల్స్‌లో చైనీస్ తైపీతో భారత్; దక్షిణ కొరియాతో చైనా తలపడతాయి.

బుమ్రా 'పుత్రోత్సాహం'



ముంబై: భారత పేస్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా తండ్రయ్యాడు. సోమవారం ముంబైలో అతని భార్య సంజనా అబ్బాయికి జన్మనిచ్చింది. తమ మొదటి బిడ్డకు 'అంగద్' అని పేరు పెట్టినట్లు బుమ్రా వెల్లడించాడు. తమ చిన్న కుటుంబం పెద్దదైందని, తమ జీవితంలో కొత్త అధ్యాయానికి సిద్ధమైనట్లు భావోద్వేగంతో ట్వీట్ చేశాడు. డెలివరీ సమయంలో భార్యతో ఉండేందుకే బుమ్రా ఆసియా కప్‌లో నేపాల్‌తో జరిగిన మ్యాచ్‌కు దూరమయ్యాడు. బుమ్రా కు కొడుకు పుట్టిన సందర్భంగా సహచర క్రికెటర్లు సూర్యకుమార్, పాండ్యా, ధావన్, కోహ్లి భార్య అనుష్క తదితరులు అతనికి అభినందనలు తెలియజేశారు.

టీమిండియా అలవోకగా...

- కుదించిన మ్యాచ్‌లో భారత్ ఘన విజయం
- 10 వికెట్లతో నేపాల్ చిత్తు
- 'సూపర్-4' దశకు రోహిత్ జట్టు

తొలి మ్యాచ్‌లో బ్యాటింగ్ ప్రాక్టీస్... కాస్త నిరాశపర్చింది. రెండో మ్యాచ్‌లో బౌలింగ్ ప్రాక్టీస్... ఇది అంతంత మాత్రమే! నేపాల్‌లాంటి జట్టును కుప్పకూల్చలేకపోయిన టీమిండియా బౌలింగ్ వైఫల్యం కనిపించింది... మధ్యలో వాన... అయితే ఎట్టకేలకు సాధికారిక బ్యాటింగ్‌తో ఉత్కంఠ లేకుండా భారత్ మ్యాచ్ ముగించింది. కుదించిన పోరులో అలవోక విజయంతో 'సూపర్-4' దశకు ముందంజ వేసింది.


ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్ రోహిత్ శర్మ


గిల్

పల్లెకెలె: ఆసియా కప్ రెండో లీగ్ మ్యాచ్‌లో భారత్ ఘనవిజయాన్ని అందుకుంది. సోమవారం జరిగిన గ్రూప్ 'ఎ' పోరులో భారత్ 10 వికెట్ల తేడాతో నేపాల్‌ను చిత్తు చేసింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన నేపాల్ 48.2 ఓవర్లలో 230 పరుగులకు ఆలౌటైంది. ఆసిఫ్ షేక్ (97 బంతుల్లో 58; 8 ఫోర్లు) అర్ధ సెంచరీ సాధించాడు. సోంపాల్ కామి (48; 1 ఫోర్, 2 సిక్స్‌లు), కుశాల్ భుర్తేల్ (38; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు) కీలక ఇన్నింగ్స్‌లు ఆడారు. అనంతరం వాన కారణంగా భారత్ లక్ష్యాన్ని 23 ఓవర్లలో 145 పరుగులుగా నిర్దేశించారు. భారత్ 20.1 ఓవర్లలో వికెట్ కోల్పోకుండా 147 పరుగులు చేసి గెలిచింది. రోహిత్ శర్మ (59 బంతుల్లో 74 నాటౌట్; 6 ఫోర్లు, 5 సిక్స్‌లు), శుబ్‌మన్ గిల్ (62 బంతుల్లో 67 నాటౌట్; 8 ఫోర్లు, 1 సిక్స్) కలిసి అజేయంగా జట్టును గెలిపించారు. ఈ విజయంతో భారత్ 'సూపర్-4' దశకు చేరగా, నేపాల్ టోర్నీ నుంచి నిష్క్రమించింది.

కీలక భాగస్వామ్యాలు...

భారత ఫీల్డింగ్ వైఫల్యాలను సొమ్ము చేసుకుంటూ నేపాల్‌కు ఓపెనర్లు భుర్తేల్, ఆసిఫ్ శుభారంభం అందించారు. తొలి వికెట్‌కు 65 పరుగులు భాగస్వామ్యం తర్వాత ఎట్టకేలకు పదో ఓవర్లో శార్దుల్ ఈ జోడీని విడదీశాడు. ఆ తర్వాత జడేజా తన బౌలింగ్‌లో 11 పరుగుల వ్యవధిలోనే తర్వాతి 3 వికెట్లు పడగొట్టి నేపాల్‌ను దెబ్బ కొట్టాడు. మరో ఎండ్‌లో ఆసిఫ్ 88 బంతుల్లో అర్ధ సెంచరీ పూర్తి చేసుకున్నాడు. అయితే కొద్ది సేపటికే ఆసిఫ్‌తో పాటు గుల్షన్ (23)ను సిరాజ్ పెవిలియన్ పంపించడంతో నేపాల్ 144/6 వద్ద నిలిచింది. ఈ దశలో సోంపాల్, దీపేంద్ర సింగ్ (29; 3 ఫోర్లు) ఆరో వికెట్‌కు 50 పరుగులు జత చేయడంతో పరిస్థితి మెరుగైంది. హార్దిక్ ఈ పార్ట్‌నర్‌షిప్‌ను విడగొట్టినా... చివర్లో చెలరేగి ఆడిన సోంపాల్ నేపాల్ స్కోరును 200 దాటించాడు. ఛేదనలో టీమిండియాకు ఎలాంటి ఇబ్బందీ ఎదురు కాలేదు. ఓపెనర్లు రోహిత్, గిల్ తమదైన శైలిలో స్వేచ్ఛగా, అలవోకగా షాట్లు ఆడి జట్టును గెలుపు దిశగా నడిపించారు.

వాన అడ్డు పడుతూ...

మ్యాచ్‌లో నాలుగుసార్లు వర్షం ఆటకు అంతరాయం కలిగించింది. నేపాల్ ఇన్నింగ్స్ సమయంలో 30 ఓవర్ల తర్వాత, 34 ఓవర్ల తర్వాత వాన కురిసింది. అయితే ఈ రెండు సందర్భాల్లో పెద్దగా ఇబ్బంది రాలేదు కానీ 37.5 ఓవర్ల తర్వాత కురిసిన వానతో సరిగ్గా గంటసేపు ఆట ఆగిపోయింది. అయినా సరే ఓవర్ల కోత లేకుండా నేపాల్ ఇన్నింగ్స్ ముగిసింది. అనంతరం భారత ఇన్నింగ్స్‌లో 2.1 ఓవర్ల తర్వాత వాన పడింది. సుమారు రెండు గంటలు అంతరాయం కలగడంతో చివరకు భారత్ ఇన్నింగ్స్‌ను కుదించి లక్ష్యాన్ని సవరించారు.

ఇదేమి ఫీల్డింగ్?

సునాయాస క్యాచ్‌లు వదిలేయడం, మిస్‌ఫీల్డింగ్, రనౌట్ అవకాశాలు చేజార్చడం, ఓవర్‌త్రోలు... ఇవన్నీ సోమవారం భారత ఫీల్డింగ్‌లో కనిపించాయి. మైదానంలో మన ఆటగాళ్లు ఇంత పేలవంగా కనిపించడం ఆశ్చర్యపర్చింది. తొలి 4.2 ఓవర్లు ముగిసేసరికి భారత ఆటగాళ్లు మూడు క్యాచ్‌లు వదిలేశారు. షమీ బౌలింగ్‌లో భుర్తేల్ ఇచ్చిన క్యాచ్‌లను శ్రేయస్, కిషన్ వదిలేయగా, సిరాజ్ బౌలింగ్‌లో ఆసిఫ్ క్యాచ్‌ను కోహ్లి వదిలేశాడు. చివర్లో సోంపాల్ క్యాచ్‌నూ కిషన్ అందుకోలేకపోయాడు.

స్కోరు వివరాలు

నేపాల్ ఇన్నింగ్స్: కుశాల్ భుర్తేల్ (సి) కిషన్ (బి) శార్దుల్ 38; ఆసిఫ్ (సి) కోహ్లి (బి) సిరాజ్ 58; భీమ్ (బి) జడేజా 7; పౌడేల్ (సి) రోహిత్ (బి) జడేజా 5; కుశాల్ మల్లా (సి) సిరాజ్ (బి) జడేజా 2; గుల్షన్ (సి) కిషన్ (బి) సిరాజ్ 23; దీపేంద్ర సింగ్ (ఎల్బీ) (బి) పాండ్యా 29; సోంపాల్ (సి) కిషన్ (బి) షమీ 48; లమిచానే (రనౌట్) 9; కరణ్ (నాటౌట్) 2; రాజ్‌భన్సీ (బి) సిరాజ్ 0; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం** (48.2 ఓవర్లలో ఆలౌట్) 230. **వికెట్ల పతనం:** 1-65, 2-77, 3-93, 4-101, 5-132, 6-144, 7-194, 8-228, 9-229, 10-230. **బౌలింగ్:** షమీ 7-0-29-1, సిరాజ్ 9.2-1-61-3, పాండ్యా 8-3-34-1, శార్దుల్ 4-0-26-1, జడేజా 10-0-40-3, కుల్దీప్ 10-2-34-0.

భారత్ ఇన్నింగ్స్: రోహిత్ (నాటౌట్) 74; గిల్ (నాటౌట్) 67; ఎక్స్‌ట్రాలు 6; **మొత్తం** (20.1 ఓవర్లలో వికెట్ నష్టపోకుండా) 147. **బౌలింగ్:** కరణ్ 4-0-26-0, సోంపాల్ 2-0-23-0, రాజ్‌భన్సీ 4-0-24-0, సందీప్ లమిచానే 4-0-39-0, దీపేంద్ర సింగ్ ఐరీ 2-0-12-0, కుశాల్ మల్లా 3-0-11-0, గుల్షన్ 1.1-0-11-0.

స్వియాటెక్‌కు షాక్

- ప్రిక్వార్టర్ ఫైనల్లో ఓడిన డిఫెండింగ్ చాంపియన్
- ఒస్టాపెంకో సంచలన విజయం
- మూడో సీడ్ జెస్సికా కూడా అవుట్
- క్వార్టర్ ఫైనల్లో జొకోవిచ్


స్వియాటెక్


ఒస్టాపెంకో

న్యూయార్క్: యూఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టెన్నిస్ టోర్నీలో సోమవారం పెను సంచలనాలు చోటు చేసుకున్నాయి. మహిళల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్, ప్రపంచ నంబర్‌వన్ ఇగా స్వియాటెక్ (పోలాండ్), మూడో సీడ్ జెస్సికా పెగూలా ప్రిక్వార్టర్ ఫైనల్లోనే నిష్క్రమించారు. 2017 ఫ్రెంచ్ ఓపెన్ చాంపియన్ ఒస్టాపెంకో (లాత్వియా) మరోసారి స్వియాటెక్‌పై తన ఆధిపత్యం చాటుకొని వరుసగా నాలుగోసారి గెలిచింది. గంటా 48 నిమిషాలపాటు జరిగిన ప్రిక్వార్టర్ ఫైనల్లో 20వ సీడ్ ఒస్టాపెంకో 3-6, 6-3, 6-1తో టాప్ సీడ్ స్వియాటెక్‌ను, మాడిసన్ కీస్ (అమెరికా) 61 నిమిషాల్లో 6-1, 6-3తో జెస్సికా పెగూలాపై గెలిచి క్వార్టర్ ఫైనల్లోకి చేరారు. ఒస్టాపెంకో ఏడు ఏస్‌లు సంధించడంతోపాటు స్వియాటెక్ సర్వీస్‌ను ఏడుసార్లు బ్రేక్ చేసింది. ఈ ఓటమితో స్వియాటెక్ వచ్చే సోమవారం విడుదలయ్యే ప్రపంచ ర్యాంకింగ్స్‌లో నంబర్‌వన్ స్థానాన్ని కోల్పోనుంది. వరుసగా 75 వారాలు టాప్ ర్యాంక్‌లో కొనసాగిన స్వియాటెక్ రెండో ర్యాంక్‌కు పడిపోతుంది. రెండో ర్యాంక్‌లో ఉన్న సబలెంకా (బెలారస్) కొత్త ప్రపంచ నంబర్‌వన్ అవుతుంది. మహిళల టెన్నిస్‌లో సింగిల్స్‌తో పాటు డబుల్స్‌లోనూ నంబర్‌వన్ ర్యాంక్‌లో నిలిచిన ఎనిమిదో క్రీడాకారిణిగా సబలెంకా గుర్తింపు పొందనుంది. 2021లో సబలెంకా డబుల్స్‌లో నంబర్‌వన్ ర్యాంక్‌ను అందుకుంది. ఇతర ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో వింబుల్డన్ చాంపియన్, తొమ్మిదో సీడ్ వొండ్రుసోవా (చెక్ రిపబ్లిక్) 6-7 (3/7), 6-3, 6-2తో పేటన్ స్టెర్న్స్ (అమెరికా)పై, ఆరో సీడ్ కోకో గాఫ్ (అమెరికా) 6-3, 3-6, 6-1తో వొజ్నియాకి (డెన్మార్క్)పై, సొరానా (రొమేనియా) 6-3, 6-3తో 15వ సీడ్ బెన్‌చిచ్ (స్విట్జర్లాండ్)పై గెలిచి క్వార్టర్ ఫైనల్లోకి ప్రవేశించారు.

2005 తర్వాత...

పురుషుల సింగిల్స్‌లో రెండో సీడ్ జొకోవిచ్ ఈ టోర్నీలో 13వసారి క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. ప్రిక్వార్టర్ ఫైనల్లో జొకోవిచ్ 6-2, 7-5, 6-4తో బోర్నా గోజో (క్రొయేషియా)పై గెలిచాడు. మరోవైపు 2005 తర్వాత యూఎస్ ఓపెన్‌లో ముగ్గురు అమెరికా క్రీడాకారులు క్వార్టర్ ఫైనల్ చేరారు. ప్రిక్వార్టర్ ఫైనల్స్‌లో పదో సీడ్ టియాఫో (అమెరికా) 6-3, 6-1, 6-4తో హిజికాటా (ఆస్ట్రేలియా)పై, తొమ్మిదో సీడ్ టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా) 7-6 (7/2), 6-4, 6-4తో స్ట్రికెర్ (స్విట్జర్లాండ్)పై, బెన్ షెల్టన్ (అమెరికా) 6-4, 6-3, 4-6, 6-4తో టామీ పాల్ (అమెరికా)పై గెలిచి క్వార్టర్ ఫైనల్లోకి అడుగు పెట్టారు. మిక్స్‌డ్ డబుల్స్ రెండో రౌండ్‌లో రోహన్ బోపన్న (భారత్)-అల్దిలా సుత్జియాది (ఇండోనేసియా) జోడీ 2-6, 5-7తో బెన్ షెల్టన్-టేలర్ టౌన్‌సెండ్ (అమెరికా) జంట చేతిలో ఓడింది.

రన్నరప్ హంపి... హారికకు మూడో స్థానం





కోల్‌కతా: టాటా స్టీల్ ఇండియా చెస్ టోర్నీలో భాగంగా సోమవారం ముగిసిన బ్లిట్జ్ ఈవెంట్‌లో ఆంధ్రప్రదేశ్ గ్రాండ్‌మాస్టర్ హంపి 12 పాయింట్లతో రన్నరప్‌గా నిలిచింది. 12.5 పాయింట్లతో చైనా గ్రాండ్‌మాస్టర్ జు వెన్‌జున్ చాంపియన్‌గా అవతరించింది. ఆంధ్రప్రదేశ్‌కే చెందిన మరో గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక 10.5 పాయింట్లతో మూడో స్థానం దక్కించుకుంది. పది మంది క్రీడాకారిణుల మధ్య 18 రౌండ్లపాటు జరిగిన బ్లిట్జ్ టోర్నీలో హంపి తొమ్మిది గేముల్లో గెలిచి, ఆరు గేమ్‌లను 'డ్రా' చేసుకొని, మూడు గేముల్లో ఓడిపోయింది. ర్యాపిడ్ ఫార్మాట్‌లో నాలుగో స్థానంలో నిలిచిన హారిక బ్లిట్జ్ ఈవెంట్‌లో ఏడు గేముల్లో నెగ్గి, ఏడు గేమ్‌లను 'డ్రా' చేసుకొని, నాలుగు గేముల్లో ఓటమి చవిచూసింది.

సినిమా

మా నమ్మకం మరింత పెరిగింది

- నవీన్ పొలిశెట్టి


● నవీన్ పొలిశెట్టి, మహేశ్‌బాబు

''మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' యునిక్ రొమాంటిక్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్. మా సినిమా ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి వచ్చిన స్పందన చూస్తుంటే చిత్రం విజయంపై నమ్మకం మరింత పెరిగింది. కృష్ణాష్టమి రోజు సినిమా రిలీజ్ అవుతోంది. కృష్ణుడు ఎలా అల్లరి చేస్తాడో, మా సినిమా కూడా అంతే అల్లరిగా ఉంటుంది'' అని నవీన్ పొలిశెట్టి అన్నారు. మహేశ్‌బాబు .పి దర్శకత్వంలో నవీన్ పొలిశెట్టి, అనుష్కా శెట్టి జంటగా నటించిన చిత్రం 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి'. వంశీ, ప్రమోద్ నిర్మించిన ఈ సినిమా ఈ నెల 7న తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో నవీన్ పొలిశెట్టి మాట్లాడుతూ– ''జాతి రత్నాలు' తర్వాత చాలా కథలు విన్నాను. కానీ 'మిస్ శెట్టి మిస్టర్ పొలిశెట్టి' నచ్చింది. నా పాత్రలో మంచి భావోద్వేగాలు ఉన్నాయి. నాగార్జునగారికి మా ట్రైలర్ బాగా నచ్చింది. 'బిగ్ బాస్' హౌస్‌లోకి 15వ కంటెస్టెంట్‌గా వెళ్లాను'' అన్నారు. ''మా సినిమా ట్రైలర్‌లో చూసింది 30 శాతం అనుకుంటే.. సినిమాలో 70 శాతం భావోద్వేగాలు, వినోదం ఉంటాయి'' అన్నారు పి. మహేశ్‌బాబు.

నవ్వుతూనే ఉన్నాను

- కిరణ్ అబ్బవరం


● నేహా శెట్టి, కిరణ్ అబ్బవరం

''రూల్స్ రంజన్' కథ వింటున్నప్పుడు రెండు గంటల పాటు నవ్వుతూనే ఉన్నాను. ప్రేక్షకులు అలాగే నవ్వుకుంటారనే నమ్మకం ఉంది'' అని కిరణ్ అబ్బవరం అన్నారు. రత్నం కృష్ణ దర్శకత్వంలో కిరణ్ అబ్బవరం, నేహా శెట్టి జంటగా నటించిన చిత్రం 'రూల్స్ రంజన్'. ఏఎం రత్నం సమర్పణలో దివ్యాంగ్ లవానియా, మురళీ కృష్ణ వేమూరి నిర్మించారు. ఈ సినిమాని ఈ నెల 28న విడుదల చేస్తున్నట్లు ఏఎం రత్నం వెల్లడించి, మాట్లాడుతూ– ''నా అనుభవం ప్రకారం ఆడియో హిట్ అయితే సినిమా సగం హిట్ అయినట్లే. మా 'రూల్స్ రంజన్'కి అమ్రిష్ అద్భుతమైన సంగీతం అందించారు'' అన్నారు. ''స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి ఆనందించదగ్గ చిత్రమిది'' అన్నారు రత్నం కృష్ణ. ''ఏఎం రత్నంగారి ఆశీస్సులతో ముందడుగు వేశాం'' అన్నారు దివ్యాంగ్, మురళీ కృష్ణ.

నా పూర్వజన్మ సుకృతం ఇది

- మూల విరాట్


● మూల విరాట్

తెలంగాణ ప్రజా కవి, స్వాతంత్ర్య సమరయోధుడు కాళోజీ నారాయణ రావు జీవితం ఆధారంగా ప్రభాకర్ జైనీ దర్శకత్వం వహించిన చిత్రం 'ప్రజాకవి కాళోజీ'. కాళోజీగా మూల విరాట్ నటించారు. విజయలక్ష్మీ జైనీ నిర్మించిన ఈ చిత్రం సెన్సార్‌కు వెళుతోంది. ఈ సందర్భంగా సోమవారం విలేకరుల సమావేశంలో ప్రభాకర్ జైనీ మాట్లాడుతూ– ''కాళోజీలాంటి గొప్ప కవి సినిమా తీయడం సాహసమే అయినప్పటికీ నాకీ అవకాశం రావడం హ్యాపీగా ఉంది'' అన్నారు. ''త్వరలో విడుదల కాబోతున్న మా సినిమాను ప్రేక్షకులు ఆశీర్వదించాలి'' అన్నారు విజయలక్ష్మీ జైనీ. ''ఈ సినిమాలో నటించడానికే సినిమా రంగంలోకి వచ్చినట్లుగా భావిస్తున్నా. కాళోజీ పాత్ర చేశాకే నా జీవితానికి సార్థకత లభించిందనే భావన కలుగుతోంది'' అన్నారు మూల విరాట్.

ఆవకాయ్... సాంబార్

తెలుగు అనగానే గుర్తొచ్చేది ఆవకాయ్... తమిళ్ అంటే సాంబార్... మలయాళంకి కూడా సాంబార్ టచ్ ఉంది. ఇప్పుడు ఆవకాయ్ డైరెక్షన్‌కి సాంబార్ సై అనడంతో క్రేజీ కాంబినేషన్ సెట్ అయింది. అదేనండీ.. మన తెలుగు డైరెక్టర్ల డైరెక్షన్‌లో తమిళ, మలయాళ హీరోలు సినిమాలు చేస్తున్నారు. ఇటు తెలుగు అటు తమిళ, మలయాళంతో పాటు పాన్ ఇండియా స్థాయిలో పలు భాషల్లో ఈ చిత్రాలు విడుదల కానున్నాయి. ఇక తెలుగు డైరెక్టర్లు - పరభాషా హీరోల కాంబో గురించి తెలుసుకుందాం.


● ధనుష్, శేఖర్ కమ్ముల


● సూర్య, చందు మొండేటి


● పరశురామ్, కార్తి


● వెంకీ అట్లూరి, దుల్కర్ సల్మాన్

శేఖర్ కమ్ముల, ధనుష్... డీ 51

వాణిజ్య అంశాల కంటే కథకి, సహజత్వానికి ప్రాధాన్యత ఇచ్చే దర్శకుల్లో శేఖర్ కమ్ముల ఒకరు. ఒక సినిమా తర్వాత మరో సినిమా వెంట వెంటనే చేసేయాలని కాకుండా కొంచెం ఆలస్యమైనా మంచి సినిమాలు తీస్తుంటారు శేఖర్ కమ్ముల. 'ఫిదా, లవ్‌స్టోరీ' వంటి వరుస హిట్లు అందుకున్న ఆయన తన తర్వాతి చిత్రాన్ని తమిళ హీరో ధనుష్‌తో చేస్తున్నారు. 'డీ 51' (వర్కింగ్ టైటిల్) పేరుతో తెలుగు–తమిళ భాషల్లో ఈ సినిమా రూపొందనుంది. ఈ చిత్రంలో ఇంతకు ముందు చూడని సరికొత్త పాత్రలో ధనుష్‌ని చూపించనున్నారట శేఖర్. సోనాలీ నారంగ్ సమర్పణలో సునీల్ నారంగ్, పుస్కూర్ రామ్మోహన్ రావు ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. రష్మికా మందన్న హీరోయిన్‌గా నటిస్తున్న ఈ సినిమాలో నాగార్జున కీలక పాత్ర చేస్తున్నారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ, హిందీ భాషల్లో ఈ చిత్రం రూపొందనుంది. కాగా ధనుష్ చేసిన తొలి తెలుగు స్ట్రయిట్ మూవీ 'సార్'. వెంకీ అట్లూరి దర్శకత్వంలో ఈ చిత్రం రూపొందింది. శేఖర్ కమ్ముల డైరెక్షన్‌లో ధనుష్ చేస్తున్నది సెకండ్ స్ట్రయిట్ తెలుగు మూవీ అవుతుంది.

★ ★ ★

చందు, సూర్య కాంబో కుదిరిందా?

'కార్తికేయ 2' సినిమాతో పాన్ ఇండియా స్థాయిలో హిట్ అందుకున్నారు డైరెక్టర్ చందు మొండేటి. ప్రస్తుతం నాగచైతన్య హీరోగా 'ఎన్‌సీ 23' (వర్కింగ్ టైటిల్) సినిమా ప్రీ ప్రొడక్షన్ పనుల్లో బిజీగా ఉన్నారు చందు. ఇప్పటివరకూ తెలుగు హీరోలతోనే సినిమాలు తీసిన ఆయన తమిళ హీరో సూర్యతో ఓ సినిమా చేయనున్నారు. వీరి కాంబినేషన్లో ఓ సినిమా రానుందంటూ కొన్నాళ్లుగా ప్రచారం జరుగుతోంది. సూర్య–చందు కాంబినేషన్ దాదాపు కుదిరిందని టాక్. సరైన కథ కుదిరితే డైరెక్ట్ తెలుగు సినిమా చేస్తానంటూ చెప్పుకొస్తున్న సూర్య.. చందు మొండేటి చెప్పిన కథ తెలుగు ఎంట్రీకి కరెక్ట్ అని భావించారట. మైథాలజీ నేపథ్యంలో సోషియో–ఫ్యాంటసీ జానర్‌లో ఈ చిత్రకథ ఉంటుందని టాక్.

★ ★ ★

పరశురామ్‌తో కార్తీ?

'గీత గోవిందం, సర్కారు వారి పాట' చిత్రాలతో వరుస హిట్లు అందుకున్నారు డైరెక్టర్ పరశురామ్. 'గీత గోవిందం' వంటి బ్లాక్ బస్టర్ తర్వాత హీరో విజయ్ దేవరకొండ–డైరెక్టర్ పరశురామ్ కాంబినేషన్‌లో మరో సినిమా షూటింగ్ జరుపుకుంటోంది. కాగా తమిళ హీరో కార్తీతో పరశురామ్ ఓ సినిమా తెరకెక్కించనున్నారనే వార్తలు కొన్నాళ్లుగా వినిపిస్తున్నాయి. ఆ మధ్య చెన్నై వెళ్లి కార్తీకి కథ వినిపించారట ఆయన. 'ఊపిరి' (2016) సినిమా తర్వాత తెలుగులో ఓ సరైన స్ట్రయిట్ ఫిల్మ్ చేయాలని ఎంతో ఆసక్తిగా ఉన్న కార్తీకి పరశురామ్ చెప్పిన కథ నచ్చడంతో పచ్చజెండా ఊపారని టాక్. ఈ సినిమాకు 'రెంచ్ రాజు' అనే టైటిల్ కూడా పరిశీలనలో ఉందట. ఈ చిత్రాన్ని తెలుగు, తమిళ భాషల్లో రూపొందించాలని భావిస్తున్నారట పరశురామ్. అటు కార్తీ, ఇటు పరశురామ్ తమ తమ సినిమాలతో బిజీగా ఉన్నారు. ఆయా చిత్రాలు పూర్తయ్యాకే వీరి సినిమా సెట్స్‌పైకి వెళ్లే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.


★ ★ ★

వెంకీతో దుల్కర్ లక్కీ భాస్కర్

తమిళ హీరో ధనుష్‌తో 'సార్'(తమిళంలో వాత్తి) సినిమాని తెరకెక్కించి, సూపర్ హిట్ అందుకున్నారు డైరెక్టర్ వెంకీ అట్లూరి. తెలుగు, తమిళ భాషల్లో ఈ చిత్రం బ్లాక్‌బస్టర్‌గా నిలిచింది. తన తాజా చిత్రాన్ని మలయాళ హీరో దుల్కర్ సల్మాన్‌తో తీస్తున్నారు వెంకీ అట్లూరి. 'లక్కీ భాస్కర్' టైటిల్‌తో ఈ చిత్రం రూపొందుతోంది. పాన్ ఇండియా స్థాయిలో వెంకీ అట్లూరితో 'సార్' నిర్మించిన సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య 'లక్కీ భాస్కర్' నిర్మిస్తున్నారు. 'సార్' సినిమాతో విద్యా వ్యవస్థ నేపథ్యంలో సమాజానికి చక్కని సందేశం ఇచ్చిన వెంకీ అట్లూరి 'లక్కీ భాస్కర్' ద్వారా మరో విభిన్న కథాంశంతో ప్రేక్షకులను మెప్పించనున్నారట. ఒక సామాన్యుడు తనకు అడ్డొచ్చిన అసమానతలను దాటుకుని ఉన్నత శిఖరాలను ఎలా చేరుకున్నాడు? అనే నేపథ్యంలో ఈ చిత్రం రూపొందుతోంది. కాగా 'మహా నటి', 'సీతా రామం' వంటి సూపర్ హిట్ చిత్రాల తర్వాత దుల్కర్ సల్మాన్ నటిస్తున్న మరో స్ట్రయిట్ తెలుగు చిత్రం 'లక్కీ భాస్కర్'.

రీల్స్

సిరిమల్లె పువ్వా..


● తన్వి నేగి

'పదహారేళ్ళ వయసు' చిత్రంలోని 'సిరిమల్లె పువ్వా' పాట ఎవర్ గ్రీన్. ఈ పాటలో శ్రీదేవి అభినయం, అందం అద్భుతం. ఈ పాటను 'ఓటు' సినిమా కోసం రీమిక్స్ చేశారు. హృతిక్ శౌర్య, తన్వి నేగి జంటగా నటించిన చిత్రం ఇది. ఫ్లిక్ నైన్ స్టూడియోస్ నిర్మాణంలో రవి దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం త్వరలోనే విడుదల కానుంది. ఈ సందర్భంగా ఈ సినిమాలోని 'సిరిమల్లె పువ్వా..' పాటను దర్శకుడు కె. రాఘవేంద్రరావు రిలీజ్ చేసి, శుభాకాంక్షలు తెలిపారు. ''ఒరిజినల్ పాటలోని మాధుర్యాన్ని మరింత పెంచుతూ అద్భుతంగా ఈ పాటని రీమిక్స్ చేశారు సిద్ధార్థ్. తన్వి విజువల్స్ ప్లెజెంట్‌గా ఉంటాయి'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సంగీతం: అగస్త్య.

పెదకాపు రెడీ


● విరాట్ కర్ణ

విరాట్ కర్ణ, ప్రగతి శ్రీవాస్తవ జంటగా శ్రీకాంత్ అడ్డాల దర్శకత్వం వహించిన చిత్రం 'పెదకాపు-1'. మిర్యాల రవీందర్ రెడ్డి నిర్మించారు. ఈ చిత్రాన్ని ఈ నెల 29న రిలీజ్ చేస్తున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ''న్యూ ఏజ్ పొలిటికల్ థ్రిల్లర్‌గా 'పెదకాపు-1' రూపొందింది. అణచివేత, ఘర్షణల నేపథ్యంలో కథ సాగుతుంది. ఇద్దరు శక్తివంతమైన వ్యక్తులకు వ్యతిరేకంగా ఒక సామాన్యుడి పోరాటం ఆసక్తిగా ఉంటుంది'' అని యూనిట్ పేర్కొంది. ఈ చిత్రానికి సమర్పణ: మిర్యాల సత్యనారాయణ రెడ్డి, సంగీతం: మిక్కీ జె మేయర్, కెమెరా: ఛోటా కె. నాయుడు.

గురు బ్రహ్మ.. గురు విష్ణు


● వికాష్ వశిష్ట, కుషిత

వికాష్ వశిష్ట హీరోగా, మోక్ష, కుషిత కళ్లపు హీరోయిన్లుగా అంజిరామ్ దర్శకత్వం వహించిన చిత్రం 'నీతోనే నేను'. ఎమ్. సుధాకర్ రెడ్డి నిర్మించిన ఈ చిత్రానికి కార్తీక్ బి. కడగండ్ల సంగీతం అందించారు. నేడు ఉపాధ్యాయుల దినోత్సవం సందర్భంగా ఈ సినిమా నుంచి 'గురు బ్రహ్మ.. గురు విష్ణు..' అంటూ సాగే లిరికల్ సాంగ్‌ని రిలీజ్ చేశారు. ఈ పాటను సుద్దాల అశోక్ తేజ రాయగా, మనో పాడారు. ''మంచి సమాజం కావాలంటే గొప్ప ఉపాధ్యాయుల వల్లే సాధ్యమవుతుంది. అలాంటి వారి గొప్పతనాన్ని తెలియజేసేలా ఈ పాట ఉంటుంది. త్వరలో చిత్రాన్ని రిలీజ్ చేస్తాం'' అన్నారు ఎమ్. సుధాకర్ రెడ్డి.

ఇడియట్ ప్రేమకథ


● యశ్వంత్, త్రిప్తి

యశ్వంత్ యజ్జవరపు, త్రిప్తి శంకర్ జంటగా వెంకట్ కదలి తెరకెక్కించిన చిత్రం 'ఓయ్ ఇడియట్'. శ్రీనుబాబు పుల్లేటి, సత్తిబాబు మోటూరి నిర్మించారు. శ్రీనుబాబు పుల్లేటి, సత్తిబాబు మోటూరి మాట్లాడుతూ– ''చక్కని ప్రేమకథా చిత్రం 'ఓయ్ ఇడియట్'. టీనేజ్ లవ్ స్టోరీని వెంకట్ కదలి ఆహ్లాదకరంగా చూపించారు. పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు పూర్తయ్యాయి. త్వరలో విడుదల తేదీ ప్రకటిస్తాం'' అన్నారు.

సాక్షి బిజినెస్
మంగళవారం
5-9-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	241	65,628
నిఫ్టీ ▲	94	19,529

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ఫ్లస్' చూడండి

విదేశీ సూచీలు (గత శుక్రవారం ముగింపు)

నాస్‌డాక్	14,032	▽	3
డోజోన్స్	34,838	▲	116
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,453	▽	12
డాక్స్	15,825	▽	15
షాంఘై	3,177	▲	44
నికాయ్	32,939	▲	229

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ (రూ.లలో)

ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	59,393
బంగారం (99.5 స్వచ్ఛత)	59,155
వెండి (కేజీ)	73,298

ఫారెక్స్ రేట్లు (రూ.లలో)

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఒకటి	81.93	83.60
£	బ్రిటన్ పౌండ్	ఒకటి	102.65	106.03
€	యూరో	ఒకటి	87.74	90.85
¥	జపాన్ ఎన్ (100)	ఒకటి	55.76	57.51
AU$	ఆస్ట్రేలియా డాలర్	ఒకటి	52.43	54.77
S$	సింగపూర్ డాలర్	ఒకటి	60.19	62.15
SAR	సౌదీ రియాల్	[illegible]	21.11	22.73
UAE D	యూఏఈ దిర్హామ్	[illegible]	21.63	23.43
¥	చైనా యువాన్	[illegible]	10.26	12.33

హోండా ఎలివేట్ వచ్చేసింది



- ధరల శ్రేణి రూ.10.99–15.99 లక్షలు
- మైలేజీ 15.31–16.92 కిలోమీటర్లు

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: వాహన తయారీ సంస్థ హోండా కార్స్ ఇండియా భారత మార్కెట్లోకి మధ్యస్థాయి ఎస్‌యూవీ ఎలివేట్ ప్రవేశపెట్టింది. ఎలివేట్‌కు భారత్ తొలి మార్కెట్ కాగా, ఈ మోడల్ ద్వారా కంపెనీ మధ్యస్థాయి ఎస్‌యూవీల్లోకి ఎంట్రీ ఇచ్చింది. ధర ఎక్స్‌షోరూంలో రూ.10.99–15.99 లక్షలు ఉంది. 121 పీఎస్ పవర్, 145 ఎన్ఎం టార్క్‌తో 6–స్పీడ్ మాన్యువల్, 7–స్పీడ్ సీవీటీ ట్రిమ్స్‌లో 1.5 లీటర్ ఐ–వీటీఈసీ పెట్రోల్ ఇంజన్ పొందుపరిచారు. లీటరుకు మైలేజీ మాన్యువల్ ట్రిమ్ 15.31, సీవీటీ 16.92 కిలోమీటర్లు అని కంపెనీ తెలిపింది. అడ్వాన్స్‌డ్ డ్రైవర్ అసిస్టెన్స్ సిస్టంతో తయారైంది. 6 ఎయిర్‌బ్యాగ్స్, లేన్ వాచ్ కెమెరా, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ, ట్రాక్షన్ కంట్రోల్‌తో వెహికిల్ స్టెబిలిటీ అసిస్ట్, హిల్ స్టార్ట్ అసిస్ట్, మల్టీ యాంగిల్ రేర్ వ్యూ కెమెరా, 458 లీటర్ల కార్గో స్పేస్, 7 అంగుళాల హెచ్‌డీ ఫుల్ కలర్ టీఎఫ్‌టీ మీటర్ క్లస్టర్, 10.25 అంగుళాల ఐపీఎస్ హెచ్‌డీ ఎల్సీడీ టచ్ స్క్రీన్ డిస్‌ప్లే ఆడియో, డ్రైవ్ వ్యూ రికార్డింగ్ వంటి హంగులు ఉన్నాయి. హ్యుందాయ్ క్రెటా, మారుతీ సుజుకీ గ్రాండ్ విటారా, కియా సెల్టోస్, టయోటా అర్బన్ క్రూజర్ హైరైడర్‌కు పోటీనిస్తుంది.

అయిదు ఎస్‌యూవీలు: భారత్‌లో 2030 నాటికి అయిదు ఎస్‌యూవీలను ప్రవేశపెట్టనున్నట్టు హోండా కార్స్ ఇండియా ప్రెసిడెంట్, సీఈవో టకూయా సుమురు తెలిపారు. 'భారత ప్యాసింజర్ కార్ల పరిశ్రమలో ఎస్‌యూవీల వాటా ఏడాదిలో 43 నుంచి 48 శాతానికి చేరింది. ఈ విభాగం కంపెనీకి చాలా కీలకం కానుంది. ఎలివేట్ చేరికతో కంపెనీకి కొత్త కస్టమర్లు తోడు కానున్నారు. ఎస్‌యూవీ విభాగంలో లేకపోవడంతో చాలా కోల్పోయాం. అందుకే ఎలివేట్‌ను పరిచయం చేయడం గొప్పగా భావిస్తున్నాం' అని వివరించారు. రాజస్తాన్‌లోని ప్లాంటు సామర్థ్యాన్ని పెంచామని, ప్రస్తుతం రోజుకు 660 యూనిట్లు ఉత్పత్తి చేయగలమని చెప్పారు. జూలై నుంచి ఎలివేట్ బుకింగ్స్ ప్రారంభం అయ్యాయి.

ప్రకృతి ఆధారిత ప్రాజెక్టులపై భారీగా పెట్టుబడులు: అమెజాన్



న్యూఢిల్లీ: ఆసియా పసిఫిక్ ప్రాంతంలో ప్రకృతి ఆధారిత ప్రాజెక్టులలో పెట్టుబడుల కోసం 15 మిలియన్ డాలర్ల ఫండ్‌ను ఏర్పాటు చేసినట్లు ఈ–కామర్స్ దిగ్గజం అమెజాన్ తెలిపింది. ఇందులో ప్రాథమికంగా 3 మిలియన్ డాలర్ల మొత్తాన్ని భారత్‌లో ఇన్వెస్ట్ చేయనున్నట్లు వివరించింది. 'తొలి ప్రాజెక్టు కింద, అనేక వన్యప్రాణులకు ఆలవాలంగా ఉండే పశ్చిమ కనుమల పరిరక్షణకు కృషి చేస్తున్న సెంటర్ ఫర్ వైల్డ్‌లైఫ్ స్టడీస్ (సీడబ్ల్యూఎస్)తో కలిసి పని చేయనున్నాం' అని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. సీడబ్ల్యూఎస్ చేపట్టే 'వైల్డ్ కార్బన్' ప్రోగ్రామ్ కోసం 1 మిలియన్ డాలర్లు అందించనుంది. ఫల, కలప, ఔషధ అవసరాలకు ఉపయోగపడే పది లక్షల పైచిలుకు మొక్కలను నాటి, పెంచడంలో 10,000 మంది రైతులకు తోడ్పాటు అందించేందుకు దీన్ని ఉద్దేశించారు. విస్తారమైన అడవులు, తీరం గల ఆసియా–పసిఫిక్ ప్రాంతానికి వాతావరణం పరమైన మార్పుల రిస్కులూ గణనీయంగా ఉంటాయని అమెజాన్ గ్లోబల్ వైస్ ప్రెసిడెంట్ కెరా హస్ట్ తెలిపారు.

మెటల్, ఐటీ షేర్ల జోరు

- నెల గరిష్టానికి నిఫ్టీ
- సూచీలకు రెండో రోజూ లాభాలే
- ఆల్ టైం హైకి ఇన్వెస్టర్ల సంపద

ముంబై: మెటల్, ఐటీ, ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్లు రాణించడంతో సోమవారం స్టాక్ సూచీలు నెల గరిష్ట స్థాయి వద్ద ముగిశాయి. దేశీయంగా ప్రోత్సాహకర స్థూల ఆర్థిక గణాంకాల నమోదు, ప్రపంచ ఈక్విటీ మార్కెట్లలోని సానుకూల అంశాలు కలిసొచ్చాయి. ఫలితంగా సోమవారం సెన్సెక్స్ 241 పాయింట్లు 65,628 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 94 పాయింట్లు పెరిగి 19,529 వద్ద నిలిచింది. సూచీలకు ఇది రెండో లాభాల ముగింపు. ఉదయం సానుకూల ప్రారంభం తర్వాత అమ్మకాల ఒత్తిడికి లోనైన సూచీలు వెంటనే తేరుకున్నాయి. ఒక దశలో సెన్సెక్స్ 297 పాయింట్లు ర్యాలీ చేసి 65,684 వద్ద, నిఫ్టీ 110 పాయింట్లు బలపడి 19,545 వద్ద ఇంట్రాడే గరిష్టాలను అందుకున్నాయి. ఎఫ్ఎంసీజీ, కన్జూమర్ డ్యూరబుల్స్ మినహా అన్ని రంగాల షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఫలితంగా బీఎస్ఈ మిడ్, స్మాల్ క్యాప్ సూచీలు దాదాపు ఒకశాతం పెరిగాయి. సెన్సెక్స్ రెండు రోజుల ర్యాలీతో బీఎస్ఈలో రూ.5.42 లక్షల కోట్ల సంపద సృష్టి జరిగింది. దీంతో ఇన్వెస్టర్ల సంపదగా భావించే బీఎస్ఈ నమోదిత కంపెనీల మొత్తం మార్కెట్ విలువ జీవిత కాల గరిష్ట స్థాయి రూ.315 లక్షల కోట్లకు చేరింది. విదేశీ ఇన్వెస్టర్లు రూ.3367 కోట్ల ఈక్విటీలను అమ్మేశారు. సంస్థాగత ఇన్వెస్టర్లు రూ.2563 కోట్ల షేర్లను కొన్నారు. ఆసియాలో థాయిలాండ్ తప్ప అన్ని దేశాల సూచీలు 0.50% నుంచి 2.50% పెరిగాయి. యూరప్ ఇండెక్సులు అరశాతం బలపడ్డాయి. లేబర్ డే సందర్భంగా సోమవారం అమెరికా మార్కెట్లకు సెలవు.

మార్కెట్లో మరిన్ని సంగతులు...

- ఆర్థిక వ్యవస్థ పుంజుకుంటుందనేందుకు సంకేతంగా బలమైన స్థూల గణాంకాల నమోదుతో మెటల్ షేర్లకు డిమాండ్ నెలకొంది. నాల్కో, సెయిల్, ఎన్ఎండీసీ షేర్లు 6% ర్యాలీ చేశాయి. టాటా స్టీల్, హిందాల్కో, జేఎస్ఎల్, వేదాంత, హిందుస్తాన్ కాపర్ షేర్లు 4–2% పెరిగాయి. హిందుస్తాన్ జింక్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, జిందాల్ స్టీల్, జేఎస్‌డబ్ల్యూ స్టీల్ షేర్లు ఒకశాతం లాభపడ్డాయి.



ఈఎంఎస్ ఆఫర్.. రూ.200–211

నీరు, మురుగునీటి పారుదల మౌలిక కార్యకలాపాల్లోని ఈఎంఎస్ ఐపీవో ఈ నెల 8న ప్రారంభం కానుంది. ఈ నెల 12న ముగియనుంది. ఒక్కో షేరుకు ధరల శ్రేణిగా రూ. 200–211ను ప్రకటించింది. ఐపీవో ద్వారా కంపెనీ రూ. 321 కోట్లు సమీకరించనుంది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

5-9-2023	
విశాఖ	500–00
చిత్తూరు	468–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	485–00
విజయవాడ	485–00
రిటైల్ ధర (డజను)	72.00
4-9-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	440–00
వరంగల్	442–00
రిటైల్ ధర	5.00

నాస్కామ్ చైర్‌పర్సన్‌గా రాజేశ్ నంబియార్



ముంబై: కాగ్నిజెంట్ ఇండియా చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ (సీఎండీ) రాజేశ్ నంబియార్‌ను తన చైర్‌పర్సన్‌గా నియమిస్తున్నట్లు టెక్నాలజీ ఇండస్ట్రీ బాడీ నాస్కామ్ సోమవారం ప్రకటించింది. ప్రస్తుతం నాస్కామ్ చైర్‌పర్సన్‌గా మైక్రోసాఫ్ట్ ఇండియా మాజీ ప్రెసిడెంట్ అనంత్ మహేశ్వరి బాధ్యతలు నిర్వహిస్తుండగా, నంబియార్ వైస్ చైర్‌పర్సన్ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. తాజాగా అనంత్ మహేశ్వరి నుంచి నంబియార్ బాధ్యతలు స్వీకరిస్తున్నారు. నాస్కామ్ భారత్‌కు సంబంధించి ఐటీ, టెక్ ట్రేడ్ సంస్థ. ప్రభుత్వం, ఐటీ పరిశ్రమ మధ్య సమన్వయం పెంపొందడానికి ఈ సంస్థ విశేష కృషి చేస్తోంది. ''నాస్కామ్ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌కు చైర్‌పర్సన్‌గా నియమితులు కావడాన్ని గౌరవప్రదమైన అంశంగా భావిస్తున్నాను. ప్రపంచానికి అత్యంత విశ్వసనీయమైన సాంకేతిక భాగస్వామిగా భారతదేశ నాయకత్వాన్ని బలోపేతం చేయడానికి సంబంధిత అన్ని వర్గాలతో కలిసి పనిచేయడానికి ఎదురు చూస్తున్నాను'' అని తన నియామకం సందర్భంగా నంబియార్ పేర్కొన్నారు.

ఈ కామర్స్‌లో కొలువుల పండుగ

దక్షిణాదిన 4,00,000 నియామకాలు • హైదరాబాద్‌లో 30 శాతం • టీమ్‌లీజ్ సర్వీసెస్ వెల్లడి

హైదరాబాద్: నిరుద్యోగులకు కొలువుల పండుగ రానుంది. పండుగల విక్రయాలకు ముందు ఈ కామర్స్ రంగంలో పెద్ద ఎత్తున నియామకాలు చోటు చేసుకోనున్నాయి. ఏటా దసరా, దీపావళి సమయాల్లో ప్రముఖ ఈ కామర్స్ సంస్థలు భారీ తగ్గింపులు, ఆఫర్లతో ప్రత్యేక విక్రయ కార్యక్రమాలు నిర్వహిస్తుంటాయి. దీంతో ఏడాది పండుగల సీజన్ సమయంలో డిమాండ్‌కు అనుగుణంగా ఉత్పత్తులు అందించేందుకు ఈ కామర్స్ సంస్థలు నెట్‌వర్క్ బలోపేతంపై దృష్టి సారించనున్నాయి. ముఖ్యంగా దక్షిణాదిలో ఈ కామర్స్ రంగంలో తాత్కాలిక ఉద్యోగాలు పెద్ద ఎత్తున రానున్నాయని నియామక సేవలు అందించే టీమ్‌లీజ్ సర్వీసెస్ సంస్థ తెలిపింది. పరిశ్రమలో నెలకొన్న ధోరణుల ఆధారంగా ఈ అంచనాకు వచ్చింది. కేవలం దక్షిణాదిలోనే 4 లక్షల తాత్కాలిక ఉద్యోగాలు వస్తాయని పేర్కొంది. దేశవ్యాప్తంగా 7,00,000 తాత్కాలిక ఉద్యోగాలు ఏర్పడతాయని తెలిపింది. హైదరాబాద్‌లో 30 శాతం, బెంగళూరులో 40 శాతం, చెన్నైలో 30 శాతం చొప్పున కొలువులు ఏర్పడతాయని తెలిపింది. పండుగల సందర్భంగా హైదరాబాద్, బెంగళూరు, చెన్నై తదితర టైర్–1 పట్టణాల్లో నియామకాలు పెద్ద ఎత్తున ఉంటాయని, కోయంబత్తూర్, కోచి, మైసూర్ తదితర ద్వితీయ శ్రేణి పట్టణాలకు సైతం నియామకాలు విస్తరించొచ్చని అంచనా వేసింది. వేర్‌హౌస్ కార్యకలాపాల్లో (గోదాములు) 30 శాతం, డెలివరీ విభాగంలో 60 శాతం, కాల్‌సెంటర్ కార్యకలాపాల కోసం 10 శాతం నియామకాలు ఉంటాయని పేర్కొంది. ''గడిచిన త్రైమాసికం నుంచి ప్రముఖ ఈకామర్స్ సంస్థలు పండుగల సీజన్‌కు సంబంధించి ఆశావహ ప్రణాళికలను ప్రకటించాయి. వినియోగదారులు భారీగా ఉండడం, భారత్‌లో తయారీని కేంద్ర సర్కారు ప్రోత్సహిస్తుండడం, ఎఫ్‌డీఐ, డిజిటైజేషన్ తదితర చర్యలు దేశంలో తాత్కాలిక కార్మికుల పని వ్యవస్థను అధికంగా ప్రభావితం చేస్తున్నాయి''అని టీమ్‌లీజ్ సర్వీసెస్ బిజినెస్ హెడ్ బాలసుబ్రమణియన్ తెలిపారు. గతేడాదితో పోలిస్తే ఈ ఏడాది తాత్కాలిక కార్మికులు దేశవ్యాప్తంగా 25 శాతం మేర పెరుగుతారని అంచనా వేస్తున్నట్టు చెప్పారు. దక్షిణాదిలో అయితే ఇది 30 శాతంగా ఉంటుందన్నారు.



ఫ్లిప్‌కార్ట్‌లో లక్ష సీజనల్ ఉద్యోగాలు

రానున్న పండుగల సీజన్ నేపథ్యంలో, వినియోగదారుల నుంచి వచ్చే డిమాండ్‌ను అనుగుణంగా తాము సరఫరా వ్యవస్థలో లక్ష తాత్కాలిక (సీజనల్) ఉద్యోగ నియామకాలు చేపడుతున్నట్టు ఫ్లిప్‌కార్ట్ ప్రకటించింది. ఫుల్‌ఫిల్‌మెంట్ కేంద్రాలు, సార్టేషన్ కేంద్రాలు, డెలివరీ హబ్‌లలో ఈ నియామకాలు చేపట్టనుంది. స్థానిక కిరాణా డెలివరీ భాగస్వాములు, మహిళలు, వికలాంగులను సైతం నియమించుకోనున్నట్టు తెలిపింది. తద్వారా వైవిధ్యమైన సరఫరా చైన్‌ను ఏర్పాటు చేయనున్నట్టు పేర్కొంది. ''బిగ్ బిలియన్ డేస్ (డిస్కౌంట్ సేల్) నిజంగా భారీ స్థాయిలో జరుగుతుంది. ఈ కామర్స్‌లో ఉండే మంచి గురించి లక్షలాది మంది కస్టమర్లు తెలుసుకునే అవకాశం ఏర్పడుతుంది. ఎక్కువ మంది మొదటిసారి కస్టమర్లే ఉంటున్నారు''అని ఫ్లిప్‌కార్ట్ గ్రూప్ సీనియర్ వైస్ ప్రెసిడెంట్ హేమంత్ బద్రి తెలిపారు. బిగ్ బిలియన్ డేస్‌లో భాగంగా ఫ్లిప్‌కార్ట్ భారీ తగ్గింపులు, ఆకర్షణీయమైన ఆఫర్లతో విక్రయాలు చేపడుతుంటుంది. బిగ్ బిలియన్ డేస్ సందర్భంగా ఉండే సంక్లిష్టతలు, స్థాయికి అనుగుణంగా తాము సామర్థ్యాన్ని, నిల్వ స్థాయి, సార్టింగ్, ప్యాకేజింగ్, మానవవనరులను, డెలివరీ భాగస్వాములను పెంచుకోవాల్సి ఉంటుందని బద్రి పేర్కొన్నారు. ఈ ఏడాది 40 శాతానికి పైగా షిప్‌మెంట్‌లను స్థానిక కిరాణా భాగస్వాములతో డెలివరీ చేసే ప్రణాళికతో ఉన్నట్టు చెప్పారు.

భవిత

విద్య, ఉద్యోగ సమాచారం

ఢిల్లీ పోలీసు విభాగంలో 7547 కానిస్టేబుల్ పోస్టులు

స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్‌సీ).. ఢిల్లీ పోలీసు విభాగంలో.. కానిస్టేబుల్ (ఎగ్జిక్యూటివ్) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 7547
» పోస్టుల వివరాలు: కానిస్టేబుల్(ఎగ్జిక్యూటివ్)–పురుషులు: 5056(జనరల్–3053,ఈడబ్ల్యూఎస్–542, ఓబీసీ–287,ఎస్సీ–872, ఎస్టీ–302). కానిస్టేబుల్(ఎగ్జిక్యూటివ్)–మహిళలు: 2491(జనరల్–1502, ఈడబ్ల్యూఎస్–268, ఓబీసీ–142, ఎస్సీ–429, ఎస్టీ–150).
» అర్హత: 10+2(సీనియర్ సెకండరీ) ఉత్తీర్ణతతో పాటు వ్యాలిడ్ డ్రైవింగ్ లైసెన్స్(ఎల్ఎంవీ) కలిగి ఉండాలి. » వేతనం: పే లెవల్–3 (రూ.21,700 నుంచి రూ.69,100)
» ఎంపిక విధానం: కంప్యూటర్ ఆధారిత పరీక్ష, ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్(పీఈటీ),ఫిజికల్ మెజర్‌మెంట్ టెస్ట్(పీఎంటీ), మెడికల్ ఎగ్జామినేషన్, డాక్యుమెంట్ వెరిఫికేషన్ ద్వారా ఎంపికచేస్తారు.
» పరీక్ష విధానం: కంప్యూటర్ ఆధారిత పరీక్ష, ఆబ్జెక్టివ్ విధానంలో 100 ప్రశ్నలు–100 మార్కులకు ఉంటుంది. జనరల్ నాలెడ్జ్/కరెంట్ అఫైర్స్, రీజనింగ్, న్యూమరికల్ ఎబిలిటీ, కంప్యూటర్ ఫండమెంటల్స్, ఎంఎస్ ఎక్సెల్, ఎంఎస్ వర్డ్, కమ్యూనికేషన్, ఇంటర్నెట్, వెబ్ బ్రౌజింగ్ తదితర అంశాల్లో ప్రశ్నలుంటాయి. పరీక్ష వ్యవధి 90 నిమిషాలు.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» దరఖాస్తులకు చివరితేది: 30.09.2023.
» కంప్యూటర్ ఆధారిత పరీక్ష: 2023 డిసెంబర్‌లో.
» వెబ్‌సైట్: https://ssc.nic.in

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో 22 ప్రాజెక్ట్ ఆఫీసర్ పోస్టులు

కొచ్చిన్ షిప్‌యార్డ్ లిమిటెడ్(సీఎస్ఎల్).. ప్రాజెక్ట్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» మొత్తం పోస్టుల సంఖ్య: 22
» విభాగాలు: మెకానికల్, ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్, సివిల్, ఇన్‌స్ట్రుమెంటేషన్, ఐటీ.
» అర్హత: సంబంధిత స్పెషలైజేషన్‌లో కనీసం 60 శాతం మార్కులతో ఇంజనీరింగ్ డిగ్రీ/మాస్టర్స్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. కనీసం రెండేళ్ల పని అనుభవం ఉండాలి. వయసు: 30 ఏళ్లు ఉండాలి.
» వేతనం: నెలకు రూ.37,000 నుంచి రూ.40,000 చెల్లిస్తారు.
» ఎంపిక విధానం: ఆన్‌లైన్ పరీక్ష, పర్సనల్ ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» దరఖాస్తులకు చివరితేది: 05.09.2023.
» వెబ్‌సైట్: www.cochinshipyard.in

ఎస్‌బీఐలో 6160 అప్రెంటిస్‌లు

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఎస్‌బీఐ) సెంట్రల్ రిక్రూట్‌మెంట్ -ప్రమోషన్ డిపార్ట్‌మెంట్, కార్పొరేట్ సెంటర్.. అప్రెంటిస్‌ల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. » మొత్తం ఖాళీల సంఖ్య: 6160
» తెలుగు రాష్ట్రాల్లో ఖాళీలు: ఆంధ్రప్రదేశ్–390, తెలంగాణ–125.
» అర్హత: గుర్తింపు పొందిన యూనివర్శిటీ/సంస్థ నుంచి ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. శిక్షణ వ్యవధి: ఒక సంవత్సరం. వయసు: 01.08.2023 నాటికి 20 నుంచి 28 ఏళ్ల మధ్య ఉండాలి.
» స్టైపెండ్: నెలకు రూ.15,000.
» ఎంపిక విధానం: ఆన్‌లైన్ రాతపరీక్ష, స్థానిక భాష పరీక్ష, ధ్రువపత్రాల పరిశీలన, వైద్య పరీక్షల ఆధారంగా ఎంపికచేస్తారు.

ముఖ్య సమాచారం

» దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
» ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరి తేది:21.09.2023
» ఆన్‌లైన్ పరీక్ష తేదీలు:అక్టోబర్/నవంబర్2023
» వెబ్‌సైట్: https://karmic.andaman.gov.in

ఏపీ సివిల్ సప్లైస్, కోనసీమ జిల్లాలో 993 పోస్టులు

కోనసీమలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ లిమిటెడ్, జిల్లా కార్యాలయం.. డా.బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో ధాన్య సేకరణకు సంబంధించి రెండు నెలల కాలానికి ఒప్పంద ప్రాతిపదికన వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది. » మొత్తం పోస్టుల సంఖ్య: 993
» పోస్టుల వివరాలు: టెక్నికల్ అసిస్టెంట్–331, డేటాఎంట్రీ ఆపరేటర్–331, హెల్పర్–331.
» టెక్నికల్ అసిస్టెంట్: బీఎస్సీ(అగ్రికల్చర్ /మైక్రోబయాలజీ/బయోకెమిస్ట్రీ/ బయోటెక్నాలజీ)/బీఎస్సీ(బీజెడ్‌సీ)/బీఎస్సీ(లైఫ్ సైన్సెస)/డిప్లొమా(అగ్రికల్చర్) ఉత్తీర్ణులై ఉండాలి.
» డేటాఎంట్రీ ఆపరేటర్: ఏదైనా డిగ్రీతో పాటు పీజీడీసీఏ ఉత్తీర్ణులై ఉండాలి.
» హెల్పర్: 8, 10వ తరగతి ఉత్తీర్ణులై ఉండాలి.
» వయసు: టీఏ/డీఈవో పోస్టులకు 21 నుంచి 40 ఏళ్లు,హెల్పర్‌కు 18నుంచి 35ఏళ్ల మధ్య ఉండాలి.
» ఎంపిక విధానం: అకడమిక్ మార్కులు, పని అనుభవం, అదనపు విద్యార్హతలు (టీఏ/డీఈవో పోస్టులకు) ఆధారంగా ఎంపికచేస్తారు.
» దరఖాస్తు విధానం: నోటిఫికేషన్ ప్రకారం నిర్ణీత నమూనాలో ఆఫ్‌లైన్ దరఖాస్తులను సంబంధిత ధ్రువపత్రాల నక్లను జతచేసి రిజిస్టర్ పోస్టు ద్వారా లేదా వ్యక్తిగతంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పౌర సరఫరాల కార్పొరేషన్ లిమిటెడ్, ఎయిమ్స్ కాలేజ్, మొదటి అంతస్తు, ముమ్మిడివరం చిరునామకు పంపించాలి.
» దరఖాస్తులకు చివరితేది: 08.09.2023.
» వెబ్‌సైట్: konaseema.ap.gov.in

గ్రూప్స్‌పై గురి పెడతారా!

» త్వరలో గ్రూప్-1, 2 పోస్టుల భర్తీకి సన్నాహాలు
» రెండు కేటగిరీల్లో కలిపి మొత్తం 597 పోస్టులకు ఆమోదం
» డిగ్రీ ఉత్తీర్ణతతో గ్రూప్స్‌కు పోటీ పడే అర్హత
» విశ్లేషణాత్మక అధ్యయనంతోనే సక్సెస్‌కు మార్గం

గ్రూప్-1, గ్రూప్-2 ఉద్యోగాలంటే.. ఎంతో క్రేజ్! రాష్ట్ర స్థాయిలో ఉన్నత ప్రభుత్వ ఉద్యోగాలివి!! అందుకే వీటిని దక్కించుకునేందుకు లక్షల మంది పోటీపడుతుంటారు. ఇలాంటి అభ్యర్థులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీపి కబురు అందించింది. గ్రూప్1లో 89 పోస్టులు, గ్రూప్ 2లో 508 పోస్టుల భర్తీకి రాష్ట్ర సర్కారు తాజాగా ఆమోదం తెలిపింది. దీంతో ఏపీలో త్వరలోనే గ్రూప్-1, గ్రూప్-2 పోస్టుల భర్తీకి నగారా మోగనుంది. ఈ నేపథ్యంలో.. ఏపీపీఎస్సీ గ్రూప్-1, గ్రూప్-2 పోస్టులకు ఎంపిక ప్రక్రియ, పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ,ప్రిపరేషన్ గైడెన్స్ తదితర వివరాలు..

గత నాలుగేళ్లుగా నిరంతరం ఏదో ఒక నోటిఫికేషన్‌తో ఉద్యోగార్థులను పలకరిస్తున్న ఏపీపీఎస్సీ.. తాజాగా గ్రూప్స్ అభ్యర్థులకు ఆనందం కలిగించే కబురు చెప్పింది. మరికొద్ది రోజుల్లోనే గ్రూప్–1, గ్రూప్–2 పోస్టుల భర్తీకి సన్నాహాలు ప్రారంభిస్తామని కమిషన్ వర్గాలు పేర్కొన్నాయి.

మొత్తం 597 పోస్టులు

ఏపీ ప్రభుత్వం ఆమోదించిన ప్రకారం–త్వరలో విడుదల చేయనున్న గ్రూప్–1, గ్రూప్–2 నోటిఫికేషన్ల ద్వారా మొత్తం 597 పోస్టులు భర్తీ చేయనున్నారు. గ్రూప్–1లో డిప్యూటీ కలెక్టర్, డీఎస్పీ, సీటీఓ తదితర 89 ఉన్నత స్థాయి పోస్టులు.. గ్రూప్–2లో డిప్యూటీ తహశీల్దార్, ఎక్సైజ్ సబ్ ఇన్‌స్పెక్టర్, మున్సిపల్ కమిషనర్ గ్రేడ్–3 వంటి 508 పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వెలువడనుంది.

సిలబస్‌పై అవగాహన

మరికొద్ది రోజుల్లోనే ఏపీపీఎస్సీ గ్రూప్–1, గ్రూప్–2 నోటిఫికేషన్లు రావడం ఖాయమని స్పష్టమైంది. కాబట్టి ప్రిపరేషన్‌కు ఉపక్రమించే ముందు అభ్యర్థులు సిలబస్‌పై సంపూర్ణ అవగాహన ఏర్పరచుకోవాలి. తాము పోటీ పడదలచుకుంటున్న పరీక్షకు సంబంధించిన సిలబస్‌ను లోతుగా పరిశీలించాలి. గత ప్రశ్న పత్రాలను అధ్యయనం చేయాలి. ఆ తర్వాత ప్రిపరేషన్ ప్రణాళిక రూపొందించుకోవాలి. ఆబ్జెక్టివ్, డిస్క్రిప్టివ్ విధానంలో నిర్వహించే గ్రూప్–1ను లక్ష్యంగా చేసుకునే అభ్యర్థులు మరింత పటిష్ట ప్రణాళికతో ముందుకు సాగాలి. ముందుగా ప్రిలిమ్స్, మెయిన్ సిలబస్‌ను పూర్తిగా అవగాహన చేసుకోవాలి. ఆ తర్వాత ఆయా అంశాలకు కల్పిస్తున్న వెయిటేజీని గమనించాలి. దీనికి అనుగుణంగా ప్రామాణిక పుస్తకాలను ఎంపిక చేసుకొని దీర్ఘకాలిక ప్రిపరేషన్ ప్రారంభించాలి.

మూడు దశల్లో గ్రూప్ 1

గ్రూప్–1 ఎంపిక ప్రక్రియలో ప్రిలిమ్స్, మెయిన్స్, ఇంటర్వ్యూ ఉంటాయి. ప్రిలిమ్స్ రెండు పేపర్లుగా ఉంటుంది. ప్రతి పేపర్‌లో 120 ప్రశ్నలు–120 మార్కులు చొప్పున మొత్తం 240 మార్కులకు పరీక్ష జరుగుతుంది. ప్రతి పేపర్‌కు పరీక్ష సమయం రెండు గంటలు. ప్రిలిమ్స్‌లో అర్హత పొందిన వారిని మెయిన్‌కు అనుమతిస్తారు. మెయిన్ పరీక్ష పూర్తిగా డిస్క్రిప్టివ్ విధానంలో అయిదు పేపర్లుగా 750 మార్కులకు నిర్వహిస్తారు.మెయిన్‌లో పొందిన మార్కుల ఆధారంగా 1:2 నిష్పత్తిలో చివరి దశ పర్సనల్ ఇంటర్వ్యూకు ఎంపిక చేస్తారు. ఇంటర్వ్యూకు 75 మార్కులు ఉంటాయి. మెయిన్, ఇంటర్వ్యూలో సాధించిన మార్కుల ఆధారంగా తుది ఎంపిక చేస్తారు.

గ్రూప్ 2 ఇలా

గ్రూప్–2 పరీక్షను రెండు దశలుగా(స్క్రీనింగ్ టెస్ట్, మెయిన్ ఎగ్జామ్) నిర్వహిస్తారు. పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో పరీక్ష జరుగుతుంది. మొదటి దశ స్క్రీనింగ్ టెస్ట్ 150 మార్కులకు ఉంటుంది. స్క్రీనింగ్ టెస్ట్‌లో అర్హత సాధించిన వారికి 1:50 నిష్పత్తిలో రెండో దశ మెయిన్ ఎగ్జామినేషన్‌కు ఎంపిక చేస్తారు. మెయిన్‌లో ఒక్కో పేపర్‌కు 150 మార్కుల చొప్పున రెండు పేపర్లు ఉంటాయి. పరీక్ష పూర్తిగా ఆబ్జెక్టివ్ విధానంలో బహుళైచ్ఛిక ప్రశ్నలతో ఉంటుంది.

సమన్వయం అవసరం

గ్రూప్–1, గ్రూప్–2 సిలబస్‌లో దాదాపు 80 శాతం ఉమ్మడి అంశాలే! కాబట్టి అభ్యర్థులు గ్రూప్–1 ఓరియెంటేషన్‌తో, డిస్క్రిప్టివ్ అప్రోచ్‌తో ప్రిపరేషన్ సాగిస్తే... గ్రూప్–2 సిలబస్‌పైనా పట్టు లభించే అవకాశం ఉంది. ఆయా టాపిక్‌లను చదివేటప్పుడు కోర్ సబ్జెక్ట్‌ను విస్తృతంగా అన్ని కోణాల్లో చదువుతూ.. సమకాలీన పరిణామాలతో సమన్వయం చేసుకోవాలి. తద్వారా ఏకకాలంలో గ్రూప్ 1, గ్రూప్ 2ల్లో రాణించేందుకు వీలవుతుంది.

విశ్లేషణాత్మక అధ్యయనం

గ్రూప్స్ అభ్యర్థులు విశ్లేషణాత్మక అధ్యయనానికి ప్రాధాన్యం ఇవ్వాలి. ప్రిలిమ్స్ నుంచే ఆయా అంశాలను విశ్లేషించుకుంటూ చదవాలి. సమకాలీన అంశాలపై పూర్తి స్థాయి అవగాహన పెంచుకోవాలి. ముఖ్యమైన టాపిక్స్‌కు సంబంధించి సినాప్సిస్, నేపథ్యం, ప్రభావం, ఫలితం, పర్యవసానాలు.. ఇలా అన్ని కోణాల్లో పట్టు సాధించాలి. ప్రస్తుతం రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ పథకాలు.. ముఖ్యంగా నవరత్నాలు, లక్షిత వర్గాలు, బడ్జెట్ కేటాయింపులు తదితర వివరాలను అవపోసన పట్టాలి. అదే విధంగా రాష్ట్ర స్థాయిలో అమలవుతున్న ఆర్థిక విధానాలు, వాటిద్వారా జరుగుతున్న అభివృద్ధిపై దృష్టి సారించాలి. దీంతోపాటు జాతీయ స్థాయిలో తాజా రాజ్యాంగ సవరణలు, నూతన జాతీయ విద్యా విధానం, ఇటీవల కాలంలో కీలకమైన తీర్పుల గురించి అవగాహన పెంచుకోవాలి.



అప్లికేషన్ అప్రోచ్

గ్రూప్స్ అభ్యర్థులు ప్రతి అంశాన్ని చదివేటప్పుడు అన్వయ దృక్పథాన్ని అలవర్చుకోవాలి. ముఖ్యంగా సమకాలీన అంశాలు సమ్మిళితంగా ఉండే ఎకానమీ, పాలిటీ, జాగ్రఫీ, సైన్స్ అండ్ టెక్నాలజీలో ఇది ఎంతో ఉపయుక్తంగా నిలుస్తుంది. అదే విధంగా చదివే సమయంలోనే రైటింగ్ ప్రాక్టీస్ చేయాలి. నిరంతరం తమ సామర్థ్యాలను అంచనా వేసుకునేందుకు మోడల్ టెస్ట్‌లకు హాజరు కావడం మేలు చేస్తుంది.

ప్రీవియస్ పేపర్స్

గ్రూప్స్ అభ్యర్థులు ప్రిపరేషన్ ప్రారంభించే ముందు గత ప్రశ్న పత్రాలను పరిశీలించాలి. గత ప్రశ్న పత్రాల ద్వారా పరీక్షలో సదరు అంశాలకు లభిస్తున్న వెయిటేజీపై అవగాహన లభిస్తుంది. అంతేకాకుండా ప్రశ్నలు అడుగుతున్న తీరు తెలుస్తుంది. ఆయా టాపిక్స్‌పై తమకున్న పట్టు, ఇంకా మెరుగుపరచుకోవాల్సిన విషయాల్లోనూ స్పష్టత లభిస్తుంది.

సిలబస్‌పై పట్టు.. కొలువుకు మెట్టు

- **చరిత్ర:** రాష్ట్ర చరిత్ర, సంస్కృతికి సంబంధించిన అంశాలపై పట్టు సాధించాలి. ప్రాచీన చరిత్ర మొదలు ఆధునిక చరిత్ర వరకూ..ముఖ్యమైన అంశాలపై సంపూర్ణ అవగాహన అవసరం. జాతీయోద్యమంలో ఆంధ్రప్రదేశ్ పాత్ర గురించి అధ్యయనం చేయాలి. అదేవిధంగా భారత దేశ చరిత్రకు సంబంధించిన అంశాలపైనా అవగాహన పెంచుకోవాలి.
- **భౌగోళిక శాస్త్రం:** దీనికి సంబంధించి రాష్ట్రంలోని భౌగోళిక వనరులు, అడవులు, జీవ సంపద, వ్యవసాయ వనరుల గురించి తెలుసుకోవాలి. వీటిని తాజా పరిస్థితులతో అన్వయం చేసుకోవాలి. గత ఏడాది కాలంలో చేపట్టిన వ్యవసాయ, నీటి పారుదల ప్రాజెక్ట్‌లు.. వాటి ద్వారా లబ్ధి చేకూరే ప్రాంతాలు వంటి వాటిపై దృష్టి పెట్టాలి.
- **పాలిటీ:** రాజనీతి శాస్త్రం, రాజ్యాంగానికి సంబంధించి ప్రాథమిక అంశాలు, భావనలు మొదలు తాజా పరిణామాల(రాజ్యాంగ సవరణలు వాటి ప్రభావం) వరకూ అన్నింటినీ తెలుసుకోవాలి. గవర్నెన్స్, లా, ఎథిక్స్‌కు సంబంధించి సుపరిపాలన దిశగా చేపడుతున్న చర్యలు, పబ్లిక్ సర్వీస్‌లో పాటించాల్సిన విలువలు, ప్రజాసేవలో చూపించాల్సిన నిబద్ధత, అంకిత భావం వంటి విషయాలపైనా అవగాహన ఏర్పరచుకోవాలి. న్యాయపరమైన అంశాలపైనా పట్టు సాధించాలి. ప్రాథమిక హక్కులు, విధులు, కేంద్ర–రాష్ట్ర ప్రభుత్వాల మధ్య సంబంధాలు.. వీటికి సంబంధించి న్యాయ వ్యవస్థకున్న అధికారాల గురించి తెలుసుకోవాలి. అదే విధంగా సివిల్, క్రిమినల్ లా, కార్మిక చట్టాలు, సైబర్ చట్టాలు, ట్యాక్స్ లాస్ గురించి అధ్యయనం చేయాలి.
- **ఎకానమీ:** మౌలిక భావనలు మొదలు తాజా వృద్ధి రేట్ల వరకూ.. గణాంక సహిత సమాచారం సేకరించుకుని పరీక్షకు సన్నద్ధం కావాలి. ఇటీవల కాలంలో చేపట్టిన ప్రధాన ఆర్థిక సంస్కరణలు, వాటిద్వారా లబ్ధి చేకూరే వర్గాలు; జాతీయ, రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చేలా తాజాగా తీసుకొచ్చిన విధానాలపై పట్టు సాధించాలి. ఈ ఆర్థిక సంవత్సరానికి సంబంధించి కేంద్ర, రాష్ట్ర బడ్జెట్‌లు, ఎకనామిక్ సర్వేలపై అవగాహన పొందాలి.
- **సైన్స్ అండ్ టెక్నాలజీ:** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల స్థాయిలో శాస్త్ర సాంకేతిక రంగాల్లో అమలవుతున్న కొత్త విధానాలు, ప్రధాన సంస్థలు, రాష్ట్ర స్థాయిలో ఐసీటీ విధానాలు, ఇండియన్ స్పేస్ ప్రోగ్రామ్, డీఆర్‌డీఓ, ఇంధన వనరులు, విపత్తు నిర్వహణకు అనుసరిస్తున్న సాంకేతిక విధానాలు తదితర అంశాలపై పట్టు సాధించాలి. దీంతో పాటు పర్యావరణ సంబంధిత అంశాలపైనా దృష్టి సారించాలి. అంతర్జాతీయ పర్యావరణ ఒప్పందాలు, పర్యావరణ పరిరక్షణకు సంబంధించి జాతీయ, రాష్ట్ర స్థాయిలో అమలు చేస్తున్న చట్టాలు, విధానాలపై పట్టు సాధించాలి.
- **సంక్షేమ పథకాలు:** రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, లక్షిత వర్గాలపైనా అవగాహన ఏర్పరచుకోవాలి. నవరత్నాలు.. వాటి పరిధిలో అమలు చేస్తున్న పథకాలు, లబ్ధిదారులు, కేటాయించిన నిధులు వంటి వాటిపై గణాంక సహిత సమాచారంతో సన్నద్ధమవ్వాలి.

పునర్విభజన చట్టం

గ్రూప్స్ అభ్యర్థులు ప్రత్యేకంగా దృష్టి పెట్టాల్సిన మరో కీలక అంశం.. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన చట్టం–2014. జనరల్ స్టడీస్, ఎకానమీ, హిస్టరీ పేపర్లు అన్నింటిలోనూ.. ఈ చట్టం నుంచి ప్రశ్నలు అడిగే అవకాశముంది. కాబట్టి అభ్యర్థులు ఈ చట్టాన్ని ప్రత్యేక దృష్టితో చదవాలి. విభజన తర్వాత ఎదురవుతున్న సవాళ్లు, సమస్యలు.. వాటి పరిష్కారానికి ప్రభుత్వం చేపడుతున్న చర్యల గురించి అవగాహన పెంచుకోవాలి.

క్లుప్తంగా...

7 నుంచి యాదాద్రిలో తిరునక్షత్ర ఉత్సవాలు



యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయంలో ఈ నెల 7 నుంచి 9 వరకు శ్రీకృష్ణాష్టమిని పురస్కరించుకుని కణ్ణన్ తిరునక్షత్ర ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఈవో గీతారెడ్డి సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించారు. మూడ్రోజులపాటు ఉత్సవాలను నిర్వహిస్తామన్నారు. ఈనెల 9న శ్రీకృష్ణ జయంతి సందర్భంగా ఆలయ ప్రాంగణంలో సాయంత్రం 5గంటలకు ఉట్టి కొట్టే కార్యక్రమం చేపట్టనున్నట్లు తెలిపారు. అదేరోజు రాత్రి శ్రీస్వామి వారి ఆలయంలో రుక్మిణీ కల్యాణోత్సవం నిర్వహిస్తామన్నారు. 7వ తేదీన నిత్య, శాశ్వత కల్యాణం, బ్రహ్మోత్సవం, శ్రీసుదర్శన నారసింహ హోమం రద్దు చేసినట్లు పేర్కొన్నారు.

వెబ్‌సైట్‌లో జేఎల్ అభ్యర్థుల హాల్‌టికెట్లు

సాక్షి, హైదరాబాద్: ఇంటర్మీడియెట్ విద్యా కమిషనరేట్ పరిధిలో జూనియర్ లెక్చరర్ ఉద్యోగాల భర్తీకి సంబంధించి ఈనెల 12 నుంచి అక్టోబర్ 3 వరకు విడతల వారీగా పరీక్షలు నిర్వహిస్తున్నట్లు టీఎస్‌పీఎస్సీ సోమవారం ఓ ప్రకటనలో వెల్లడించింది. ఈ పరీక్షలకు దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల హాల్‌టికెట్లను వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచింది.

కొత్త ఇంజనీరింగ్ కాలేజీల్లో కౌన్సెలింగ్

రెండోవారం నుంచి ఇంజనీరింగ్ క్లాసులు



సాక్షి, హైదరాబాద్: మహబూబాబాద్, ఖమ్మం జిల్లా పాలేరులో కొత్తగా ఏర్పాటైన ఇంజనీరింగ్ కాలేజీల్లోని సీట్లను ప్రత్యేక కౌన్సెలింగ్ ద్వారా భర్తీ చేస్తున్నట్టు సాంకేతిక విద్యావిభాగం తెలిపింది. సాధారణ ఎంసెట్ కౌన్సెలింగ్ పూర్తయిన తర్వాత ఈ రెండు కాలేజీలకు ప్రభుత్వ అనుమతులు లభించాయి. మహబూబాబాద్ కాలేజీలో సీఎస్ఈ (డేటాసైన్స్)లో 61, సీఎస్‌సీలో 43, ఈసీఈలో 65 సీట్లు ఉన్నాయి. ఖమ్మం జిల్లా పాలేరు కాలేజీలో సీఎస్ఈ డేటాసైన్స్‌లో 59, సీఎస్ఈలో 31, ఈసీఈలో 65 సీట్లు అందుబాటులో ఉన్నాయని తెలిపింది. ఈ కాలేజీల్లో సోమవారం నుంచి ఈ నెల 8వ తేదీ వరకూ సర్టిఫికెట్ల ధ్రువీకరణ చేపడతారని, 4 నుంచి 8వ తేదీ వరకూ ఆప్షన్లు ఇచ్చుకోవచ్చని, ఈ నెల 10వ తేదీన సీట్ల కేటాయింపు ఉంటుందని తెలిపింది. కాగా రాష్ట్రవ్యాప్తంగా ఇంజనీరింగ్ కాలేజీల్లో స్పాట్ అడ్మిషన్ల ప్రక్రియ మంగళవారం ముగుస్తుంది. ఈ నెల రెండోవారంలో ఇంజనీరింగ్ క్లాసులు మొదలు పెట్టనున్నారు.

గురుకుల కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యా సంస్థల సొసైటీ పరిధిలో పనిచేస్తున్న 567 మంది కాంట్రాక్టు ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం తీపి కబురును అందించింది.వారి సర్వీసును క్రమబద్ధీకరిస్తూ రాష్ట్ర ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో 63 మంది పురుషులు, 504 మంది మహిళలు ఉన్నారు. వీరంతా 2007 సంవత్సరంలో కాంట్రాక్టు పద్ధతిలో ఎంపికయ్యారు. సర్వీసు క్రమబద్ధీకరణ నేపథ్యంలో ఉద్యోగులకు ప్రత్యేకంగా నియామక ఉత్తర్వులు జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి రాహుల్‌బొజ్జా గురుకుల సొసైటీ కార్యదర్శిని ఆదేశించారు. ఎస్సీ గురుకుల ఉద్యోగుల సర్వీసు క్రమబద్ధీకరణ ఉత్తర్వులు జారీ చేయడంపట్ల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఉపాధ్యాయ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సీహెచ్.బాలరాజు, ప్రధాన కార్యదర్శి ఎస్.దయాకర్ హర్షం వ్యక్తం చేశారు.

లైంగిక వేధింపుల నిరోధానికి బీబీఏతో ఒప్పందం

సాక్షి, హైదరాబాద్: లైంగిక వేధింపులకు గురైన చిన్నారులు, మహిళలను రక్షించడంతోపాటు వారికి పునరావాసం, ఇతర న్యాయ సహాయం అందించడమే లక్ష్యంగా పోలీసులు బచ్‌పన్ బచావో ఆందోళన్(బీబీఏ)తో కలిసి పనిచేస్తున్నారు. ఇందులో భాగంగా తెలంగాణ రాష్ట్ర పోలీసు మహిళా భద్రతావిభాగం బీబీఏతో వరుసగా రెండోసారి ఎంఓయూ కుదుర్చుకుంది. సోమవారం మహిళా భద్రత విభాగ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర మహిళాభద్రతవిభాగం అడిషనల్ డీజీ శిఖాగోయల్, బీబీఏ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ధనంజయ్ టింగల్‌తో ఎంఓయూపై సంతకాలు చేశారు. కార్యక్రమంలో మహిళా భద్రత విభాగం డీఐజీ సుమతి ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు. లైంగిక వేధింపులు, ఆన్‌లైన్ వేధింపులు, మానవ అక్రమ రవాణాకు గురైన బాధితులకు తగిన న్యాయం అందేలా చూడడం, వారికి అవసరమైన న్యాయసాయం అందించడం, వారిలో మానసిక స్థైర్యం పెంచేలా కౌన్సిలింగ్ ఇవ్వడం, లైంగిక వేధింపులను అరికట్టడంలో తెలంగాణ పోలీసులకు సహాయకారిగా ఉండడం ఎంఓయూ ముఖ్య ఉద్దేశమని తెలిపారు. ఇప్పటి వరకు 220 మంది చిన్నారులను పాఠశాలల్లో చేర్చడం, 237 మంది మహిళలకు వివిధ ప్రభుత్వ పథకాల కింద ఆర్థిక సాయం, 102 కుటుంబాలకు రేషన్‌కార్డులు, బాధితులకు రూ. 28.14 లక్షల పరిహారం ఇప్పించామని చెప్పారు.

మారుతున్న 'గురు'తర బాధ్యత

టీచర్ల బోధన పద్ధతుల్లో మార్పులు అనివార్యం

జాతీయ విద్యా విధానంలో కేంద్రం స్పష్టీకరణ

ఉపాధ్యాయుడికీ పునఃశ్చరణ అవసరమని వెల్లడి

నిత్య శోధన దిశగా గురువుల అడుగులు

టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో ప్రభుత్వ టీచర్ల వెనుకంజ!



నేడు గురుపూజా దినోత్సవం

సాక్షి, హైదరాబాద్: అక్షర జ్ఞానంలో అంతర్జాతీయంగా అనేక మార్పులొచ్చాయి. 'నెట్' ప్రపంచం విద్యార్జనకు ముడి సరుకైంది. ప్రపంచ పరిజ్ఞానం అందిపుచ్చుకోవడం అనివార్యమైంది. విశ్వ వ్యాప్త విజ్ఞానం వైపు విద్యార్థుల ఆకాంక్షలు పరుగులు తీస్తున్నాయి. ఈ మేరకు బోధన తీరు మారుతోంది. తగిన నైపుణ్యాన్ని అందిపుచ్చుకోవాల్సిన అవసరం నేటి తరం గురువులకు తప్పనిసరైంది. ఎల్‌కేజీ నుంచే ఐఐటీ పునాదులు కోరుకునే తల్లిదండ్రుల ఆలోచన ధోరణికి అనుగుణంగా టీచర్లూ సంసిద్ధులు కావాల్సిన అవసరం ఏర్పడింది. కేంద్ర ప్రభుత్వం తీసుకొస్తున్న జాతీయ విద్యా విధానం ఈ తరహా మార్పులను నొక్కి వక్కాణించింది. ఉపాధ్యాయుడికీ పునఃశ్చరణ అవసరమని పేర్కొంది. నేషనల్ కౌన్సెల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రీసెర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సీఈఆర్టీ) 2022లో జరిపిన అధ్యయనం.. పాఠశాల విద్య నుంచే మార్పులు చేపట్టాలని స్పష్టం చేసింది. ఈ సూచనను జాతీయ విద్యా విధానం-2020లో పొందుపరిచారు. విద్యార్థి మానసిక ధోరణికి, సామాజికంగా వస్తున్న మార్పులకు అనుగుణంగా బోధన ప్రక్రియ సాగాలని కేంద్ర విద్యాశాఖ పేర్కొంది.

డిజిటల్ విద్యలో వెనుకంజ

దేశవ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు స్కూళ్ళలో 95 లక్షలమంది ఉపాధ్యాయులు పని చేస్తున్నారు. తెలంగాణలో వీరి సంఖ్య దాదాపు 2.5 లక్షల వరకూ ఉంది. ఎన్‌సీఈఆర్టీ అధ్యయనం ప్రకారం 58 శాతం ఉపాధ్యాయులు ఇప్పటికీ పాత పద్ధతిలోనే బోధన చేస్తున్నారు. కోవిడ్ తర్వాత వచ్చిన డిజిటల్ విద్యపై పెద్దగా అవగాహన పెంచుకోలేదని పేర్కొంది. వర్చువల్ మోడ్‌లో బోధన సాగుతున్నా, ఆన్‌లైన్ విద్యా విధానం ప్రాధాన్యత పెరుగుతున్నా, ఆ దిశగా నైపుణ్యాన్ని పెంచుకునే వారి శాతం 46కు మించి ఉండటం లేదని స్పష్టం చేసింది. ముఖ్యంగా ప్రభుత్వ స్కూళ్లల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులు టెక్నాలజీని అందిపుచ్చుకోవడంలో వెనుకబడి ఉన్నారు. సర్కారీ స్కూళ్లలో మౌలిక వసతుల కొరత ఇందుకు ఓ కారణమని చెబుతున్నారు. డిజిటల్ విద్యలో పూర్తిగా గ్రాఫిక్ వీడియోతో బోధించే విద్యా విధానం అందుబాటులోకి వచ్చింది. కానీ ప్రభుత్వ స్కూల్ టీచర్లు దీనికి పెద్దగా ప్రాధాన్యమివ్వడం లేదు.

సరికొత్త బోధనకు అలవాటు పడాలి



ఆధునిక బోధన పద్ధతులు దూసుకొస్తున్న తరుణంలో ఉపాధ్యాయులూ ఈ దిశగా మార్పులు చేసుకోవాలి. కొత్త విషయాలను నేర్చుకోవడం, సరికొత్తగా బోధించడానికి అలవాటు పడాలి. అప్పుడే రోబోలు గురువుల స్థానాన్ని అక్రమించలేవు. విద్యార్థుల్లో దాగున్న అంతర్గత శక్తిని టీచర్ వెలికితీయాలి.

- పి.రాజా భానుచంద్రప్రకాశ్ (గెజిటెడ్ హెచ్‌ఎంల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు)

పిల్లల ఐక్యూ మేరకు బోధించాలి



ఉపాధ్యాయుడు ముందుగా చైల్డ్ సైకాలజీ తెలుసుకోవాలి. అతని ఐక్యూని గుర్తించి బోధన చేపట్టాలి. ఇది పుస్తకాల ద్వారా వచ్చే నాలెడ్జ్ కాదు. విద్యార్థితో గురువుకు నిరంతర సంబంధం అవసరం. తన పిల్లలు ఎంత ఎదగాలని కోరుకుంటాడో, తాను చదువు చెప్పే విద్యార్థీ అంతే జ్ఞానం పొందాలని ఆకాంక్షించాలి.

- చావా రవి (టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి)

గురువూ నిత్య విద్యార్థే

దేశవ్యాప్తంగా ఇంగ్లిష్ మాధ్యమంలో బోధన విధానం పెరుగుతోంది. విద్యార్థుల తల్లిదండ్రులూ దీన్నే కోరుకుంటున్నారు. ఈ కారణంగానే ప్రైవేటు స్కూళ్ళలో విద్యార్థుల సంఖ్య గడచిన పదేళ్ళలో 47 శాతం పెరిగింది. పుస్తకాలకే పరిమితం కాకుండా ప్రయోగాత్మక విద్యా విధానాన్ని ఎన్‌పీఏ సూచిస్తోంది. పాఠ్యాంశాన్ని ప్రాక్టికల్‌గా నిరూపించే సైద్ధాంతిక విధానాన్ని ఉపాధ్యాయులు అనుసరించాలి. బోధనకు ముందే ఉపాధ్యాయుడు పాఠ్యాంశంపై పట్టు పెంచుకోవాలని ఎన్‌సీఈఆర్టీ సూచిస్తోంది. అంటే నిరంతర పునఃశ్చరణతో పాటు, విషయ పరిజ్ఞానం ఎప్పటికప్పుడు పెంచుకోవాల్సి ఉంది. ఇందుకోసం జాతీయ, రాష్ట్ర స్థాయిలో విద్యాశాఖలు శిక్షణ ఇస్తున్నా ప్రయోజనం పెద్దగా ఉండటం లేదు. ఈ కారణంగానే బ్యాచులర్ ఆఫ్ ఎడ్యుకేషన్ (బీఈడీ) విద్యలోనే జాతీయ స్థాయి మార్పులకు శ్రీకారం చుట్టారు. రెండేళ్ళకు బదులుగా నాలుగేళ్ళ ఇంటిగ్రేటెడ్ బీఈడీని అందుబాటులోకి తెచ్చారు. ఇందులో ప్రధానంగా విద్యార్థి సైకాలజీని అంచనా వేయడం, అతని ఐక్యూను గుర్తించడం, అందుకు అనుగుణంగానే బోధన చేపట్టడం చేస్తారు. విద్యార్థిని ప్రతి వారం పరీక్షించడం, వెనుకబడ్డ పాఠ్యాంశాలకు పదును పెట్టే మెళకువలు ఉపాధ్యాయులు అనుసరించాల్సి ఉంటుంది. కాబట్టి ఇక గురువు కూడా నిత్య విద్యార్థిగా మారాల్సిన పరిస్థితి ఉంది.

2.66 లక్షల ర్యాంకుకూ కన్వీనర్ సీటు

ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా సీట్ల జాబితా విడుదల

- బీసీ సీ కేటగిరీలో మహిళకు సీటు కేటాయింపు
- 1.59 లక్షల ర్యాంకుకు జనరల్ కోటాలో సీటు
- కాళోజీ ఆరోగ్య విశ్వవిద్యాలయం వెల్లడి

సాక్షి, హైదరాబాద్: మొదటి విడత కన్వీనర్ కోటా కౌన్సెలింగ్‌లో 2.38 లక్షల నీట్ ర్యాంకు సాధించిన విద్యార్థికి ఎంబీబీఎస్ సీటు రాగా, ఇప్పుడు రెండో విడత కౌన్సెలింగ్‌లో కన్వీనర్ కోటాలో ఏకంగా 2,66,945 ర్యాంకు సాధించిన బీసీ సీ మహిళా విద్యార్థికి సీటు లభించింది. ఈ మేరకు కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం సోమవారం రెండో విడత ఎంబీబీఎస్ కన్వీనర్ కోటా సీట్ల కేటాయింపు జాబితాను విడుదల చేసింది. ఇంతటి పెద్దస్థాయి ర్యాంకుకు సీటు రావడం రాష్ట్ర చరిత్రలోనే తొలిసారి కావడం విశేషం. అలాగే మొదటి విడత కౌన్సిలింగ్‌లో జనరల్ కోటాలో 1.31 లక్షల ర్యాంకు సాధించిన విద్యార్థికి సీటు రాగా, ఇప్పుడు రెండో విడత కౌన్సెలింగ్‌లో 1.59 లక్షల ర్యాంకు సాధించిన జనరల్ కేటగిరీ విద్యార్థికి సీటు లభించింది.

రెండో విడత కౌన్సెలింగ్‌లో గరిష్ట ర్యాంకులతో పొందిన కన్వీనర్ కోటా సీట్ల వివరాలు

కేటగిరీ	జనరల్	మహిళా	కేటగిరీ	జనరల్	మహిళా
ఓపెన్	1,59,928	1,59,419	బీసీ బీ	1,82,579	1,81,777
ఈడబ్ల్యూఎస్	1,42,345	1,26,240	బీసీ సీ	2,62,999	2,66,945
ఎస్సీ	2,43,666	2,42,008	బీసీ డీ	1,75,332	1,74,334
ఎస్టీ	2,28,912	2,27,108	బీసీ ఈ	1,84,057	1,82,953
బీసీ ఏ	2,56,690	2,56,783	మైనారిటీ	1,82,683	1,72,532

రాష్ట్రంలోని కన్వీనర్ సీట్లు 5,514

రాష్ట్రంలోని మెడికల్ కాలేజీల్లో ఉన్న కన్వీనర్ సీట్లలో 5,514 సీట్లను విద్యార్థులకు కేటాయిస్తూ విశ్వవిద్యాలయం జాబితా విడుదల చేసింది. మొదటి విడతలో సీట్లు పొందిన అనేకమంది విద్యార్థులు ఇప్పుడు తమకు ఇష్టమైన, అనువైన కాలేజీ కోసం రెండో విడత కౌన్సెలింగ్‌లోనూ పాల్గొన్నారు. గతేడాది ఓ ప్రైవేట్ కాలేజీలో చివరి (నాలుగో) విడత కౌన్సిలింగ్‌లో 2.28 లక్షల ర్యాంకర్‌కు బీసీ-ఏ కేటగిరీలో కన్వీనర్ సీటు లభించగా, ఈసారి రెండో విడత కౌన్సెలింగ్‌లో 2.66 లక్షల ర్యాంకు సాధించిన బీసీ సీ విద్యార్థికి కన్వీనర్ సీటు లభించడం గమనార్హం. అలాగే గతేడాది జనరల్ కేటగిరీలో చివరి విడతలో 1.25 లక్షల ర్యాంకుకు సీటు లభించగా, ఇప్పుడు రెండో విడతలోనే 1.59 లక్షల ర్యాంకుకు జనరల్ కేటగిరీలో సీటు వచ్చింది. బీసీ బీ కేటగిరీలో గతేడాది 1.37 లక్షల ర్యాంకుకు సీటు రాగా, ఈసారి రెండో విడతలోనే 1.82 లక్షల ర్యాంకర్‌కు సీటు వచ్చింది. అలాగే గతేడాది బీసీ డీ కేటగిరీలో 1.28 లక్షల ర్యాంకర్‌కు సీటు రాగా, ఈసారి 1.75 లక్షల ర్యాంకర్‌కు సీటు వచ్చింది.

సీట్లు మిగిలితే ఇంకా రెండు విడతల కౌన్సెలింగ్

సీట్లు మిగిలితే కన్వీనర్ కోటా సీట్లకు ఇంకా రెండు విడతల్లో కౌన్సెలింగ్ జరగనుంది. రెండో విడతలో సీటు వచ్చినా, జాతీయ స్థాయి కౌన్సెలింగ్‌లో సీటు వచ్చినవారు ఇక్కడ చేరకుంటే, ఆ సీట్లు తదుపరి విడతల్లో కేటాయిస్తారు. అప్పుడు ఇంకా పెద్ద ర్యాంకర్‌కు సీటు కేటాయిస్తారు. 2023-24 వైద్య విద్యా సంవత్సరంలో రాష్ట్రంలోని 54 మెడికల్ కాలేజీల్లో ఎంబీబీఎస్ సీట్లున్నాయి. ప్రభుత్వంలోని అన్ని సీట్లను, ప్రైవేటు కాలేజీల్లోని 50 శాతం సీట్లను కన్వీనర్ కోటాలో భర్తీ చేస్తారు. ప్రభుత్వ మెడికల్ కాలేజీల్లోని సీట్లల్లో 15 శాతం అఖిల భారత కోటా కింద భర్తీ చేస్తారు. వాటిల్లో రెండు విడతల కౌన్సెలింగ్ తర్వాత సీట్లు మిగిలితే తిరిగి వాటిని మన రాష్ట్రానికే ఇస్తారు. రాష్ట్రంలో ప్రైవేట్ మెడికల్ కాలేజీల్లో మేనేజ్‌మెంట్ మొదటి విడత కౌన్సెలింగ్‌లో ఎన్ఆర్ఐ (సీ కేటగిరీ) కోటాలో గరిష్టంగా 12 లక్షల నీట్ ర్యాంకర్‌కు సీటు లభించింది. అలాగే మొదటి కౌన్సెలింగ్‌లో బీ కేటగిరీలో 5.39 లక్షల ర్యాంకర్‌కు సీటు రావడం తెలిసిందే.

హోంగార్డు టు డ్రగ్ కొరియర్

- వివిధ రాష్ట్రాల్లోని పెడ్లర్స్‌కు ఎండీఎంఏ సరఫరా
- హైదరాబాద్‌కు తీసుకొచ్చి డెలివరీ
- వలపన్ని పట్టుకున్న సౌత్‌వెస్ట్ టాస్క్‌ఫోర్స్ టీమ్
- ఇద్దరి అరెస్టు..215 గ్రాముల సరుకు స్వాధీనం



ప్రదీప్‌శర్మ



ఎం.వీరేంద్ర

సాక్షి, హైదరాబాద్:

రాజస్తాన్ పోలీసువిభాగంలో హోంగార్డుగా పనిచేస్తున్న ప్రదీప్‌శర్మ.. తనకు ఏర్పడిన పరిచయాలతో డ్రగ్ కొరియర్‌గా మారాడు. దేశవ్యాప్తంగా వివిధ నగరాల్లో ఉన్న పెడ్లర్స్‌కు మాదకద్రవ్యాలు... ప్రధానంగా మిథలిన్ డయాక్సిమోథమెథ్మామైన్ (ఎండీఎంఏ) సరఫరా చేస్తున్నాడు. దీనిపై సమాచారం అందుకున్న సౌత్‌వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు జూబ్లీహిల్స్ అధికారులతో కలిసి వలపన్నారు. ప్రదీప్‌తోపాటు పెడ్లర్ ఎం.వీరేంద్రను పట్టుకున్నట్లు వెస్ట్‌జోన్ డీసీపీ జోయల్‌డెవిస్ తెలిపారు. టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డీ పి.రాధాకిషన్‌రావు, జూబ్లీహిల్స్ ఏసీపీ హరిప్రసాద్‌లతో కలిసి సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన పూర్తి వివరాలు వెల్లడించారు.

మామూళ్లు చాలక కమీషన్ల కోసం...

ప్రతాప్‌ఘర్‌కు చెందిన ప్రదీప్‌శర్మ అలియాస్ కమల్‌రాణా అక్కడి ఠాణాలో హోంగార్డు. తన విధుల్లో భాగంగా కొన్నేళ్ల నుంచి అక్కడి చెక్‌పోస్టుల్లో డ్యూటీ చేసేవాడు. పాకిస్తాన్‌తో పాటు పంజాబ్ నుంచి వచ్చే మాదకద్రవ్యాలు ఈ ప్రాంతం మీదుగానే ఇతర చోట్లకు వెళ్లేవి. ఈ నెట్‌వర్క్ నిర్వహించే బడా డ్రగ్ సప్లయర్స్ చెక్‌పోస్టుల్లో ఉన్న వారికి మామూళ్లు ఇచ్చేవారు. ఇలా పెడ్లర్స్‌లో సంబంధాలు ఏర్పాటు చేసుకున్న ప్రదీప్‌శర్మ కమీషన్ ఇస్తే తానూ డ్రగ్ కొరియర్‌గా పనిచేస్తానని చెప్పాడు. దీనికి వారు అంగీకరించడంతో రెండుమూడేళ్లగా డ్రగ్ కొరియర్‌గా మారాడు. ఆపై వివిధ నగరాల్లో ఉన్న డ్రగ్ పెడ్లర్స్‌కు ఎండీఎంఏ డ్రగ్ సరఫరా చేస్తున్నాడు. ఆయా చెక్‌పోస్టులు, పోలీసుల వద్ద తన గుర్తింపుకార్డు చూపిస్తూ బయటపడేవాడు.

కారు డ్రైవింగ్ వదిలి డ్రగ్‌పెడ్లింగ్...

కామారెడ్డి జిల్లా బిచ్కుంద మండలం పెద్దదేవాడకు చెందిన మతంవార్ వీరేంద్ర కారుడ్రైవర్. తన వృత్తిలో భాగంగా అనేక మందిని దేశంలోని వివిధ ప్రాంతాలకు తీసుకెళ్లేవాడు. ఇలా రాజస్తాన్ వెళ్లినప్పుడు ప్రదీప్‌శర్మ ఇతడి కారులో ఎక్కాడు. ఆ పరిచయంలోనే ప్రదీప్ డ్రగ్ కొరియర్ అని తెలియడంతో జట్టు కట్టాడు. మాదకద్రవ్యాలను తీసుకొచ్చి ఇస్తే తాను పెడ్లర్‌గా మారి హైదరాబాద్‌లో విక్రయిస్తానని వీరేంద్ర చెప్పగా, ప్రదీప్ అంగీకరించాడు. ఈ ఒప్పందంలో భాగంగా గతేడాది తమ ప్రాంతానికే చెందిన నరేష్‌చౌదరితో కలిసి 70 గ్రాముల ఎండీఎంఏ తీసుకొచ్చి వీరేంద్రకు ఇచ్చి వెళ్లాడు. గత ఏడాది ఏప్రిల్ 30న హైటెక్ సిటీ ప్రాంతంలో వీరేంద్రను అరెస్టు చేసిన మాదాపూర్ ఎస్ఓటీ పోలీసులు డ్రగ్ స్వాధీనం చేసుకున్నారు. ఆపై నరేష్ పట్టుబడగా, ఈ కేసులో ప్రదీప్‌శర్మ ఇప్పటికీ వాంటెడ్‌గానే ఉన్నాడు.

మళ్లీ డెలివరీకి వచ్చి...

మాదాపూర్ కేసులో బెయిల్‌పై వచ్చిన వీరేంద్ర కొన్నాళ్లు ఖాళీగానే ఉండి, మళ్లీ దందా మొదలెట్టాడు. ఇందులో భాగంగా ప్రదీప్‌కు భారీ మొత్తం డ్రగ్ ఆర్డర్ ఇచ్చాడు. దీంతో 215 గ్రాములు ఎండీఎంఏ పౌడర్ తీసుకుని ప్రదీప్ బస్సులో హైదరాబాద్ చేరుకున్నాడు. వీరి కదలికలపై సౌత్ వెస్ట్ టాస్క్‌ఫోర్స్‌కు సమాచారం అందింది. జూబ్లీహిల్స్ పోలీసులతో కలిసి సోమవారం రోడ్ నెం.5 వద్ద వలపన్నారు. మాదకద్రవ్యంతో అక్కడకు చేరుకున్న ప్రదీప్‌తో పాటు వీరేంద్రను పట్టుకుని డ్రగ్ స్వాధీనం చేసుకున్నారు. ఈ డ్రగ్‌ను గ్రాము రూ.10 వేల వరకు విక్రయించడానికి వీరేంద్ర పథకం వేశాడు. గతంలో టాస్క్‌ఫోర్స్ పోలీసులే 240 గ్రాములు ఎండీఎంఏ స్వాధీనం చేసుకున్నారు. ఆ తర్వాతి స్థానం ఇప్పుడు దొరికిన 215 గ్రాములదే అని అధికారులు చెబుతున్నారు. మాదాపూర్ పోలీసులు ప్రదీప్‌ను పీటీ వారెంట్‌పై అరెస్టు చేయనున్నారు.

కస్టడీలోకి తీసుకుని విచారిస్తాం

"ఈ డ్రగ్‌ను ప్రదీప్‌కు ఎవరు అందించారు? వీరేంద్ర నగరంలో ఎవరెవరికి విక్రయిస్తున్నాడు? అనే అంశాలను దర్యాప్తు చేస్తున్నాం. దీని కోసం నిందితులు ఇద్దరినీ కోర్టు అనుమతితో పోలీసు కస్టడీలోకి తీసుకొని విచారిస్తాం. హైదరాబాద్‌ను డ్రగ్ ఫ్రీ సిటీగా మార్చడంలో అందరూ సహకరించాలి. మాదకద్రవ్యాలపై ఎలాంటి సమాచారం ఉన్నా, వీటికి బానిసలుగా మారిన వారి విషయంలో సహాయం కావాలన్నా 8712671111 నంబరులో సంప్రదించాలి."

- జోయల్ డెవిస్, వెస్ట్‌జోన్ డీసీపీ

కొలత పెట్టి.. లెక్క కట్టి..!

- కోటపాడు చెరువులో చేపపిల్లలు వదులుతుండగా లెక్క వేయించిన వైనం
- 21 వేలకుపైగా తక్కువ వచ్చినట్లు ఖమ్మం కలెక్టర్ నిర్ధారణ





రఘునాథపాలెం: మత్స్యకారుల ఆర్థికాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం ఉచిత చేపపిల్లలు సరఫరా చేస్తున్న క్రమంలో అక్రమాలు చోటు చేసుకుంటుండటంతో అధికారులు అప్రమత్తమయ్యారు. ఈ మేరకు ఖమ్మం జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ పకడ్బందీ చర్యలు చేపట్టడంతో ఓ కాంట్రాక్టర్ చేతివాటం బయటపడింది. ఖమ్మం జిల్లాలో చేపపిల్లల పంపిణీని రఘునాథపాలెం మండలం కోటపాడులో చెరువు వద్ద మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్, కలెక్టర్ గౌతమ్ సోమవారం ప్రారంభించారు. రెండు రకాల చేపపిల్లలను వదలాల్సి ఉండటంతో కలెక్టర్ చేపపిల్లల సైజ్‌ను స్కేల్‌తో కొలత వేయించారు. అనంతరం ఎంపీడీవో రామకృష్ణకు, మత్స్యశాఖ ఏడీ ఆంజనేయస్వామి, సిబ్బందితో మొత్తం చేపపిల్లల లెక్క వేయించారు. ఈ చెరువులో టెండర్ నిబంధన ప్రకారం 75 వేల చేపపిల్లలను వదలాల్సి ఉంది. దీంతో కాంట్రాక్టర్ తీసుకొచ్చిన చేపపిల్లల్లో 21,500 తక్కువగా ఉన్నాయని తేలింది. దీంతో ఆ మొత్తం చేపపిల్లలను మళ్లీ వదలాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించడంతోపాటు జిల్లావ్యాప్తంగా వదిలే చేపపిల్లలను లెక్కించాలని అధికారులకు కలెక్టర్ సూచించారు.

డబ్బులు పంపి.. మళ్లీ వెనక్కి తీసేసుకుని..

- జ్యువెలరీ షాపునకు రూ.1.24 కోట్లు బురిడీ కొట్టిన వైనం
- రూ.1.24 కోట్ల జ్యువెలరీ ఆర్డర్ చేసిన విజయవాడ వాసి
- బ్యాంకు నుంచి షోరూంకు డబ్బు బదిలీ
- ఆభరణాలు అందగానే నిలిపివేతకు బ్యాంకుకు నిర్దేశం

హిమాయత్‌నగర్: ప్రముఖ జ్యువెలరీ షోరూం 'మంగత్రాయ్ నీరజ్ జ్యువెలర్స్'నే బురిడీ కొట్టించాడో ప్రబుద్ధుడు. ఆభరణాలు కొంటానంటూ నమ్మించి ముందుగానే డబ్బు పంపి ఆభరణాలు చేతికి వచ్చాక ఆ డబ్బును వెనక్కి లాక్కున్నాడు. దీంతో తమని ఓ కస్టమర్ మోసం చేశాడంటూ షోరూం నిర్వాహకుడు హరీష్ సీసీఎస్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో..ఇద్దరిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

రూ.1.24 కోట్ల విలువైన ఆభరణాలు తీసుకుని..

గత వందేళ్లుగా జ్యువెలరీ రంగంలో ఉన్న 'మంగత్రాయ్ నీరజ్ జ్యువెలర్స్' సంస్థ వాట్సాప్ నుంచి కూడా ఆర్డర్స్ తీసుకుంటుంది. ఇందులో భాగంగానే విజయవాడకు చెందిన బొడ్డుపల్లి విక్రమ్ అనే వ్యక్తి ఈ షోరూంకు సంబంధించిన వాట్సాప్ నంబర్‌కు టచ్‌లోకి వచ్చాడు. తనకు కావాల్సిన డిజైన్స్‌ను అడిగి వాటి ధరలు తెలుసుకున్నాడు. ఒక్కో దానికి ఒక్కో రేటుతో కూడిన వివరాలను విక్రమ్‌కు కొటేషన్ ద్వారా ఇచ్చారు. ఇందుకు సంబంధించి రూ.1కోటి 24లక్షలను ముందుగానే షోరూం ఖాతాలకు తన హెచ్‌డీఎఫ్‌సీ ఖాతా ద్వారా బదిలీ చేశాడు. షోరూంకు సంబంధించిన రిప్రజెంటేటివ్స్ విజయవాడ వెళ్లి అక్కడున్న విక్రమ్ మనిషి ప్రవీణ్‌కు వీటిని అప్పగించారు. అప్పగించిన మరుక్షణం తాను షోరూంకు పంపిన డబ్బును స్టాప్ చేయాలంటూ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకును అధికారికంగా విక్రమ్ కోరాడు. దీంతో మీకు పంపిన డబ్బును మేం తిరిగి వెనక్కు తీసుకుంటున్నామంటూ హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు నుంచి షోరూంకు మెయిల్ వచ్చింది. మెయిల్‌లో చెప్పినవిధంగా విక్రమ్ పంపిన రూ.1కోటి 24లక్షలను పలు విధాలుగా వెనక్కితీసుకున్నారు. షోరూం యాజమాన్యానికి ఈ విషయం తెలియగా వారు ఆరా తీశారు. విక్రమ్ పంపిన అకౌంట్ యూఎస్‌లో ఉందని తేలింది. అతను కూడా యూఎస్‌లోనే ఉంటూ వీరితో ఇండియా నంబర్ ద్వారా చాట్ చేసినట్లు గుర్తించారు.దీంతో సీసీఎస్ పోలీసులకు ఈ వివరాలన్నీ ఇచ్చి, తమ అమౌంట్ తమకు వెనక్కి వచ్చేలా చేయాలంటూ ఫిర్యాదులో కోరారు. ఈమేరకు కేసు నమోదు చేసిన సీసీఎస్ పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు.

కొడుకు ఇంటి ఎదుట తల్లి ఆందోళన

- పోషణ బాధ్యత విస్మరించిన కుమారుడు
- కుమారుడిని మందలించిన పోలీసులు



ఇల్లెందురూరల్: నవమాసాలు మోసి జన్మనిచ్చిన తల్లి చరమాంకంలో కుమారుడు పట్టించుకోకపోవడంతో అతడి ఇంటి ఎదుటే నిరసనకు దిగిన ఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు మండలం సుభాష్‌నగర్‌లో చోటుచేసుకుంది. మహబూబాబాద్ జిల్లా పాకాల కొత్తగూడేనికి చెందిన చిలివేరు మల్లికాంబకు ఆరుగురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. 30 ఏళ్ల క్రితం భర్త మరణించగా, కష్టపడి పిల్లలందరి పెళ్లిళ్లు చేసింది. కాగా, కుమారుడు చిలివేరు రమేశ్ బతుకుదెరువు కోసం ఇల్లెందుకు వచ్చి బోర్‌వెల్ బండి నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. మల్లికాంబకు ప్రస్తుతం 80 ఏళ్లు దాటాయి. ఇటీవల అనారోగ్యానికి గురవడంతో కుమార్తెలు, కుమారుడు కలసి ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఆరోగ్యం మెరుగుపడిన తర్వాత కుమార్తెల వద్దే ఉంటున్న తల్లి పోషణ కోసం ఎంతో కొంత ఇవ్వాలని రమేశ్‌ను అడిగింది. పెద్దమనుషుల సమక్షంలో నెలకు రూ.4 వేలు ఇస్తానని ఒప్పుకున్న రమేశ్ తర్వాత ఆ డబ్బు ఇవ్వడం లేదు. కొంతకాలం వేచిచూసిన కుమార్తెలు సోమవారం మల్లికాంబను రమేశ్ ఇంటికి తీసుకొచ్చారు. అయితే ఆమె లోపలికి రాకుండా రమేశ్ కుటుంబసభ్యులు గేటుకు తాళం వేశారు. దీంతో ఆమె ఇంటి ఎదుటే బైఠాయించింది. దీనిపై కుమార్తెలు పోలీసులకు సమాచారం అందించగా వారు అక్కడికి చేరుకుని తల్లీ కొడుకును స్టేషన్‌కు తరలించారు. సీఐ కరుణాకర్ రమేశ్‌ను మందలించడంతో ఇకపై నెలకు రూ.5 వేల చొప్పున క్రమం తప్పకుండా ఇస్తానని ఒప్పుకున్నాడు. దీంతో మల్లికాంబ పాకాల కొత్తగూడెంలో ఉంటున్న కూతురు వద్దకు తిరిగి వెళ్లింది.

కొడుకు అమ్మకానికి తల్లి బేరసారాలు

- ఇద్దరి నుంచి అడ్వాన్స్... ఠాణాకు చేరిన పంచాయితీ

ఖలీల్‌వాడి: రూ.లక్షకు కొడుకునుఅమ్మకానికి పెట్టింది ఓ తల్లి. ఇద్దరి వద్ద రూ. 5 వేల చొప్పున అడ్వాన్స్‌గా వసూలు చేసింది. బాబును అప్పగించే విషయంతో జరిగిన గొడవతో విషయం వెలుగుచూసింది. నిజామాబాద్ జిల్లాకేంద్రంలోని త్రీటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధి అంబేడ్కర్ కాలనీకి చెందిన అంద్రాగి అలియాస్ గోసంగి దేవికి ఈనెల 3న జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో నార్మల్ డెలివరీ అయ్యింది. ఆమె మగబిడ్డకు జన్మనిచ్చింది. అయితే బిడ్డ అమ్మకానికి దేవి ముందుగానే హుబేరాబేగంతో రూ.లక్షకు ఒప్పందం కుదుర్చుకుంది. అడ్వాన్స్‌గా రూ.5 వేలు తీసుకుంది. ఇదే సమయంలో షబానాబేగంతో రూ.లక్షకు ఒప్పందం కుదుర్చుకుని ఆమె వద్ద కూడా రూ.5వేలు అడ్వాన్స్‌గా తీసుకుంది. దేవి సోమవారం ఆస్పత్రి నుంచి ఇంటికి చేరుకుంది. బాబును తమకే ఇవ్వాలని హుబేరా బేగం, షబానాబేగం అంబేడ్కర్ కాలనీలోని దేవి ఇంటి వద్ద గొడవకు దిగారు. విషయం పోలీసులకు చేరడంతో వెళ్లి అందరిని పోలీస్ స్టేషన్‌కు పిలిపించారు. షబానాబేగం, హుబేరా బేగం, దేవిలకు కౌన్సెలింగ్ ఇచ్చారు. బాబు అమ్మకానికి సంజీవ్‌నగర్ కాలనీకి చెందిన ఆశవర్కర్ సహాయం చేసినట్టు పోలీసులు గుర్తించి విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.